బుధవారం
14•3•2018
హైదరాబాద్
• వెల.5 రూ.
• సంపుటి 7 • సంచిక 276
• పేజీలు : 16 + (20/16) + 8 పేజీల నిపుణ ప్రత్యేక అనుబంధం

మన రాష్ట్రం • మన పత్రిక

నమస్తే తెలంగాణ

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

ఎన్నికల బడ్జెట్ కాదు..
మాది ప్రజాబడ్జెట్



వ్యవసాయం, అనుబంధ రంగాలకు అధిక కేటాయింపులు

'నమస్తే తెలంగాణ' ఇంటర్వ్యూలో ఆర్థికమంత్రి ఈటల

"**మొదటినుంచీ** ప్రజల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి, సాగునీటిరంగాలకు ప్రాధాన్యమిస్తూ పక్కాగా బడ్జెట్‌కు రూపమిస్తున్నాం. ఎన్నికల మ్యానిఫెస్టోలో కూడా పొందుపరచని ఎన్నో పథకాలను, కార్యక్రమాలను బడ్జెట్‌లో ప్రవేశపెట్టాం. ప్రజల అవసరాలకు ప్రతిబింబంగా మా బడ్జెట్ ఉంటుంది. ఎన్నికలు వస్తున్నాయని ప్రజలను ఆకర్షించడానికి ప్రత్యేక మార్పులు చేయాల్సిన అవసరం మాకు లేదు. మా బడ్జెట్ ఈసారి కూడా పూర్తిగా ప్రజల అవసరాల ప్రాతిపదికనే ఉంటుంది.. వ్యవసాయం, దాని అనుబంధరంగాలపై మా దృష్టి కేంద్రీకృతమవుతున్నది. సంక్షేమ కార్యక్రమాలకు ఎప్పటిలాగే పెద్ద పీట వేస్తాం.

12

ఆధార్ అనుసంధాన
గడువు పొడిగింపు



తీర్పు వెలువడేంత వరకు ఈ ఆదేశాలు అమలు: సుప్రీంకోర్టు

ప్రత్యక్ష నగదు బదిలీ వంటి పథకాలకు కొనసాగింపు

న్యూఢిల్లీ, మార్చి 13: ఆధార్ అనుసంధానంపై ప్రజలకు, వినియోగదారులకు ఊరట లభించింది. వివిధ సేవలకు ఆధార్ అనుసంధానం గడువును సుప్రీంకోర్టు నిరవధికంగా పొడిగించింది. అన్ని సేవలను ఆధార్‌తో ముడిపెట్టడం వల్ల వ్యక్తుల గోప్యత హక్కులకు విఘాతం కలుగుతున్నదని దాఖలైన పిటిషన్ల విచారణ సందర్భంగా ఐదుగురు సభ్యులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం మంగళవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. గత ఏడాది డిసెంబర్ 15న సుప్రీంకోర్టు ఈ కేసు విచారణ జరిపినపుడు ఆధార్ అనుసంధానం గడువును 2018 మార్చి 31వరకు పొడిగించింది. ఈ గడువు మరికొద్ది రోజుల్లో

మిగతా 5వ పేజీలో

వేటు పడింది

కాంగ్రెస్ సభ్యులపై చర్యలు • కోమటిరెడ్డి, సంపత్ శాసనసభ సభ్యత్వాల రద్దు



- గవర్నర్ ప్రసంగ సమయంలో ఘటన దుర్మార్గం
- స్వామిగౌడ్‌పై దాడితో దిగ్భ్రాంతికి గురయ్యా
- వీడియో క్లిప్పింగ్స్ పరిశీలించే ఈ నిర్ణయం
- స్పీకర్ మధుసూదనాచారి వ్యాఖ్యలు



కోమటిరెడ్డి వెంకటరెడ్డి



సంపత్‌కుమార్

సీఎల్పీ నేత జానారెడ్డి సహా 11 మందిపై సస్పెన్షన్

- గవర్నర్ ప్రసంగం సమయంలో అనుచిత ప్రవర్తనపై స్పీకర్ మధుసూదనాచారి సంచలన నిర్ణయం
- మండలిలో కాంగ్రెస్ పక్ష నేత షబ్బీర్‌అలీ సహా ఆరుగురు ఎమ్మెల్సీలను సస్పెండ్ చేసిన డిప్యూటీ చైర్మన్

అరాచకశక్తుల పీచమణుస్తాం

అసెంబ్లీ లోపలా, బయటా కఠినచర్యలు
రాజకీయాల్లో అసహనం పనికిరాదు.. బయటకు వెళ్లాలనే ప్లాన్‌తోనే దాడి
వారి కుట్రపై మాకు ముందే సమాచారం ఉంది
రాజకీయ ముసుగులో అరాచకాలు చేస్తామంటే నడువదు
అసెంబ్లీలో తేల్చిచెప్పిన ముఖ్యమంత్రి కేసీఆర్



మంగళవారం అసెంబ్లీలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

అసెంబ్లీలో గూండాగిరీ చేసిన కాంగ్రెస్ సభ్యులపై వేటు పడింది. గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకుని, మండలి చైర్మన్‌పై దాడిచేసి గాయపర్చిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంపత్‌కుమార్‌ల శాసనసభ సభ్యత్వాలను స్పీకర్ ఎస్ మధుసూదనాచారి రద్దుచేశారు. ఇదే ఘటనలో ప్రతిపక్ష నేత జానారెడ్డి సహా 11 మంది కాంగ్రెస్ సభ్యులను ప్రస్తుత బడ్జెట్ సమావేశాలు ముగిసేంతవరకు సస్పెండ్ చేశారు. అటు ఉభయసభల సంయుక్త సమావేశంలో అరాచకానికి పాల్పడిన ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్సీలను ప్రస్తుత బడ్జెట్ సమావేశాలు ముగిసేంతవరకు సస్పెండ్ చేస్తూ శాసనమండలి తీర్మానించింది. మంగళవారం శాసనసభ ప్రారంభమైన తర్వాత సోమవారం నాటి ఘటనకు బాధ్యులైనవారిపై చర్యలకు ప్రతిపాదిస్తూ తీర్మానం ప్రవేశపెట్టాల్సిందిగా శాసనసభ

మిగతా 2వ పేజీలో

ఆ ఇద్దరి సభ్యత్వాలు రద్దుచేస్తూ గెజిట్

2

నేడు క్యాబినెట్ భేటీ

బడ్జెట్‌తోపాటు ఏడు బిల్లుల ఆమోదం!

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర బడ్జెట్‌కు ఆమోదం తెలిపేందుకు బుధవారం సాయంత్రం 5 గంటలకు క్యాబినెట్ భేటీ కాబోతున్నది. ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన జరుగనున్న ఈ సమావేశంలో 2018-19 బడ్జెట్‌కు ఆమోదంతోపాటు మొత్తం ఏడు బిల్లులను ఆమోదించనున్నట్టు సమాచారం. వీటిలో తెలుగు తప్పనిసరి, డీజీపీ నియామక చట్టానికి సవరణ, అసైన్డ్ భూముల చట్టానికి సవరణ, పంచాయతీరాజ్ చట్టానికి సవరణ, న్యాయశాఖలో రెండు బిల్లుల సవరణలకు క్యాబినెట్ ఆమోదముద్ర వేయనున్నది.



ఛత్తీస్‌గఢ్ సుక్మా జిల్లాలోని కిష్టారం సమీపంలో మంగళవారం మావోయిస్టులు పేల్చిన ఐఈడీతో ఎగిరిపడిన జవాన్ల మైన్ ప్రూఫ్ వాహనం

ఛత్తీస్‌గఢ్‌లో పేలిన మందుపాతర

9 మంది సీఆర్పీఎఫ్
జవాన్లు మృతి

- మరో ఇద్దరు జవాన్లకు గాయాలు
- సుక్మా జిల్లా కిష్టారంలో ఘటన
- పది అడుగులు ఎగిరిపడి.. తునాతునకలైన మైన్‌ప్రూఫ్ వాహనం

తునాతునకలైన వాహనం.. విసిరేసినట్టు అక్కడక్కడ పడిన నిర్జీవ శరీరాలు.. తెగిపడిన అవయవాలు.. యుద్ధానంతర పరిస్థితిలా భీతావహ వాతావరణం! ఇది ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు సృష్టించిన మరో విధ్వంసం. కొద్ది రోజులక్రితమే భద్రతాదళాల చేతిలో గట్టి ఎదురుదెబ్బ తిన్న మావోయిస్టులు.. సుక్మా జిల్లా కిష్టారం-పాలోడి మార్గంలో పథకం ప్రకారం మందుపాతర పేల్చడంతో ఛత్తీస్‌గఢ్ అడవుల్లో మళ్లీ నెత్తురు చిమ్మింది. తొమ్మిది మంది సీఆర్పీఎఫ్ జవాన్లు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు జవాన్లకు తీవ్ర గాయాలయ్యాయి. మందుపాతరలను తట్టుకునేలా రూపొందించిన వాహనం సైతం ఈ పేలుడు ధాటికి తుక్కుతుక్కయింది.

భద్రాచలం, నమస్తే తెలంగాణ/ కొత్తగూడెం క్రైం/ రాయ్‌పూర్/ న్యూఢిల్లీ:

ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో మావోయిస్టులు మరోసారి విరుచుకుపడ్డారు. గాలింపుకోసం వస్తున్న కేంద్ర రిజర్వు పోలీసు దళానికి చెందిన మైన్‌ప్రూఫ్ వాహనాన్ని భారీ పేలుడు పదార్థాలు ఉపయోగించి పేల్చేశారు. ఈ ఘటనలో తొమ్మిది మంది సీఆర్పీఎఫ్ జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. పేలుడు ధాటికి పోలీసు వాహనం పది అడుగుల మేర గాలిలోకి ఎగిరిపడి ముక్కలయింది. రాయ్‌పూర్‌కు

మిగతా 12వ పేజీలో

నక్సల్స్ ప్రతీకార చర్య

- సీఆర్పీఎఫ్ వాహనం పేల్చివేత
- కిష్టారం బేస్ క్యాంప్‌కు మృతదేహాలు
- కూంబింగ్ ముమ్మరం చేసిన పోలీసులు
- తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో హై అలర్ట్
- సీఆర్పీఎఫ్ సిబ్బంది మృతిపై కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సంతాపం





సిరిసిల్లలో అపారెల్ హబ్ ఏర్పాటుకు మంగళవారం సచివాలయంలో రాష్ట్ర మంత్రి కేటీఆర్ సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న చేనేత శాఖ డైరెక్టర్ శైలజారామయ్యర్, కే వెంచర్స్ సంస్థ ప్రతినిధులు

సిరిసిల్లలో అపారెల్
సూపర్ హబ్

తెలంగాణ ప్రభుత్వంతో కే వెంచర్స్ ఒప్పందం

నేతన్నల జీవితాల్లో వెలుగులు నింపడమే సీఎం లక్ష్యం
ఐటీ, చేనేతశాఖ మంత్రి కేటీఆర్
తెలంగాణ తమ స్వరాష్ట్రమన్న సంస్థ ప్రతినిధులు

12

టీఆర్‌ఎస్ ఎంపీల నిరసనతో దద్దరిల్లిన లోక్‌సభ

3

మరో ఇద్దరు సభ్యులపైనా చర్యలు!

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గవర్నర్ ప్రసంగం సందర్భంగా అనుచితంగా ప్రవర్తించినందుకు మరో ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలపైనా చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది. గవర్నర్ ప్రసంగం సమయంలో కాంగ్రెస్ సభ్యుల వ్యవహారశైలికి సంబంధించిన వీడియో ఫుటేజీని మంగళవారం అసెంబ్లీ కార్యాలయం క్షుణంగా పరిశీలించింది. ఇందులో మరో ఇద్దరు సభ్యులు కూడా అనుచితంగా ప్రవర్తించినట్టు వెల్లడైందని సమాచారం. ఈ నేపథ్యంలో వారిపైనా చర్యలకు రంగం సిద్ధమవుతున్నదని తెలుస్తున్నది.



మంగళవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన అడిషనల్ డీజీ జితేందర్



మంగళవారం అసెంబ్లీలో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన హైదరాబాద్ పోలీస్ కమిషనర్ అంజనీకుమార్. చిత్రంలో డీజీపీ మహేందర్‌రెడ్డి, అడిషనల్ డీజీ జితేందర్ కూడా ఉన్నారు.

సీఎం కేసీఆర్‌ను కలిసిన హైదరాబాద్ సీపీ, అడిషనల్ డీజీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావును హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అంజనీకుమార్, అడిషనల్ డీజీ (లా అండ్ ఆర్డర్) జితేందర్ అసెంబ్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. డీజీపీ ఎం మహేందర్‌రెడ్డి ఇరువురు అధికారులను సీఎం కేసీఆర్‌కు పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఇద్దరు అధికారులకు సీఎం కేసీఆర్ అభినందనలు తెలిపారు. హైదరాబాద్ సీపీ అంజనీకుమార్ సీఎం కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అడిషనల్ డీజీ జితేందర్ రాజ్‌భవన్‌లో గవర్నర్ ఈఎస్‌ఎల్ గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.



మంగళవారం సరోజినీదేవి దవాఖానలో మండలి చైర్మన్ స్వామిగౌడ్‌ను పరామర్శిస్తున్న మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి



మండలి చైర్మన్ స్వామిగౌడ్‌ను పరామర్శిస్తున్న మంత్రి జోగురామన్న, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి

కోలుకుంటున్న స్వామిగౌడ్

- నేడు డిశ్చార్జ్ చేస్తామన్న వైద్యులు

మెహిదీపట్నం: కాంగ్రెస్ ఎమ్మెల్యేల దాడిలో గాయపడి సరోజినీదేవి కంటి దవాఖానలో చికిత్స పొందుతున్న శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్‌కు మెరుగైన వైద్యం అందిస్తున్నామని, ఆయన కోలుకుంటున్నారని దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రవీందర్ గౌడ్ తెలిపారు. మంగళవారమే డిశ్చార్జ్ చేయాల్సి ఉండగా షుగర్ లెవల్స్ పెరుగడంతో పర్యవేక్షణలో ఉంచామని చెప్పారు. బుధవారం ఉదయం డిశ్చార్జ్ చేస్తామని పేర్కొన్నారు. స్వామిగౌడ్‌ను డాక్టర్లు వివిధ సమయాల్లో నాలుగుసార్లు పరీక్షించారు. కాగా స్వామిగౌడ్‌ను మండలి డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్, మంత్రులు అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, జోగు రామన్న, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ బూర నర్సయ్యగౌడ్, మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్, కరీంనగర్ జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, తెలంగాణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సత్యగౌడ్, కార్పొరేటర్ విజయారెడ్డి, టీజీవో రాష్ట్ర అధ్యక్షురాలు మమత, ఆర్టీఏ జేటీసీ పాండురంగనాయక్, గ్రూప్ -1 అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం చంద్రశేఖర్‌గౌడ్, గెజిటెడ్ అధికారుల సంఘం ఉపాధ్యక్షుడు రవీందర్‌కుమార్, లీగల్ అడ్వైజర్, పీపీఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణమూర్తి తదితరులు పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ మండలి చైర్మన్‌పై దాడిచేసి కాంగ్రెస్ తన నైజాన్ని చాటుకున్నదని.. కాంగ్రెస్ అంటే గూండాలు, రౌడీల పార్టీ అని మరోసారి రుజువైందని ధ్వజమెత్తారు. ఎంపీ బూర నర్సయ్యగౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఎమ్మెల్యేల చర్య హేయమని, దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ సభ్యులు మండలి చైర్మన్‌పై భౌతికదాడులకు పాల్పడటం బాధాకరమని.. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ముహూర్తం

సూర్యోదయం: 6.28 గంటలకు

సూర్యాస్తమయం: 6.22 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, కృష్ణపక్షం ద్వాదశి మధ్యాహ్నం 3.48 వరకు, తదుపరి త్రయోదశి, నక్షత్రం: శ్రవణం మధ్యాహ్నం 3.07 వరకు తదుపరి ధనిష్ఠ, అమృతఘడియలు: తె. 3.36 నుంచి 5.12 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 12.25 నుంచి 1.54 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 12.01 నుంచి 12.49 వరకు, వర్జ్యం: రాత్రి 7.28 నుంచి 9.04 వరకు.

లోకం పోకడ



ఆ హెల్మెట్ తీసి పడేయ్.. నువ్వంటే నాకామాత్రం గౌరవం వుందిలే!

అసెంబ్లీ ఆవాజ్





వేటు పడింది

▶ మొదటిపేజీ తరువాయి...

వ్యవహారాల మంత్రి టీ హరీశ్‌రావును స్పీకర్ కోరారు. హరీశ్‌రావు మాట్లాడుతూ 'సోమవారంనాటి దాడి చాలా తీవ్రమైంది. చట్టసభలను అవమానపరిచేలా, గౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరించారు' అన్నారు. అసెంబ్లీ రూల్స్ 340 సబ్ రూల్ 2 ప్రకారం కాంగ్రెస్ సభ్యులను సస్పెండ్ చేస్తూ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాన్ని సభ ఆమోదించింది. అలాగే కాంగ్రెస్ సభ్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్ కుమార్‌లను భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 194 (3) ప్రకారం శాసనసభ సభ నుంచి బహిష్కరించారు. వీరి బహిష్కరణను కూడా సభ ఆమోదించింది. సస్పెండ్ అయినవారిలో సీఎల్పీ నేత కే జానారెడ్డి, ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, భట్టివిక్రమార్క, జీవన్‌రెడ్డి, గీతారెడ్డి, చిన్నారెడ్డి, డీకే అరుణ, పద్మావతి, టీ రామ్మోహన్‌రెడ్డి, డీ మాధవరెడ్డి, వంశీచందర్‌రెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ గవర్నర్ ప్రసంగం సమయంలో దుర్మార్గమైన, దురదృష్టకర ఘటన జరిగిందని చెప్పారు.మండలి చైర్మన్ స్వామిగౌడ్‌పై దాడి తనను దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. ఈ ఘటనపై తీవ్ర మనస్తాపాన్ని ప్రకటించారు. సస్పెన్షన్, బహిష్కరణకు గురైన ఎమ్మెల్యేలు సభనుంచి బయటకు వెళ్లిపోవాలని స్పీకర్ పదేపదే కోరారు. అయినా కాంగ్రెస్ సభ్యులు మొండికేయడంతో మార్షల్స్ వారిని సభ నుంచి బయటకు తీసుకెళ్లారు. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ అరాచక శక్తుల పీచమణుస్తామని స్పష్టంచేశారు. కాంగ్రెస్ సభ్యుల చర్యలు పరాకాష్ఠకు చేరుకున్నాయని వ్యాఖ్యానించారు. నిర్ణయం కఠినమైనదైనా తప్పదని చెప్పారు. శాసనసభ నిర్వహణ విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని సీఎం స్పష్టం చేశారు. ఇదిలాఉంటే ఉభయ సభల సంయుక్త సమావేశంలో అనుచితంగా ప్రవర్తించినందుకు ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్సీలను సస్పెండ్ చేస్తున్నట్టు డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్ ప్రకటించారు. సస్పెండ్ అయినవారిలో షబ్బీర్ అలీ, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, సంతోష్, దామోదర్‌రెడ్డి, ఆకుల లలిత, కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి ఉన్నారు.

దురదృష్టకరమైన, దుర్మార్గమైన సంఘటన: స్పీకర్

మండలి చైర్మన్ స్వామిగౌడ్‌పై జరిగిన దాడి తనకు తీవ్ర మనస్తాపాన్ని కల్గించిందని స్పీకర్ ఎస్ మధుసూదనాచారి చెప్పారు. కాంగ్రెస్ సభ్యుల సస్పెన్షన్ అనంతరం ఆయన మాట్లాడుతూ సభలో గవర్నర్ ప్రసంగం సమయంలో దుర్మార్గమైన, దురదృష్టకర సంఘటన జరిగిందని అన్నారు. సస్పెండ్ అయిన కాంగ్రెస్ సభ్యులు సభనుంచి వెళ్లిపోవాలని స్పీకర్ విజ్ఞప్తిచేశారు. నాలుగేండ్లలో దేశంలోనే ఆదర్శవంతమైన సభగా తెలంగాణ అసెంబ్లీని మార్చుకున్నామని చెప్పారు. దేశంలోని వివిధ రాష్ట్రాల అసెంబ్లీ స్పీకర్లతో జరిగిన కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ సదస్సుల్లో తెలంగాణ శాసనసభ తీరును చాలా రాష్ట్రాలు గౌరవించాయని తెలిపారు. ఈచరిత్రకు మచ్చకల్గించారని అన్నారు. సభ నిర్ణయాన్ని గౌరవించాల్సిన బాధ్యత సభ్యులదని స్పీకర్ స్పష్టంచేశారు. మండలి చైర్మన్‌పై దాడితో దిగ్భ్రాంతికి గురయ్యానని చెప్పారు. మధ్యలో జానారెడ్డి లేచి సభను వీడే ముందు మాట్లాడటానికి అవకాశం ఇవ్వాలని కోరగా స్పీకర్ తిరస్కరించారు. బీఏసీ సమావేశంలో క్లిప్పింగ్స్ చూసి, సభ్యులపై చర్యలు తీసుకునేందుకు తనకు అధికారం ఇచ్చారని, ఆ మేరకు చర్యలు తీసుకోవాల్సిన అనివార్య పరిస్థితి వచ్చిందని చెప్పారు.

అరాచక శక్తుల పీచమణుస్తాం: సీఎం కేసీఆర్

శాసనసభను హుందాగా నడిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి సభ్యుడిపైనా ఉందని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు చెప్పారు. గవర్నర్ ప్రసంగం సందర్భంగా చోటుచేసుకున్న సంఘటన దురదృష్టకరమని ఆవేదన వ్యక్తంచేశారు. రాజకీయాల్లో అసహనం పనికిరాదని కాంగ్రెస్ సభ్యులకు హితవుపలికారు. ఎన్ని రోజులు కావాలంటే అన్ని రోజులు చర్చించేందుకు సిద్ధమని ప్రభుత్వం ప్రకటించిన తర్వాత గొడవ ఎందుకని నిలదీశారు. సభ నుంచి ఎలాగైనా బయటకు వెళ్లాలనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ సభ్యులు గవర్నర్ ప్రసంగం సమయంలో దాడి చేశారని సీఎం విమర్శించారు. సభ నిర్వహణ విషయంలో కఠినంగా ఉంటామని స్పష్టంచేశారు. తమది తప్పయితే ప్రజలే శిక్షిస్తారని వ్యాఖ్యానించారు. 'బాధాకరం. దురదృష్టకరం. ఇటువంటి పరిస్థితి సభలో వస్తుందని ఊహించలేదు. కొత్త రాష్ట్రమైనా సభ చాలా హుందాగా నడిచింది. చాలా రాష్ట్రాల్లో బడ్జెట్ పద్దులు గిలెటిన్ అయ్యే సందర్భాలున్నాయి. అర్ధరాత్రి 11 గంటలు దాటినా పద్దులు గిలెటిన్ కాకుండా చర్చలు జరిపి పాస్ చేసుకున్నాం. కొత్త రాష్ట్రమైనప్పటికీ చాలా గొప్పగా చర్చలు జరుగుతున్నాయని వివిధ పార్లమెంటరీ సమావేశాల్లో మన శాసనసభ ప్రశంసలందుకుంది' అని సీఎం చెప్పారు. 'నిన్న జరిగిన ఘటన బాధాకరం. నిర్ణయం కఠినమైనదైనా తప్పదు. గవర్నర్‌ను కొడదామనుకుంటే తప్పిపోయి స్వామిగౌడ్‌కు తగిలిందట! వాళ్లు చెప్పుకొంటున్నారు. రాజకీయాలలో అసహనం పనికిరాదు. కాంగ్రెస్ సభ్యులు సభలో, బయటా కొనసాగిస్తున్న అరాచకాలకు పరాకాష్ఠ ఇది. కాంగ్రెస్ సభ్యులు సభలో చేసిన రచ్చ అంతా టీవీల ద్వారా ప్రపంచమంతా చూసింది. హెడ్‌ఫోన్ తగిలి మండలి చైర్మన్ కన్నుకు దెబ్బతగిలితే ఆయన నాటకమాడుతున్నారంటూ కాంగ్రెస్ నేతలు ఆరోపణలు చేయడం సిగ్గుచేటు' అని సీఎం అన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు నిర్దాక్షిణ్యంగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. 'చేసే అరాచకం చేసి, విసిరికొట్టి, మార్షల్స్ అడ్డం ఉంటే కొట్టరాకపోతే బల్ల ఎక్కికొట్టి, నగ్నంగా ప్రజల ముందు బయటపడిందిగాక, చైర్మన్ నాటకమాడుతున్నారని అంటున్నారు.. ఇది కూడా డెరోగేటరీయే. కౌన్సిల్ చైర్మన్‌కు అబద్ధాలు ఆపాదిస్తారా?' అని కేసీఆర్ నిలదీశారు.

కాంగ్రెస్ సభ్యులవి చీప్ పాలిటిక్స్

కాంగ్రెస్ సభ్యులు చీప్‌పాలిటిక్స్ చేస్తున్నారని సీఎం కేసీఆర్ మండిపడ్డారు. 'తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు బిల్లు పాసైన తర్వాత మర్యాదపూర్వకంగా నేను ప్రధానిని కలువడానికి ఢిల్లీ వెళితే ఇక్కడ టీఆర్‌ఎస్ జెండా దిమ్మెలు కూలగొట్టారు. తెలంగాణ వచ్చింది.. ఇక కేసీఆర్ ఇంటికి కుక్కకూడా పోదన్నారు. ఇంతలో ఎన్నికలు వచ్చాయి. వాళ్లు మూడోవంతు సీట్లు మాత్రమే గెలిచారు. ప్రభుత్వం ఏర్పడిన తరువాత కూడా 'ప్రభుత్వం ఉండదు.. కూలిపోతుంది' అంటూ ప్రచారంచేశారు. అనేక సందర్భాల్లో ఎన్నికలు జరిగాయి. ఒక్క ఎన్నికలోనూ కాంగ్రెస్ గెలువలేదు. కొన్నిచోట్ల డిపాజిట్లు కోల్పోయారు. అచ్చంపేట మున్సిపాలిటీ ఎన్నికల్లో టీఆర్‌ఎస్‌ను ఓడించడానికి అన్ని పార్టీలు ఏకమై 20 వార్డుల్లో పోటీ చేస్తే ఒక్కటీ గెలువలేదు. జీహెచ్‌ఎంసీ ఎన్నికలు, ఉపఎన్నికలు ఇలా ఏ ఎన్నికలైనా టీఆర్‌ఎస్సే గెలిచింది' అని సీఎం చెప్పారు. తనపైనా వ్యక్తిగతంగా విషపూరిత ప్రచారంచేశారని ఆయన గుర్తుచేశారు. ''కేసీఆర్ ఆరోగ్యం బాగలేదు. చికిత్సకోసం అమెరికాకు పోతడు.. ఇక అటే పోతడు' అని ప్రచారం చేశారు. నాలుగేండ్ల నుంచి ఇంకా అమెరికాకు పోతనే ఉన్న! ఇంత చీప్ పాలిటిక్సా?' అని సీఎం విమర్శించారు. 'ఆరు నూరైనా వందశాతం ప్రజలకోసం పనిచేస్తం. ప్రజలకు అన్నీ వివరిస్తం. నాలుగేండ్లుగా శాంతిభద్రతలు బ్రహ్మాండంగా ఉన్నాయి. అన్ని వర్గాలకు రక్షణ ఉంది. దీనినిచూసి ఓర్వలేకనే అరాచకాలు సృష్టిస్తున్నారు' అని అన్నారు.

రాజకీయ ముసుగులో అరాచకాలు చేస్తామంటే నడవదు

'ఏ రూపంలో ఉన్నా అరాచక శక్తుల పీచమణచడానికి వెనుకాడబోం. నేరస్థులు రాజకీయాల ముసుగులో అరాచకాలు చేస్తామంటే నడువదు' అని సీఎం కేసీఆర్ తేల్చి చెప్పారు. స్పీకర్‌నుద్దేశించి 'తమరి సమక్షంలో జరిగిన దానికి తమరే ప్రత్యక్ష సాక్షి. బీఏసీలో తమరి సమక్షంలోనే ఏ అంశం ప్రతిపాదిస్తే ఆ అంశంపై చర్చకు సిద్ధమని చెప్పాం. ఎన్ని రోజులు కోరితే అన్ని రోజులు సభ జరిపేందుకు సిద్ధమని చెప్పారు. పోయినసారి సమయానికి మించి చర్చ చేసుకున్నాం. ఎన్ని రోజులైనా, ఏ అంశంపైనైనా చర్చకు సిద్ధంగా ఉన్నామని చెప్పిన తరువాత ఎందుకు గొడవ? సమావేశాల తొలిరోజు గొడవచేయడం ఎంతవరకు సమంజసం? చైర్మన్ దవాఖాన పాలయ్యేలా మైకులు, హెడ్‌ఫోన్లు విసిరేశారు. బయటకు వెళ్లి చైర్మన్ నాటకమాడుతున్నారని మాట్లాడుతున్నారు. గవర్నర్ ప్రసంగం సందర్భంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చక్కగా, హుందాగా కూర్చొంటే ఈ పరిస్థితి ఎందుకు వస్తుంది? మీకు ఇక్కడ కూర్చునే ఉద్దేశం లేదు. ఈ సభలో కూర్చుంటే వచ్చేది ఏమీ లేదు.. ఎలాగైనా బయటకు వెళ్లాలనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ సభ్యులు గవర్నర్ ప్రసంగం సమయంలో దాడిచేశారు. ముందస్తు ప్లాన్ ప్రకారమే దాడి చేసినట్టు మాకు సమాచారం ఉంది' అని సీఎం కేసీఆర్ చెప్పారు.


సభ నడిపే విషయంలో కఠినంగా ఉంటామన్న సందేశం ఇవ్వాల్సిందే

'రాజ్యాంగ దిక్సూచీలు అక్కడ రాష్ట్రపతి, ఇక్కడ గవర్నర్. బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా ఉభయసభలనుద్దేశించి ప్రసంగిస్తారు. మాట్లాడటానికి అవకాశం ఉండి కూడా పుస్తకాలు చింపివేశారు. మైకులు విరిచేశారు. సభను నడిపే విషయంలో కఠినంగా ఉంటామన్న సందేశాన్ని ఇవ్వాల్సిందే. శాంతిభద్రతలు బాగా ఉన్నాయి. ప్రజలు సంతోషంగా ఉన్నారు. అరాచకశక్తులను సహించం. రాజకీయ నాయకుల ముసుగులో ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తే ఊరుకోం. మేముచేసేది తప్పైతే మమ్మల్ని ప్రజలే శిక్షిస్తారు. న్యాయనిర్ణేతలు ప్రజలే. సరైన చర్య తీసుకున్నందుకు అభినందిస్తారు' అని సీఎం అన్నారు.

వితండవాదనలు సరికాదు

ప్రతిపక్ష నేత జానారెడ్డిని సభనుంచి సస్పెండ్ చేయడం తగదని బీజేపీ శాసనసభాపక్ష నేత కిషన్‌రెడ్డి మాట్లాడటంపై సీఎం అభ్యంతరం వ్యక్తంచేశారు. అరాచకాలకు మీరు సపోర్ట్‌చేస్తానంటే మాకు అభ్యంతరం లేదన్నారు. 'సభలో లేని పార్లమెంట్ సభ్యులపై మాట్లాడడం సరికాదని చెప్పారు. ఎంపీలు అక్కడి పరిస్థితికి అనుగుణంగా వ్యవహరిస్తారని, అయినా అక్కడ పార్లమెంట్ సమావేశాలు సజావుగా నడిచే పరిస్థితే లేదన్నారు. 543 మంది పార్లమెంట్ సభ్యుల్లో మాకు ఉన్నది 13మందే. జానారెడ్డి ఏం చేశారో తెలుసా? జానారెడ్డిని అందరికంటే ఎక్కువ నేనే గౌరవించాను' అని సీఎం చెప్పారు. దీనిపై కిషన్‌రెడ్డి ఇంత అసహనం పనికి రాదని వ్యాఖ్యానించగా సీఎం జోక్యం చేసుకుని, 'వితండ వాదనలు చేయడం కాదు. ఇక్కడ జరిగింది దురదృష్టకర ఘటన. రెండింట మూడొంతుల మంది సస్పెన్షన్, బహిష్కరణ నిర్ణయాన్ని ఆమోదించారు. సభ అంటే మీరేనా? రెండింట మూడొంతులున్న వాళ్లు మౌనం పాటించాలా? సభ చాలా స్పష్టంగా సస్పెన్షన్‌ను పాస్‌చేసింది' అని కేసీఆర్ చెప్పారు. సభలో ఉన్న మూడొంతుల మంది సభ్యుల అభిప్రాయాన్ని గౌరవించరా? అని బీజేపీని నిలదీశారు.

ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్సీల సస్పెన్షన్



శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్‌పై దాడి నేపథ్యంలో ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్సీలను వైస్‌చైర్మన్ నేతి విద్యాసాగర్ సస్పెండ్‌చేశారు. ప్రస్తుత బడ్జెట్ సమావేశాలు ముగిసేవరకు ఈ సస్పెన్షన్ కొనసాగుతుందని ప్రకటించారు. మంగళవారం సమావేశం ప్రారంభమైన తర్వాత సోమవారం చైర్మన్ స్వామిగౌడ్‌పై జరిగిన దాడి ఘటనను ప్రస్తావించిన వైస్‌చైర్మన్.. ప్రజాస్వామ్యంలో ఇటువంటి సంఘటనలు దురదృష్టకరమని విచారం వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రథమ పౌరుడిపైననే దాడికి పాల్పడటం, మండలి చైర్మన్‌ను గాయపరచడంవంటి ఘటనలు బాధాకరమన్నారు. ఇదే అంశంపై మాట్లాడేందుకు ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరికి అవకాశం ఇచ్చారు. కడియం మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలపైననే దాడికి పాల్పడిన కాంగ్రెస్ సభ్యులను సస్పెండ్ చేయాలని చైర్మన్‌కు సూచించారు. నిర్ణయాలు బాధాకరమైనప్పటికీ, ప్రజలకు ప్రజాస్వామ్య వ్యవస్థలపైన విశ్వాసం పెంచాలంటే కఠిన నిర్ణయాలు తప్పవని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. మండలిలోని కాంగ్రెస్ సభ్యులు షబ్బీర్‌అలీ, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఆకుల లలిత, దామోదర్‌రెడ్డి, సంపత్‌కుమార్‌లను సస్పెండ్ చేయాలని చైర్మన్‌ను కోరారు. ఈ మేరకు వారిని సస్పెండ్ చేస్తున్నట్టు విద్యాసాగర్ ప్రకటించారు. అనంతరం కాంగ్రెస్ సభ్యులు నినాదాలు చేసుకుంటూ సభ నుంచి బయటకు వెళ్లిపోయారు.

బహిష్కరణలు కొత్తేమీకాదు

- ఇందిరాగాంధీనీ సస్పెండ్ చేశారు
- ఆర్టికల్ 194 (3) ద్వారా చట్టసభలకు అధికారం కల్పించిన రాజ్యాంగం
- పలు ఇతర రాష్ట్రాల్లోనూ సభ్యులపై చర్యలు
- న్యాయపరమైన అభ్యంతరాలూ ఉండవ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

అనుచిత వ్యాఖ్యలు, అనుచిత ప్రవర్తనతో చట్టసభల గౌరవానికి భంగం కలిగించేలా, సభ హుందాతనాన్ని కించపరిచేలా వ్యవహరించిన ఏ సభ్యుడినైనా సభ నుంచి బహిష్కరించే అధికారం ఆయా చట్టసభలకు ఉంటుంది. ఉభయ సభల సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించే సమయంలో అరాచకం సృష్టించి, మండలి చైర్మన్ కంటికి గాయం చేసిన వారిపై తెలంగాణ శాసనసభ ఈ క్రమంలోనే చర్యలు తీసుకున్నది. చరిత్రలో ఇలాంటి బహిష్కరణ సంఘటనలను చాలానే ఉన్నాయి. భారత పార్లమెంటరీ వ్యవస్థను ఒక్క కుదుపు కుదిపిన 'ఓటుకు నోటు' ఉదంతంలో ఒక్క వేటుతో 11 మంది ఎంపీలను లోక్‌సభనుంచి బహిష్కరించారు. ఈ సంఘటన అప్పట్లో సంచలనం సృష్టించింది. చట్టసభల గౌరవానికి భంగం కలిగించేలా సభ్యులు ప్రవర్తిస్తే.. వారిని బహిష్కరించే అధికారం సభకు ఉంటుందని, ఈ బహిష్కరణకు ఎలాంటి న్యాయపరమైన అభ్యంతరాలుకూడా నిలువలేనివేనని స్పష్టంగా చాటిచెప్పిన సందర్భం అది. అంతెందుకు.. భారత పార్లమెంటరీ వ్యవస్థపై, దేశంపై తనదంటూ ముద్ర వేసిన ఇందిరాగాంధీనికూడా దాదాపు సంవత్సరానికిపైగా బహిష్కరించిన చరిత్ర ఉంది. ఇందుకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 105 (3) ప్రకారం పార్లమెంట్‌కు విశేషాధికారాలు ఉన్నాయి. రాష్ట్రాల చట్ట సభలకు (శాసనసభ, శాసనమండలి) కూడా ఇలాంటి పరిస్థితి ఎదురైతే.. ఆర్టికల్ 194 (3) ప్రకారం బాధ్యులైన సభ్యులను బహిష్కరించే అధికారం సభకు ఉంది. ఒకవేళ రాజ్యాంగంలోని ఆర్టికల్ 208(1) కింద సభ్యుడి బహిష్కరణకు ఎలాంటి ఆదేశిత అధికరణలను సిద్ధం చేయకున్నా.. ఆర్టికల్ 194(3)ద్వారా సభకున్న అధికారంతో సదరు సభ్యుడిని బహిష్కరించవచ్చని గత సంఘటనలు స్పష్టంచేస్తున్నాయి. 'ఓటుకు నోటు' వ్యవహారంలో సభ నుంచి సభ్యులను బహిష్కరించే అధికారం ఉందని మాజీ సొలిసిటర్ జనరల్, సీనియర్ న్యాయవాది టీఆర్ అంధ్యార్జున కూడా తన రచనల్లో నొక్కివక్కాణించారు.

స్పష్టంగా తీర్పు చెప్పిన మధ్యప్రదేశ్ హైకోర్టు

చట్టసభకున్న అధికారాన్ని మధ్యప్రదేశ్ హైకోర్టుకూడా గతంలో ఒక కేసులో స్పష్టంచేసింది. 1966 మార్చి 17న మధ్యప్రదేశ్ విధానసభలో డిప్యూటీ స్పీకర్‌ను దుర్భాషలాడుతూ.. ఆయనపైకి చెప్పులు విసిరారు. దీనిపై సభలో పలువురు సభ్యులు వేర్వేరుగా తీర్మానాలను సభముందు ఉంచారు. ఆ మేరకు పలువురు సభ్యులను సభ నుంచి బహిష్కరించారు. ఈ నేపథ్యంలోనే మార్చి 19, 1966న జారీచేసిన రెండు వేర్వేరు గెజిట్‌లలో యశ్వంతరావు మెఘావలె, పంధరిరావు క్రిదత్తల శాసనసభ సభ్యత్వాలను వారి అనుచిత ప్రవర్తన కారణంగా రద్దుచేసినట్టు పేర్కొన్నారు. మార్చి 21న విధానసభ కార్యదర్శి కేంద్ర ఎన్నికల కమిషన్ కార్యదర్శికి లేఖ రాస్తూ.. యశ్వంతరావు మెఘావలె, పంధరిరావు క్రిదత్త స్థానాలు ఖాళీ అయినట్టుగా గుర్తించాలని పేర్కొన్నారు. దీనిపై యశ్వంతరావు మధ్యప్రదేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిని విచారించిన హైకోర్టు ఆగస్టు, 29, 1966న తీర్పు చెప్తూ.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 208(1) కింద సభ్యుల బహిష్కరణకు ఎలాంటి నిర్దేశితాలను రూపొందించనప్పటికీ, సభ ఔన్నత్యాన్ని కాపాడటం, గౌరవాన్ని నిలబెట్టడంలో భాగంగా ఆర్టికల్ 194(3) ప్రకారం సభ్యులను బహిష్కరించే అధికారాన్ని కలిగి ఉందని స్పష్టం చేసింది. ఇలా భారత పార్లమెంటరీ వ్యవస్థలో సభ గౌరవానికి తీవ్ర భంగం కలిగించిన సభ్యులపై బహిష్కరణ వేటువేయడం అనేది ముందునుంచీ కొనసాగుతూ వస్తున్నదనేది స్పష్టమవుతున్నది. పార్లమెంట్, శాసనసభల్లో రికార్డయిన ఇలాంటి సంఘటనల తీర్మానాలను పరిశీలించిన మీదటే.. తెలంగాణ ప్రభుత్వంకూడా.. సోమవారం ఘటనలో కాంగ్రెస్ సభ్యులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంపత్‌లను బహిష్కరించేందుకు తీర్మానం ప్రవేశపెట్టింది. దీనిని సభ ఆమోదించడంతో మంగళవారం ఉదయం నుంచి సదరు ఇద్దరు సభ్యులు తమ శాసనసభ సభ్యత్వం కోల్పోయినట్టేనని న్యాయనిపుణులు స్పష్టంచేస్తున్నారు.

మరికొన్ని ఉదాహరణలు..

- సెప్టెంబర్ 25, 1951 నాడు లోక్‌సభ సభ్యుడు హెచ్.జి.ముద్గల్‌ను సభ నుంచి బహిష్కరించారు.
- అనుచిత ప్రవర్తనతో సభాగౌరవాన్ని భంగపర్చినందుకు నవంబర్ 15, 1976న సుబ్రమణ్యస్వామిని రాజ్యసభ నుంచి బహిష్కరించారు.
- దేశ చరిత్రలోనే ప్రముఖ స్థానం సంపాదించుకున్న ప్రధానిగా పేరుగాంచిన ఇందిరాగాంధీని నవంబర్ 18, 1977న లోక్‌సభ నుంచి బహిష్కరించారు.
- భారత పార్లమెంటరీ చరిత్రలో తీవ్ర సంచలనం సృష్టించిన సంఘటనల్లో ఒకటైన 'ఓటుకు నోటు' వ్యవహారంలో డిసెంబర్ 23, 2005న 11 మంది ఎంపీలను సభ నుంచి బహిష్కరించారు.
- అసభ్యంగా ప్రవర్తించారన్న కారణంతో ఏపీ ఎమ్మెల్యే రోజాను అసెంబ్లీ నుంచి ఏడాదిపాటు సస్పెండ్ చేశారు.
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హయాంలో అప్పటి ఎమ్మెల్యే కరణం బలరాంను 2008 మార్చిలో ఆరు నెలలపాటు సస్పెండ్ చేశారు. అప్పటి అసెంబ్లీ స్పీకర్‌పై కరణం బలరాం ప్రకాశం జిల్లాలో అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు ఈ చర్యలు తీసుకున్నారు.
- జూన్ 13, 1964న మహారాష్ట్ర శాసనసభకూడా ఒక సభ్యుడిని సభ నుంచి బహిష్కరించింది.
- కేరళ శాసనసభలో 2015, మార్చి 13న బడ్జెట్ ప్రవేశపెట్టే సందర్భంగా రాష్ట్ర ఆర్థిక మంత్రిపట్ల దురుసుగా ప్రవర్తించిన ప్రతిపక్ష ఎమ్మెల్యేలపై అసెంబ్లీ కార్యదర్శి ఫిర్యాదుమేరకు పోలీసు కేసు నమోదుచేశారు.

ఆ ఇద్దరి సభ్యత్వాలు రద్దు చేస్తూ గెజిట్

కాంగ్రెస్ నేతలు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంపత్‌కుమార్‌ల శాసనసభ సభ్యత్వాలు రద్దయినట్టు మంగళవారం రాత్రి విడుదలైన గెజిట్ పేర్కొంది. ఇదే విషయాన్ని ఢిల్లీలోని కేంద్ర ఎన్నికల సంఘానికి తెలియజేసేందుకు బుధవారం ఉదయం శాసనసభ నుంచి లేఖ రాయనున్నట్టు సమాచారం. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంపత్‌కుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న నల్గొండ, అలంపూర్ స్థానాలు మంగళవారం నుంచి ఖాళీ అయినట్టుగా అధికారికంగా గుర్తించాలని ఈ లేఖలో పేర్కొననున్నారు. ఈ నేపథ్యంలో ఈ రెండు నియోజకవర్గాలకు ఉపఎన్నికలు అనివార్యం కానున్నాయి.

టీఆర్ఎస్ ఎంపీల నిరసనతో దద్దరిల్లిన లోక్‌సభ

- రిజర్వేషన్ల కేటాయింపు అంశంపై పోరాటం ఉద్ధృతం
- పోడియం వద్దకు దూసుకెళ్లి కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు
- పార్లమెంటులో ఏడోరోజూ కొనసాగిన నిరసనలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

టీఆర్ఎస్ ఎంపీల నిరసనతో మంగళవారం లోక్‌సభ దద్దరిల్లింది. రిజర్వేషన్ల కేటాయింపుల్లో రాష్ట్రాలకు హక్కులు కల్పించాలని ఎంపీలు తమ పోరాటాన్ని ఉద్ధృతం చేశారు. కేంద్రం పట్టించుకోకపోవడంతో నిరసనలతో లోక్‌సభను స్తంభింపజేశారు. పార్లమెంట్ ఉభయసభలు వరుసగా ఏడోరోజూ ఎలాంటి సభా కార్యక్రమాలు జరుగకుండానే వాయిదాపడ్డాయి. సభ ప్రారంభం కాగానే రిజర్వేషన్లు కల్పించే అధికారం రాష్ట్రాలకే ఇవ్వాలని కోరుతూ టీఆర్ఎస్ లోక్‌సభా పక్షనేత జితేందర్‌రెడ్డి నేతృత్వంలో టీఆర్ఎస్ ఎంపీలు వినోద్‌కుమార్, సీతారాంనాయక్, బాల్క సుమన్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, పసునూరి దయాకర్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, నగేశ్ ప్లకార్డులు ప్రదర్శించారు. స్పీకర్ పోడియం వద్దకు వెళ్లి కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో సభను స్పీకర్ మధ్యాహ్నం 12గంటల వరకు వాయిదావేశారు. తిరిగి సభ ప్రారంభమైన తర్వాత కూడా టీఆర్ఎస్ ఎంపీలు జై తెలంగాణ నినాదాలు చేస్తూ రిజర్వేషన్ల హక్కులను రాష్ట్రాలకే ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ఎంపీల ఆందోళనల మధ్యే స్పీకర్ జీరో అవర్‌ను ప్రారంభించారు. అయినా, సభ్యులు నినాదాలతో హోరెత్తించడంతో సభను బుధవారానికి వాయిదావేస్తున్నట్టు ఆయన ప్రకటించారు. రాజ్యసభ సైతం వరుసగా ఏడోరోజు ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించకుండానే వాయిదా పడింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ స్కాం విషయంలో కాంగ్రెస్, తృణమూల్ ఎంపీలు, కావేరీ నదీజలాల బోర్డు ఏర్పాటుచేయాలని అన్నాడీఎంకే ఎంపీలు ఆందోళన చేపట్టడంతో సభను వాయిదావేశారు. ఆ తర్వాత కూడా పరిస్థితిలో మార్పురాకపోవడంతో బుధవారానికి వాయిదా వేశారు.



మంగళవారం పార్లమెంట్ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న ఎంపీలు ఏపీ జితేందర్‌రెడ్డి, బీ వినోద్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, సీతారాంనాయక్, జీ నగేశ్, పసునూరి దయాకర్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, డీ శ్రీనివాస్, మల్లారెడ్డి, బాల్క సుమన్



మంగళవారం యాదాద్రిలో మీడియాతో మాట్లాడుతున్న రైతు సమన్వయ సమితి రాష్ట్ర చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

రైతుల సమగ్రాభివృద్ధికి కార్యాచరణ

- నియోజకవర్గ కేంద్రాల్లో ఆగ్రో ఆధారిత పరిశ్రమలు
- రూ.2 వేలకోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడం చరిత్రాత్మకం
- తెలంగాణ రైతు సమన్వయ సమితి రాష్ట్ర చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: రైతులకు మౌలిక సదుపాయాల కల్పన, ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా రైతు సమన్వయ సమితి రాబోయే ఆరు నెలల కార్యాచరణను సిద్ధంచేస్తున్నదని రాష్ట్ర రైతు సమన్వయసమితి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి చెప్పారు. రైతులు అన్నివిధాలుగా ఎదిగేందుకు సమితి కృషి చేస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి మంగళవారం యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహస్వామిని కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ రైతులు సంఘటితంగా లేకపోవడం వల్లే సమస్యలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. 'వ్యవసాయం, విద్యుత్, పౌరసరఫరాలు, ఆర్థిక, మార్కెటింగ్‌శాఖ, మత్స్యశాఖ మంత్రుల సమన్వయంతో కార్యాచరణ చేపడుతున్నాం. ఎరువులు, విత్తనాలు అందజేసే కార్యక్రమం కూడా కొనసాగుతుంది. వ్యవసాయ యాంత్రీకరణకు చర్యలు చేపడుతాం. రైతుల కోసం యాంత్రీకరణ సర్వే చేపట్టి.. ట్రాక్టర్లు, హార్వెస్టర్లు తదితర వ్యవసాయ పరికరాల వివరాలను సేకరించాం' అని గుత్తా సుఖేందర్‌రెడ్డి వివరించారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గకేంద్రాల్లో ఆగ్రో ఆధారిత పరిశ్రమలను ప్రారంభించనున్నట్టు ఆయన ప్రకటించారు. మే 1 నుంచి వ్యవసాయానికి పెట్టుబడి కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. రాష్ట్రంలో 1.61 లక్షల సభ్యత్వాలతో సమితి ఏర్పడిందని, రైతులను సమన్వయపరిచి మంచి దిగుబడి సాధించేందుకు కృషిచేస్తామని ఆయన పేర్కొన్నారు.

తెలంగాణకు మరో తిరుమల యాదాద్రి

ముఖ్యమంత్రి కేసీఆర్ యాదాద్రికి రూ.2 వేల కోట్లను వెచ్చించి అభివృద్ధి చేస్తున్నందున ఇది తెలంగాణకు తలమాణికంగా మారనుందని గుత్తా సుఖేందర్‌రెడ్డి చెప్పారు. తెలంగాణకు మరో తిరుమలగా యాదాద్రి మారుతుందని పేర్కొన్నారు. వేలకోట్లతో యాదాద్రి ఆలయాన్ని పునర్నిర్మించడం చరిత్రాత్మకమని చెప్పారు. తనపై భరోసా ఉంచి సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించినందుకు సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గుత్తా వెంట నార్మాక్స్ డెయిరీ చైర్మన్ గుత్తా జితేందర్‌రెడ్డి, టీఆర్ఎస్ రైతు విభాగం రాష్ట్ర ప్రధానకార్యదర్శి గొంగిడి మహేందర్‌రెడ్డి, ఆల్డా చైర్మన్ మోతె పిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి పదో తరగతి పరీక్షలు

- ఉదయం 8:45కే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి
- ఉదయం 9.30 నుంచి పరీక్షలు ప్రారంభం
- హాజరుకానున్న 5,38,867 మంది విద్యార్థులు
- 2,542 కేంద్రాల్లో పరీక్షల నిర్వహణ
- సందేహాల నివృత్తికి టోల్‌ఫ్రీ నంబర్-18004257462
- పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ జీ కిషన్ స్పష్టీకరణ



హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రవ్యాప్తంగా గురువారం నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ జీ కిషన్ తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, ఉదయం 8.45 గంటలకే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్ష ప్రారంభం అయ్యాక మరో ఐదు నిమిషాల వరకే గ్రేస్ పీరియడ్ ఉంటుందని, ఆ లోపు మాత్రమే లోపలికి అనుమతిస్తామని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కిషన్ స్పష్టంచేశారు. రాష్ట్రవ్యాప్తంగా 11,103 పాఠశాలల నుంచి 5,38,867 మంది(బాలురు 2,76,388, బాలికలు 2,62,479) పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. వీరిలో రెగ్యులర్ విద్యార్థులు 5,03,117 మంది, ప్రైవేటు విద్యార్థులు 35,750 మంది ఉన్నట్టు చెప్పారు. ఒకేషనల్ అభ్యర్థులు 20,838 మంది హాజరవుతున్నారని పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణకు రాష్ట్రవ్యాప్తంగా 2,542 పరీక్ష కేంద్రాలను ఏర్పాటుచేశామని, హాల్‌టికెట్లు అందని విద్యార్థులు www.bse.telangana.gov.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. వీటిపై ప్రధానోపాధ్యాయుల సంతకం, స్టాంపు వేయించుకొని పరీక్షలకు హాజరుకావాలని తెలిపారు. పరీక్షలను సజావుగా నిర్వహించడం కోసం 148 ఫ్లయింగ్‌స్క్వాడ్‌లను ఏర్పాటుచేశామని తెలిపారు. పరీక్షలపై సందేహాల నివృత్తి కోసం డీఈవో, ఎంఈవోలను నియమించామని, ప్రభుత్వ పరీక్షల విభాగంలో టోల్‌ఫ్రీ నంబర్ (18004257462), కంట్రోల్‌రూం ఏర్పాటుచేశామని వివరించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ జవాబు పత్రాలను బయటకు తీసుకెళ్లవద్దని, ఆన్సర్‌షీట్‌పై పేర్లు, సంతకాలు, చిహ్నాలు, నినాదాలు రాయవద్దని, హాల్‌టికెట్ తప్ప ఇతర కాగితాలను పరీక్ష కేంద్రాల్లోకి తేవొద్దని సూచించారు. చూచిరాతకు పాల్పడితే విద్యార్థులపై చట్టపరమైన చర్యలు తీసుకొని డిబార్ చేస్తామని హెచ్చరించారు. ఇన్విజిలేటర్లపైనా చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. ఈ మేరకు పరీక్ష ప్రారంభానికి ముందే హామీపత్రాలపై సంతకాలు చేయాల్సి ఉంటుందని చెప్పారు. సమావేశంలో ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ బీ సుధాకర్‌రెడ్డి, విజయభారతి తదితరులు పాల్గొన్నారు.

చూచిరాతకు ఇన్విజిలేటర్లను బాధ్యులుగా చేయవద్దు

పదోతరగతి పరీక్షల్లో విద్యార్థులు చూచిరాతకు పాల్పడితే ఇన్విజిలేటర్లను బాధ్యులుగా చేయవద్దని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు పలు ఉపాధ్యాయసంఘాల నాయకులు విజ్ఞప్తిచేశారు. ఈ మేరకు సంతకాలు చేయాలనే హామీపత్రాల విధానాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ మేరకు మంగళవారం పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌ను పీఆర్టీటీయూటీఎస్, యూటీఎఫ్, ఎస్టీయూటీఎస్, టీటీఎఫ్, టీపీటీఎఫ్, డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఓ ప్రకటనలో కోరారు.

ఎంపీ కవితకు శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని మోదీ, సీఎం కేసీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలు మంగళవారం రాష్ట్రంతోపాటు దేశ విదేశాల్లో ఘనంగా జరిగాయి. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ లేఖ రాశారు. ఈ లేఖను తెలుగులో రాయడం విశేషం. 'మీ జన్మదినం సందర్భంగా నా హృదయపూర్వక శుభాకాంక్షలు స్వీకరించండి. దేశ ప్రజలకు సేవలందించేందుకు వీలుగా మీకు ఆరోగ్యకర, ఆనందమయ జీవితాన్ని ప్రసాదించాలని భగవంతుడిని కోరుకుంటున్నాను' అని ప్రధాని తన లేఖలో పేర్కొన్నారు. సీఎం కే చంద్రశేఖర్‌రావు ఆమెకు హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఎంపీ కవితకు శుభాకాంక్షలు తెలిపారు.







టీఆర్టీ ప్రాథమిక కీ విడుదల

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: టీచర్ పోస్టుల భర్తీకి నిర్వహించిన టీఆర్టీకి సంబంధించిన ప్రాథమిక కీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్టు టీఎస్‌పీఎస్సీ ఓ ప్రకటనలో తెలిపింది. బుధవారం నుంచి కీ అభ్యంతరాలను ఈ నెల 21 నుంచి 31 వరకు స్వీకరించనున్నట్టు కమిషన్ కార్యదర్శి తెలిపారు. ఇంగ్లిష్‌లో మాత్రమే అభ్యంతరాలను స్వీకరిస్తామని, ఇతరభాషల్లో తెలియజేయాలనుకుంటే అటాచ్ ఫైల్ లింక్ ద్వారా పీడీఎఫ్ రూపంలో సమర్పించవచ్చని పేర్కొన్నారు. హాల్‌టికెట్ నంబర్, పేపర్ కోడ్, సిరీస్, ప్రశ్న సంఖ్య, ప్రశ్న ఐడీ తప్పకుండా పొందుపర్చాలని సూచించారు.

ముగిసిన రాజ్యసభ నామినేషన్ల పరిశీలన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాజ్యసభ నామినేషన్ల పరిశీలన మంగళవారం ముగిసింది. రాష్ట్రం నుంచి ఖాళీగా ఉన్న మూడు రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరుగునుండగా మొత్తం 5 నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో శ్రమజీవి పార్టీ అభ్యర్థి జాజుల భాస్కర్ నామినేషన్‌ను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి తిరస్కరించారు. టీఆర్ఎస్ పార్టీ తరపున జోగినిపల్లి సంతోష్‌కుమార్, బండ ప్రకాశ్, బడుగుల లింగయ్యయాదవ్, కాంగ్రెస్ నుంచి పీ బలరాంనాయక్ నామినేషన్లు సక్రమంగా ఉన్నాయని తెలిపారు. జాజుల భాస్కర్ నామినేషన్ పత్రాలు సరిగా లేవని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ నరసింహాచార్యులు ఎన్నికల ప్రధాన అధికారికి నివేదించారు. దీంతో ఆయన నామినేషన్‌ను తిరస్కరిస్తున్నట్టు రాష్ట్ర ఎన్నికల ప్రధానఅధికారి రజత్‌కుమార్ తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 15వ తేదీ మధ్యాహ్నం 3గంటల వరకు గడువు ఉంది. నాలుగో అభ్యర్థి బరిలో ఉన్నపక్షంలో ఈ నెల 23న పోలింగ్ జరుగుతుంది.



నరేశ్ అగర్వాల్ గారు బీజేపీలోకి రావటాన్ని ఆహ్వానిస్తున్నాను. కానీ ఆయన జయాబచ్చన్ గురించి చేసిన వ్యాఖ్యలు ఆమోదనీయం కాదు. వాటిని ఆయన వెంటనే వెనక్కి తీసుకోవాలి.

సుష్మాస్వరాజ్, కేంద్రమంత్రి

గోవా ముఖ్యమంత్రి మనోహర్ పరికర్ చికిత్సకోసం అమెరికా వెళ్లటంతో రాష్ట్రంలో పాలన స్తంభించిపోయింది. పాలనాధిపతి లేక అనేక సమస్యలు ఏర్పడ్డాయి. మైనింగ్ శాఖలో సంక్షోభం తలెత్తింది. కాబట్టి వెంటనే గోవాలో రాష్ట్రపతి పాలన విధించాలి.

రాఖీ ప్రభుదేశాయ్ నాయక్, గోవా శివసేన అధికార ప్రతినిధి



చరిత్రలో నేడు



1794

పత్తి జిన్ మిషన్‌పై పేటెంట్ పొందిన ఎలి వైట్నీ.

1955

నేపాల్ రాజుగా అభిషిక్తుడైన ప్రిన్స్ మహేంద్ర.





1957

ఇండోనేషియాలో సాస్త్రోమిడ్జోజో ప్రభుత్వం రాజీనామా.

నాసిక్ నుంచి ముంబైకి సాగిన రైతుల 200 కి.మీ. యాత్ర మహారాష్ట్ర ప్రభుత్వం హామీలతో ముగిసింది. కానీ విధానకర్తల అవగాహనలోనే లోపం ఉన్నది. ఈ సంక్షోభాన్ని రుణ మాఫీకి సంబంధించిన సమస్యగా గుర్తించడం మొదటి లోపం. రాష్ట్రం మొత్తం సమస్య ఒకే విధంగా ఉందను కోవడం మరొక పొరపాటు. విదర్భ, మరఠ్వాడా ప్రాంతాల రైతుల సమస్యలు నాసిక్‌తో పోలిస్తే భిన్నమైనవి. వ్యవసాయ రంగంలో ఏర్పడిన సంక్షోభాన్ని తక్షణం పరిష్కరించవలసిన అవసరం ఉన్నది. నిప్పుల మీద నీళ్ళు చల్లినట్టు ఏదో సహాయం ప్రకటించినంత మాత్రాన ఫలితం ఉండదు.

హిందుస్థాన్ టైమ్స్

ఢిల్లీలో పాకిస్థాన్ దౌత్యవేత్తలను, వారి కుటుంబాల వేధింపు సాగుతున్నది. దౌత్యవేత్తలు నగరంలో తిరుగుతున్నప్పుడు ఇబ్బంది పెట్టడం, వారి పిల్లలు పాఠశాలలకు వెళ్ళకుండా అడ్డుకోవడం సాగుతున్నది. మోదీ ప్రభుత్వంలోని అతివాదశక్తులు భారత్ పాక్ దేశాల మధ్య సంబంధాలను దెబ్బ కొట్టాలని సూచిస్తున్నాయి. పాక్‌లోనూ ఇటువంటి మతవాద వర్గాలు ఇదే కోరుకుంటున్నాయి. కానీ రెండు దేశాల్లోని పరిపాలకులు ఇటువంటి ధోరణులను పట్టించుకోకుండా, శాంతియుత సంబంధాలను నెలకొల్పుకోవాలె. పాక్ దౌత్యవేత్తలకు భద్రత కల్పించడానికి భారత్ చొరవ చూపించాలె.

డాన్

సభ ప్రతిష్ఠ కాపాడాలి

రాష్ట్ర బడ్జెట్ సమావేశాల తొలిరోజే ప్రతిపక్షాల వ్యవహరణ తీరు పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి మచ్చ తెచ్చే విధంగా ఉన్నది. ఓ సభ్యుడు విసిరిన హెడ్‌ఫోన్ నేరుగా సభాధ్యక్ష స్థానం వైపు దూసుకెళ్లి గోడకు తగిలి మండలి చైర్మన్ స్వామిగౌడ్ కంటికి తగిలింది. ప్రతిపక్షాల తీరు నిరసనల పరిధి దాటి దాడుల దాకా దిగజారటం దిగ్భ్రాంతికరం. పార్లమెంటరీ వ్యవస్థలో అధికారపక్ష విధాన లోపాలను ఎత్తిచూపటం, ప్రజానుకూల విధానాలకు పట్టుబట్టడం ఆరోగ్యకర, ఆహ్వానించదగ్గ విధానం. ఇలాంటి చర్చలే వ్యవస్థకు బలాన్ని చేకూరుస్తాయి. కానీ ఈమధ్య ప్రతిపక్షాల తీరు మరోలా మారిపోయింది. అధికారపక్షం ఏ పనిచేసినా, ఏ పథకాన్ని ప్రవేశపెట్టినా వ్యతిరేకించటమే, రచ్చచేయటమే పనిగా పెట్టుకున్నట్లుగా కనిపిస్తున్నది. గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకునే వ్యూహంతో సభలోకి ప్రవేశించటం శోచనీయం. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం కూడా ముందు జాగ్రత్తగా మార్షల్స్‌ను పెద్ద సంఖ్యలో మోహరించి సభాధ్యక్ష స్థానానికి రక్షణ ఏర్పరిచింది. అయినా ఇలాంటి ఘటన చోటుచేసుకోవటం పరిస్థితి తీవ్రతను తెలుపుతున్నది. ప్రజానుకూల విధాన రచనకు, రూపకల్పనకు వేదిక కావాల్సిన చట్టసభలు బల ప్రదర్శనల స్థాయికి దిగజారటం ప్రజాస్వామ్య ప్రియులను కలిచివేస్తున్నది. అయితే ఇదేదో కాకతాళీయంగా, పొరపాటుగా జరిగిందని సరిపెట్టుకునే పరిస్థితులు లేకపోవటమే ఇప్పటి విషాదం.

కొంతకాలంగా చట్టసభల్లో చోటుచేసుకుంటున్న విపరీత పరిణామాలు ఏ మాత్రం సమర్థనీయంగా లేవు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి చర్చలే జవము, జీవమూ అన్న విషయాన్ని మరిచి ప్రవర్తిస్తున్న తీరుతో చట్టసభల విలువల పతనం పాతాళంలో పడిన స్థితిని తెలుపుతున్నాయి. దీనికి పార్లమెంటు మొదలు, వివిధ రాష్ట్రాల అసెంబ్లీలు వేదికలు కావటం దిగజారుతున్న చట్టసభల ప్రతిష్ఠకు తార్కాణం. కేరళ అసెంబ్లీలో బడ్జెట్ ఘట్టం మునుపెన్నడూ ఎరుగని బీభత్స కాండకు వేదికైంది. ముడుపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆర్థికమంత్రి కె.ఎం.మణి వార్షిక బడ్జెట్ పెట్టకుండా అడ్డుకుంటామని విపక్ష ఎల్‌డీఎఫ్ ముందుగానే ప్రకటించింది. ఆరునూరైనా బడ్జెట్ ప్రవేశపెట్టి తీరుతామని కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ పంతానికి పోయింది. ఈ క్రమంలో ఇరుపక్షాల మధ్య అక్షరాలా యుద్ధమే జరిగింది. ఏకంగా సభాపతి కుర్చీనే ఎత్తి బయటపడేశారు. ప్రతిపక్ష సభ్యుల రణగొణ ధ్వనుల మధ్య ఆరు నిమిషాల్లోనే 140 పేజీల బడ్జెట్‌ను చదివేశారు! ఈ క్రమంలో జరిగిన విధ్వంసం అంతాఇంతా కాదు. వైరిపక్షీయుల్ని కొట్టి, కొరికి, నెట్టి, కంప్యూటర్లు బద్దలుకొట్టి, బల్లలపై ఎక్కి చిందులు తొక్కి సృష్టించిన మహా గందరగోళం కేరళనే కాదు, యావత్ భారతావనినే దిగ్భ్రాంతి పరిచింది. ఇక తమిళనాట అసెంబ్లీలో జరిగిన కీచులాట, కీచకపర్వం తెలియంది కాదు. ఒడిషా శాసన సభలోనూ జరిగిన దొమ్మిలో ముఖ్యమంత్రి దవాఖానకు వెళ్లి కట్టు కట్టించుకోవాల్సి వచ్చింది. మరో సందర్భంలో గవర్నర్‌నూ ఉతికి ఆరేసిన తీరూ ఉన్నది. ఉత్తరప్రదేశ్‌లో వీధిపోరాటాలు దర్శనమిచ్చాయి. బీహార్‌లో తప్పతాగివచ్చిన ఓ సభ్యుడు మల్లయుద్ధానికి దిగిన ఉదంతం ఉన్నది. మధ్యప్రదేశ్‌లో పాదరక్షలు తలలకు తగిలి నెత్తురును కళ్లచూశాయి. ఈ నేపథ్యంలోంచే పార్లమెంటులో పెప్పర్ స్ప్రే కూడా ప్రజాస్వామ్య విలువలను మసకబార్చింది. ఇలాంటి దురావేశ, దుశ్చేష్టలు ప్రజాస్వామ్యానికి ప్రమాద సంకేతాలు.

సభలు సజావుగా ప్రయోజనాత్మకంగా జరిగేందుకు శాసనసభా స్పీకర్ కఠిన నిర్ణయాలు తీసుకోక తప్పలేదనిపిస్తున్నది. ఈ క్రమంలో రాజ్యసభ చైర్మన్‌గా నారాయణన్ చెప్పిన మాటలు గమనార్హమైనవి. చట్టసభ సర్వసత్తాక వ్యవస్థ కాబట్టి గౌరవ సభ్యులంతా స్వీయ సమీక్షతో తప్పులు గ్రహించాలి, దిద్దుకోవాలి. అవసరమైతే తనను తాను శిక్షించుకోవాలన్నారు ఆయన. నిజానికి ఇప్పుడు కావాల్సింది ఈ స్ఫూర్తేనని తేటతెల్లమవుతున్నది. ఇలాంటి స్వీయ నియంత్రణతోనే ప్రజాస్వామ్యానికి మూలస్తంభాల్లో ఒకటిగా ఉన్న శాసన నిర్మాణ వ్యవస్థ విశిష్టత పెరుగుతుంది. ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది.

చర్చలతో నడిచేది పార్లమెంటరీ ప్రజాస్వామ్యమని తొలినాటి సభాపతి మవలాంకర్ ఉద్బోధించారు. చట్టసభలను సజావుగా చర్చలకు సరైన వేదికలుగా నిలువనివ్వకుండా బలప్రదర్శనశాలలుగా భ్రష్టుపట్టిస్తున్న నేరం, పాపం రాజకీయపక్షాలది, గౌరవసభ్యులది. ఔన్నత్యాన్ని మరిచి వ్యవహరిస్తే మిగిలేది అరాచకమే. దేశవ్యాప్తంగా ఇటువంటి వికృత పోకడలు సాగుతున్న తరుణంలో తెలంగాణ సభ ఇందుకు భిన్నంగా ఆదర్శప్రాయంగా సాగాలని కోరుకోవడం అత్యాశ కాదు. మునుపెన్నడూ లేనివిధంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ తర్వాత అసెంబ్లీ గౌరవప్రదంగా, అర్థవంతంగా నడిచిన తీరు దేశానికే ఆదర్శంగా నిలిచింది. ప్రతిపక్ష సభ్యులు అడిగిన ప్రతి ప్రశ్నకూ సమాధానాలివ్వటం కోసం కాలపరిమితి లేకుండా గత బడ్జెట్ సమావేశాలు నడిచిన తీరు ఉండనే ఉన్నది. అయినా ఫక్తు రాజకీయ కారణాలతో చట్టసభ వేదికను రచ్చ చేయటం ప్రజారాజకీయం అనిపించుకోదు. ఇప్పుడు రాష్ట్ర అసెంబ్లీలో జరిగిన దుర్ఘటనలు దురదృష్టకరమైనవే. సభలు సజావుగా ప్రయోజనాత్మకంగా జరిగేందుకు శాసనసభా స్పీకర్ కఠిన నిర్ణయాలు తీసుకోక తప్పలేదనిపిస్తున్నది. ఈ క్రమంలో రాజ్యసభ చైర్మన్‌గా నారాయణన్ చెప్పిన మాటలు గమనార్హమైనవి. చట్టసభ సర్వసత్తాక వ్యవస్థ కాబట్టి గౌరవ సభ్యులంతా స్వీయ సమీక్షతో తప్పులు గ్రహించాలి, దిద్దుకోవాలి. అవసరమైతే తనను తాను శిక్షించుకోవాలన్నారు ఆయన. నిజానికి ఇప్పుడు కావాల్సింది ఈ స్ఫూర్తేనని తేటతెల్లమవుతున్నది. ఇలాంటి స్వీయ నియంత్రణతోనే ప్రజాస్వామ్యానికి మూలస్తంభాల్లో ఒకటిగా ఉన్న శాసన నిర్మాణ వ్యవస్థ విశిష్టత పెరుగుతుంది. ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది.

జనగళం

హిందీ బోధించాలె

రాష్ట్రంలోని ఉర్దూ మాధ్యమ, ఉన్నత పాఠశాలల్లో ద్వితీయ భాషగా తెలుగుతో పాటు కంపోజిట్ సబ్జెక్టుగా హిందీ భాష కూడా బోధించవలసిన అవసరం ఉన్నది. జాతీయ భాష అయిన హిందీ ప్రతి భారతీయుడు నేర్చుకోవలసిన ఆవశ్యకత ఉన్నది. నేడు వాణిజ్య, పారిశ్రామిక రంగాలు గ్రామాల దాకా విస్తరిస్తున్నాయి. దీంతో హిందీ భాష తప్పనిసరిగా మారింది. ఉర్దూ మాధ్యమ విద్యార్థులు హిందీ వింటే అర్థం చేసుకోగలుగుతున్నారు. కానీ హిందీ రాయడం, చదువడం రావడం లేదు. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ ఈ విషయమై ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి.

- ఎం.డి.అక్తర్ పాషా, అమరచింత, వనపర్తి

ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను ఏర్పాటు చేయాలె

జంటనగరాలతో పాటు మహానగరాల్లో రోడ్లు దాటాలంటే పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. రోడ్లు దాటే క్రమంలో ఎందరో ప్రమాదాల పాలవుతున్నారు. మరెందరో ప్రాణాలు కోల్పోతున్నారు. ఇక రోడ్డు దాటే క్రమంలో వృద్ధులు పడుతున్న బాధలు మాటల్లో చెప్పలేనివి. కాబట్టి ప్రధానమైన రోడ్ల మధ్యమధ్యన ఫుట్ ఓవర్‌బ్రిడ్జిలను ఏర్పాటు చేయాలి. లేదా సిగ్నళ్లను ఏర్పాటుచేయాలి. తద్వారా రోడ్డు ప్రమాదాలను తగ్గించినవారమవుతాం.

- సరికొండ శ్రీనివాసరాజు, వనస్థలిపురం, హైదరాబాద్

చర్యలు తీసుకోవాలె

శివకేశవులు ఇద్దరూ ఒక్కటే, అయినప్పటికీ భద్రాచలం క్షేత్రంలో గతంలో ఏ రకమైన సంప్రదాయక పూజలు నిర్వహించారో అదే విధంగా పూజలు నిర్వహించాలే. ఎవరో ఏదో చెప్పారని పూజా విధానం మార్చాలని పట్టుబట్టడం సరికాదు. గర్భగుడిలో నిరసన తెలిపిన వారిపై చర్యలు తీసుకోవాలి.

- వి.రాజశేఖరశర్మ, నాగర్‌కర్నూల్

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@namasthetelangaana.com Fax-040-23291118

అంతర్జాతీయం

మహమ్మద్ తాఖి

బుజ్జగింపులు ఇక చాలు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న కొత్త అఫ్ఘానిస్థాన్ వివాదం పాకిస్థాన్‌ను గందరగోళంలో పడేసింది. రెండు నెలల తర్వాత కూడా ఈ మనస్థితి నుంచి బయటపడటం లేదు. అమెరికా ఉగ్రవాద పోరాటానికి తాను మద్దతు ఇచ్చానని గుర్తుచేసింది. అఫ్ఘానిస్థాన్‌లోని అమెరికా కూటమి దళాలకు పాకిస్థాన్ మీదుగా సరఫరాలు అందకుండా అడ్డుకుంటామని పాకిస్థాన్ పార్లమెంటు హెచ్చరికలు కూడా చేసింది. పాకిస్థాన్ తాలిబన్లకు ఆశ్రయం ఇచ్చినా, హక్కానీ ఉగ్రవాద సంస్థకు తోడ్పడినా పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ట్రంప్ గట్టిగా హెచ్చరించారు. అన్నిటికి మించి అఫ్ఘానిస్థాన్ ప్రభుత్వానికి మద్దతు ఇవ్వవలసిందిగా ట్రంప్ భారత్‌కు సూచించడం పాకిస్థాన్‌కు వణుకు పుట్టించింది. పాకిస్థాన్ రాజకీయ నాయకులు, సైనికాధికారులు, విశ్లేషకులు భారత్‌కు ట్రంప్ చేసిన సూచనను తప్పుపడుతున్నారు. అఫ్ఘానిస్థాన్‌లో భారత్ ప్రమేయం పాకిస్థాన్‌కు ప్రమాదకరమని అంటున్నారు.

పాకిస్థాన్ ప్రధాని షహీద్ ఖాఖాన్ అబ్బాసీ ఇటీవల విదేశీ సంబంధాల మండలిలో ప్రసంగిస్తూ అఫ్ఘానిస్థాన్‌లో భారత్ రాజకీయ, సైనిక పాత్ర ఏ మాత్రం ఉండకూడదన్నారు.

అఫ్ఘానిస్థాన్‌కు భారత్ తోడ్పాటు అందించడంపై పాకిస్థాన్ గులుగుతుండటం ఇది తొలిసారి కాదు. భారత్‌కు స్థానం కల్పించకూడదని, పాకిస్థాన్ తనకు సూచించిందని అఫ్ఘానిస్థాన్ మాజీ అధ్యక్షుడు హమీద్ కర్జాయి గతంలో వెల్లడించారు. ఒబామా అధ్యక్షుడిగా ఉన్నప్పుడు అమెరికాకు అప్పటి పాకిస్థాన్ సైన్యాధ్యక్షుడు ఇటువంటి సూచనలే చేశాడు. పాకిస్థాన్ నాయకత్వం తాలిబన్ నాయకులకు తమ దగ్గర ఆశ్రయం కల్పిస్తూ, ఆ ఉగ్రవాద సంస్థను భారత్‌కు, అఫ్ఘానిస్థాన్‌కు వ్యతిరేకంగా వాడుకుంటున్నది. తాలిబన్ ఎమిర్ మహమ్మద్ ఒమర్ పాకిస్థాన్‌లోనే మరణించాడు. ఆయన వారసుడైన ముల్లా అఖ్తర్ మన్సూర్ పాకిస్థాన్‌లోనే అమెరికా డ్రోన్ దాడిలో మరణించాడు. ఆయన స్థానంలో మావ్లావీ హయిబుతుల్లా అఖున్జాదా నియామకం కూడా పాకిస్థాన్‌లోనే జరిగింది. ఇవన్నీ గమనిస్తే, పాకిస్థాన్ తాలిబన్లకు ఆశ్రయం కల్పిస్తున్నదని స్పష్టమవుతున్నది. అయినా పాకిస్థాన్ ప్రపంచాన్ని మోసం చేయాలని చూస్తున్నది. తాలిబన్ దళాలు అఫ్ఘానిస్థాన్‌లో ఉండవచ్చు, కానీ వారిని నడిపించే పెద్దలు మాత్రం పాకిస్థాన్‌లోనే ఉన్నారు. అఫ్ఘానిస్థాన్ న్యాయబద్ధమైన భద్రత పేర పాకిస్థాన్ ఏ మాత్రం సిగ్గులేకుండా ఉగ్రవాదులను తన ఏజెంట్లుగా ఉపయోగించుకుంటున్నది. పాకిస్థాన్ విదేశాంగ మంత్రి ఖావాజా ముహమ్మద్ అసిఫ్ ఇటీవల అమెరికా పర్యటన సందర్భంగా ఇదే పాట పాడారు. అఫ్ఘానిస్థాన్ భద్రత కోసం కూడా ఉగ్రవాదానికి తోడ్పాటు అందించడం నేరం.

అఫ్ఘానిస్థాన్‌లో భారత దళాలు ఉండకూడదని పాకిస్థాన్ కోరుకోవడాన్ని అర్థం చేసుకోవచ్చు. కానీ అఫ్ఘానిస్థాన్ ఏ దేశంతో దౌత్య సంబంధాలు పెట్టుకోవాలె, ఎక్కడినుంచి అభివృద్ధి నిధులు పొందాలనేది తామే శాసిస్తామనుకోవడం పెత్తందారీతనమే. వాస్తవ పరిస్థితిని అర్థం చేసుకోలేకపోవడమే. అఫ్ఘానిస్థాన్‌కు భారత్ రెండు వందల కోట్ల డాలర్ల మేర రుణసహాయం అందచేసింది. అధికారులకు, సైన్యానికి శిక్షణ కార్యక్రమం చేపట్టింది. ఆ దేశంలో అనేక పునర్నిర్మాణ ప్రాజెక్టులను చేపట్టింది. అఫ్ఘానిస్థాన్‌కు దక్షిణాసియాలోనే అత్యంత పెద్ద రుణదాత భారత్. 2002 నుంచి ఇప్పటివరకు మూడు వందల కోట్ల డాలర్ల సహాయం అందించింది. అఫ్ఘానిస్థాన్ పార్లమెంటు భవనాన్ని భారతే నిర్మించింది. సాల్మా డ్యామ్ వంటి ప్రధాన జలవిద్యుత్ ప్రాజెక్టులను నిర్మించింది. 2,500 కి.మీ. పొడవైన రహదారులను నిర్మించింది. వేలాది మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందిస్తున్నది. భారీ ఎత్తున మౌలిక వసతులను సమకూరుస్తున్నప్పటికీ కూడా అఫ్ఘానిస్థాన్‌లో భారత సైనిక దళాలు లేవు. భారత్ అఫ్ఘానిస్థాన్‌లో దళాలను దింపితే రెండు వైపులా సైన్యంతో తమ పరిస్థితి అడకత్తెరలో పోకముక్కలా తయారవుతుందని పాకిస్థాన్ కాలంచెల్లిన భావజాలంతో భయపడుతున్నది. పాకిస్థాన్ ఇప్పటివరకు నాలుగుసార్లు యుద్ధాలు చేసింది. ఏ ఒక్క యుద్ధంలో కూడా అఫ్ఘానిస్థాన్ పాకిస్థాన్ వ్యతిరేకత ప్రదర్శించలేదు. భారత్ అఫ్ఘానిస్థాన్‌లో డజన్ల కొద్దీ దౌత్య కార్యాలయాలు తెరిచినట్టు పాకిస్థాన్ ప్రచారం చేస్తున్నది. కానీ భారత కార్యాలయాలు పాకిస్థాన్ కన్నా ఎక్కువేమీ లేవు. ఒక రాయబార కార్యాలయం, నాలుగు కాన్సులేట్స్ మాత్రమే ఉన్నాయి. భారత్‌కు అఫ్ఘానిస్థాన్‌లో 1970 దశకంలో ఎన్ని దౌత్య కార్యాలయాలు ఉన్నాయో ఇప్పటికీ అన్నే ఉన్నాయి.

1947-48లో పాకిస్థాన్ కశ్మీర్ వేదికగా భారత్‌తో యుద్ధానికి దిగింది. ఈ సందర్భంగా తన సైన్యంతోపాటు పష్తూన్ యువతను కొంత మేర జిహాద్ పేర యుద్ధంలోకి దింపింది. జుల్ఫికర్ అలీ భుట్టో హయాం నుంచి జిహాదీ బలగాలను వాడుకోవడం పాకిస్థాన్ విదేశాంగ విధానంలో భాగమైంది. భుట్టో 1973లో విదేశాంగ మంత్రిత్వశాఖలో అఫ్ఘానిస్థాన్ విభాగాన్ని ఏర్పాటుచేశారు. అఫ్ఘానిస్థాన్ అధ్యక్షుడు దావూద్ లౌకికవాద పష్తూన్‌లకు, బెలూచీ రాజకీయవేత్తలకు, వేర్పాటువాదులకు మద్దతిస్తున్నారని, దీన్ని తిప్పికొట్టాలని భుట్టో భావించారు. అఫ్ఘానిస్థాన్ చర్యలకు ప్రతిగా అఫ్ఘాన్ ఇస్లామిక్ దళాలను తయారు చేయమని భుట్టో తమ సరిహద్దు దళాల సైనికాధికారి బ్రిగేడియర్ నసీరుల్లా బాబర్‌ను ఆదేశించారు. ఈ క్రమంలోనే బుర్హానుద్దీన్ రబ్బానీ, గుల్బుద్దీన్ హెక్మత్యార్, జలాలుద్దీన్ హక్కానీ మొదలైన నాయకులను తయారుచేసింది. జలాలుద్దీన్ హక్కానీ 1973లో హెచ్‌క్యూఎన్ ఉగ్రవాద సంస్థను స్థాపించాడు. పాకిస్థాన్‌లోని ఉత్తర వజీరిస్థాన్ గిరిజన ప్రాంతంలో ఉగ్రవాద శిక్షణా సంస్థను నెలకొల్పాడు. దీంతో ఆయన దావూద్ ఖాన్‌కు వ్యతిరేకంగా మొదటి జిహాద్ ప్రారంభించాడు. భుట్టో ఏర్పాటుచేసిన అఫ్ఘాన్ జిహాదీలు 1975లో కాబూల్‌పై రెండోసారి జిహాద్ నడిపారు.

హక్కానీలు అమెరికా సన్నిహితవర్గమని, ఆ దేశం సూచనమేరకే తాము హక్కానీలకు మద్దతు ఇచ్చామని ఇటీవల పాకిస్థాన్ ఆర్థిక మంత్రి ఖావాజా అసిఫ్ వెల్లడించారు. అయితే ఈ అఫ్ఘాన్ జిహాదీలకు పాకిస్థాన్ మద్దతు ఇచ్చిందనేది వాస్తవం. సోవియెట్ సేనలకు వ్యతిరేకంగా తాము అఫ్ఘాన్ జిహాదీలకు మద్దతు ఇచ్చామని పాకిస్థాన్ ఇప్పటికీ చెప్పుకుంటున్నది. కానీ సోవియెట్ సేనలు రాకముందే, అఫ్ఘానిస్థాన్‌లోని కమ్యూనిస్టులకు, జాతీయవాదులకు వ్యతిరేకంగా పాకిస్థాన్ జిహాదీలను తయారుచేసింది. అఫ్ఘానిస్థాన్‌లోని సోవియెట్ సేనలకు వ్యతిరేకంగా జిహాదీలను పెంచి పోషించడానికి పాకిస్థాన్‌కు పాశ్చాత్య దేశాలు, అరబ్ రాజ్యాలు సహాయం చేశాయి. అయితే ఈ సహాయం ఆగిపోయిన తర్వాత పాకిస్థాన్ జిహాదీలకు మద్దతు ఇవ్వడాన్ని నిలిపివేయలేదు. పాకిస్థాన్‌లోని బెలోచీ ప్రాంతంలో ఇప్పుడు నడుస్తున్న వేర్పాటువాద ఉద్యమానికి అఫ్ఘానిస్థాన్ మద్దతు లేదు. అఫ్ఘానిస్థాన్‌లో బెలోచీ శిక్షణ శిబిరాలు ఏమీ లేవు. అఫ్ఘానిస్థాన్ ప్రభుత్వం వారికి ఆయుధాలను అందించడం లేదు. బెలోచీ వేర్పాటువాదులకు భారత్ సహాయం చేస్తున్నది. అయితే ఈ సహాయం అఫ్ఘానిస్థాన్ ద్వారా కాకుండా ఇతర మార్గాల ద్వారా అందుతున్నది. ఈ విషయాన్ని బెలోచీ నాయకులు బహిరంగంగానే అంగీకరిస్తున్నారు. భారత్ గూఢచార సంస్థ రీసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్ ఏర్పడటానికి ముందే మూడు బెలోచీ తిరుగుబాట్లు జరిగాయి. అయినా పాకిస్థాన్ ప్రభుత్వం ఆంతరంగికంగా తన వైఫల్యాలను కప్పి పుచ్చుకోవడానికి అఫ్ఘానిస్థాన్‌ను నిందిస్తున్నది. పాకిస్థాన్ పెత్తనం బెలోచీ ప్రజలలో వేర్పాటువాద కాంక్షను పెంచింది.

అఫ్ఘానిస్థాన్‌లో పెత్తనం చేయాలనే ఉబలాటం పాకిస్థాన్‌కు బాగా ఉన్నది. దీనికితోడు జిహాదీలను తురుపు ముక్కలుగా వాడుకుంటూ, భారత్‌తో కశ్మీర్ వివాదాన్ని పరిష్కరించడానికి రంగంలోకి దిగాలని అమెరికాను కోరుతున్నది. కశ్మీర్‌లో సంక్షోభం సృష్టించి, భారత్ నుంచి భద్రతాసమస్య ఉన్నదని చెబుతూ అమెరికాను మధ్యవర్తిగా రమ్మని కోరుతున్నది. పాకిస్థాన్ చేస్తున్న ఈ ప్రతిపాదన ప్రమాదకరమైనది. ఈ విధానం ద్వారా కశ్మీర్‌లో యథాతథస్థితిని భగ్నంచేయాలని భావిస్తున్న ది. భారత్ బూచీ అనేది పాకిస్థాన్ మానసిక సమస్యే తప్ప, భౌగోళిక సమస్య కాదు. భారత్‌కు సంబంధించి, పాకిస్థాన్ భద్రతా సమస్యలు నిజమైనవే అని అనుకున్నా, భారత్‌తో సరితూగాలని కలలు కనడం మాత్రం అర్థం లేనిది. భారత్ పాకిస్థాన్ కన్నా నాలుగంతలు పెద్దది. పాకిస్థాన్‌తో పోలిస్తే భారత్ ఆర్థిక వ్యవస్థ చాలా పెద్దది. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ విస్తరణ కాంక్ష ఎట్టి పరిస్థితుల్లోనూ తీరదు. అందువల్ల అఫ్ఘానిస్థాన్ ఊబి నుంచి బయటపడాలనే యావతో అమెరికా కశ్మీర్ ఉచ్చులోకి దిగకూడదు. కశ్మీర్ వివాదం ఏదో అద్భుతం జరిగి పరిష్కారం అయినా, భారత్‌తో సరితూగాలనే పాకిస్థాన్ కోరిక మాత్రం నెరవేరదు. పాకిస్థాన్‌కు భారత్ నుంచి నిజంగా భద్రతాపరమైన సమస్యలు ఉంటే పరిష్కరించవచ్చు. కానీ భారత్ పట్ల కంటగింపుగా ఉన్న పాకిస్థాన్ మానసిక జాడ్యానికి మందు లేదు. దీనికి ఏ రకమైన దౌత్య పరిష్కారం సాధ్యం కాదు. అమెరికా పాకిస్థాన్‌కు స్పష్టమైన గడువు విధించి దారికి తేవాలె. జార్జి డబ్ల్యు బుష్ కాలం నుంచి ఒబామా హయాం వరకు అమెరికా పాకిస్థాన్‌లో 35 బిలియన్ డాలర్లు కుమ్మరించింది. ఇందులో ఎక్కువభాగం పాకిస్థాన్ సైన్యానికి ఉపయోగపడింది. ఈ విధమైన బుజ్జగింపుల కాలం ముగిసింది.

అఫ్ఘానిస్థాన్‌లో పెత్తనం చేయాలనే ఉబలాటం పాకిస్థాన్‌కు బాగా ఉన్నది. దీనికితోడు జిహాదీలను తురుపు ముక్కలుగా వాడుకుంటూ, భారత్‌తో కశ్మీర్ వివాదాన్ని పరిష్కరించడానికి రంగంలోకి దిగాలని అమెరికాను కోరుతున్నది. కశ్మీర్‌లో సంక్షోభం సృష్టించి, భారత్ నుంచి భద్రతాసమస్య ఉన్నదని చెబుతూ అమెరికాను మధ్యవర్తిగా రమ్మని కోరుతున్నది. పాకిస్థాన్ చేస్తున్న ఈ ప్రతిపాదన ప్రమాదకరమైనది.

(వ్యాసకర్త: పాకిస్థానీ, అమెరికన్ కాలమిస్ట్) ది వైర్ సౌజన్యంతో..

గుణాత్మక మార్పు తప్పనిసరి!

జాతీయం



వనం జ్వాలా నరసింహారావు

రాజకీయాల్లో గుణాత్మక మార్పు రావాలంటే తెలంగాణ తరహాలోనే భారత జాతి పునర్నిర్మాణం, పునర్నిర్వచనం, పునఃసృష్టి జరుగాలని సీఎం కేసీఆర్ అభిప్రాయపడుతున్నారు. ఇందులో భాగంగా మొదటగా చేయాల్సింది వివిధ దేశాల్లో అమల్లో ఉన్న ఉత్తమ విధానాలను, పద్ధతులను, అలవాట్లను, నడవడులను సేకరించి, అధ్యయనం చేసి, వాటిని మన దేశ స్థితిగతులకు అనుగుణంగా ఉపయోగించుకోవడమే! దేశ ఆర్థిక పరపతిని గణనీయంగా పెంచి, ఏయే రంగాల్లో మనం వెనుకబడి ఉన్నామో అర్థం చేసుకోవాలి. తదనుగుణంగా తప్పొప్పులు సరిచేసుకుంటూ ముందడుగు వేయడమే మన ముందున్న తక్షణ కర్తవ్యమనే విషయం కూడా సీఎం మాటల్లో స్పష్టమవుతున్నది. ఈ నేపథ్యంలో, ఇవన్నీ దృష్టిలో ఉంచుకొని, జాతీయ అభివృద్ధి ఎజెండా రూపొందించుకోవాల్సిన అవశ్యకత ఎంతైనా ఉన్నది. దేశంలోని వివిధ రాష్ట్రాల, సమాజంలోని వివిధ వర్గాల, అవసరాలను ప్రతిబింబించేదిగా ఆ ఎజెండా ఉండాలని సీఎం కేసీఆర్ ఉద్దేశంగా కనిపిస్తున్నది.

పలురంగాల నిపుణులు, సీనియర్ పాలనాధికారులు, ఆర్థిక శాస్త్రవేత్తలు, సమాజ అభ్యున్నతి కోరే ప్రతి ఒక్కరు, తమవంతు పాత్రగా, ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టాలను, విధానాలను, శాసనాలను, పద్ధతులను, అధ్యయనం చేయాలి. సంస్కరణల కోణంలో అవసరమైన మార్పుచేర్పులు చేసి, మార్పు దిశగా మార్గదర్శకాలను రూపొందించాలి. ఈ ప్రయత్నంలో అన్ని వర్గాల, ప్రాంతాల ప్రజలు చురుగ్గా భాగస్వాములు కావాలి. ఇదే క్రమేపీ జాతీయ అభివృద్ధి ఎజెండా రూపకల్పనకు దారితీస్తుంది. సీఎం కేసీఆర్ అంటున్న రాజకీయాల్లో గుణాత్మక మార్పునకు ఇవి పునాదులు అవుతాయి.

బీజేపీ ఆధ్వర్యంలోని ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉండటం వల్ల దేశాభివృద్ధి కాని, దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుపోవడం కాని జరిగే అవకాశాలు అంతగా కనిపించడం లేదు. ఇప్పటికే నాలుగేండ్లు గడిచిపోయాయి. ప్రజలు ఒకవిధంగా నరేంద్ర మోదీ పాలనతో విసిగిపోయారు. కనీసం ఒక్కటంటే ఒక్క ప్రాధాన్యం సంతరించుకున్న, ప్రజలకు అవసరమైన పథకం ఆలోచించడం కాని, అమలు చేయడం కానీ జరుగలేదంటే బహుశా అతిశయోక్తి కాదేమో! దళితులకు కాని, రైతులకు కాని ఏదన్నా పథకం అమలైందా? కాలేదన్న విషయంలో ప్రజలను చైతన్యవంతులను చేయగలిగితే, వాళ్లు ప్రశ్నించడం మొదలుపెడితే మార్పురావడం కష్టం కాదు. కాకపోతే ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో బీజేపీ ఓడితే మరో ప్రత్యామ్నాయం లేదు. కాబట్టి ఆయన స్థానంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావచ్చు. రెండింటికీ పెద్ద తేడా ఏముంది? సీఎం కేసీఆర్ చెప్పినట్లు, పథకాల పేర్లు మారుతాయి, కానీ గుణాత్మక మార్పు వచ్చే అవకాశం లేదు. మన దేశం గురించి తక్కువగా అంచనా వేసుకుంటూ, ఫలానా దేశం ఇంత గొప్పది, అంత గొప్పది, అనే మాటలు ఎన్నాళ్ళు వినాలి? ఈ స్థితి మారదా? ప్రజలు ఇప్పుడున్న వ్యవస్థతో తీవ్ర ఆవేదన చెందుతున్నారు. గుణాత్మక మార్పుకోసం ఎదురు చూస్తున్నారు. మార్పు రావాలి, వచ్చి తీరాలి. అదే అంటున్నారు సీఎం కేసీఆర్.

జాతీయ స్థాయిలో రాజకీయ పార్టీల పునరేకీకరణ జరుగడానికి, ఒక ఆకృతిగా రూపుదిద్దుకోవడానికి సమయం ఆసన్నమైంది. అయితే, ఇది కేవలం రాజకీయ పార్టీల కలయిక మాత్రమే కాకుండా, ప్రజలు సమన్వితం కావాలి. గుణాత్మక మార్పు కోసం పిలుపునిచ్చిన కేసీఆర్, ఆయన నాయకత్వంలోని దేశవ్యాప్త బృందం, ఇదే ఎజెండాగా జాతీయ రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషించనున్నది. అత్యంత అభ్యుదయకర, ప్రగతిశీల ఎజెండా దేశాభివృద్ధికి రూపుదిద్దుకోనున్నది. భారత్ సంపన్న దేశంగా కావాలి. కేవలం రెండు దశాబ్దాలలో అత్యంత సంపన్నమైన దేశంగా రూపుదిద్దుకున్న చైనాను ఆదర్శవంతంగా తీసుకొని వారేం చేశారో అదే మనం చేయగలుగాలి. దేశంలోని సుప్రసిద్ధ ఆర్థిక శాస్త్రవేత్తలు, వారితోపాటు దేశం కోసం ఏం చేయడానికైనా సిద్ధపడే నిబద్ధత గల వ్యక్తులు, వాళ్ల ఆలోచనలను ఈ దిశగా కార్యరూపందాల్చేలా చేయాలి. రాజకీయాల్లో రాబోయే గుణాత్మక మార్పునకు శ్రీకారం చుట్టనున్న రాజకీయశక్తి మూడో ఫ్రంట్ కాని, ఫెడరల్ ఫ్రంట్ కానీ కాదు. ఇది కొత్తగా రూపుదిద్దుకోనున్న మరో ప్రత్యామ్నాయ జాతీయ రాజకీయ పార్టీ. ఇది ఏక సారూప్యత ఉన్న పలు రాజకీయ పార్టీల సహవ్యవస్థ (కన్సార్షియం), లేదా, కలయిక. ఇదే రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించి అధికారంలోకి రావాలి. అలా జరుగాలంటే, దాని ఎజెండా కాని, ఎన్నికల మ్యానిఫెస్టో కాని అత్యంత జాగరూకతతో తయారుచేయాలి. దేశానికి ఒక బృహత్తర ప్రణాళిక రూపొందించాలి.

మన రాజ్యాంగం సమాఖ్య స్ఫూర్తితో రాయడం జరిగింది. రాష్ట్రాలకు, కేంద్రానికి వేర్వేరు రకాల అధికారాలు పొందుపరిచారు. అర్థంకాని విషయం. కేవలం రాష్ట్రాల పరిధిలోనే ఉండాల్సిన అంశాలైన గ్రామీణాభివృద్ధి, గ్రామీణ రహదారులు, వ్యవసాయం, పట్టణాభివృద్ధి, విద్య, వైద్యం లాంటి మరికొన్ని అంశాలు కేంద్ర పరిధిలో ఎందుకుండాలని కేసీఆర్ అడుగడం సమంజసం. విదేశాంగ విధానమో, దేశ రక్షణకు సంబంధించిన అంశమో, దేశ సమగ్రత సార్వభౌమత్వానికి సంబంధించిన అంశమో కేంద్ర పరిధిలో ఉంటే తప్పులేదు. సమాఖ్య జాబితా అని, రాష్ట్రాల జాబితా అని రెండు ఉంటే సరిపోతుంది. ఉమ్మడి జాబితా అవసరం లేదు. ప్రభుత్వ విధానంలో, సంవిధానంలో, వ్యవస్థీకృత మార్పులతోపాటు న్యాయవ్యవస్థలో కూడా సంస్కరణలు రావాలి. గుణాత్మక మార్పులో ఇవన్నీ భాగం కావాలి. ఏ వర్గానికి ఎంత మేరకు ఉపాధి అవకాశాలు కల్పించాలో సరిగ్గా తెలిసేది ఆయా రాష్ట్రాలకే కాబట్టి రిజర్వేషన్ల వ్యవహారం పూర్తిగా రాష్ట్రాల పరిధిలోనే ఉండాలి. అసలు రాష్ట్రం అంటే ఏమిటి? సమాఖ్య అంటే ఏమిటి? అనే విషయంలో పునర్నిర్వచనం చేయడానికి కూడా సమయం ఆసన్నమైంది. రాష్ట్రాలకు మరిన్ని అధికారాలు బదలాయించి, వాటికి సాధికారత కలిగించాలి. అదే విధంగా రాష్ట్రాలు కూడా సముచితమైనరీతిలో స్థానిక సంస్థలకు అధికారాలు ఇవ్వాలి. ఇదే అసలుసిసలైన సమాఖ్యస్ఫూర్తి.

స్వాతంత్ర్యం వచ్చి డెబ్బై ఏండ్లయినా జరుగాల్సినంత అభివృద్ధి జరుగలేదు. ప్రజావసరాలు తీరలేదు. ప్రజలందరికీ కనీసం రక్షిత మంచినీటి వసతి కలిగించలేకపోయాయి ప్రభుత్వాలు. దేశంలో 70,000 టీఎంసీల నీటి లభ్యత ఉన్నా పూర్తిస్థాయి ఉపయోగంలోకి తేలేకపోయాం. అంతర్రాష్ట్ర జల వివాదాలు పరిష్కారం కావడానికి ఏండ్ల తరబడి పడుతుంది. దేశం మొత్తం మీద 3.30 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతున్నా, సగం దేశం అంధకారంలోనే ఉంటుంది. ఇదేమన్నా పద్ధతా? వ్యవస్థ ఇలా ఉండాలా? ఒక రాష్ట్రంలో మిగిలి ఉన్న వనరులను మరో తరుగు రాష్ట్రానికి ఇచ్చే పద్ధతి ఎందుకు ఉండకూడదు? తొలిసారి, నాలుగేండ్ల క్రితం, ఒక కాంగ్రెసేతర పార్టీ సొంతంగా అధికారంలోకి వచ్చింది. ప్రజలు ఎంతో ఆశించారు ఆ ప్రభుత్వం నుంచి. వారి ఆశలు అడియాసలయ్యాయి. ఈ దుస్థితి చూసి ఎంతకాలం ప్రేక్షకులుగా ఉండాలని ప్రజలు అడుగుతున్నారు. ఎందరో నిపుణులు, ఎన్నో కమిషన్లు కేంద్ర, రాష్ట్ర సంబంధాల విషయంలో సూచించిన అంశాలు అమలుకు నోచుకోలేదు. సమాఖ్య స్ఫూర్తి పూర్తిగా కొరవడింది.

అభివృద్ధి, సంక్షేమ, మౌలిక వసతుల కల్పనా పరంగా, తెలంగాణ రాష్ట్రం ఎన్నో మైలురాళ్ళను అధిగమించింది. తెలంగాణ రాష్ట్రం తన వినూత్న పథకాలు, కార్యక్రమాల ద్వారా దేశానికి ఆదర్శ రాష్ట్రంగా నిలిచింది. తెలంగాణలో ప్రవేశపెట్టిన పథకాలు జాతీయ ఎజెండా అయితే గుణాత్మక మార్పు కోసం ఏర్పడే రాజకీయ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం. రాజకీయ నాయకులు, రంగాల నిపుణులు, పాలనానుభవం కలిగిన అధికారులు, ఇతరులు తమ సూచనలు, సలహాలు ఇచ్చి ఈ బృహత్తర యజ్ఞంలో భాగస్వాములు కావాలి.

తెలంగాణ రాష్ట్రం తన వినూత్న పథకాలు, కార్యక్రమాల ద్వారా దేశానికి ఆదర్శ రాష్ట్రంగా నిలిచింది. తెలంగాణలో ప్రవేశపెట్టిన పథకాలు జాతీయ ఎజెండా అయితే గుణాత్మక మార్పు కోసం ఏర్పడే రాజకీయ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078, Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

బీటీ పత్తి విత్తనాల ధర తగ్గింపు

ప్యాకెట్ విత్తనాల ధరను రూ.740గా నిర్ణయించిన కేంద్రం

మోన్‌శాంటో రాయల్టీలో రూ.10 కోత



న్యూఢిల్లీ: పత్తి రైతులకు శుభవార్త. బీటీ కాటన్ (జన్యు మార్పిడి) విత్తనాల ధరను తగ్గిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ప్యాకెట్ బీటీ పత్తి విత్తనాల ధరను రూ.740గా నిర్ణయించింది. గత ఏడాది బీటీ ధర రూ.800. మోన్‌శాంటో మహికో కంపెనీకి దేశీయ కంపెనీలిచ్చే రాయల్టీలో రూ.10 కోత విధించింది. జూన్ నుంచి మొదలయ్యే ఖరీఫ్ సీజన్ నుంచి కొత్త ధరలు అమలులోకి వస్తాయి. దీనివల్ల 80 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. బోల్‌గార్డ్-1 విత్తనాలు రూ.635 ధర (రాయల్టీ లేకుండా)కు అందుబాటులో ఉన్నాయి. 2016 నుంచి జీఎం వెర్షన్ విత్తనాల ఏకరీతిన గరిష్ఠ ధరల్ని కేంద్రం స్థిరీకరిస్తున్నది.

అనుమతిలేని బీటీ విత్తన విక్రయాలపై దర్యాప్తు

అనుమతి లేని బీటీ విత్తనాల విక్రయాలపై దర్యాప్తునకు కేంద్రం ఓ కమిటీని నియమించింది. తెలంగాణ, ఏపీ, మహారాష్ట్రలో మూడో రకం బీటీ కాటన్ పత్తి విత్తనాలు విక్రయించినట్టు కొన్ని కేసులు బయటకు వచ్చాయని కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ లిఖితపూర్వకంగా లోక్‌సభకు తెలిపారు. దీనిపై దర్యాప్తునకు శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటుచేసినట్టు మంత్రి షెకావత్ వెల్లడించారు.

రక్షణశాఖకు నిధులు సరిపోవు

బడ్జెట్‌లో కేటాయింపులపై భారత సైన్యం అసంతృప్తి



బిపిన్ రావత్

న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్ 2018-19లో కూడా రక్షణశాఖకు తగినన్ని నిధులు కేటాయించకపోవడంపై భారత సైన్యం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. యుద్ధోన్మాదంతో ఉన్న పాకిస్థాన్, అటువైపు చైనా మమ్మురంగా పూర్తిస్థాయిలో వాటి రక్షణ దళాలను ఆధునీకరించుకుంటున్నాయని, ఆ రెండు దేశాలతో భారత్‌కు యుద్ధం వచ్చే అవకాశాలున్న పరిస్థితుల్లో అత్యవసర ఆయుధ సామగ్రి సేకరణకు కూడా నిధులు లేక మనం ఇబ్బందులు పడుతున్నామని సైన్యం భారత పార్లమెంటరీ కమిటీకి తెలిపింది. రక్షణరంగంపై ఏర్పాటైన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ మంగళవారం లోక్‌సభకు సమర్పించిన నివేదికలో ఈ వివరాలు ఉన్నాయి. భారత సైనిక దళాధిపతి బిపిన్ రావత్ చైనా సైనిక పాటవం గురించి వివరించారు. చైనా తన ఆర్థిక ప్రగతికి అనుగుణంగా రక్షణ వ్యయాన్ని పెంచుకుంటున్నదని తెలిపారు. చైనా తన సైనిక సామర్థ్యాన్ని అమెరికాతో సమానంగా పెంచుకోవడానికి పోటీ పడుతున్నదని సైనిక దళాల ఉప అధిపతి లెఫ్టినెంట్ శరత్ చంద్ చెప్పారు. ఇటువంటి తరుణంలోనూ భారత రక్షణశాఖకు తగినన్ని నిధులు కేటాయించకపోవడంతో సైనిక ఆధునీకరణ ప్రణాళికకు విఘాతం కలుగుతుందని పేర్కొన్నారు. సైనిక దళాలను ఆధునీకరించుకోవాలన్న తమ ఆశలను 2018-19 బడ్జెట్ కేటాయింపులు (రూ.21,338 కోట్లు) నీరు గార్చాయని లెఫ్టినెంట్ శరత్ చంద్ పార్లమెంటరీ కమిటీతో అన్నారు.

అమెరికా విదేశాంగమంత్రి టిల్లర్‌సన్‌పై వేటు

సీఐఏ అధిపతి పాంపియోను ఆ స్థానంలో నియమించిన ట్రంప్



టిల్లర్‌సన్

వాషింగ్టన్: తనకు అనుకూలంగా పనిచేయని విదేశాంగమంత్రి రెక్స్ టిల్లర్‌సన్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వేటు వేశారు. ఆయన స్థానంలో అమెరికా నిఘా సంస్థ (సీఐఏ) డైరెక్టర్ మైక్ పాంపియోను నియమిస్తున్నట్టు మంగళవారం ప్రకటించారు. పాంపియో స్థానంలో గినా హాస్పెల్‌ను సీఐఏ డైరెక్టర్‌గా నియమించారు. ప్రస్తుతం ఆమె సీఐఏలో డిప్యూటీ డైరెక్టర్‌గా ఉన్నారు. సీఐఏ డైరెక్టర్‌గా ఒక మహిళను ఎంపిక చేయడం ఇదే ప్రథమం. 'పాంపియో ఇక మన నూతన విదేశాంగ మంత్రి అవుతారు. ఈ పదవికి ఆయన తగిన వ్యక్తి. ప్రస్తుత కీలక సమయంలో ఆయన బాగా పని చేస్తారన్న విశ్వాసం నాకు ఉన్నది' అని ట్రంప్ ట్వీట్ చేశారు. 'అంతర్జాతీయ సంబంధాల పటిష్ఠతకు, అమెరికాకు ఎదురవుతున్న సవాళ్లపై పోరాటానికి, ఉత్తరకొరియాతో అణునిరాయుధీకరణకు కృషి చేస్తారు' అని వైట్‌హౌస్ ఒక ప్రకటనలో తెలిపింది. సైన్యం, కాంగ్రెస్, సీఐఏలో ఉన్న అనుభవంతో పాంపియో ఈ కొత్త పదవిని సమర్థంగా నిర్వహిస్తారన్న విశ్వాసం తనకు ఉన్నదని, ఆయన నియామకాన్ని త్వరగా ఆమోదించాలని సెనేట్ కమిటీని కోరుతున్నానని ట్రంప్ పేర్కొన్నారు. 65 ఏండ్ల టిల్లర్‌సన్ ప్రస్తుతం ఆఫ్రికా పర్యటనలో ఉండగానే ట్రంప్ ఆయనను మంత్రి పదవి నుంచి తొలగించడం గమనార్హం. ట్రంప్ ప్రభుత్వ విధానాలతో టిల్లర్‌సన్ పలుమార్లు విభేదించారు. ఉత్తరకొరియా, రష్యాతో సంబంధాలపై ట్రంప్ వైఖరితో ఆయన విభేదించడం తెలిసిందే. మంత్రిపదవి నుంచి తప్పుకోవాలని ఆయన పలుమార్లు అనుకున్నా అలాంటిదేమీ లేదని ప్రకటించాలని ట్రంప్ వర్గం ఆయనపై ఒత్తిడి తెచ్చింది.



యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ నివాసంలో విందుకు హాజరైన విపక్షాల నేతలు

మోదీనెలా పడగొడుదాం?

- ఎన్డీయేవ్యతిరేక కూటమి లక్ష్యంగా విపక్ష నేతలకు సోనియా విందు
- 20 పార్టీల నేతలు హాజరు

న్యూఢిల్లీ, మార్చి 13: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సారథ్యంలోని ఎన్డీయేకు వ్యతిరేకంగా కూటమి ఏర్పాటు చేయడమే లక్ష్యంగా యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ మంగళవారం రాత్రి తన నివాసంలో విపక్ష నేతలకు విందునిచ్చారు. ఈ సమావేశానికి సుమారు 20 పార్టీల నేతలు హాజరయ్యారని సమాచారం. నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) అధ్యక్షుడు శరద్ పవార్, మాజీ సీఎంలు ఒమర్ అబ్దుల్లా (జమ్ముకశ్మీర్), బాబూలాల్ మరాండీ, హేమంత్ సోరెన్ (జార్ఖండ్), జీతన్ రాం మాంఝీ (బీహార్), జేడీయూ తిరుగుబాటు నేత శరద్ యాదవ్, అజిత్ సింగ్ (ఆర్ఎల్డీ), రాం గోపాల్ యాదవ్ (ఎస్పీ), సతీశ్ చంద్ర మిశ్రా (బీఎస్పీ) హాజరయ్యారు. సుదీప్ బందోపాధ్యాయ (తృణమూల్), మహ్మద్ సలీం, టీకే త్యాగరాజన్ (సీపీఎం), కనిమొళి (డీఎంకే), మీసా భారతి, తేజస్వి యాదవ్ (ఆర్జేడీ), డీ రాజా (సీపీఐ) తదిత రులు కూడా హాజరయ్యారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా రాహుల్ ఎన్నికైనా లోక్‌సభ ఎన్నికల ముందు విపక్షాల మధ్య కూటమి కోసం జరిగే చర్చల్లో సోనియా గాంధీ చురుగ్గా పాల్గొంటారని కాంగ్రెస్ పార్టీ నేత ఒకరు తెలిపారు. ఇటీవల మోదీ క్యాబినెట్‌లో మంత్రి పదవులకు రాజీనామా చేసినా ఎన్డీయేలోనే కొనసాగుతున్న టీడీపీ, ఒడిశాలో అధికార బిజూ జనతాదళ్, తెలంగాణలోని అధికార టీఆర్ఎస్‌లను విందుకు ఆహ్వానించలేదని పార్టీ వర్గాల కథనం. ఇంతకుముందు కూడా విపక్షాలతో సమావేశమైన సోనియా వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు వివిధ పార్టీలు తమ మధ్య గల స్వల్ప విభేదాలను పక్కన బెట్టాలని సూచించారు. కాంగ్రెస్ మీడియా ఇన్‌చార్జి రణ్‌దీప్ సూర్జెవాలా మాట్లాడుతూ విపక్షాల మధ్య స్నేహం కోసమే తప్ప, రాజకీయాల కోసం ఈ భేటీ ఏర్పాటు చేయలేదన్నారు. ఇటీవల వెలుగు చూసిన బ్యాంకింగ్ మోసాలు తదితర అంశాలపై ప్రభుత్వం చర్చ నుంచి పారిపోతుందని సమావేశానికి హాజరైన నేతలు అభిప్రాయ పడ్డారని చెప్పారు. జాతి ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై చర్చించారని సూర్జెవాలా అన్నారు.

పాలస్తీనా ప్రధాని కాన్వాయిపై బాంబు దాడి

- మూడు వాహనాలు స్వల్పంగా ధ్వంసం
- క్షేమంగా బయటపడిన రామీ హమ్దల్లా



ధ్వంసమైన కాన్వాయిలోని ఓ వాహనం

జబాలియా : పాలస్తీనా ప్రధాని రామీ హమ్దల్లా కాన్వాయిపై మంగళవారం బాంబు దాడి జరిగింది. అయితే ఆయన క్షేమంగా బయటపడ్డారు. గాజా ఉత్తర స్ట్రిప్‌లో సీవరేజీ ప్లాంట్‌ను ప్రారంభించేందుకు వెళ్తుండగా ఈ దాడి జరిగింది. పేలుళ్లలో కాన్వాయిలోని మూడు వాహనాలు స్వల్పంగా ధ్వంసమయ్యాయి. గాజా స్ట్రిప్‌లోని ఎరెజ్ క్రాసింగ్‌ను దాటిన కాసేపటికే కాన్వాయిపై దాడి జరిగింది. అయినా ఆయన సీవరేజీ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఇది గాజా మిలిటెంట్ల పనేనని అధికార ఫతా పార్టీ ఆరోపించింది.

రన్‌వే 02.. రన్‌వే 20.. గందరగోళం

కంట్రోలర్ ఆదేశాలను అర్థంచేసుకోని పైలట్ ■ నేపాల్ విమాన ప్రమాదంపై ముమ్మరంగా దర్యాప్తు

కాఠ్మండు, మార్చి 13:

నేపాల్‌లోని త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయం రన్‌వేపై విమానం కూలిన ఘటనపై అధికారులు దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ ఘటనలో 49 మంది ప్రయాణికులు మృత్యువాత పడ్డారు. విమాన బ్లాక్ బాక్స్ తెలిపిన వివరాల ప్రకారం ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్, విమాన పైలట్ మధ్య జరిగిన సంభాషణల్లో గందరగోళం వల్లే ప్రమాదం జరిగినట్లు అంచనా వేస్తున్నామని అధికారులు మంగళవారం చెప్పారు. సోమవారం ఢాకా నుంచి కాఠ్మండు వెళ్తున్న యూఎస్-బంగ్లా ఎయిర్‌లైన్స్ విమానం ప్రమాదానికి గురైనప్పుడు అందులో 67 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బంది ఉన్నారు. విమానం రన్‌వేపై దిగుతున్నప్పుడు మంటలు చెలరేగి పక్కనే ఉన్న ఫుట్‌బాల్ మైదానంలో కుప్పకూలింది. విమాన డాటా రికార్డర్‌ను స్వాధీనం చేసుకొని భద్రపర్చడంతోపాటు దర్యాప్తును వేగవంతం చేసినట్టు విమానాశ్రయం జీఎం రాజ్‌కుమార్ చెట్రి తెలిపారు. ప్రమాదా నికి కారణం మీరంటే మీరని ఎయిర్‌లైన్స్ అధికారులు, విమానాశ్రయ వర్గాలు పరస్పరం ఆరోపించుకుంటున్నారు. విమానం ల్యాండింగ్‌కు చేసిన సూచనల్లో గందరగోళం వల్లే ప్రమాదం జరిగిందని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. ప్రమాద స్థలానికి తమ సంస్థ తరపున భద్రతా దర్యాప్తు అధికారితోపాటు ఫీల్డ్ సర్వీస్ ప్రతినిధిని పంపుతున్నట్టు విమాన తయారీ కంపెనీ బొంబార్డియర్ తెలిపింది. ప్రమాదంపై నేపాల్ ప్రభుత్వం ఆరుగురు సభ్యుల కమిటీని నియమించిం ది. బంగ్లాదేశ్‌కు చెందిన ఇద్దరు మంత్రుల ఆధ్వర్యంలో ఉన్నతస్థాయి కమిటీ ఘటనా స్థలాన్ని సందర్శించింది.



కాఠ్మండులోని విమానాశ్రయం పక్కనున్న ఫుట్‌బాల్ స్టేడియంలో కుప్పకూలిన విమానం శిథిలాలు



విమాన మృతులకు కొవ్వొత్తుల నివాళి

మీరు ఎటువైపు వెళ్లాలనుకుంటున్నారు?

ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్‌కు (ఏటీసీ).. పైలట్‌కు మధ్య జరిగిన చివరి నాలుగు నిమిషాల సంభాషణలను బట్టి దక్షిణ భాగంలో ఉన్న రన్‌వే 02.. ఉత్తరభాగంలో ఉన్న రన్‌వే 20 విషయంలో పైలట్ గందరగోళానికి గురైనట్టు నేపాలీ పత్రికలు వార్తా కథనాలు ప్రచురించాయి. రికార్డయిన సంభాషణల ప్రకారం.. 'నేను మళ్లీ చెప్తున్నాను. రన్‌వే 20 వైపు వెళ్లొద్దు' అని కంట్రోలర్ పైలట్‌ను హెచ్చరించారు. తర్వాత 'అలాగే ఉండండి. విమానాన్ని ల్యాండ్ చేయొద్దు. మరో విమానం వస్తున్నది' అనే హెచ్చరికలు రికార్డయ్యాయి. విమానం కుడివైపు మళ్లిన తర్వాత 'మీరు రన్‌వే 02 లేదా 20లో దేనిపై ల్యాండ్ అవ్వాలని అనుకుంటున్నారు'? అని కంట్రోలర్ ప్రశ్నించారు. దానికి పైలట్ 'మేం రన్‌వే 20పై ల్యాండ్ అవుతాం' అని చెప్పారు. ఆ మేరకు అనుమతి జారీచేశారు. తర్వాత 'రన్‌వే మీకు కనిపిస్తున్నదా'? అని ప్రశ్నించగా లేదని పైలట్ చెప్పారు. దీంతో కుడివైపునకు మళ్లాలని కంట్రోలర్ కోరారు. దీంతో రన్‌వే తమకు కనిపిస్తున్నదని కచ్చితంగా చెప్పిన పైలట్.. రన్‌వే 20కి అనుమతి ఇచ్చినా రన్‌వే 02ను ఖాళీ చేయండని కోరారు. దీంతో రన్‌వే 02పై ల్యాండింగ్‌కు కంట్రోలర్ క్లియరెన్స్ ఇచ్చారు. చివరగా పైలట్ 'సర్.. మేం ల్యాండ్ కావొచ్చా' అని అడిగారు. కొద్దిసేపు నిశ్శబ్దం తర్వాత 'నేను మళ్లీ చెప్తున్నాను. ఇటు మళ్లండి' అని కంట్రోలర్ గట్టిగా అరిచారు. తర్వాత కొద్దిసేపటికే మంటలు చెలరేగాయి. ఢాకా కేంద్రంగా పనిచేసే యూఎస్ బంగ్లా ప్రైవేట్ ఎయిర్‌లైన్స్ 'ఎగరండి వేగంగా.. భద్రంగా' అనే నినాదంతో జూలై 2014లో ప్రారంభమైంది.

ఉత్తరాఖండ్‌లో లోయలో పడిన బస్సు

13 మంది మృతి, 11 మందికి గాయాలు

నైనిటాల్: ఉత్తరాఖండ్‌లో మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రయాణికు బస్సు లోయలో పడింది. ఘటనలో 13 మంది మరణించగా, 11 మంది గాయాలపాలయ్యారు. బస్సు అల్మోరా జిల్లా దెఘాట్ నుంచి నైనిటాల్ జిల్లా రామ్‌నగర్‌కు వెళ్తుండగా టోటమ్ గ్రామ సమీపాన ఈ ప్రమాదం జరిగింది. ప్రమాద సమయంలో 24 మంది ప్రయాణిస్తున్నారు. మృతుల్లో తొమ్మిదిమందిని గుర్తించామని, వారిలో ఇద్దరు మహిళలు ఉన్నారని అల్మోరా సీనియర్ ఎస్పీ బీ రేణుకా దేవి తెలిపారు. 'ప్రమాదం గురించి తెలియగానే సహాయ చర్యలను ప్రారంభించాం. క్షతగాత్రులను సమీప దవాఖానకు తరలించాం. తీవ్రంగా గాయపడినవారిని హల్ద్వానీకి తరలించాం. బస్సు ప్రమాదంపై విచారణ ప్రారంభించాం' అని ఎస్పీ తెలిపారు. బస్సుప్రమాదంపై ఉత్తరాఖండ్ సీఎం త్రివేంద్రసింగ్ రావత్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించినట్లు సీఎం చెప్పారు.



లోయలో పడిన బస్సు

మృత్యు ఘంటికలు

ఇథియోపియాలో ఘోర రోడ్డు ప్రమాదం

ఆనకట్ట పైనుంచి కిందకు పడిపోయిన బస్సు.. 38 మంది మృతి

అడ్డిస్ అబాబ: ఇథియోపియాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రయాణికులతో వెళ్తున్న బస్సు ఆనకట్ట పైనుంచి కిందకు పడిపోవడంతో 38 మంది మరణించారు. మృతుల్లో 28 మంది పురుషులు, 10 మంది మహిళలు ఉన్నారు. ప్రభుత్వ మీడియా వెల్లడించిన వివరాల ప్రకారం.. సోమవారం డెస్సీ, మెకానెసేలం పట్టణాల మధ్య ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదం నుంచి 10 మంది ప్రాణాలతో బయటపడ్డారు. తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు. బస్సులో సాంకేతిక లోపం కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తున్నది. మృతుల్లో ఎక్కువ మంది డెస్సీ, మెకానెసేలం పట్టణాలకు చెందినవారు ఉన్నారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

టర్కీలో ట్రక్కు-బస్సు ఢీ 13 మంది మృతి

ఇస్తాంబుల్: ఉత్తర టర్కీలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చిన్నపిల్లలతోపాటు 13 మంది మరణించగా, 20 గాయపడ్డారు. ఉత్తర అనటోలియాలో ఆగిఉన్న ట్రక్కును ఢీకొన్న ప్యాసింజర్ బస్సులో మంటలు చెలరేగడంతో ఈ ఘటన జరిగిందని స్థానిక మీడియా తెలిపింది. ఇస్తాంబుల్ నుంచి టోకాట్‌కు వెళుతున్న ఈ బస్సులో ప్రయాణికులు నిద్రిస్తున్నప్పుడు ఈ ఘటన జరిగిందని పేర్కొన్నది.



ట్రక్కును ఢీకొన్న బస్సు

నరేశ్ అగర్వాల్ వ్యాఖ్యలపై ముప్పేట నిరసన

- జయకు బాసటగా సుష్మా, స్మృతి, మాయావతి
- వ్యాఖ్యల్ని ఉపసంహరించుకున్న బీజేపీ నేత



జయాబచ్చన్, నరేశ్ అగర్వాల్

న్యూఢిల్లీ, మార్చి 13: నటి, సమాజ్‌వాది పార్టీ (ఎస్పీ) రాజ్యసభ సభ్యురాలు జయాబచ్చన్‌పై బీజేపీలో చేరిన ఎస్పీ మాజీ నేత నరేశ్ అగర్వాల్.. సినిమా డ్యాన్సర్ అంటూ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. జయాబచ్చన్‌కు కేంద్ర మంత్రులు సుష్మాస్వరాజ్, స్మృతి ఇరానీ సహా పలువురు సంఘీభావం ప్రకటించారు. ఈ వివాదంపై జయ స్పందిస్తూ... 'నటిగా ఉండటం నాకెంతో గర్వకారణం. నేను పట్టుదల గల మహిళను. ఆయన మాటలకు వెరువను' అని అన్నారు. కాగా, మహిళల గౌరవానికి భంగం కలిగించేలా ఎవరు దూషించినా ఉపేక్షించేది లేదని కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ అన్నారు. నరేశ్ క్షమాపణలు చెప్పాలని బీఎస్పీ అధినేత్రి మాయావతి డిమాండ్ చేశారు. నరేశ్ అగర్వాల్ మాట్లాడుతూ తన వ్యాఖ్యలు ఎవరినైనా బాధపెట్టినట్లయితే విచారం వ్యక్తం చేస్తున్నానన్నారు.

ఆధార్ అనుసంధాన గడువు పొడిగింపు

మొదటిపేజీ తరువాయి...

ముగియనున్న తరుణంలో గడువును పొడిగించాలని పిటిషనర్లు కోరారు. దాంతో ఈ కేసులో తాము తీర్పు వెలువరించేంత వరకు ఆధార్ అనుసంధానం గడువును నిరవధికంగా పొడిగిస్తున్నట్లు కోర్టు ప్రకటించింది. అయితే వివిధ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన ప్రత్యక్ష నగదు బదిలీ వంటి పథకాలకు మాత్రం ఆధార్ అనుసంధానం తప్పనిసరి విధానం కొనసాగుతుందని ప్రధాన న్యాయమూర్తి దీపక్‌మిశ్రా నాయకత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ తాజా ఉత్తర్వుల ప్రకారం బ్యాంకు ఖాతాలు, ఫోన్ వినియోగం వంటి సర్వీసులకు ఆధార్ అనుసంధానం కోసం ప్రస్తుతం నిర్దిష్ట గడువు లేదు. కాబట్టి వినియోగదారులు ఈ విషయమై ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అన్ని సేవలను ఆధార్‌తో ముడిపెట్టడాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పెద్ద సంఖ్యలో పిటిషన్లు దాఖలయ్యాయి. ఆధార్ అనుసంధానం రాజ్యాంగ వ్యతిరేకమని పిటిషనర్లు వాదించారు. ఆధార్ అనుసంధానం గడువును ఆఖరు నిమిషంలో పొడిగించడం వల్ల బ్యాంకులు, స్టాక్ ఎక్స్ఛేంజి వంటి ఆర్థిక సంస్థలకు ఇబ్బందికరంగా మారే అవకాశం ఉందని ఈ నెల7న ఈ కేసు విచారణ సందర్భంగా ధర్మాసనం వ్యాఖ్యానించింది. పైగా ఈ విషయమై దాఖలైన అన్ని పిటిషన్లను ఈ నెల 31లోగా విచారించి తీర్పునివ్వడం సాధ్యం కాదని పేర్కొంది. ఆ ప్రకారమే ఇప్పుడు అనుసంధానం గడువును నిరవధికంగా పొడిగించింది. ప్రజా పంపిణీ వ్యవస్థతో ఆధార్ అనుసంధాన ప్రక్రియలో ఉన్న లోపాల కారణంగా పేద ప్రజలు ఎన్నో కష్టాలను ఎదుర్కొంటున్నారని,నిత్యావసర వస్తువులు అందక పలువురు ఆకలితో అలమటించి చనిపోయారని ఈ కేసులో ప్రధాన పిటిషనర్‌గా ఉన్న కర్ణాటక హైకోర్టు మాజీ జడ్జి కేఎస్ పుట్టస్వామి ఫిబ్రవరి 22న సుప్రీంకోర్టు దృష్టికి తెచ్చారు. అటువంటి బాధితులకు నష్ట పరిహారం ఇప్పించాలని కోర్టును అభ్యర్థించారు.

క్షయరహిత భారత్

- 2025 నాటికి వ్యాధి నుంచి విముక్తి
- క్షయ నిర్మూలన అంతర్జాతీయ సదస్సులో ప్రధాని మోదీ పిలుపు

న్యూఢిల్లీ,: క్షయవ్యాధికి (టీబీ) ప్రాథమిక దశలోనే ఉత్తమ చికిత్స అందించాలని, 2025 నాటికి భారత్‌ను క్షయ రహిత దేశంగా మార్చాలని ప్రధాని నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ, కేంద్ర వైద్యారోగ్యశాఖ సంయుక్తంగా ఢిల్లీలో మంగళవారం 'క్షయ నిర్మూలన సదస్సు'ను ప్రారంభిస్తూ ప్రధాని మోదీ 'క్షయరహిత భారత్-2025' కార్యక్రమాన్ని ప్రకటించారు. టీబీ నిర్మూలనకు జరుగుతున్న ప్రయత్నాలు విఫలం అవుతున్నాయని, ఈ నేపథ్యంలో చికిత్స విధానాన్ని మార్చాలన్నారు. ప్రైవేట్ రంగాన్ని భాగస్వామిని చేయాలన్నారు. మానసికంగా దృఢంగా ఉంటే ఈ వ్యాధిని జయించడం సులభమేనని చెప్పారు.

ఐదేండ్ల ముందుగానే..

క్షయ వ్యాధిని అత్యవసరంగా నిర్మూలించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ 25 ఏండ్ల కిందటే ప్రకటించినా, వివిధ దేశాలు ఆ వైపుగా కృషి చేసినా ఇప్పటికీ విజయం సాధించలేదని మోదీ అన్నారు. 2030 నాటికి టీబీని నిర్మూలించాలని ప్రపంచ దేశాలు లక్ష్యం విధించుకున్నాయని, ఐదేండ్ల ముందే భారతదేశం నుంచి క్షయవ్యాధిని తరిమికొట్టాలన్నారు. టీబీ రోగులకు చికిత్స, పోషకాహారం అందించేందుకు ఏటా రూ.647 కోట్ల వరకు ఖర్చు పెట్టే వెసులుబాటు కల్పించామన్నారు.




'క్షయ నిర్మూలన సదస్సు'ను ప్రారంభిస్తున్న మోదీ

పలు అంశాలపై రజినీ మౌనం: కమల్



కోయంబత్తూర్: కావేరీ అంశంపై రజినీకాంత్ 'నిశ్శబ్దం'గా ఉంటున్నారని మక్కల్ నీతి మయ్యమ్ వ్యవస్థాపకుడు కమల్‌హాసన్ అన్నారు. మంగళవారం ఆయన కోయంబత్తూర్‌లో మాట్లాడుతూ.. 'కావేరీ నీటి పంపిణీ అంశమొక్కటే కాదు. ఇంకా ఎన్నో విషయాలపై రజినీకాంత్ ఆయన అభిప్రాయాన్ని వెల్లడించడంలేదు' అని చెప్పారు. కావేరీ నీటి పంపిణీ విషయంలో సుప్రీంకోర్టులో పిటిషన్ వేయాలని కమల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కేంద్రం వెంటనే కావేరీ యాజమాన్య బోర్డును ఏర్పాటుచేయాలని కోరారు.


నేనింకా పూర్తిస్థాయి రాజకీయవేత్తను కాదు



రిషికేశ్: తానింకా పూర్తిస్థాయి రాజకీయవేత్తను కాలేదని, తనను తాను తెలుసుకొనేందుకు హిమాలయాల్లో ఆధ్యాత్మిక పర్యటన చేస్తున్నానని రజినీకాంత్ చెప్పారు. రాజకీయ అంశాలపై రజినీ మాట్లాడటం లేదని కమల్‌హాసన్ చేసిన వ్యాఖ్యలపై.. మీడియా అడిగిన ప్రశ్నలకు ఆయన స్పందించారు. మంగళవారం రిషికేశ్‌లోని దయానంద్ సరస్వతి ఆశ్రమంలో రజినీ మాట్లాడారు. 'ఇప్పటికీ నేను పూర్తిస్థాయి రాజకీయవేత్తను కాలేదు. నా పార్టీని కూడా ఇంకా ప్రకటించలేదు. రాజకీయాల గురించి మాట్లాడదలచుకోలేదు' అని పేర్కొన్నారు.

లోక్‌సభలో చర్చకు రాని ఆర్థిక బిల్లు

వరుసగా ఏడో రోజు పార్లమెంట్‌లో 'నిరసన'ల హోరు!



లోక్‌సభలో టీఆర్ఎస్ సహా విపక్షాల నిరసనలు

న్యూఢిల్లీ: పార్లమెంట్ మలి విడుత బడ్జెట్ సమావేశాల్లో వరుసగా ఏడో రోజూ నిరసనతోనే ముగిసింది. లోక్‌సభలో విపక్షాల నిరసనల మధ్య మంగళవారం కూడా 2018-19 సంవత్సర ఆర్థిక బిల్లును చర్చకు చేపట్టనే లేదు. లోక్‌సభ ప్రారంభం కాగానే టీఆర్ఎస్, టీడీపీ, కాంగ్రెస్, అన్నాడీఎంకే, తృణమూల్ కాంగ్రెస్ సభ్యులు వెల్‌లోకి దూసుకురావడంతో క్వశ్చన్ అవర్, జీరో అవర్ తుడిచిపెట్టుకుపోయాయి. వైసీపీతోపాటు టీడీపీ సభ్యులు ఏపీకి ప్రత్యేక హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్ల కోటా పెంపు కోసం టీఆర్ఎస్, పీఎన్బీలో కుంభకోణంపై కాంగ్రెస్, తృణమూల్ సభ్యులు, కావేరీపై అన్నాడీఎంకే సభ్యులు నిరసనకు దిగారు. రాజ్యసభలోనూ వైసీపీ, టీడీపీ సభ్యులు ప్రత్యేక హోదా కోసం డిమాండ్ చేయగా, పీఎన్బీ కుంభకోణంపై ఓటింగ్ నిబంధన ద్వారా చర్చ చేపట్టాలని కాంగ్రెస్, తృణమూల్ సభ్యులు పట్టుబట్టారు.

అధ్యక్ష ఎన్నికల్లో రష్యా జోక్యం లేదు

- అమెరికా హౌస్ ఇంటెలిజెన్స్ కమిటీలోని రిపబ్లికన్ల వెల్లడి

వాషింగ్టన్: అధ్యక్ష ఎన్నికల సందర్భంగా ట్రంప్ వర్గం రష్యాతో గానీ, ఇంటెలిజెన్స్ సంస్థలతోగానీ కుమ్మక్కు కాలేదని అమెరికా హౌస్ ఇంటెలిజెన్స్ కమిటీలోని రిపబ్లికన్లు వెల్లడించారు. కాగా, వైట్‌హౌస్ నుంచి వచ్చిన ఒత్తిడి మేరకే కమిటీ ఈ విధమైన నిర్ణయానికి వచ్చిందని కమిటీలోని డెమోక్రాట్ నాయకుడు ఆడమ్ షిఫ్ ఆరోపించారు. 2016లో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో రష్యా జోక్యం చేసుకున్నదని, ట్రంప్‌ను గెలిపించడానికి కొన్ని ఇంటెలిజెన్స్ సంస్థలు ప్రయత్నించాయని డెమోక్రాట్లు ఆరోపించడం, ఈ విషయమై విచారణకు కమిటీని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.

నేపాల్ అధ్యక్షురాలిగా మళ్లీ విద్యాదేవి భండారి



ఖాఠ్మండు: నేపాల్ అధ్యక్షురాలిగా మరోసారి విద్యాదేవి భండారి విజయం సాధించారు. తొలి మహిళా అధ్యక్షురాలైన ఆమె రెండోసారి కూడా మంగళవారం భారీ మెజారిటీతో గెలుపొందారు. వామపక్ష కూటమి అభ్యర్థి భండారి తన ప్రత్యర్థి, నేపాలీ కాంగ్రెస్ (ఎన్సీ) అభ్యర్థి కుమారి లక్ష్మీరాయ్‌పై 2/3వంతు కంటే అధిక మెజారిటీ సాధించి జయకేతనం ఎగురవేశారు. భండారికి 39,275ఓట్లు రాగా, లక్ష్మీరాయ్‌కి 11,730 ఓట్లు వచ్చాయని ఎన్నికల కమిషన్ అధికార ప్రతినిధి నవరాజ్ తెలిపారు.

షూటింగ్ మధ్యలో అమితాబ్‌కు అస్వస్థత

జోధ్‌పూర్: రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో బిగ్‌బీ అమితాబ్ బచ్చన్(75) అస్వస్థతకు గురయ్యారు. 'థగ్స్ ఆఫ్ హిందూస్థాన్' సినిమా షూటింగ్‌లో ఉన్న ఆయన ఒక్కసారిగా అస్వస్థతకు లోనుకావడంతో వెంటనే చికిత్స అందించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలుకడగా ఉన్నది. అయితే అమితాబ్ ఆరోగ్యాన్ని పూర్తిగా పరిశీలించి తగు వైద్య చికిత్సలను అందించడానికి ముంబై నుంచి వైద్య బృందం జోధ్‌పూర్ చేరుకుంది.

'అడవి మంటల' కేసులో గైడ్ అరెస్ట్

థేని: తమిళనాడు పశ్చిమ కనుమల్లోని కురంగని అడవిలో పర్వతారోహకులకు గైడ్‌గా వ్యవహరించారని అనుమానిస్తున్న రంజిత్ (30)ని పోలీసులు అరెస్ట్ చేశారు. విషాదంగా మారిన ఈ పర్వతారోహణకు వసతులు సమకూర్చిన చెన్నైకి చెందిన సంస్థతో రంజిత్‌కున్న సంబంధాలపై తేల్చుకునేందుకు పోలీసులు ఆయన్ని ప్రశ్నిస్తున్నారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన యువతి దివ్య (29)ను మెరుగైన చికిత్స నిమిత్తం మదురై ప్రభుత్వ దవాఖానకు తరలించగా... చికిత్స పొందుతూ ఆమె మరణించింది.దీంతో మృతుల సంఖ్య 10 కి చేరింది.

పాల కల్తీకి పాల్పడితే మూడేండ్ల జైలు

ముంబై: పాల కల్తీకి పాల్పడితే నాన్ బెయిలెబుల్ కేసు నమోదు చేసేలా, మూడేండ్లపాటు జైలు శిక్ష అనుభవించేలా త్వరలో చట్టం తెస్తామని మహారాష్ట్ర ఆహార, పౌర సరఫరాల మంత్రి గిరీశ్ బపత్ తెలిపారు. పాల కల్తీపై మహారాష్ట్ర అసెంబ్లీలో పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ.. ప్రస్తుత చట్టం ప్రకారం పాలకల్తీకి పాల్పడితే ఆరు నెలల వరకు జైలు శిక్ష విధిస్తున్నామని, అయితే కల్తీని నివారించడానికి ఈ శిక్షను మూడేండ్లకు పొడిగిస్తున్నామన్నారు.

కార్తి చిదంబరం సీఏకు బెయిల్

న్యూఢిల్లీ: ఐఎన్ ఎక్స్ మీడియా నల్లధనం కేసులో అరెస్ట్ అయిన కార్తి చిదంబరం చార్టెడ్ అకౌంటెంట్ ఎస్ భాస్కర రామన్‌కు బెయిల్ లభించింది. ఢిల్లీలోని ప్రత్యేక కోర్టు ఆయనకు మంగళవారం బెయిల్ మంజూరు చేసింది. కేంద్ర మాజీమంత్రి చిదంబరం కుమారుడైన కార్తితోపాటు ఆయనకు సీఏగా వ్యవహరించిన భాస్కర రామన్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ గత నెల 16న అరెస్ట్ చేసింది. నల్లధనం కేసులో కార్తికి సహకరించారన్న ఆరోపణ తప్ప రామన్‌పై ఇతరత్రా అభియోగాలు లేవు కాబట్టి బెయిల్ మంజూరు చేస్తున్నట్లు జడ్జి ప్రకటించారు.

వేగంగా లింకురోడ్ల నిర్మాణం

హైదరాబాద్‌లోని ఐటీ జోన్‌తోపాటు సెంట్రల్‌లోనూ తగ్గనున్న ట్రాఫిక్ చిక్కులు

- ఇప్పటికే కొన్నిచోట్ల తుదిదశకు చేరిన పనులు
- ఈ ఏడాది చివరికల్లా మొత్తం 16 రోడ్లు అందుబాటులోకి


మాదాపూర్-హైటెక్‌సిటీ రోడ్ (ఫైల్)

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: గ్రేటర్ హైదరాబాద్‌లో లింకురోడ్ల నిర్మాణంతో ప్రధాన రోడ్లపై ట్రాఫిక్ ఇబ్బందులు చాలావరకు తగ్గే అవకాశమున్నది. దీనివల్ల ప్రయాణసమయం కూడా గణనీయంగా తగ్గే ఆస్కారమున్నది. ముఖ్యంగా ఐటీ జోన్‌లోని మాదాపూర్, హైటెక్‌సిటీ, నానక్‌రామ్‌గూడ తదితర వెస్ట్‌జోన్‌లో ఎంతో ఊరట లభించే వీలున్నది. జీహెచ్‌ఎంసీ అధికారులు ఆ దిశగా లింకురోడ్ల నిర్మాణం పనులు వేగవంతం చేశారు. పలు రోడ్ల నిర్మాణం పనులు ఇప్పటికే తుదిదశకు చేరుకోగా, చేపట్టిన మొత్తం 16 రోడ్లను ఈ ఏడాది చివరికల్లా అందుబాటులోకి తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

తొలగనున్న ట్రాఫిక్ సమస్య

నగరంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడంతోపాటు త్వరగా గమ్యాన్ని చేరుకొనేలా ప్రభుత్వం ఎస్‌ఆర్‌డీపీ కింద పెద్ద ఎత్తున సిగ్నల్ ఫ్రీ కారిడార్లు, మల్టీలెవల్ ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఈ పనుల్లో కూడా స్వతహాగానే ట్రాఫిక్ సమస్య అధికంగా ఉన్న ఐటీ జోన్‌ను ప్రాధాన్యతాక్రమంలో ముందుంచిన అధికారులు లింకురోడ్ల నిర్మాణంలోనూ ఈ ప్రాంతానికి ప్రాధాన్యం ఇచ్చారు. నగరంలో మొత్తం 16 లింకురోడ్లను గుర్తించగా, అందులో నాలుగు మినహా మిగిలినవన్నీ వెస్ట్‌జోన్‌లోనివే కావడం విశేషం. వీటితోపాటు సెంట్రల్‌జోన్‌లో కూడా పలు రోడ్లను గుర్తించి పనులు చేపట్టారు. మాదాపూర్, బొటానికల్ గార్డెన్, నానక్‌రామ్‌గూడ, చందానగర్ తదితర ప్రాంతాల్లో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పలుచోట్ల భూసేకరణ పూర్తికావడంతో రోడ్ల నిర్మాణం చేపట్టగా, దాదాపు పనులు తుదిదశకు చేరుకున్నట్టు అధికారులు తెలిపారు. ఈ లింకురోడ్లతో ప్రధానంగా బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, కాచిగూడ, అబిడ్స్, కూకట్‌పల్లి, మాదాపూర్, శేరిలింగంపల్లి, అంబర్‌పేట్ తదితర ప్రాంతాల్లోని ప్రధాన రోడ్లపై ట్రాఫిక్ రద్దీ చాలావరకు తగ్గే అవకాశం ఉన్నది. లింకురోడ్ల నిర్మాణానికి 204 ఆస్తులను సేకరించాల్సి ఉంటుందని గుర్తించగా, ఇప్పటికే సగానికిపైగా సేకరణ పూర్తయిందని అధికారులు వెల్లడించారు. ఈ ఏడాది చివరికల్లా అన్ని రోడ్లూ పూర్తవుతాయని భరోసా ఇస్తున్నారు.

లింకురోడ్లు, సేకరించే ఆస్తుల వివరాలు..

సర్కిల్	లింకురోడ్లు	అడ్డంకిగా మారిన ఆస్తులు
9	కాచిగూడ మెయిన్‌రోడ్డు-న్యూ నల్లకుంట బ్రిడ్జి	5
9	అలీకేఫ్ జంక్షన్-నాగోల్ వయా అహ్మద్‌నగర్	4
10	రోడ్ నంబర్-1- రోడ్ నం-10(బంజారాహిల్స్)	1
10	గ్రీన్‌లాండ్స్ జంక్షన్-నెక్లెస్‌రోడ్	2
11	మాదాపూర్-ఐలారోడ్(వెస్టిన్‌హోటల్ వెనుక)	3
11	బొటానికల్ గార్డెన్ రోడ్(కొండాపూర్)-హఫీజ్‌పేట్ రైల్వేట్రాక్	25
11	జేవీహిల్స్, కొండాపూర్ క్రాస్‌రోడ్స్, రాఘవేంద్రకాలనీ వయా హెచ్‌టీ లైన్	75
11	మాదాపూర్ మెయిన్‌రోడ్-నాలెడ్జ్‌పార్క్ వయా రహేజా ఐటీ పార్క్	15
11	నానక్‌రామ్‌గూడ టీసీఎస్-ఓఆర్‌ఆర్ సర్వీస్‌రోడ్ వయా జనచైతన్యరోడ్	12
11	ఎన్‌హెచ్‌డీసీ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ లేఔట్-నార్సింగి-నానక్‌రామ్‌గూడ ఓఆర్‌ఆర్	14
11	నానక్‌రామ్‌గూడ(గ్రామం)సర్వే నంబర్లు- 50, 52, 53, 82, 77, 85, 86, 89, 92, 93, 149, పుప్పాలగూడ(గ్రామం)లోని సర్వే నం- 346, 345, 344, 342, 277, 276	15
11	మాదాపూర్-హైటెక్‌సిటీ	2
11	నానక్‌రామ్‌గూడ నార్సింగి గ్రామం-హ్యాండ్ ఆఫ్ హోప్ చెర్చ్	22
12	చందానగర్(ఎన్‌హెచ్-9)-శ్రీదేవీ థియేటర్(నాలా వెంబడి)	1
14	తొమ్మిదో ఫేజ్ చివరి నుంచి ఐడీపీఎల్ సొసైటీ రోడ్ వరకు	3
14	కూకట్‌పల్లి మెయిన్‌రోడ్-ఆంజనేయనగర్	5
మొత్తం		204

అక్రమ హోర్డింగుల తొలగింపు వేగవంతం


ఖైరతాబాద్ ఆర్‌టీవో కార్యాలయం ఆవరణలోని యూనిపోల్‌ను తొలగిస్తున్న దృశ్యం

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ నగరంలో అక్రమ హోర్డింగులు, యూనిపోల్స్ తొలగింపు కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతున్నదని, నెలరోజుల్లో ఎంపికచేసిన అన్ని అక్రమ హోర్డింగులనూ తొలగిస్తామని జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రకటించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో మొత్తం 333 అక్రమ హోర్డింగులు గుర్తించి జనవరి 22వ తేదీ నుంచి వీటి తొలగింపు చేపట్టగా, ఇప్పటివరకు 195 హోర్డింగులు తొలగించామన్నారు. మిగిలిన 138 హోర్డింగులు, యూనిపోల్లను నెలరోజుల్లోగా తొలగిస్తామని తెలిపారు. ఖైరతాబాద్ ఆర్‌టీవో కార్యాలయం ఆవరణంలో ఉన్న అనధికార యూనిపోల్‌ను మంగళవారం తొలగించినట్టు చెప్పారు. తొలగించిన వాటిలో జీహెచ్‌ఎంసీ నియమించిన ఏజెన్సీ 84 హోర్డింగులను, మిగిలిన 111 హోర్డింగులను ఆయా యాడ్ ఏజెన్సీలే సొంతంగా తొలగించుకున్నట్టు వివరించారు.


హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై మొల్ల విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, బీసీ కమిషన్ సభ్యుడు వకుళాభరణం కృష్ణమోహన్, ఎమ్మెల్యే కే లక్ష్మణ్ తదితరులు

ఘనంగా కవయిత్రి మొల్ల జయంతి

ముషీరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాష్ట్రీయ కుమ్మర సంఘం ఆధ్వర్యంలో ప్రముఖ కవయిత్రి మొల్ల జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఉన్న మొల్ల విగ్రహానికి బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ కే లక్ష్మణ్, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, బీసీ కమిషన్ సభ్యుడు వకుళాభరణం కృష్ణమోహన్ తదితరులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ బీసీల అభ్యున్నతికి టీఆర్‌ఎస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తున్నదని, చేతివృత్తులను ఆదుకోవడానికి ఎంబీసీ కార్పొరేషన్ పరిధిలోకి తీసుకొచ్చి నిధులు కేటాయించిందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రీయ కుమ్మర సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కొల్లూరి అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి శివానంద్, గౌరవ అధ్యక్షుడు బండారు భిక్షపతి, కే శ్రీనివాస్, రేపాక రాంబాబు, శంకరయ్య, సిల్వేరు శంకర్, విజయ్‌కుమార్, ఎం రాజేశ్ పాల్గొన్నారు.

ఎస్టీపీలో పడి తండ్రీకొడుకుల మృతి


అరవింద్, ఆదిత్య మృతదేహాలు

ఉప్పల్, నమస్తే తెలంగాణ: సివరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్(ఎస్టీపీ)లో పడి తండ్రీకొడుకులు మృతిచెందిన ఘటన హైదరాబాద్ ఉప్పల్‌లో జరిగింది. ఉప్పల్ పోలీసుల కథనం ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన అరవింద్‌కుమార్(24) కుటుంబంతో కలిసి కాటేదాన్‌లో ఉంటున్నాడు. ఉప్పల్ సూర్యనగర్‌లో ఉంటున్న సోదరుడు మదన్‌కుమార్ వద్దకు సోమవారం కుమారుడు ఆదిత్య(3)తో కలిసి వచ్చాడు. మదన్‌కుమార్ కుమారుడు విశాల్‌కుమార్(13)తో కలిసి కూలీ డబ్బుల కోసం సోమవారం సాయంత్రం ఉప్పల్‌లోని ఆదిత్య దవాఖాన వెనుకప్రాంతంలోని వెల్డింగ్‌షాపునకు వెళ్లారు. గంట తర్వాత వస్తే డబ్బులు ఇస్తామని యజమాని చెప్పాడు. దీంతో ముగ్గురూ కలిసి పక్కనే ఉన్న గుడి వద్దకు వెళ్లారు. కొద్దిసేపటికి విశాల్‌కుమార్ నిద్రపోయి లేచేసరికి ఆదిత్య, అరవింద్‌కుమార్ కనిపించలేదు. ఈ విషయాన్ని విశాల్‌కుమార్ ఇంటికి వెళ్లి తండ్రి మదన్‌కుమార్‌కు చెప్పాడు. రాత్రి వరకు వెతికినా ప్రయోజనంలేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం ఉదయం ఉప్పల్‌లోని సివరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో మృతదేహాలు కనిపించాయి. ప్రమాదవశాత్తు అందులో పడి మృతిచెంది ఉండవచ్చని భావిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉన్నది.

అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్నాడని..

ప్రియురాలి కుమారుడిని చితకబాదాడు


గాయపడిన బాలుడు, పక్కన నిందితుడు పెద్దిరాజు

అమీర్‌పేట, నమస్తే తెలంగాణ: తమ సరదాలకు అడ్డంకిగా మారాడన్న నెపంతో ప్రియురాలి ఆరేండ్ల కుమారుడిని విచక్షణారహితంగా కొట్టి తీవ్రంగా గాయపర్చిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్ సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బబ్బుగూడలో డ్రైవర్‌గా పని చేస్తున్న పెద్దిరాజు ఉంటున్నాడు. అదే బస్తీలో ఏడాది కిందట శ్రీకాకుళం నుంచి వచ్చి లక్ష్మి కూడా ఉంటున్నది. భర్త చనిపోయిన లక్ష్మి కుమారుడు పవన్‌కుమార్‌తో కలిసి ఉంటున్నది. ఈ నేపథ్యంలో లక్ష్మితో పరిచయం పెంచుకున్న పెద్దిరాజు క్రమంగా ఆమెను లోబర్చుకున్నాడు. ఈ పరిస్థితుల్లో తమ సరదాలకు ఆరేండ్ల పవన్ అడ్డంకిగా మారాడని పెద్దిరాజు తరుచూ బాలుడిని తీవ్రంగా కొడుతుండేవాడు. సోమవారం సాయంత్రం ఏకంగా ప్లాస్టిక్ వైర్‌తో పవన్‌ను తీవ్రంగా కొట్టడంతో ముఖం, వీపు, కాళ్లు, తలపై తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఇంటి నుంచి బయటకు వచ్చి ఏడుస్తుండగా బస్తీ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు బాలుడిని ఆరాతీయగా, పెద్దిరాజు తనను గాయపర్చిన తీరును వివరించాడు. దీంతో బస్తీ ప్రతినిధులంతా కలిసి పెద్దిరాజుకు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి పెద్దిరాజును రిమాండ్‌కు తరలించారు.

సిమో ఒలింపియాడ్స్‌లో నారాయణ స్కూల్స్ ప్రతిభ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జాతీయస్థాయిలో సిమో ఎడ్యుకేషన్ నిర్వహించే మ్యాథ్స్, సైన్స్ ఒలింపియాడ్స్‌లో నారాయణ స్కూల్స్ సత్తాచాటాయి. సౌత్‌ఇండియా ఫిజిక్స్ ఒలింపియాడ్ ప్రకటించిన తొలి పదిలోపు జాతీయస్థాయి ర్యాంకుల్లో 77 శాతం తమ విద్యార్థులే కైవసం చేసుకున్నారని నారాయణ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పీ సింధూర నారాయణ తెలిపారు. జాతీయస్థాయి తొలి పదిర్యాంకుల్లో సౌత్ ఇండియా బయాలజీ ఒలింపియాడ్‌లో 67 శాతం, సైన్స్ ఒలింపియాడ్‌లో 62 శాతం, కెమిస్ట్రీ ఒలింపియాడ్‌లో 60 శాతం, మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో 34 శాతం నారాయణ సంస్థల విద్యార్థులే దక్కించుకున్నారని చెప్పారు. సిమో ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో మూడోతరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించే మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ ఒలింపియాడ్స్‌కు దేశవ్యాప్తంగా ప్రాధాన్యత ఉన్నదని పేర్కొన్నారు. పోటీ పరీక్షల కోసం ప్రత్యేకంగా కార్యక్రమాలను రూపొందించి అమలుపరుస్తున్నామని, అత్యున్నతస్థాయి మెటీరియల్‌ను తయారుచేశామని ఆమె వివరించారు. ప్రతిభచాటిన విద్యార్థులను నారాయణ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కే పునీత్ అభినందించారు.

ఆందోళనలో ఫార్మా-డీ విద్యార్థులు

- కేంద్రం నిర్లక్ష్యంతో ఉద్యోగావకాశాలు కరువు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కేంద్రం నిర్లక్ష్యంతో ఫార్మా-డీ పూర్తిచేసిన విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారు. కోర్సును ప్రవేశ పెట్టిన కేంద్ర సర్కారు ఉద్యోగావకాశాలు కల్పించకపోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2008లో మార్చి 13న ఫార్మా-డీ కోర్సును పీసీఐ(ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా)అనుమతితో దేశంలో ప్రవేశపెట్టారు. ఆరేండ్ల కాలవ్యవధిగా డాక్టర్ ఆఫ్ ఫార్మసీ కోర్సును రూపొందించారు. మొదటి ఫార్మా-డీ బ్యాచ్ 2014లో బయటకు వచ్చింది. వైద్యుడు సూచించిన ఔషధాలను ఎలా? ఎంత మోతాదులో వాడాలి? అనే విషయాన్ని రోగికి చెప్పడమే ఫార్మా-డీ విద్యార్థుల పని. దేశవ్యాప్తంగా 12వేల మందికిపైగా రూ.20 లక్షల వరకు ఖర్చుచేసి ఫార్మా-డీ కోర్సు పూర్తిచేశారు. అమెరికా, ఆస్ట్రేలియా, యూకే, కెనడాలో ఫార్మా-డీ పూర్తిచేసిన ఫార్మసిస్టుల సేవలను వినియోగించుకుంటున్నారు. కేంద్రం 2015లో ఫార్మసీ ప్రాక్టీస్ రెగ్యులరైజేషన్ పేరిట చట్టాన్ని రూపొందించింది. అయినప్పటికీ ఫార్మా-డీ అభ్యర్థుల సేవలను వినియోగించుకోవడం లేదని నిరుద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

'పాలమూరు-రంగారెడ్డి'పై విచారణ వాయిదా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ)లో విచారణ వచ్చే నెల 12కు వాయిదాపడింది. పాత పాలమూరు జిల్లాతోపాటు రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల పరిధిలోని 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు చేపడుతున్న ఈ పథకం పనులను నిలిపివేయాలంటూ కాంగ్రెస్ నాయకుడు హర్షవర్ధన్ ఎన్జీటీని ఆశ్రయించిన విషయం తెలిసిందే. దీనిపై మంగళవారం విచారణ చేపట్టిన ఎన్జీటీ.. తదుపరి విచారణను ఏప్రిల్ 12కు వాయిదా వేసింది.

నమస్తే తెలంగాణ

జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు,
సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi

హైదరాబాద్
బుధవారం 14 మార్చి 2018

WWW. NTNEWS.COM



బుద్ధా అరుణారెడ్డి

తాను ఇచ్చే శిక్షణపట్ల గురువుకు ఓ స్పష్టత ఉండాలి. ఉత్తమ శిష్యులను తయారు చేసుకొనే సామర్థ్యం ఉండాలి. శిష్యుల పట్ల అవసరమైనప్పుడు కాఠిన్యం, అప్పుడప్పుడు ప్రేమను చూపించాలి. మొత్తంగా శిష్యులను ఉన్నతంగా, సమాజానికి ఉపయోగపడేలా తీర్చిదిద్దడమే గురువు లక్ష్యం. అలాంటి నిర్దిష్టమైన లక్ష్యాన్ని ఎంచుకొని, అహర్నిశలు కష్టపడుతూ, కుటుంబాన్ని, వృత్తిని బ్యాలెన్స్ చేస్తూ.. ఎంతోమంది శిష్యులను జాతీయ, అంతర్జాతీయ పోటీలకు పరిచయం చేసింది ఈ గురువే. ప్రపంచ జిమ్నాస్టిక్స్ పోటీల్లో మన తెలంగాణ ఖ్యాతిని నలుదిశలా వ్యాపింపజేసిన బుద్దా అరుణారెడ్డికి ఈమే తొలిగురువు!!

స్వర్ణ విజేతలకు గురువు!



అరుణారెడ్డి తొలి గురువు స్వర్ణలత

జిమ్నాస్టిక్స్‌లో కాంస్య పతకం సాధించింది మన తెలంగాణ తేజం బుద్దా అరుణారెడ్డి. ఆమెలో చిన్నతనంలోనే అంతటి స్ఫూర్తిని రగిలించి, ఆమె ప్రయాణానికి తొలిగురువుగా పునాది వేసింది మాత్రం కోచ్ సోమా స్వర్ణలత. దాదాపు నాలుగేండ్లకు పైగా అరుణారెడ్డికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఆమె భవిష్యత్‌ను నిర్ణయించింది స్వర్ణలత. గురువు నేర్పిన క్రమశిక్షణను, ఆటలో చెప్పిన నైపుణ్యాలను మెరుగుపర్చుకొని నేడు ఈ స్థాయిలో నిలిచింది అరుణారెడ్డి. ఒక గురువుగా తన శిష్యులను ఉన్నతస్థానంలో చూడడంలో ఉన్న ఆనందం మరెక్కడుంటుందని అంటున్నది స్వర్ణలత.

వరంగల్ పట్టణానికి చెందిన సోమా స్వర్ణలత తండ్రి ఓ టైలర్. ఆయన టైలరింగ్‌లో శిక్షణ తీసుకొనేందుకు ముంబై వెళ్లాడు. అప్పుడు జిమ్నాస్టిక్స్ చూసి ఆశ్చర్యపోయాడు. అప్పుడే తన కూతురికి జిమ్నాస్టిక్స్ నేర్పించాలనుకొన్నాడు. అలా వరంగల్ వచ్చి.. ఇంట్లోనే గడ్డితో లాన్ తయారు చేసి, దానిపై బార్‌గా కర్రను ఉంచి తానే ఇంట్లోనే జిమ్నాస్టిక్స్ శిక్షణ ఇచ్చేవాడు. అలా ఆరేండ్ల వయసులోనే తండ్రి చూపిన బాటనే తన కెరీర్‌గా ఎంచుకొని జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి పోటీల్లో తన ప్రతిభ చూపింది స్వర్ణలత. తర్వాత కోచ్‌గా జీవితాన్ని ప్రారంభించి ఎంతోమంది చాంపియన్స్‌ను తయారు చేసింది.

అరుణారెడ్డిని ఇలా గుర్తించారు!!: స్వర్ణలత జిమ్నాస్టిక్స్‌లో మంచిగా కోచింగ్ ఇస్తారని తెలిసి.. అరుణారెడ్డిని ఆరేండ్ల వయసులో ఆమె తండ్రి తీసుకొచ్చారు. సిన తర్వాత పిల్లలపై అంత ప్రేమ చూపిస్తారు స్వర్ణలత. ఆ విషయం ఆమె దగ్గర జిమ్నాస్టిక్స్ నేర్చుకున్న పిల్లలందరికీ తెలుసు. అరుణారెడ్డిని ఉన్నత స్థానానికి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో ఒక్కోసారి చేయి చేసుకోవాల్సి వచ్చేదట. కొన్నిసార్లు గద్దించి చెప్పేది. ట్రైనింగ్‌లో ఎప్పుడూ పిల్లలపై ప్రేమ చూపించలేదు. అయితే స్వర్ణలత దగ్గర శిక్షణ తీసుకుంటున్నంత కాలం ఏనాడూ తనకు అరుణారెడ్డి ఎదురు చెప్పలేదట. ఆమె ఎలాంటి ఎలిమెంట్ చెప్పినా.. అరుణారెడ్డి క్షణాల్లో చేసి చూపెట్టేది. అరుణారెడ్డి చేస్తున్న ఫీట్స్ చూస్తుంటే.. స్వర్ణలతలో రోజురోజుకూ నమ్మకం, ఆత్మవిశ్వాసం రెట్టింపయ్యేది. అలా కొన్నాళ్ల శిక్షణ తర్వాత రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి పోటీల్లో అరుణను చాంపియన్‌గా నిలిపింది స్వర్ణలత. ఆమె ఆధ్వర్యంలో 2005లో నిర్వహించిన సబ్ జూనియర్ నేషనల్ గోల్డ్ మెడలిస్ట్‌గా అవతరించింది అరుణారెడ్డి.

ఎంతోమంది చాంపియన్స్..



నేను కోచ్‌గా ఎక్కడ విధులు నిర్వర్తించినా ఉదయం 6 గంటలకు కచ్చితంగా కోచింగ్‌కు హాజరుకావాల్సిందే. టైం అంటే టైమే. 'నేనే లేట్‌గా వస్తే.. పిల్లలు నా నుంచి క్రమశిక్షణ ఎలా నేర్చుకుంటారు' అంటుంది స్వర్ణలత. మొదటి పోస్టింగ్ కడప జిల్లాలో తీసుకొని అక్కడ ఎంతోమంది విద్యార్థులను జాతీయ, అంతర్జాతీయ పోటీలకు పంపింది. అక్కడి నుంచి కరీంనగర్, వరంగల్, హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో జిమ్నాస్టిక్స్ విద్యార్థులకు శిక్షణ ఇచ్చింది. ప్రస్తుతం సరూర్‌నగర్ జిమ్నాస్టిక్స్ కోచింగ్ ఇస్తున్నారు. 25 యేండ్ల కాలంలో ఎంతో విద్యార్థులను జాతీయ, అంతర్జాతీయ పోటీలకు పరిచయం చేసింది. వారిలో కొంతమందిని చాంపియన్స్‌గా తీర్చిదిద్దింది.

అరుణారెడ్డిని చూడగానే ఆమెలోని చాంపియన్‌ను గుర్తించింది స్వర్ణలత. ఎందుకంటే అప్పటికీ తన శరీరసౌష్టవం జిమ్నాస్టిక్స్‌కు తగ్గట్లుగా ఉండడం, కష్టమైన ఎలిమెంట్స్ చెప్పినా సులువుగా చేయడంతో అరుణారెడ్డి ఏనాటికైనా చాంపియన్ అవుతుందని అనుకున్నారు స్వర్ణలత. అప్పటి నుంచి అరుణారెడ్డిపై ప్రత్యేక దృష్టి పెట్టి ఎంతో కఠినమైన శిక్షణ ఇచ్చేది. అరుణారెడ్డిలోని ప్రతిభకు తన ఆలోచనలు మేళవించి కొత్త టెక్నిక్స్ నేర్పించింది. అరుణాలోని నైపుణ్యాన్ని మెరుగుపరిచేందుకు ఉదయం మూడుగంటలు, సాయంత్రం మూడుగంటలు జిమ్నాస్టిక్స్‌లో కఠినమైన శిక్షణ ఇచ్చింది స్వర్ణలత.

కూతురుకంటే ఎక్కువ: శిక్షణ ఇచ్చేటప్పుడు ఎంత కఠినంగా ఉంటారో.. ముగి

తండ్రి కష్టం మర్చిపోలేనిది: అరుణారెడ్డి తండ్రికి ఆమెను గొప్ప చాంపియన్‌గా చూడాలని కోరిక ఉండేది. అందుకు ఆయన కూడా ఎంతకష్టమైనా ఉద్యోగం అయిపోగానే కారులో పాపను స్కూల్ నుంచి తీసుకెళ్లి స్వర్ణలత దగ్గర శిక్షణ ఇప్పించేవారు. మళ్లీ ఉదయం ఐదింటికే అరుణను తయారు చేయించి, తల్లి పెట్టిన టిఫిన్, స్నాక్స్ బాక్స్‌లో తీసుకెళ్లి.. ఆరింటికల్లా శిక్షణ మొదలు పెట్టేది. జిమ్‌లోనే స్కూల్‌డ్రెస్ పెట్టుకొని శిక్షణ ముగిసిన తర్వాత అటునుంచి అటే స్కూల్‌కు వెళ్లేదట అరుణారెడ్డి. చిన్నప్పుడు అంతలా కష్టపడింది కాబట్టే ఇప్పుడు ఇంతమంచి స్థాయిలో ఉన్నదని గర్వంగా చెప్పుకుంటున్నది కోచ్ స్వర్ణలత. తనను కోచ్‌గా చూడడానికి తన తండ్రి ఎంతలా కష్టపడ్డారో.. అరుణారెడ్డి తండ్రి కూడా అంతే కష్టపడ్డారని చెబుతున్నది.

ఒలింపిక్స్‌లో మెడల్ సాధిస్తుంది!

అరుణారెడ్డిలో ఉన్న నైపుణ్యం, తెలివితేటలు, పనిపట్ల శ్రద్ధ ఏనాటికైనా ఆమెను ఉన్నతస్థానంలో ఉంచుతాయని అనుకొనేవాళ్లం. నేడు చూశాం కూడా. అయితే అరుణారెడ్డికి మెరుగైన శిక్షణ ఇస్తే.. కచ్చితంగా ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధిస్తుంది. అరుణారెడ్డి గురువుగా ఆ రోజుకోసం ఎదురుచూస్తున్నా. ఎనాటికైనా తనపేరు సువర్ణాక్షరాలతో లిఖిస్తుందనే నమ్మకం ఉన్నది. మనదేశంలో సరైన వనరులు లేవు కాబట్టి.. కనీసం విదేశాల్లో అయిన అరుణారెడ్డికి కోచింగ్ ఇప్పించాలి.

సోమా స్వర్ణలత, జిమ్నాస్టిక్స్ కోచ్

సమస్యలు, సవాళ్లను అధిగమిస్తూ: ఆరేండ్ల వయసులో జిమ్నాస్టిక్స్ కెరీర్ మొదలు పెట్టిన దగ్గర్నుంచి.. నేటి వరకు ఎన్నో సవాళ్లను అధిగమిస్తున్నది స్వర్ణలత. పెండ్లయిన ఏడేండ్లకే భర్త ఏవీ గిరిరాజ్ రోడ్డు ప్రమాదంలో చనిపోయారు. అప్పటి నుంచి కుటుంబాన్ని పోషించుకుంటూ, పిల్లలను చదివించుకుంటూ.. వృత్తిపరంగా శిష్యులను ఉన్నతమార్గంలో నడిపిస్తూ.. ఎన్నో కష్టాలను అనుభవించింది. భర్త గిరిరాజ్ జిమ్నాస్టిక్స్‌లో అంతర్జాతీయ కోచ్. కలకత్తాలో వీరి ప్రేమ ప్రయాణం మొదలైంది. దాదాపు 8 యేండ్లు ప్రేమించుకున్న తర్వాత.. తల్లిదండ్రులను ఒప్పించి పెండ్లి చేసుకున్నారు. వీరికి ఇద్దరు సంతానం. భర్త రోడ్డు ప్రమాదంలో చనిపోవడంతో కృంగిపోయింది. తర్వాత బిడ్డలను చదివిస్తూ.. వారి కోసం కష్టపడుతున్నది. కూతురికి జిమ్నాస్టిక్స్, కుమారుడికి టెన్నిస్ నేర్పిస్తున్నది.

ఇంకా కాంట్రాక్ట్ కోచ్‌గానే: 1993 నుంచి ఇప్పటి వరకూ ఇంకా కాంట్రాక్ట్ పద్ధతిలోనే కోచ్‌గా కొనసాగుతున్నది స్వర్ణలత. క్రీడల మంత్రిత్వ శాఖ నుంచి ఆదేశాలను పాటిస్తూనే పలుచోట్లకు ట్రాన్స్‌ఫర్ అవుతున్నా.. పర్మినెంట్ కాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. కడపలో మొదటిసారి ఉద్యోగంలో చేరినప్పుడు 2,300 రూపాయలకు జాయిన్ అయింది. అప్పటి నుంచి ఇప్పటి వరకూ ప్రతియేటా వేతనం పెంచుతున్నారే తప్ప.. రెగ్యులర్ చేయడం లేదు. ప్రభుత్వం తమలాంటి వారిని దృష్టిలోఉంచుకొని పర్మినెంట్ చేయాలని కోరుతున్నది.

రవికుమార్ తోటపల్లి

పారిస్ లక్ష్మి.. ఫిదా అయింది!



మన దేశ సంస్కృతీ సంప్రదాయాల్లో మనకు తెలియని అద్భుతాలెన్నో ఉన్నాయి. ఇక్కడ కనిపించే విభిన్న సంస్కృతికి విదేశీయులు ఫిదా అవుతున్నారు. ఇక పారిస్ లక్ష్మి ఏకంగా మనదేశ కోడలైపోయింది.

నిజమే.. మన సంస్కృతిలో ఏదో మహాజగత్తు ఉన్నది. ఇక్కడి సంప్రదాయాలు తెలుసుకున్న విదేశీయులు ఎవరైనా మరోసారి ఇండియాకు వెళ్లాలి అంటుంటారు. ఇక ఫ్రాన్స్‌కు చెందిన మిరియాం సోఫియా లక్ష్మి క్విని యోకు మన దేశమంటే ఎంతో ఇష్టం. ఎంతంటే..? మనదేశానికి చెందిన వ్యక్తిని పెండ్లి చేసుకొని.. ఇక్కడే స్థిరపడేంత. ఇక్కడి అలవాట్లు, ఆచారాలు, సంప్రదాయాలు, కట్టుబాట్లు, విభిన్న నృత్యాలు, భిన్న జాతులను చూసి ఇక్కడే శాశ్వతంగా ఉండాలని చిన్నప్పుడే నిర్ణయించుకున్నది మిరియాం. చిన్నప్పుడు ఏసు ప్రభువు కథలతో పాటు.. ఇండియాలోని దేవుళ్లు, వాళ్ల విశిష్టత, చరిత్రను తల్లిద్వారా తెలుసుకున్నది. అంతే ఆరోయేట నుంచే ఇండియాకు కుటుంబంతో వస్తూ.. ఇక్కడి భరతనాట్యం నేర్చుకునేది. ఇలా ప్రతియేటా తప్పకుండా ఇండియాలోని ప్రముఖ ప్రాంతాలు సందర్శించేది. అలా కేరళకు చెందిన కథక్ కళాకారుడు పల్లిపురం సునిల్‌ను పెండ్లి చేసుకున్నది. ఇద్దరూ కళాశక్తి అనే డాన్స్ స్కూల్ ప్రారంభించి.. పలువురికి శిక్షణ ఇస్తున్నారు. సంస్కృతిపైన మక్కువతో దక్షిణాదిలోని దాదాపు పది సినిమాల్లో విదేశీ నృత్యకారిణిగా నటించింది లక్ష్మి. అలా మన సంస్కృతిలో తాను భాగమైంది.

పండ్లరసాలు.. గుజ్జుతో..



ముఖం కాంతివంతంగా మారడానికి, చర్మ సౌందర్యం మెగురుపడేందుకు పండ్ల రసాలు, గుజ్జు ఎంత ఉపయోగపడుతాయో తెలుసుకొని.. మీరూ ఓ సారి ప్రయత్నించండి.

- బాగా పండిన అరటి పండుకు అలివ్ ఆయిల్, రోజ్‌వాటర్, కోకో వాటర్ కలిపి ఫేస్‌ప్యాక్ చేసుకోవాలి. గోరు వెచ్చని నీరు/పాలతో శుభ్రం చేసుకుంటే మెరిసే చర్మం మీ సొంతం.
- పుచ్చకాయను ముక్కలుగా కట్ చేసి ముఖం మీద మసాజ్ చేయాలి. తడి ఆరిన తర్వాత మళ్లీ మసాజ్ చేయాలి. ఇలా నాలుగుసార్లు చేస్తే ముఖం కాంతివంతమవుతుంది.
- అరకప్పు స్ట్రాబెర్రీలను పేస్టుగా చేసి, అందులో సోర్ క్రీమ్‌ను మిక్స్ చేసి ముఖానికి రాయాలి. 10-15 నిమిషాల తర్వాత చల్లటి నీటితో కడిగితే మొటిమలు తగ్గుతాయి.
- ఒక కప్పు దానిమ్మ గింజలు పేస్టు చేసుకుని 3/4 కప్పు క్రీమ్ మిక్స్ చేసి, మెడకు అప్లై చేయాలి. 20 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో కడిగితే ఆయిల్ స్కిన్ తొలగిపోతుంది.
- పొట్టుతో సహా ఆపిల్ ముక్కలను పేస్టు చేసి, అందులో ఒక స్పూన్ రోజ్ వాటర్ కలిపి, ఆ మిశ్రమాన్ని ముఖానికి రాయాలి. తర్వాత గోరు వెచ్చని నీటితో శుభ్రం చేయాలి.
- కర్బూజలో విటమిన్ ఏ, సి అధికంగా ఉండే కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచుతుంది.
- నల్లటి వలయాలు, చారలు, జిడ్డు ముఖాన్ని తప్పించుకోవడం కోసం ద్రాక్షరసం అద్భుతంగా పనిచేస్తుంది.

నా సమస్యలకు పరిష్కారం చెప్పరూ..?



అడుగండి చెబుతా

నా వయసు 40 సంవత్సరాలు. నా సమస్యను ఎక్కడ ప్రారంభించి చెప్పాలో కూడా అర్థం కావడం లేదు. ఆకలి చాలా తక్కువ. ఇక ఆకలి మొదలైందంటే మాత్రం ఆగలేను. వెంటనే ఏదైనా తినకపోతే స్పృహ తప్పుతుందేమో అనిపిస్తుంది. కాస్త తినగానే కడుపు నిండినట్టు అనిపిస్తుంది. పొట్ట ఉబ్బరంగా మారిపోతుంది. మోషన్ కూడా ఫ్రీగా ఉండదు. ప్రతి రోజు విరేచనం అవుతుంది కానీ పూర్తిగా అయిపోయిన భావన కలుగదు. పైల్స్ ఉన్నాయేమో అని అనుమానంగా ఉంది. పొట్ట నిండా గ్యాస్ చేరి విపరీతంగా ఉబ్బి పోయి ఉబ్బెత్తుగా కనిపిస్తుంది. అలాంటి స్థితిలో పొట్ట బరువుగా ఉండి కలిగే ఇబ్బంది మాటల్లో చెప్పలేను. తేన్పులు వస్తుంటాయి. ఆయాసంగా ఉంటుంది. నా సమస్యలకు ఆయుర్వేదంలో మంచి పరిష్కారం లభిస్తుందని స్నేహితులు అంటున్నారు. నిజమేనా? నా సమస్యలకు పరిష్కారం ఏమిటి? దయచేసి పూర్తిగా వివరించగలరు.

చిన్ని, కామారెడ్డి

మీరు చెప్పిన లక్షణాలను బట్టి మీకు పైల్స్ సమస్య ఉన్నట్టు అనుమానంగా ఉంది. అందువల్లే విరేచనం కావడంలో ఆటంకం ఏర్పడుతుందేమో అనిపిస్తున్నది. ముందుగా అది నిర్ధారించడానికి పరీక్ష చెయ్యాల్సి ఉంటుంది. ఈ లక్షణాలన్నీ కూడా ఆమ్లపిత్తంలో కనిపిస్తాయి. ఆమ్లపిత్తం ఒక వ్యాధి. ఆమ్లపిత్తం ప్రకోపించడం వల్ల ఆటోపం అనే స్థితి ఏర్పడుతుంది. ఈ స్థితిలో పొట్ట ఉబ్బిపోతుంది. ఇలా ఉబ్బడం వల్ల పొట్ట బరువు పెరుగుతుంది. ఈ స్థితిని ఆధ్మానం అంటారు. ఆధ్మానంలో కలిగే ఇబ్బందిని వర్ణించలేం.

ఈ సమస్యలకు కారణం, మసాల, పులుపు, పచ్చళ్లు ఎక్కువగా తినడం లేదా మానసిక ఒత్తిడి కారణం కావచ్చు. ఒత్తిడి వల్ల మానసిక ప్రశాంతత లోపిస్తుంది. దాని ప్రభావం జీర్ణక్రియ మీద నేరుగా ఉంటుంది. జీర్ణక్రియ సరిగా లేకపోవడం వల్ల అరుచి, అజీర్ణం ఇబ్బంది పెడతాయి. మలబద్దకం ఏర్పడుతుంది. మలబద్ధకం వల్ల ఆమ్లపిత్తం మరింత ఎక్కువ అవుతుంది. మలబద్ధకం వల్ల ఆమ్లపిత్తం, ఆమ్లపిత్తం వల్ల మలబద్ధకం పెరుగుతాయి. ఈ సమస్యలన్నింటికి కారణం మలబద్ధకమే. మలబద్ధకం తగ్గితే ఆమ్లగుణం తగ్గుతుంది. ఈ సమస్యలకు ఆయుర్వేదంలో మంచి చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. ఆమ్లగుణం తగ్గేందుకు మందులు వాడాల్సి ఉంటుంది. ఆహార కారణాలతో ఆమ్లగుణం పెరిగితే ఆహారంలో మార్పులు చేసుకోవాల్సి ఉంటుంది. మానసిక ఒత్తిడి ఇందుకు కారణమైతే మరోరకమైన మందులు వాడాల్సి ఉంటుంది. మందులు వాడుతూ పంచకర్మ ల్లోని విరేచన, వస్తి కర్మలు అవసరమవుతాయి. పూర్వకర్మల్లో వస్తికర్మ తప్పకుండా చెయ్యాల్సి ఉంటుంది. చికిత్స క్రమం తప్పకుండా పూర్తిస్థాయిలో తీసుకుంటే తప్పకుండా మీ సమస్యలు పరిష్కారం అవుతాయి.



డాక్టర్ సారంగపాణి
మెంబర్ అండ్ వైస్ చైర్మన్
సిసిఐఎం,
మినిస్ట్రీ ఆఫ్ ఆయూష్
సాయి భరద్వాజ సూపర్
స్పెషాలిటీ ఆయుర్వేద
హైదరాబాద్

నమస్తే తెలంగాణ
సంకేత
[హైదరాబాద్]
బుధవారం 14 మార్చి 2018
టెక్నాలజీ 2.0



నీళ్లు తాగించే యాప్స్

రోజుకు ఎనిమిది నుంచి పది గ్లాసుల వరకు మంచినీళ్లు తాగమని డాక్టర్లు చెబుతారు. కానీ ఇప్పటి వరకు ఎన్ని తాగామో గుర్తుండదు. పనిలో పడితే అసలు నీళ్లు తాగాలన్న విషయం కూడా మరిచిపోతారు కొంతమంది. అలాంటి వారికోసమే ఈ ఐదు యాప్‌లు.

వాటర్ లాగ్డ్ :

ఇది మీరు వాటర్ తాగాల్సిన టైం వచ్చినప్పుడు గుర్తు చేస్తుంది. సో మర్చిపోయే చాన్సే లేదన్నమాట. కాకపోతే మీరు నీళ్లు తాగిన ప్రతీసారి ఇందులో డిపాజిట్ చేయాలన్నమాట. ఇది మీరు వాటర్ తాగి ఎంత సేపవుతుందో అని కూడా రిమైండ్ చేసినప్పుడు నోటీస్ చేస్తుంది. యాప్‌స్టోర్‌లో ఈ యాప్‌ని ఫ్రీగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

వాటర్ యువర్ బాడీ

ఈ యాప్ అందరికీ సుపరిచితమే. మీరు ఒక రోజులో తాగిన మంచినీళ్ల శాతాన్ని గ్రాఫ్ రూపంలో చూపిస్తుంది. వాటర్ తాగడం వల్ల ఎలాంటి ప్రయోజనాలుంటాయో ఈ యాప్ చెప్తుంది. అంతేకాదు మీ శరీరానికి ఎంత నీరు కావాలి. మీరు ఇప్పటి వరకు ఎంత తాగారు అనే విషయాన్ని కూడా డిస్‌ప్లే చేస్తుంది. గూగుల్ ప్లేస్టోర్‌లో ఈ యాప్ ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.


హైడ్రో కోచ్

మీ బాడీకి ఎంత నీరు అవసరం, ఉదయం నుంచి ఎన్ని నీరు తాగారు అనే ఖచ్చితమైన లెక్కలు తీసి చూపిస్తుందీ యాప్. వయసును బట్టి, ఆడ, మగ లింగ భేదాన్ని బట్టి ఎవరికి ఎంత వాటర్ అవసరమో నోటీస్ చేస్తుంది. గూగుల్ ప్లేస్టోర్‌లో ఈ యాప్ ఫ్రీగా అందుబాటులో ఉంది. కావాలనుకుంటే డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ప్లాంట్ నానీ

చిన్న చిన్న మొక్కలు మన దగ్గరికొచ్చి దాహంగా ఉంది మంచినీళ్లు పోయండి అని అడుగుతాయా ? అడుగవు. కానీ ఈ యాప్‌లో ఉండే చిన్న చిన్న మొక్కలు మీర నీరు తాగాల్సిన సమయం రాగానే అలారం వచ్చి మాకు దాహంగా ఉంది నీరు పోయండి అని అడుగుతాయి. మీరు ఒక్క గ్లాసు వాటర్ తాగి ఈ యాప్‌లో రిజిష్టర్ చేసుకుంటే సాయంత్రానికల్లా ఆ మొక్క పెరిగి చెట్టవుతుంది. ఇంట్రెస్టింగ్‌గా ఉన్న ఈ యాప్ గూగుల్ ప్లేస్టోర్ నుంచి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

త్వరలో విడుదల!



సోనీ ఎక్స్‌పీరియా ఎక్స్‌జెడ్ 1 ప్రీమియం



డిస్‌ప్లే కాస్త చిన్నగా ఉన్నా.. పెర్ఫామెన్స్‌లో మాత్రం సోనీ ఫోన్లు ముందే ఉంటాయి. 4.6 ఇంచుల డిస్‌ప్లే, 1280 x 720 స్క్రీన్ రిజల్యూషన్‌తో రూపొందించిన ఈ మొబైల్‌లో 4 జీబీ ర్యామ్, 64 జీబీ ఇంటర్నల్ స్టోరేజీ ఉంటుంది. 256 జీబీ వరకు మెమరీ కార్డు ద్వారా పెంచుకునే సామర్థ్యం కూడా ఉంది. 19 మెగాపిక్సెల్స్ రియర్ కెమెరా, 8 మెగాపిక్సెల్స్ ఫ్రంట్ కెమెరా, 8.0 ఓరియో ఆండ్రాయిడ్ వెర్షన్‌తో ఈ మొబైల్ తయారుచేశారు. ఫింగర్‌ప్రింట్ సెన్సార్, 4జీ వోల్ట్, డ్యుయల్‌బాండ్ వైఫై, 5.0 బ్లూటూత్, టైప్ సీ యూఎస్‌బీ ఈ మొబైల్‌లో ఉన్న అదనపు ఫీచర్లు. 2700 ఎంఏహెచ్ బ్యాటరీ సామర్థ్యం ఉంటుంది. దీని ధర రూ. 34,900గా నిర్ణయించి ఈ మొబైల్‌ని త్వరలో మార్కెట్లోకి విడుదల చేయనున్నారు. ఇవే ఫీచర్లతో సోనీ ఎక్స్‌పీరియా ఎక్స్‌జెడ్1 మొబైల్ కూడా రూపొందించారు. కాకపోతే ధరలో కాస్త అటూఇటూగా ఉండొచ్చు.

హువాయ్ పి11



5.5 ఇంచుల డిస్‌ప్లే ఎల్‌సీడీ ప్యానెల్‌తో హువాయ్ పి11 మొబైల్ డిస్‌ప్లే రూపొందించారు. 2560x 1440 పిక్సెల్స్ స్క్రీన్ రిజల్యూషన్, 970 చిప్‌సెట్, 4/6జీబీ ర్యామ్, 64/128 జీబీ ఇంటర్నల్ స్టోరేజీ, 8.0 ఓరియో ఆండ్రాయిడ్ వర్షన్, డ్యుయల్ సిమ్, 16 మెగాపిక్సెల్స్ రియర్ డ్యుయల్ కెమెరా, 8 మెగాపిక్సెల్స్ సెల్ఫీ కెమెరా, 3000 ఎంఏహెచ్ లియాన్ బ్యాటరీ సామర్థ్యంతో ఈ మొబైల్ రూపొందింది. ఈ నెల చివర్లో విడుదల కానున్న దీని ధర రూ. 38,000

ఎల్‌జీ వీ30ఎస్ థింక్యూ



6 ఇంచుల క్యూహెచ్‌డీ ప్లస్ ఓఎల్‌ఈడీ డిస్‌ప్లేతో 2880 x 1440 పిక్సెల్స్ స్క్రీన్ రిజల్యూషన్‌తో ఈ మొబైల్ రూపొందించారు. గొరిల్లా గ్లాస్ 5 ప్రొటెక్షన్, ఆక్టాకోర్ స్నాప్‌డ్రాగన్ 835 ప్రాసెసర్లు ఇందులో అమర్చారు. 6 జీబీ ర్యామ్, 128/256 ఇంటర్నల్ స్టోరేజీ, 2 టీబీ వరకు పెంచుకోగల మెమరీ సామర్థ్యం. 8.0 ఓరియో ఆండ్రాయిడ్ వెర్షన్ ఈ మొబైల్‌లో అందుబాటులో ఉంది. 16,13 మెగాపిక్సెల్స్ డ్యుయల్ రియర్ కెమెరా, 5 మెగాపిక్సెల్స్ ఫ్రంట్ కెమెరా, వాటర్, డస్ట్ రెసిస్టెన్స్, టైప్ సీ యూఎస్‌బీ పోర్ట్, వంటి అదిరిపోయే ఫీచర్లతో మార్కెట్లోకి రానున్నది. 128 జీబీ వెర్షన్ ధర రూ. 63,000 256 వెర్షన్ ధర రూ. 66,000లకు అందుబాటులో ఉండనున్నది.

హువాయ్ పీ20 లైట్



హువాయ్ పీ 20 పేరుతో ఈ నెలాఖర్లో కొత్త మొబైల్‌ను మార్కెట్లోకి విడుదల చేయనున్నది. 5.84 ఇంచుల ఫుల్ హెచ్‌డీ కర్వ్‌డ్ గ్లాస్ డిస్‌ప్లే, ఆక్టాకోర్ ప్రాసెసర్, 4జీబీ ర్యామ్, 64 జీబీ ఇంటర్నల్ స్టోరేజీ, 256 జీబీల వరకు పెంచుకోగల సామర్థ్యం ఈ మొబైల్‌లో అమర్చిన ప్రత్యేక ఫీచర్. 8.0 ఆండ్రాయిడ్ వర్షన్, 16, 2 మెగాపిక్సెల్స్, 16 మెగాపిక్సెల్స్ సెల్ఫీ కెమెరా అమర్చారు. 3000 ఎంఏహెచ్ బ్యాటరీ సామర్థ్యంతో రూపొందించిన ఈ మొబైల్ బ్లూ, బ్లాక్, రోజ్ గోల్డ్, గోల్డ్ రంగుల్లో అందుబాటులో ఉన్నది. ధర ఇంకా నిర్ణయించలేదు.

ఒప్పో ఆర్15 ఫీచర్లు



ఈ నెలాఖర్లో ఒప్పో ఆర్ 15 పేరుతో తన కొత్త మోడల్ మొబైల్‌ను మార్కెట్లోకి విడుదల చేయనున్నది. 6.28 ఇంచుల డిస్‌ప్లే, 2280 x 1080 పిక్సెల్స్ స్క్రీన్ రిజల్యూషన్‌తో ఈ మొబైల్ రూపొందించారు. 6జీబీ ర్యామ్, 128 జీబీ ఇంటర్నల్ స్టోరేజీ, 256 జీబీ వరకు మెమొరీని పెంచుకునే సామర్థ్యం కలదు. 8.1 ఆండ్రాయిడ్ వెర్షన్, హైబ్రిడ్ డ్యుయల్ సిమ్, 16,5 మెగాపిక్సెల్స్ డ్యుయల్ రియర్ కెమెరాలు, 20 మెగాపిక్సెల్స్ సెల్ఫీ కెమెరాలు ఇందులో అమర్చారు. ఫింగర్‌ప్రింట్ సెన్సార్, 4జీ వోల్ట్, డ్యుయల్ బాండ్ వైఫై, 5.0 బ్లూటూత్, టైప్ సీ యూఎస్‌బీ, 3365 బ్యాటరీ సామర్థ్యం కలదు. ధర ఇంకా నిర్ణయించలేదు.

నోకియా 9



అదిరిపోయే ఫీచర్లతో నోకియా త్వరలో ఓ కొత్త మోడల్ మొబైల్‌ని మార్కెట్లోకి విడుదల చేయనున్నది. ఈ మొబైల్ ఫీచర్ల విషయానికొస్తే.. 5.3 ఇంచుల క్వాడ్ హెచ్‌డీ డిస్‌ప్లే, 2560x1440 పిక్సెల్స్ స్క్రీన్ రిజల్యూషన్, స్నాప్‌డ్రాగన్ 835 ప్రాసెసర్‌తో, 4/6/8 జీబీ ర్యామ్‌తో ఈ మొబైల్ రూపొందించారు. డ్యుయల్ సిమ్, 8.0 ఆండ్రాయిడ్ వర్షన్ ఈ మొబైల్‌లో అందుబాటులో ఉన్నాయి. వెనుకవైపు 13,8 మెగాపిక్సెల్స్ కెమెరాలు, 13 మెగా పిక్సెల్స్ సెల్ఫీ కెమెరా ఉన్నాయి. 4జీ వోల్ట్, ఫింగర్‌ప్రింట్ సెన్సార్, 5.0 వెర్షన్ బ్లూటూత్, టైప్ సి యూఎస్‌బీ పోర్ట్, వాటర్, డస్ట్ రెసిస్టెన్స్ ఇందులో అమర్చిన ఫీచర్లు. బ్యాటరీ గురించి చెప్పాలంటే ఎప్పట్లాగే అధిక సామర్థ్యంతో మొబైల్స్ విడుదల చేసే మొబైల్‌గా పేరున్న నోకియా ఈ మోడల్‌కి 3500 ఎంఏహెచ్ బ్యాటరీతో, ఫాస్ట్‌ఛార్జింగ్ ఫీచర్‌ను రూపొందించింది. ఈ నెలాఖర్లో విడుదల కానున్న ఈ మొబైల్ ధర రూ. 34,990

ఎల్‌జీ జీ7



మార్చిలోనే విడుదల అయిన ఈ మొబైల్ నోకియా 9 కంటే కాస్త పెద్దదైన డిస్‌ప్లేతో మార్కెట్లోకి రానుంది. 6.1 ఇంచుల ఫుల్‌విజన్ డిస్‌ప్లే, 1440x3120 పిక్సెల్స్ స్క్రీన్ రిజల్యూషన్ ఆక్టాకోర్ స్నాప్‌డ్రాగన్, 845 ప్రాసెసర్లతో ఈ మొబైల్ రూపుదిద్దుకుంది. 4/6 జీబీ ర్యామ్, 64/128 జీబీ ఇంటర్నల్ స్టోరేజీ, 8.1 ఆండ్రాయిడ్ వెర్షన్‌తో ఈ మొబైల్ తయారుచేశారు. ఇక కెమెరాల విషయానికొస్తే 16 మెగాపిక్సెల్స్ డ్యుయల్ బ్యాక్ కెమెరాలు, 8 మెగాపిక్సెల్స్ సెల్ఫీ కెమెరా ఇందులో ఉన్నాయి. ఫింగర్‌ప్రింట్ సెన్సార్, ఐపీ 68 వాటర్, డస్ట్ రెసిస్టెన్స్, 4జీ వోల్ట్, డ్యుయల్‌బాండ్ వైఫై, 5ఎల్‌ఈ వెర్షన్‌లో బ్లూటూత్, టైప్ సీ యూఎస్‌బీ, 3000 ఎంఏహెచ్ బ్యాటరీ లాంటి మొదలైన ఫీచర్లు ఈ మొబైల్ ప్రత్యేకతలు. వేగంగా, వైర్‌లెస్‌గా చార్జింగ్ చేసుకునే సదుపాయం ఈ ఫోన్ ప్రత్యేక ఫీచర్. మార్కెట్లోకి విడుదల చేయనున్న అంచనా ధర రూ. 59,900



'గులేబకావళి' చిత్రంలో హన్సిక, ప్రభుదేవా

గులేబకావళి రహస్యం

ప్రభుదేవా, హన్సిక జంటగా నటించిన తమిళ చిత్రం 'గులేబకావళి'. కల్యాణ్ దర్శకత్వం వహించారు. సీనియర్ నటి రేవతి ఓ శక్తివంతమైన పాత్రలో నటించారు. ఈ చిత్రాన్ని అదే పేరుతో సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పతాకంపై మల్కాపురం శివకుమార్ తెలుగులోకి అనువదిస్తున్నారు. ఈ నెల 23న ప్రేక్షకుల ముందుకురానుంది. నిర్మాత మాట్లాడుతూ 'తమిళంలో ఘనవిజయం సాధించిన ఈ చిత్రం తెలుగు నేటివిటీకి దగ్గరగా వుంటుంది. యూనివర్సల్ కాన్సెప్ట్‌తో తెరకెక్కింది. గులేబకావళి అనే గ్రామంలో నిక్షిప్తమైన నిధి కోసం జరిగే అన్వేషణ నేపథ్యంలో ఈ కథ సాగుతుంది. పూర్తి ఎంటర్‌టైన్‌మెంట్‌గా సాగే ఈ చిత్రానికి స్క్రీన్‌ప్లే హైలైట్‌గా వుంటుంది. ప్రభుదేవా నృత్యాలు, నటన హైలైట్‌గా నిలుస్తాయి' అని తెలిపారు. మన్సూర్ అలీఖాన్, మధు, ఆనంద్‌రాజ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి స్టంట్స్: పీటర్ హెయిన్స్, సంగీతం: వివేక్ మెర్విన్, కెమెరా: ఆర్‌ఎస్ ఆనంద్‌కుమార్, ఆర్ట్: కదీర్, పాటలు: సామ్రాట్, దర్శకత్వం: కల్యాణ్, నిర్మాత: మల్కాపురం శివకుమార్.


నమస్తే తెలంగాణ
చిత్రం

మా అమ్మలాగే వుంది!


కూతురు సితారతో మహేష్‌బాబు

స్టార్‌గా ఎంత బిజీగా వున్నా హీరో మహేష్‌బాబు తన పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధను చూపిస్తుంటారు. ప్రస్తుతం కొరటాల శివ రూపొందిస్తున్న 'భరత్ అనే నేను' చిత్రంలో నటిస్తున్న ఆయన తాజాగా సోషల్ మీడియా ఇన్‌స్టాగ్రామ్‌లో తన గారాలపట్టి సితార ఫొటోను షేర్ చేస్తూ తను అచ్చు తన తల్లి ఇందిరాదేవిలానే వుందని వ్యాఖ్యానించారు. 'పింక్..గర్ల్ పవర్..చూడటానికి అచ్చం మా అమ్మలాగే వుంది' అని పోస్ట్ చేశారు. దీనికి తోడు హార్ట్ సింబల్స్‌ని కూడా పోస్ట్ చేయడం మహేష్‌బాబు అభిమానులతో పాటు అందరిని ఆకట్టుకుంటున్నది. ఈ ఫొటోను మహేష్ పోస్ట్ చేసిన కొన్ని గంటల్లోనే లక్ష మందికి పైగా లైక్ చేశారు. మహేష్‌బాబు నటిస్తున్న 'భరత్ అనే నేను'. సమకాలీన రాజకీయాంశాల నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో మహేష్‌బాబు భరత్ రామ్ అనే పాత్రలో ముఖ్యమంత్రిగా కనిపించనున్నారు. కైరా అద్వానీ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి దేవిశ్రీప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. త్వరలో ఆడియో విడుదల చేసి చిత్రాన్ని ఏప్రిల్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని సన్నాహాలు చేస్తున్నారు.

ఉగాదికి ఫస్ట్‌లుక్


రవితేజ

రవితేజ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రానికి సంబంధించిన ఫస్ట్‌లుక్‌ను ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 18న విడుదల చేయబోతున్నారు. ఎస్.ఆర్.టి ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ రూపొందిస్తున్న ఈ చిత్రానికి కళ్యాణ్‌కృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. రామ్ తాళ్లూరి నిర్మాత. మాళవికశర్మ కథానాయికగా నటిస్తున్నది. 'యాక్షన్, వినోదం, సెంటిమెంట్ అంశాలు మేళవించిన కుటుంబ కథా చిత్రమిది. రవితేజ పాత్ర చిత్రణ నవ్యపంథాలో వుంటుంది. 60శాతం చిత్రీకరణ పూర్తయింది. మే నెలాఖరున విడుదల చేయాలని సన్నాహాలు చేస్తున్నాం' అని చిత్ర బృందం తెలిపింది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: ముఖేష్, సంగీతం: శక్తికాంత్ కార్తీక్, ఆర్ట్: బ్రహ్మ కడలి.

కలల రాకుమారుడు


తేజ, హరిణిరెడ్డి

రాజేష్ కనపర్తి దర్శకత్వంలో సెవన్ వండర్స్ పతాకంపై రూపొందుతున్న చిత్రం 'డ్రీమ్‌బాయ్'. తేజ, హరిణిరెడ్డి జంటగా నటిస్తున్నారు. రేణుక నరేంద్ర నిర్మాత. సోమవారం హైదరాబాద్‌లో ఈ చిత్రం ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత రాజ్‌కందుకూరి క్లాప్‌నివ్వగా, మరో నిర్మాత ఎమ్.వి.రావు కెమెరా స్విఛాన్ చేశారు. దర్శకుడు మాట్లాడుతూ 'థ్రిల్లింగ్ అంశాలకు ప్రాధాన్యమున్న ప్రేమకథా చిత్రమిది. ఆద్యంతం వినోదభరితంగా సాగుతుంది. కథలోని మలుపులు అలరిస్తాయి' అని తెలిపారు. సోమవారం నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైందని, వాణిజ్య హంగులు పుష్కలంగా ఉన్న ఈ చిత్రం తెలుగు ప్రేక్షకుల్ని ఆకట్టుంటుందని నిర్మాత తెలిపారు. ధన్‌రాజ్, రాకేష్, సుఖేష్‌రెడ్డి, గౌతమ్‌రాజు ముఖ్య పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: సుభాష్ ఆనంద్, కెమెరా: నాని.

రామేశ్వరరావు కన్నుమూత




తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ కామర్స్ జనరల్ మేనేజర్ జె.రామేశ్వరరావు(74) మంగళవారం హైదరాబాద్‌లోని స్వగృహంలో గుండెపోటుతో కన్నుమూశారు. గతంలో ఆయన మంచిర్యాల తాహసిల్దార్‌గా పనిచేశారు. రామేశ్వరరావు ఆకస్మిక మరణం పట్ల తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సంతాపాన్ని వ్యక్తంచేసింది.

సందేశాత్మక కథాంశంతో..


శివాజీరాజా, ఆర్.కె.గౌడ్

ఆర్.కె. ఫిలింస్ పతాకంపై ప్రతాని రామకృష్ణగౌడ్ స్వీయ దర్శకత్వంలో రూపొందిస్తున్న చిత్రం 'మహిళా కబడ్డీ'. రచన స్మిత్ ప్రధాన పాత్రలో నటిస్తున్నది. ఈ సినిమాలో ఉగాది పండుగ నేపథ్యంలో వచ్చే గీతాన్ని మంగళవారం హైదరాబాద్‌లో మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు శివాజీరాజా విడుదలచేశారు. ఆయన మాట్లాడుతూ 'ఆర్.కె సంస్థలో నేను నటించాను. బోలేషావలి స్వరపరచిన ఈ గీతం వింటుంటే ఉగాది పండుగ ముందే వచ్చినట్లుంది' అని తెలిపారు. ఆర్.కె. గౌడ్ మాట్లాడుతూ 'సుదీర్ఘ విరామం తర్వాత నేను దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. ఓ పల్లెటూరి అమ్మాయి జాతీయ కబడ్డీ ఛాంపియన్‌గా ఎలా నిలిచిందనే సందేశాత్మక కథాంశంతో ఈ చిత్రం రూపొందుతున్నది. ఇటీవలే మూడో షెడ్యూల్ పూర్తయింది. ఈ సినిమాలో శివాజీరాజా ఓ కీలక పాత్రను పోషిస్తున్నారు. ఉగాది పాటను గాయని వరం చక్కగా ఆలపించింది' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముత్యాల రాందాస్, ఏడిద శ్రీరామ్, వరం, బోలేషావళి పాల్గొన్నారు.

కొండవీటి కోట నేపథ్యంలో..


చిత్రం శ్రీను

చిత్రం శ్రీను ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'విశ్వదాభిరామ'. సురేష్ కాశి, సురేంద్ర కమల్, అశోక్‌చక్రం దర్శకత్వం వహించనున్నారు. భువన్‌తేజ్, అనిల్, ఆనంద్, సహస్ర, రాజారెడ్డి, మానస కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని సోలో స్టార్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై సురేంద్ర కమల్ నిర్మిస్తున్నారు. దర్శకులు మాట్లాడుతూ 'కొండవీటి కోట నేపథ్యంలో సాగే డెత్ గేమ్ థ్రిల్లర్ ఇది. ఇప్పటి వరకు కామెడీ పాత్రల్లో ఆకట్టుకున్న చిత్రం శ్రీను తొలిసారి ఇందులో విలన్‌గా నటిస్తున్నారు. తెలుగు ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని కలిగించే చిత్రమిది. చిత్రీకరణ పూర్తయింది. నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలోనే చిత్రాన్ని విడుదల చేస్తాం' అన్నారు. ఈ చిత్రానికి కథ, కథనం, మాటలు: సురేష్ కాశీ, కెమెరా: అజీమ్, తరుణ్ సోనూ.

మట్టిమనుషుల కథ!


సూర్య, శ్రావ్య

సూర్య, భరత్ చంద్ర, శ్రావ్యారావు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'సంత'. 'మట్టి మనుషుల ప్రేమకథ' అని ఉపశీర్షిక. నెల్లుట్ల ప్రవీణ్ చంద్ దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీ జైవర్ధన్ బొయెనేపల్లి నిర్మిస్తున్నారు. నేటి నుంచి పాటల చిత్రీకరణ జరుగనున్నది. దర్శకుడు మాట్లాడుతూ 'ఇటీవలే తొలి షెడ్యూల్ పూర్తయింది. ఈ 14 నుంచి మిగిలిన టాకీ పార్ట్‌తో పాటు పాటల్ని చిత్రీకరిస్తున్నాం. హైదరాబాద్, వరంగల్ పరిసర ప్రాంతాల్లోని అందమైన ప్రదేశాల్లో పాటల చిత్రీకరణ చేస్తున్నాం. ఈ షెడ్యూల్‌లోనే చిత్రీకరణ మొత్తం పూర్తవుతుంది. ఓ సంత నేపథ్యంలో సాగే ఫీల్ గుడ్ లవ్ ఎంటర్‌టైనర్ ఇది. మట్టి మనుషుల ప్రేమకథగా ఆద్యంతం వినోదాత్మకంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నం. అన్ని కార్యక్రమాలు పూర్తిచేసి చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని సన్నాహాలు చేస్తున్నాం' అన్నారు. కిన్నెర, మధుమణి, జబర్దస్త్ ఫణి తదితరులు నటిస్తున్నారు.

నమస్తే తెలంగాణ
యువ
[హైదరాబాద్]
బుధవారం 14 మార్చి 2018

క్యాన్సర్‌ను జయించి.. జీవితాన్ని సాధించి

భయంకరమైన క్యాన్సర్ మహమ్మారి జీవితం మీద దాడి చేసింది. ఆ సమయంలో తన వెంట ఎవరూ లేరు. అక్షరాలను ప్రేమించే ఓ అమ్మాయి పరిచయం అయింది. ఆత్మహత్య చేసుకోవాలనుకున్న తనను ఆ భ్రమ నుంచి బయటికి తీసుకొచ్చింది. ఆమె ఎవరు?

కొందరు ఎప్పుడు ఎక్కడ ఎందుకు పరిచయం అవుతారో తెలియదు. కానీ వాళ్లు మన జీవితాల్ని ప్రభావితం చేస్తారు. కష్టాల నుంచి కాపాడుతారు. అవసరమైన ప్రాణాలు పోస్తారు. ఇది అలాంటి కథనమే. గౌరీ కౌర్ హర్యానాలో సోనేపట్ ప్రాంతానికి చెందిన అమ్మాయి. 2016లో బ్రెయిన్ క్యాన్సర్ అటాక్ చేసింది. ఆ సమయంలో తన వెంట ఎవరూ లేరు. జీవితమనే సముద్రాన్ని ఒంటరిగా ఈదింది. కష్టాల్లో ఉన్నప్పుడు ఎవరూ ఆదుకోరు. తన జీవితం ఇంతే అనుకొని ఆత్మహత్య చేసుకుందామనుకుంది. అప్పుడు సుప్రియ దేవతలా తన జీవితంలో కొత్త వెలుగు నింపింది. ఇంటర్నెట్‌లో అయిన వీళ్లిద్దరి పరిచయం స్నేహం వైపు దారి తీసింది. క్యాన్సర్‌తో బాధపడుతున్న గౌరీకి సాహిత్యం ద్వారా సహాయం అందించింది. ఆత్మవిశ్వాసాన్ని నింపే పద్యాలు, కవిత్వం, కథలను రాసి పంపేది. ఆ పదాలను చదివి ధైర్యాన్ని తెచ్చుకుని ఎవరి కోసం తాను బతుకాలని నిర్ణయించుకొని కొత్త జీవితాన్ని ఆరంభించింది. వైద్యంతో పాటు ఆత్మవిశ్వాసం అనే బలం మందుతో తన రోగాన్ని తక్కువ చేసుకొని మరో జీవితాన్ని సాధించింది.





సంపన్న కుటుంబాలకు చెందిన పిల్లలు వారాంతాల్లో ఏం చేస్తుంటారు? ఔటింగ్ వెళ్తారు. కార్ రేసింగ్‌తో ఎంజాయ్ చేస్తారు! అనిందిత్‌ది కూడా సంపన్న కుటుంబమే. కానీ అతడు రేసింగ్‌ను ఎంజాయ్‌మెంట్ కోసం ఎంచుకోలేదు! కార్లతో కాలయాపన కాకుండా చాంపియన్ అవ్వొచ్చనీ నిరూపించాడు! రేసింగ్‌లో తెలంగాణ సత్తా చాటుతున్నాడు!

అనిందిత్.. తెలంగాణ సూపర్ రేసర్!

కారులో షికారుకెళ్తేనే ఎంతో మజా ఉంటుంది. అలాంటిది రేసింగ్ చేస్తే.. పోటీలో పాల్గొంటే.. సూపర్ కిక్కు ఉంటుంది. కానీ ఈ రంగంలో రాణించాలంటే చాలా గట్స్ ఉండాలి. డ్రైవింగ్‌లోనే కాదు.. ఆలోచనల్లోనూ దూసుకెళ్లే వేగం ఉండాలి. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా అంతా తలకిందులవుతుంది. అంత కష్టతరం.. రిస్క్ రేసింగ్. కానీ దాని రుచి తెలిసినవాళ్లకు మాత్రం రేసింగ్ మంచి పేరు తీసుకొస్తుంది. ఓ చాంపియన్‌గా నిలబెడుతుంది. అలాంటి వారిలో ఒకరు తెలంగాణకు చెందిన అనిందిత్ రెడ్డి.

తెలంగాణ సత్తా

అనిందిత్ రెడ్డి చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి కుమారుడు. మంచి బ్యాక్‌గ్రౌండ్ ఉన్న అనిందిత్ బిజినెస్ ఫీల్డ్‌లో ఉన్నాడు. చాలామందికి ఉన్నట్లు అనిందిత్‌కు కూడా ఓ అభిరుచి ఉన్నది. అదే రేసింగ్. మామూలు డ్రైవింగ్‌కు.. రేసింగ్‌కు చాలా తేడా ఉంటుంది. కానీ సంపన్న కుటుంబాలకు చెందిన పిల్లలు సాధారణ డ్రైవింగ్.. రేసింగ్‌కు తేడా లేకుండా వాహనాలు నడుపుతుంటారనే అపవాదు ఉన్నది. అనిందిత్ రెడ్డి ఆ నింద వేసుకోలేదు. చిన్నప్పట్నుంచి కార్లను చూస్తూ పెరిగిన అతను మంచి రేసర్ కావాలని లక్ష్యం పెట్టుకున్నాడు. అనేక చాంపియన్‌షిప్‌లలో తన ప్రతిభను కనబర్చి తెలంగాణ సత్తా ఏంటో నిరూపించాడు.

స్పోర్ట్స్‌పర్సన్-2017

రేసింగ్‌లో దూసుకెళ్తున్న అనిందిత్ రెడ్డిని తాజాగా ఫెడరేషన్ ఆఫ్ మోటార్ స్పోర్ట్స్ క్లబ్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌ఎమ్‌ఎస్‌సీఐ) నేషనల్ స్పోర్ట్స్ పర్సన్ ఆఫ్ ది ఇయర్ అవార్డుతో సత్కరించింది. 2018 మార్చి 11న చెన్నైలో జరిగిన కార్యక్రమంలో 2017 సంవత్సరానికి గాను ఉత్తమ క్రీడాకారుడి అవార్డు అందుకున్నాడు. అనిందిత్ ఈ రంగంలోకి 2014లో అరంగ్రేటం చేశాడు. అతని వయసు 26 ఏళ్లు. చిన్న వయసులోనే ఈ రంగంలోకి అడుగుపెట్టిన అనిందిత్ మోటార్ స్పోర్ట్స్‌లో సంచలనాలు సృష్టిస్తున్నాడు. ఎంఆర్‌ఎఫ్-1600 టైటిల్స్ గెలిచాడు. రెండు జాతీయ రేసింగ్ చాంపియన్‌షిప్‌లలో యూరో జీకే -17 టైటిల్ సొంతం చేసుకున్నాడు.

స్వతహాగా ఎదుగాలని

అనిందిత్‌ది స్వతహాగా ఎదుగాలనే స్వభావం. కోట్ల సంపదలున్నా.. ఆల్రెడీ బిజినెస్‌లో మంచి సక్సెస్ రేట్ ఉన్నా అతను మాత్రం రేసింగ్‌నే ఎంచుకున్నాడు. అందుకే రిచ్ కిడ్ అనే మరకను పోగొట్టుకున్నాడు. రేసింగ్ డ్రైవర్లతో.. ఇంజినీర్లతో మంచి సంబంధం కలిగి ఉంటాడు. ఎవరూ చెప్పినా వినే స్వభావం అతనికి చిన్నప్పట్నుంచే ఉన్నది. అనిందిత్ అమెరికాలోని మిచిగాన్ జనరల్ మోటార్స్ ఇనిస్టిట్యూట్ నుంచి మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తిచేశాడు. తర్వాత హెల్త్‌కేర్ స్టార్టప్‌లు రూపొందించడంతో కెరీర్ స్టార్ట్ చేశాడు. ఇష్టమంతా రేసింగ్‌లోనే ఉండటంతో 2014లో రేసింగ్‌లోకి ఎంటర్ అయ్యాడు. రేసింగ్ తన ప్యాషన్ మాత్రమే కాదు తన లక్ష్యం అంటున్నాడు అనిందిత్.



అమెరికాలో ఉండగానే..

యూఎస్‌లో ఉన్నప్పుడే అనిందిత్‌కు రేసింగ్‌పై దృష్టి మళ్లింది. కానీ అతని వయసు అప్పుడు 13 ఏళ్లే కావడంతో కొంత కాలం వేచి చూశాడు. పేరెంట్స్ కూడా చిన్నవయసులో ఎందుకనీ చెప్పారు. వయసు పెరుగుతున్నా కొద్దీ మోటార్ స్పోర్ట్స్‌లో అతనికి ఇష్టం పెరుగుతూ వచ్చింది. ఆక్టేన్.. హైస్పీడ్ మోటార్ వేగ ప్రవాహంతో అనుభూతి పొందిన అతడు తన మనసులోని మాటను వ్యక్తపరిచాడు. 2014లో ఎప్పుడైతే మోటార్ స్పోర్ట్స్‌లోకి అడుగుపెట్టాడో ఇక వెనుతిరుగొద్దు అని సంకల్పించాడు అనిందిత్. తన రంగంలో ప్రతిభను చాటుకోవాలనుకున్నాడు. వెనుతిరుగకుండా పరాక్రమాన్ని చాటుతున్నాడు. గో కార్ట్స్.. స్పోర్టీ కార్లతో రేసింగ్ అనిందిత్ అభిరుచి. మృదుస్వభావిగా ఉండే అని.. ఆటలో మాత్రం దూకుడు ప్రదర్శిస్తున్నాడు.

రేసింగ్ చాంపియన్

రేసింగ్‌లో ప్రతీసారి గెలుపు పొందేందుకే అనిందిత్ తాపత్రయపడుతుంటాడు. తాపత్రయానికి తగ్గట్టుగానే కృషి కూడా చేస్తుంటాడు. పదమూడేండ్ల నుంచే ఈ రంగంపై అవగాహన ఉండటం.. దానికి తగ్గట్టు ఆసక్తి ఉండటం అతనికి కలిసొచ్చింది. ప్రారంభంలోనే మంచి రికార్డ్ ఖాతాలో వేసుకున్నాడు. 2014 నుంచి మొదలుపెడితే ఇప్పటివరకు అత్యుత్తమ ప్రదర్శన ఇస్తూనే ఉన్నాడు. 2014లో పోలో ఆర్ కప్‌లో సత్తా చాటాడు. కేవలం రెండు వారాల ప్రాక్టీస్‌తోనే అనిందిత్ ఉత్తమ ప్రదర్శన కనబర్చాడు. 2015లో వోక్స్‌వ్యాగన్ వెంగో కప్ కిరీటం గెలుచుకున్నాడు. 2016లో ఎంఆర్‌ఎఫ్ ఫార్ములా రేస్‌లో.. జేకే టైర్ ఫార్ములా బీఎండబ్ల్యూ సిరీస్‌లో అనిందిత్ పాల్గొని సత్తాచాటాడు. 2017లో యూరో జీకే 2017 రేసింగ్ చాంపియన్‌గా నిలిచాడు. ఈ విజయంతోనే అతడిని జాతీయ స్థాయిలో బెస్ట్ స్పోర్ట్స్ పర్సన్‌గా ప్రకటించాలనే ప్రతిపాదనలు వచ్చాయి.

ఆసియా వ్యాప్తంగా

మోటార్ రేసింగ్ స్పోర్ట్స్‌లో తన విజయాన్ని దృష్టిలో ఉంచుకొని బెస్ట్ స్పోర్ట్స్ పర్సన్ అవార్డు రావడం పట్ల అనిందిత్ ఆనందంగా ఉన్నాడు. ఈ సంవత్సరం జీటీ సిరీస్‌లో ట్రోఫీ సాధించాలనే లక్ష్యంతో కసరత్తు చేస్తున్నాడు. అందుకే ఇటీవల ఇటలీలో రెనాల్ట్ టెస్ట్‌లో పాల్గొనలేదు. ఆసియా వ్యాప్తంగా జీటీ4.. జీటీ3ల ట్రోఫీల్లో పాల్గొని తన వేగానికి మరింత పదును పెడుతా అంటున్నాడు. కొడుకు విజయాన్ని అనిందిత్ తల్లిదండ్రులు విశ్వేశ్వర్‌రెడ్డి.. సంగీత ఆస్వాదిస్తున్నారు. కెరీర్ ప్రారంభం నుంచి అతనికి అండగా నిలుస్తూ ఎంకరేజ్ చేస్తున్నారు. విశ్వేశ్వర్‌రెడ్డి స్వతహాగా సాహస క్రీడా ప్రేమికుడు కావడం అనిందిత్ విజయానికి తోడ్పడింది.

యూత్ ఐకాన్.. మోస్ట్ డిజైరబుల్ మ్యాన్!



హైదరాబాద్ టైమ్స్ తాజాగా 'మోస్ట్ డిజైరబుల్ మెన్ 2017 జాబితాను విడుదల చేసింది. ఇందులో హైదరాబాద్‌కు చెందిన బషీర్ అలీ మొదటి స్థానంలో నిలిచాడు. అతడికి సంబంధించిన ఆసక్తికరమైన సమ్‌గతులు..

- ఫిట్‌నెస్ మోడల్‌గా కెరీర్ ప్రారంభించి సోషల్‌మీడియా ద్వారా యూత్‌కి స్టయిల్ ఐకాన్‌గా పరిచయం అయ్యాడు.
- ఎంటీవీ నిర్వహించే స్లిప్ట్స్‌విల్లా టెన్ రియాలిటీ షోలో పాల్గొని విజయం సాధించాడు.
- 24 యేండ్ల బషీర్ రోడీస్ రైజింగ్ గేమ్ షోలో రన్నరప్‌గా ఉన్నాడు.
- స్లిప్ట్స్‌విల్లా టెన్ రియాటీ షోకి సన్నీ లియోన్, రన్‌విజయ్ సింఘా వ్యాఖ్యాతలుగా ఉన్నారు
- బషీర్‌తో ఫొటో దిగి రన్‌విజయ్ సింఘా ట్విట్టర్‌లో పోస్ట్ చేశాడు.
- యూట్యూబ్‌లో హైదరాబాదీ వీడియోలు కూడా చేశాడు.
- బిగ్‌బాస్ గేమ్ షోలో కూడా పాల్గొన్న బషీర్ అలీ ముద్దు పేర్లు బాబ్, బషీర్ భాయ్ పాల్గొన్నాడు.
- హైదరాబాద్ యూసుఫ్‌గూడలోని సెయింట్ మేరీస్‌లో కాలేజ్‌లో విద్యను అభ్యసించాడు.
- ప్యార్ తూనే క్యా కియా గేమ్‌లో కూడా పాల్గొన్నాడు.
- బషీర్ ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్‌తో పాటు స్విమ్మింగ్, స్కేటింగ్, డాన్సింగ్ కూడా చేస్తాడు.
- సోషల్‌మీడియాలో బషీర్‌కు లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు.

తారలు.. విజేతలు



హలో హాల్ ఆఫ్ ఫేమ్ అవార్డు ఫంక్షన్‌లో బాలీవుడ్ తారలు సందడి చేశారు. సక్సెస్‌ఫుల్‌గా జరిగిన ఈ ఈవెంట్‌లో ప్రముఖులంతా పాల్గొన్నారు. మరీ ఈ కార్యక్రమ విజేతలు ఎవరో తెలుసా?

యువత అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. ఆయా రంగాల్లో తమదైన శైలిలో విజయాలు సాధిస్తున్నారు. బాలీవుడ్ తారలు కూడా ఇటీవల జరిగిన అవార్డుల ఫంక్షన్‌లో అవార్డులందుకున్నారు. వారెవరంటే.. ఉత్తమ నటుడిగా షాహిద్ కపూర్, మోస్ట్ స్టైలిష్ మ్యాన్ ఆఫ్ ది ఇయర్ అవార్డు సిద్దార్థ మల్హోత్రా, స్టయిల్ ఐకాన్ ఆఫ్ ది ఇయర కృతి సనన్, ఎంటర్‌టైనర్ ఆఫ్ ద ఇయర్ ఫీమేల్ దీపికా పదుకొనే, ఎంటర్‌టైనర్ ఆఫ్ ద ఇయర్ మేల్ విభాగంలో రణ్‌వీర్ సింగ్, స్టయిలిష్ ఉమన్ ఆఫ్ ద ఇయర్‌గా శ్వేతానందలు విజయం సాధించారు.

జాన్వీ.. అమ్మ చాటు బిడ్డ కాదు!



శ్రీదేవి గురించి తెలిసిన ప్రతి ఒక్కరికీ ఆమె కూతురు జాన్వీ కపూర్ తెలిసే ఉంటుంది. కానీ ఆమెకు సంబంధించిన అన్ని విషయాలు తెలియకపోయుండొచ్చు. ఆమె తల్లిచాటు బిడ్డ అని చాలామంది అనుకుంటున్నారు. కానీ జాన్వీ స్వతహాగా ఆలోచించే స్వభావం కలదట. వ్యూహాత్మకంగా వ్యవహరిస్తుంది కూడా.

దడక్ కోసం ధైర్యంతో: జాన్వీ నటించబోయే చిత్రం దడక్. సంచలన చిత్రం సైరత్‌కు రీమేక్ ఇది. ఈ సినిమాపైనే శ్రీదేవి భారీ అంచనాలు పెట్టుకున్నది. తల్లి నమ్మకాన్ని.. తన సత్తాను చాటుకోవాలన్నా.. కెరీర్ మలుపు తిరుగాలన్నా దడక్ ఫలితంపైనే ఆధారపడి ఉంటుందని ఆమెకూ తెలుసు. తల్లి మరణం తర్వాత ధైర్యంగానే ఉందట జాన్వీ.

ముక్కుసూటిగా నో: శ్రీదేవి తెలుగులోనే అత్యధికంగా సినిమాలు చేసింది. తెలుగు మూలాలున్న ఆమె తన కూతురు కూడా తెలుగులో నటింపజేసేందుకు ఆసక్తిచూపించింది. తెలుగులో మహేశ్‌బాబు సరసన నటించేందుకు ఉవ్విళ్లూరుతుంటారు హీరోయిన్లు. అలాంటిది మురుగదాస్ దర్శకత్వంలో మహేశ్ నటిస్తున్న సినిమాలో అవకాశం వచ్చినా నో చెప్పిందట. నటనలో పరిణతి చెందాకే తెలుగులో చేస్తానన్నదట.

అక్షత్‌తో ప్రేమాయణం: జాన్వీకి ధైర్యం ఎక్కువ అనడానికి ఇదొక నిదర్శనం. అక్షత్ రంజన్‌తో ప్రేమపలో పడటం.. డేటింగ్ అని వార్తలు రావడంతో కొద్దికాలం దుమారం లేచింది. అయితే జాన్వీ.. అక్షత్.. శ్రీదేవి.. బోనీ కపూర్‌లు కలిసి ఒకే కారులో ప్రయాణించిన వార్తలు బయటకొచ్చిన తర్వాత వీరి ప్రేమాయణాన్ని శ్రీదేవి ఒప్పుకుంది.

అమెరికాలో చదువు: జాన్వీ హోమ్ సిక్ కాదు. ఆమె అమెరికాలోని లాజ్ ఏంజిల్స్‌లో గ్రాడ్యుయేషన్ చేసింది. చదువులో ఆమె చురుకేనట. ద లీ స్ట్రాస్‌బర్గ్ థియేటర్ అండ్ ఫిల్మ్ ఇనిస్టిట్యూట్‌లో నటనలో శిక్షణ తీసుకున్నది. జాన్వీకి ట్రావెలింగ్ అంటే ఇష్టమట. ఒంటరిగా కూడా వారాంతంలో కొత్త ప్రాంతాలకు వెళ్లి ఎంజాయ్ చేస్తుండేదట.



పెండ్లి చేద్దామంటే: శ్రీదేవికి తన కూతురు సినిమాల్లోకి రావడం ఇష్టం లేకుండెనట. పెండ్లి చేసుకోమ్మని కోరేదట. అయితే తాను కచ్చితంగాసినిమాల్లోకే వస్తానని చెప్పడంతో కూతురు ఇష్టానికి ప్రాధాన్యతనిస్తూ ఓకే చెప్పిందట శ్రీదేవి. గారాబంగా పెంచడంతో జాన్వీకి కొంచెం తలబిరుసు ఎక్కువ అంటుంటారు తెలిసిన వాళ్లు కొందరు.

బర్త్‌డే వేడుకలు: శ్రీదేవి చనిపోయిందనే విషయం అభిమానులే జీర్ణించుకోలేకపోతున్నారు. కానీ అలా ఎన్నాళ్లని చింతచేస్తూ ఉంటామనుకుందో ఏమనుకుందో జాన్వీ తన బర్త్‌డే సెలబ్రేట్ చేసుకున్నది. తల్లి చనిపోయిందనే బాధ కూడా లేకుండా ఈ పార్టీలేంటి అనే విమర్శలు రావడంతో జాన్వీ ఎలాంటి బర్త్‌డే పార్టీ జరుపుకోలేదని సిబ్బంది వివరణ ఇచ్చినా అక్షత్ పెట్టిన ఇన్‌స్టాగ్రామ్ ఫొటోలతో పార్టీ నిజమేనని తెలిసింది.

సుడోకు

డైలీ సుడోకు 151 సమాధానం

3	1	5	4	9	6	8	2	7
7	2	6	1	3	8	4	9	5
8	4	9	2	5	7	6	3	1
1	5	8	6	4	2	9	7	3
4	6	7	9	1	3	2	5	8
2	9	3	7	8	5	1	6	4
6	3	2	8	7	1	5	4	9
9	7	1	5	6	4	3	8	2
5	8	4	3	2	9	7	1	6

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -152

1	3		2			7	4	
	2	5		1				
4	8			6			5	
			7	8		2	1	
5				9		3	7	
9				3				5
	4				6	8	9	
	5	3			1	4		
6								

ట్వీట్



కిరాక్ పార్టీ బస్సు ట్రిప్ తిరుమలకు చేరుకున్నది. దర్శనం పూర్తయింది. మార్చ్ 16న మీ దీవెనలు మాకు అవసరం.



నిఖిల్ సిద్ధార్థ
@actor_Nikhil

నిఖిల్‌ను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య
959,497

కామన్‌మ్యాన్ వాయిస్

జీవితం చాలా చిన్నది. కోపం, ద్వేషం, అసూయలను వదులండి. అందరితో నవ్వుతూ సాగండి. జీవితంలో ఇంతకుమించి సంతోషం ఏముంటది.
-Mohammed Darwesh

ఇప్పటికైనా మనం కండ్లు తెరువాలే.. వాళ్లకు మనం ఎంత చేసినా అది ఎన్నటికీ మన మీడియా కాదు.
-Katpally Santosh Reddy


సమర్థించేవాడు, విమర్శించేవాడు ఇద్దరూ కరెక్ట్. అది వాళ్ల దృష్టి కోణం, అభిప్రాయం. కానీ సమర్థన పేరుతో విమర్శ పేరుతో ఇతరులని బూతులు తిట్టే ఇద్దరూ తప్పే. అది వాళ్ల కుసంస్కారం.
-Kris Posts

వైరల్ వీడియో



కపిల్ శర్మ సరికొత్త కార్యక్రమంతో నవ్వించడానికి మళ్లీ వస్తున్నాడు. ఫ్యామిలీ టైమ్ విత్ కపిల్ శర్మ ప్రోగ్రాంతో అలరించనున్నాడు.

Family Time With Kapil Sharma
Coming Soon On Sony Television
Total views : 3,925,142+
Published on Mar 10, 2018


TRIDENT ARTS
NORTHSTAR
ENTERTAINMENT PVT. LTD.
HIGHLY ACCLAIMED
AWARD WINNING FILM
ఉగాది
శుభాకాంక్షలతో
MARCH
16TH
RELEASE
LADY SUPERSTAR
Nayanthara
in
కర్తవ్యం
PRODUCERS
SHARRATH MARAR - R. RAVINDRAN
WRITTEN & DIRECTED BY
GOPI NAINAR
SINDHU GRAFIX
PAVAN KUMAR
EXECUTIVE PRODUCER M.SRINIVASA RAO
PETER HEIN GHIBRAN RUBEN OMPRAKASH LALGUDI N ILAYARAJA GULABI SRINU
RAJESH M. MURTHY UMA DEVI RAVI RANGANATHAN RAJU RAJA KRISHNAN NAREN-MURTHY S. KALAI SELVAN PRO. SKN

నిర్దిష్ట ప్రణాళికతో కరీంనగర్ అభివృద్ధి

■ నాలుగు పట్టణాలకు అభివృద్ధి సంస్థలు
■ శాసనమండలిలో మంత్రి కేటీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నిర్దిష్ట ప్రణాళికల ప్రకారం పట్టణాలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతోనే కరీంనగర్‌లో శాతవాహన పట్టణాభివృద్ధి సంస్థను ఏర్పాటు చేశామని ఐటీ, పురపాలకశాఖ, మున్సిపల్‌శాఖల మంత్రి కేటీఆర్ మంగళవారం శాసనమండలిలో వెల్లడించారు. కరీంనగర్ మాదిరిగానే 'నిజామాబాద్'లో 'నిజామాబాద్ పట్టణాభివృద్ధి సంస్థ', ఖమ్మంలో 'స్తంభాద్రి పట్టణాభివృద్ధి సంస్థ', సిద్దిపేటలో 'సిద్దిపేట అభివృద్ధి సంస్థ'లను ఏర్పాటుచేశామని పేర్కొన్నారు. సభ్యులు నారదాసు లక్ష్మణరావు, భానుప్రసాద్ తదితరులు అడిగిన ప్రశ్నలకు మంత్రి వివరణగా సమాధానం చెప్పారు. ఈ సంస్థలన్నింటికీ త్వరలోనే పాలకమండళ్లను ఏర్పాటుచేస్తామని హామీఇచ్చారు. పట్టణాభివృద్ధి సంస్థలకు సొంత వనరులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఆర్థిక సంఘాలు ఇలా నాలుగు రకాల ఆదాయ వనరులు ఉంటాయని.. ఈ ఆదాయ వనరులన్నింటినీ కలిపి సమగ్ర అభివృద్ధి ప్రణాళికలను రూపొందించే లక్ష్యంతో పట్టణాభివృద్ధి సంస్థలను ఏర్పాటుచేశామని చెప్పారు. కరీంనగర్ పట్టణాభివృద్ధి సంస్థ పరిధిలోకి 71 గ్రామాలు వచ్చాయని.. ఇక్కడ సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని వివరించారు.

దవాఖానల్లో వృద్ధులకు ప్రత్యేక క్యూలు: మంత్రి తుమ్మల

ప్రభుత్వ దవాఖానల్లో సీనియర్ సిటిజన్ల కోసం ప్రత్యేక క్యూ సౌకర్యాలు కల్పించినట్టు మహిళా, శిశు, వృద్ధులు, వికలాంగుల సంక్షేమశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చెప్పారు. వృద్ధుల ఏకీకృత కార్యక్రమం కింద కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతో రాష్ట్రంలో 17 వృద్ధాశ్రమాలు, ఒక సంచార మెడికేర్ యూనిట్, ఒక డే కేర్ సెంటర్ పనిచేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. మంగళవారం మండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, టీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ రాములునాయక్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. జీహెచ్‌ఎంసీ ప్రాంతంలో 54 డే కేర్ కేంద్రాలు, 18 ఈ-గ్రంథాలయాలు ఏర్పాటుచేశామని, సంచార ఆరోగ్య సంరక్షణ యూనిట్ (104) గ్రామాలను సందర్శిస్తున్నదని తెలిపారు.

విత్తన భాండాగారంగా రాష్ట్రం: పోచారం

రాష్ట్రాన్ని విత్తన భాండాగారంగా మార్చడానికి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర వ్యవసాయ, విత్తనాభివృద్ధిశాఖల మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. వచ్చే వానాకాలంలో విత్తనోత్పత్తి చేసే రైతులకు రుణాలను పెంచాలని కోరుతామన్నారు. మంగళవారం శాసనమండలిలో సభ్యులు పాతూరి సుధాకర్‌రెడ్డి, గంగాధర్‌గౌడ్, బాలసాని లక్ష్మీనారాయణ అడిగిన ప్రశ్నకు మంత్రి పోచారం సమాధానం చెప్పారు.

శిక్షలు కఠినంగా ఉండాల్సిందే: మంత్రి కేటీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: చట్టసభల్లో క్రమశిక్షణను ఉల్లంఘిస్తే కఠినచర్యలు తీసుకోవాల్సిందేనని రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖ మంత్రి కే తారకరామారావు అన్నారు. మంగళవారం శాసనమండలి నుంచి బయటకు వస్తుండగా తనను కలిసిన మీడియాతో కేటీఆర్ మాట్లాడారు. కాంగ్రెస్ సభ్యుల సస్పెన్షన్, సభ్యత్వాల రద్దును ప్రస్తావించగా, కేటీఆర్ స్పందించారు. ఈ తరహా చర్యలు తీసుకోవడం దేశంలో కొత్తేమీ కాదని, గతంలో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ అసెంబ్లీలలో అనుచితంగా ప్రవర్తించిన సభ్యులపై కఠినచర్యలు తీసుకున్న విషయాన్ని గుర్తుచేశారు. నేరానికి పాల్పడ్డవారు మాత్రమే కాదు, ప్రోత్సహించిన వారు కూడా శిక్షార్హులేనని స్పష్టంచేశారు. కాంగ్రెస్ సభ్యుల ప్రవర్తన బహిరంగంగా వీడియో ఫుటేజీలో స్పష్టంగా కనిపించిందని కేటీఆర్ చెప్పారు.



అసెంబ్లీ కమిటీహాలులో జరిగిన మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్. చిత్రంలో మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, పద్మారావుగౌడ్, జోగురామన్న, ఎంపీ బూర నర్సయ్యగౌడ్, ఎమ్మెల్సీలు గంగాధర్‌గౌడ్, బాలసాని లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ఉన్నారు

కల్లుగీత వృత్తి బలోపేతానికి సర్కార్ అండ

■ క్యాబినెట్ సబ్‌కమిటీ భేటీలో నిర్ణయాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గత పాలకుల నిర్లక్ష్యానికి గురైన కల్లుగీత కార్మికుల తలరాత మార్చడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని, కల్లుగీత వృత్తి బలోపేతానికి అండగా నిలుస్తున్నదని ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీలు వీ గంగాధర్‌గౌడ్, బాలసాని లక్ష్మీనారాయణ వెల్లడించారు. మంగళవారం టీఆర్‌ఎస్ఎల్పీ కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడుతూ.. కల్లుగీత వృత్తి బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై అసెంబ్లీ కమిటీహాలులో మంగళవారం నిర్వహించిన మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో చర్చించినట్టు చెప్పారు. త్వరలో సీఎం కేసీఆర్ గౌడ నేతలు భేటీ అవుతారన్నారు. గౌడ భవనం నిర్మాణానికి పదెకరాల భూమితో పాటు రూ.25 కోట్లు ఇవ్వాలని తాము కోరామని, సీఎంతో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని మంత్రులు హామీ ఇచ్చారన్నారు.



అసెంబ్లీ ఆవాజ్



దాడి కుట్ర జానారెడ్డిదే..

■ టెర్రరిస్టులను తలపించిన కాంగ్రెస్ సభ్యుల తీరు
■ దాడి అనంతరం సంబురంగా షేక్‌హ్యాండ్ ఇచ్చుకున్నారు
■ అందరి ఆమోదంతోనే ఆ పార్టీ సభ్యులపై వేటు
■ విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి



అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి. చిత్రంలో మంత్రి మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వివేకానంద, కాలె యాదయ్య, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, చింతా ప్రభాకర్ ఉన్నారు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సీఎల్పీలో ముందస్తుగా రూపొందించుకున్న ప్రణాళిక ప్రకారమే అసెంబ్లీలో కాంగ్రెస్ సభ్యులు దాడికి పాల్పడ్డారని, ప్రతిపక్ష నాయకుడు జానారెడ్డి ఈ దాడికి కుట్రపన్నారని విద్యుత్‌శాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి తెలిపారు. సభలో గవర్నర్ ప్రసంగిస్తుండగా కాంగ్రెస్ పార్టీ సభ్యులు వ్యవహరించిన తీరు టెర్రరిస్టులను తలపించిందని ఆరోపించారు. మారణహోమం సృష్టించిన తరువాత టెర్రరిస్టులు ఎలా సంబురపడుతారో.. సోమవారం సభలో గవర్నర్, మండలి చైర్మన్‌పై దాడిచేశాక కాంగ్రెస్ నాయకులు అలాగే షేక్‌హ్యాండ్‌లు ఇచ్చుకుంటూ సంబురాలు చేసుకున్నారని మండిపడ్డారు. మంగళవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మంత్రి మహేందర్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. దాడికి అసలు రూపకల్పన చేసిన జానారెడ్డి తననెందుకు సస్పెండ్ చేశారంటూ అమాయకంగా అడుగుతున్నారని ఎద్దేవాచేశారు. ఏండ్లుగా శాసనసభలో ఉంటున్న సీనియర్ సభ్యుడు సభా మర్యాదలు వదిలేశారని, సభలో దాడుల వల్ల రాష్ట్ర ప్రతిష్ఠకు భంగం కలుగుతుందనే విషయం తోటి సభ్యులకు చెప్పలేకపోయారని పేర్కొన్నారు. శాసనసభ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ప్రతిపక్షాలకు అడిగినంత సమయం ఇచ్చామని, ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలు కీలకంగా ఉండాలని నమ్మిన వ్యక్తి సీఎం కేసీఆర్ అని చెప్పారు. ప్రజా సమస్యలు, పథకాల అమలుపై లోటుపాట్లు చర్చించాల్సిన సభా సమయాన్ని కాంగ్రెస్ సభ్యులు దాడులకు మాత్రమే వినియోగించుకున్నారన్నారు. నిబంధనల మేరకే స్పీకర్ కాంగ్రెస్ సభ్యులపై చర్యలు తీసుకున్నారని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో సభలో హరీశ్‌రావు వ్యవహరించిన తీరు.. ఇప్పుడు కాంగ్రెస్ సభ్యులు వ్యవహరించిన తీరుకు అసలే పోలిక లేదని చెప్పారు.

అంతా కలిసికట్టుగా దాడిచేశారు : మంత్రి మహేందర్‌రెడ్డి

కాంగ్రెస్ సభ్యులు ఉద్దేశపూర్వకంగా, అందరూ కలిసికట్టుగా గవర్నర్, స్పీకర్, చైర్మన్‌పై దాడిచేశారని మంత్రి మహేందర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ నేతలకు అధికారదాహంతో ఓపిక, సహనం నశించిపోతున్నాయని, ప్రజల్లో ఆదరణ లేకపోవడంతో ఏం చేయాలో తెలియక దాడికి దిగారని ఆరోపించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై చర్చించడం, లోపాలు ఎత్తిచూపేందుకు ఎలాంటి విషయాలు లేకపోవడంతో ప్రణాళికతో దాడిచేశారని మంత్రి మహేందర్‌రెడ్డి ఎద్దేవా చేశారు.

ప్రశ్నోత్తరాల సమయం

కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నాం

■ న్యాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉమ్మడి హైకోర్టును విభజించాలని కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నామని న్యాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడి అసెంబ్లీలో చెప్పారు. మంగళవారం ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ హైకోర్టు విభజనలో జరుగుతున్న జాప్యంపై వేసిన ప్రశ్నకు సమాధానమిస్తూ పార్లమెంట్‌లో టీఆర్‌ఎస్ ఎంపీలు కేంద్రాన్ని ఈ విషయమై గట్టిగా నిలదీశారని చెప్పారు. సీఎం కేసీఆర్ తెలంగాణకు ప్రత్యేక హైకోర్టు ఏర్పాటుచేయాల్సిన ఆవశ్యకతను వివరిస్తూ ఇప్పటికే ప్రధానికి, కేంద్రానికి, భారత ప్రధాన న్యాయమూర్తికి లేఖలు రాశారని, భారత ప్రధాన న్యాయమూర్తిని కూడా కలిసి మాట్లాడారని సభకు తెలిపారు. కేంద్ర న్యాయశాఖ మంత్రి హైకోర్టు విభజనను తక్షణమే పరిశీలిస్తామని చెప్పారని, హైకోర్టు విభజనపై కేంద్రం చేస్తున్న జాప్యాన్ని ప్రజలు గమనిస్తున్నారని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. హైకోర్టు విభజనకు సంబంధించి హైకోర్టు ఆరుగురు న్యామూర్తులతో కమిటీ వేసిందని వివరించారు.

ఏప్రిల్ 1 నుంచి కంటి పరీక్షలు: మంత్రి లక్ష్మారెడ్డి



రాష్ట్రవ్యాప్తంగా ఏప్రిల్ 1వ తేదీ నుంచి ప్రతిఒక్కరికి కంటి పరీక్షలు నిర్వహిస్తామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి తెలిపారు. సభలో సభ్యులు జీవన్‌రెడ్డి, గంగుల కమలాకర్, పువ్వాడ అజయ్, వీ శ్రీనివాస్‌గౌడ్ అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇస్తూ రాష్ట్రంలో ప్రభుత్వ దవాఖానలను బలోపేతం చేశామన్నారు. కేవలం వైద్యసేవలకే పరిమితం కాకుండా అవగాహన కల్పిస్తున్నామన్నారు. రోగాలను ముందుగానే గుర్తిస్తే బాగుంటుందని చెప్పారు. ప్రభుత్వం సమగ్ర వైద్యవిధానాన్ని తీసుకువస్తున్నదని చెప్పారు. ఇప్పటివరకు 95 శాతం ఇమ్యూనైజేషన్ చేస్తున్నామని, త్వరలో దీనిని వందశాతం సాధిస్తామని చెప్పారు. తెలంగాణ డయాగ్నస్టిక్స్ పథకం ద్వారా జిల్లా కేంద్రాల్లో 20 సెంట్రల్ డయాగ్నస్టిక్ సెంటర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు చెప్పారు.

ఎన్నారైల సంక్షేమానికి పాలసీ తెస్తాం: మంత్రి కేటీఆర్



ప్రవాస భారతీయుల ఇబ్బందులపై ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అడిగిన ప్రశ్నకు మంత్రి కేటీఆర్ సమాధానమిచ్చారు. ప్రవాస భారతీయుల సంక్షేమం గురించి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఆలోచిస్తున్నదన్నారు. ఎన్నారైల కోసం ఒక విధానాన్ని తీసుకొచ్చి, నిధులు కేటాయిస్తామన్నారు.

కాలువ పొడిగింపు ప్రతిపాదన: మంత్రి హరీశ్‌రావు



తుంగతుర్తి నియోజక వర్గంలోని శాలిగౌరారం మండలంలోని 5 గ్రామాలకు సాగునీటిని అందించడానికి కాలువను పొడిగించాలన్న ప్రతిపాదన ఉందని తాగునీటి శాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ శాలిగౌరారం మండంలోని 8 గ్రామాలలో ఉన్న 23 చెరువులను నింపి 5029 ఎకరాల భూమికు సాగునీటిని అందించడం కోసం అక్కినేపల్లి పెద్దచెరువు నుంచి ఆకారం పెద్దచెరువు వరకు 22 కిలోమీటర్ల కాలువను పెరిక కొండారం వరకు పొడిగించాలని అడిగారని, దీనిని పరిశీలిస్తున్నామని తెలిపారు.

50 లక్షల గొర్రెలు పంపిణీ చేశాం: మంత్రి తలసాని



రాష్ట్రంలో గొర్రెల పంపిణీ పథకంలో ఎలాంటి నిధుల దుర్వినియోగం జరుగలేదని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సభకు తెలిపారు. ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇస్తూ ఇప్పటివరకు 2,40,193 మంది లబ్ధిదారులకు 50,44,000 గొర్రెలు పంపిణీ చేసినట్టు వివరించారు. ఈ గొర్రెలు ఇప్పటివరకు 16 లక్షల పిల్లలు పెట్టాయని, దీని వల్ల రూ.650 కోట్ల అదనపు ఆదాయం వస్తుందని తెలిపారు.

టీఎస్‌ఆర్టీసీకి నష్టాలు నిజమే: మంత్రి మహేందర్‌రెడ్డి



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గ్రామీణ ప్రాంతాల్లో పేదప్రజలకు రవాణా సాధనంగా ఉపయోగ పడుతున్న పల్లెవెలుగు సర్వీసులతో నష్టాలు వచ్చినా ప్రజలకు ప్రభుత్వ రవాణా సంస్థ అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ఆదరిస్తూ ఆ నష్టాలను భరిస్తున్నామని రోడ్డురవాణాశాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే టీఎస్‌ఆర్టీసీకి నష్టాలు వస్తున్న మాట వాస్తవమేనని, ఈ నష్టాలను తగ్గించేందుకు ప్రభుత్వం చేయూతనిస్తున్నదని ఆయన తెలిపారు. మండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో ప్రభుత్వవిప్‌లు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బోడకుంటి వెంకటేశ్వర్లు, సభ్యుడు పురాణం సతీశ్‌కుమార్ అడిగిన ప్రశ్నకు మంత్రి మహేందర్‌రెడ్డి సమాధానమిస్తూ.. నష్టాల్లో నడుస్తున్న టీఎస్‌ఆర్టీసీని ఆదుకోవడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని, సంస్థను ఆదుకునేందుకు గత బడ్జెట్‌లో రూ.1000 కోట్ల నిధులు అందించారని తెలిపారు.

విద్యాప్రమాణాలను పెంచేందుకు చర్యలు: కడియం



హైదరాబాద్, నమస్తేతెలంగాణ: విద్యాప్రమాణాలను పెంపొందించేందుకు ప్రభుత్వం అన్నిచర్యలను తీసుకుంటున్నదని ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి మండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో తెలిపారు. పాతూరి సుధాకర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, పూల రవీందర్ అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలిచ్చారు. ఎంఈవోలను నియమించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలన్నింటినీ పరిశీలిస్తున్నామని ఉపముఖ్యమంత్రి వెల్లడించారు.

సోలార్ పంపుసెట్లపై రైతుల అనాసక్తి: మంత్రి జగదీశ్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సోలార్ పంపుసెట్ల వైపు రైతులు మొగ్గు చూపడం లేదని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుత వ్యవసాయ పంపుసెట్లను సౌర పంపుసెట్లుగా మార్చడంపై మంగళవారం శాసనమండలిలో టీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ అడిగిన ప్రశ్నకు మంత్రి బదులిస్తూ అలాంటి ప్రతిపాదన ఏదీ లేదని స్పష్టం చేశారు.

గల్ఫ్ బాధితులకు అండగా నిలువాలి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గల్ఫ్‌లో సమస్యలు ఎదుర్కొంటున్న తెలంగాణ వాసులను ఆదుకోవాలని, వారికి అండగా నిలువాలని ఐటీ, పురపాలక, ఎన్నారై వ్యవహారాలశాఖ మంత్రి కే తారకరామారావును ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, బిగాల గణేశ్ కోరారు. మంగళవారం అసెంబ్లీలాబీలో మంత్రి కేటీఆర్‌కు వినతిపత్రం అందజేశారు. వలస వెళ్లిన తెలంగాణవాసులను గల్ఫ్‌లోని వివిధ కంపెనీల యాజమాన్యాలు ఇబ్బందులకు గురిచేస్తున్నాయని లేఖలో పేర్కొన్నారు. గల్ఫ్‌లోని తెలంగాణవాసుల సమస్యలను పరిష్కరించేందుకు సమన్వయకర్తను నియమించాలని కోరారు.

మీడియా పాయింట్

చట్టాలు తెలిసిన జానారెడ్డి బొంకుతున్నారు



గవర్నర్ ప్రసంగం సందర్భంగా సోమవారం అసెంబ్లీలో కాంగ్రెస్ నేతలు వ్యవహరించిన తీరు వారికుట్రలను బయటపెట్టింది. 2005లో యూపీఏ హయాంలో 11 మంది ఎంపీలను పార్లమెంట్‌నుంచి బహిష్కరించారు. 1977లో ఇందిరాగాంధీ లోక్‌సభ నుంచి బహిష్కరణకు గురయ్యారు. ఉత్తమ్, జానారెడ్డిలు చట్టాలు తెలువవన్నట్టు బొంకుతున్నారు. బీజేపీ నేతలు కూడా డబుల్ గేమ్ ఆడుతున్నారు.

– వేముల వీరేశం, టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే

బస్సుయాత్ర విఫలమైందనే అసహనం



కాంగ్రెస్ నేతలకు ఇంగితజ్ఞానం కరువైంది. బస్సు యాత్ర విఫలం కావడంతో తీవ్రమైన అసహనంతో అసెంబ్లీకొచ్చారు. నోటికొచ్చిన భాష మాట్లాడి, భౌతికదాడులకు దిగారు. కాంగ్రెస్ సభ్యులపై స్పీకర్ తీసుకున్న చర్య సమర్థనీయం. ప్రజాక్షేత్రంలోకి వెళ్తే కాంగ్రెస్ నేతలకు ప్రజలే కర్రుకాల్చి వాత పెడ్తారు.

– ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే

తెలంగాణ పరువు తీసేలా వ్యవహరిస్తున్నారు



శాసనసభలో కాంగ్రెస్ నేతలు వ్యవహరించిన తీరు తెలంగాణ పరువు తీసే విధంగా ఉంది. సభా నియమావళి ప్రకారమే కాంగ్రెస్ సభ్యులపై స్పీకర్ చర్యలు తీసుకున్నారు. గవర్నర్ లక్ష్యంగా పేపర్లు విసిరామని సమర్థించుకోవడం సిగ్గుచేటు.

–బాజిరెడ్డి గోవర్ధన్, టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే

అధికార దాహంతో సైకోగా మారారు



కాంగ్రెస్ నేతలకు అధికార దాహం పట్టుకున్నది. అది నెరవేరదని తెలిసి సైకోలుగా మారుతున్నారు. నేడు కాంగ్రెస్ నాయకులు చేసినదానికి వారిని చెప్పులతో ఊరేగిస్తారు.

– రామలింగారెడ్డి, టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే

రౌడీయిజాన్ని తలపించారు



దేవాలయంలాంటి సభలో కాంగ్రెస్ సభ్యులు రౌడీయిజాన్ని తలపించేలా దాడిచేశారు. అభివృద్ధిని చూసి తట్టుకోలేకే ప్లాన్ ప్రకారం దాడికి పాల్పడ్డారు.

–చింతా ప్రభాకర్, టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే

పార్టీ పెద్ద పక్కనుండి దాడిచేయించారు



సీఎం థర్డ్ ఫ్రంట్ ఏర్పాటు చేస్తానని ప్రకటించగానే కాంగ్రెస్ నాయకులకు మతిభ్రమించింది. పార్టీ పెద్ద పక్కనుండి దాడి చేయించారు. రేవంత్‌రెడ్డి.. నీ బ్లాక్ మెయిల్ రాజకీయాలు పనికిరావు.. దమ్ముంటే ప్రజాస్వామ్యబద్ధంగా పోరాడు.

– జీవన్‌రెడ్డి, టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే

అసహనంలో కాంగ్రెస్ పార్టీ: అక్బరుద్దీన్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వివిధ రాష్ట్రాల్లో అపజయాలు ఎదుర్కొంటున్న కాంగ్రెస్ అసహనంతో ఉన్నదని, ఇక్కడా అసహనానికి గురవుతున్నారని ఎంఐఎం శాసనసభపక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. కాంగ్రెస్ సభ్యుల సస్పెన్షన్‌పై మంగళవారం సభలో ఆయన మాట్లాడుతూ సోమవారం వారు ప్రవర్తించిన తీరు నగరంలో నడిరోడ్డుపై విద్యార్థిని వేటాడి చంపినరీతిలో ఉందన్నారు.

దేశ రాజకీయాల్లో తెలంగాణ కింగ్‌మేకర్

దేశ రాజకీయాల్లో తెలంగాణ కింగ్ మేకర్ పాత్ర పోషించనున్నదని అక్బరుద్దీన్ ఒవైసీ అభిప్రాయపడ్డారు. మంగళవారం అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై చర్చలో మాట్లాడుతూ బంగారు తెలంగాణ నిర్మాణం కోసం చేపట్టే అన్ని కార్యక్రమాలకు తమ మద్దతు ఉంటుందన్నారు. 2019లో కూడా సీఎం కేసీఆర్‌నే మళ్లీ ముఖ్యమంత్రిగా చూడాలని ఉన్నదని చెప్పారు.

ప్రజాస్వామ్యానికి మాయనిమచ్చ

■ మండలి చీఫ్‌విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి



టీఆర్‌ఎస్ఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న మండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి. చిత్రంలో ప్రభుత్వ విప్‌లు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి, నల్లాల ఓదేలు, ఎమ్మెల్సీ వీ గంగాధర్‌గౌడ్ ఉన్నారు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: శాసనసభలో సోమవారం కాంగ్రెస్ సభ్యుల దాడి ప్రజాస్వామ్యానికి మాయనిమచ్చని శాసనమండలి ప్రభుత్వ చీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. గవర్నర్ ప్రసంగం సందర్భంగా సభలో సీఎల్పీ నేత జానారెడ్డి, పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలోనే దాడి జరిగిందన్నారు. మంగళవారం టీఆర్‌ఎస్ఎల్పీ కార్యాలయంలో ప్రభుత్వ విప్‌లు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, గొంగిడి సునితా మహేందర్‌రెడ్డి, నల్లాల ఓదేలు, ఎమ్మెల్సీ వీ గంగాధర్‌గౌడ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంపత్‌కుమార్ మైక్‌లు, హెడ్‌ఫోన్లు, పెన్నులను గవర్నర్ మీదకు విసురుతున్నప్పుడు జానారెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి లేచి వారిని ప్రోత్సహించినట్టు వీడియో ఫుటేజీలలో కనిపించిందని పాతూరి చెప్పారు. దాడిని కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్సీలు కూడా ప్రోత్సహించడం సహించరాని విషయమన్నారు. కఠినచర్యలు తీసుకుంటేనే మార్పు వస్తుందని తెలిపారు.

ప్రణాళిక ప్రకారమే దాడి: పల్లా రాజేశ్వర్‌రెడ్డి

తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో వినూత్నంగా ముందుకెళుతున్నదని, శాసనసభా వ్యవహారాలను నడపడటంలోనూ అద్భుతంగా పనిచేస్తున్నదని ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి చెప్పారు. సభలో గొడవచేసి సస్పెండ్ కావాలనేది కాంగ్రెస్ పార్టీ లక్ష్యమన్నారు. మైక్‌ను గురిచూసి గవర్నర్ వైపు విసరడంలో ఆంతర్యం ఏమిటని పల్లా ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ సభ్యులను బహిష్కరించడమే కాకుండా, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సభలో మాట్లాడేందుకు ప్రతిపక్షాలకు ఎక్కువ సమయం కేటాయిస్తున్నామని, ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రశ్నించడానికి ఏమీలేకనే కాంగ్రెస్ పార్టీ సభనుంచి బయటకెళ్లాలని ప్రణాళిక వేసుకున్నదని అన్నారు. చర్చ పెడితే ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందనే కార్యక్రమాలు జరుగకుండా చూడాలని యత్నించారని పేర్కొన్నారు.

జానారెడ్డిని సొంత పార్టీ నేతలే గౌరవించరు: సునీతా మహేందర్‌రెడ్డి

సీఎల్పీ నేతగా పార్టీ సభ్యులను అదుపులో ఉంచుకోవడంలో జానారెడ్డి విఫలమయ్యారని, అసలు ఆయనను సొంతపార్టీ నేతలే గౌరవించరని ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ నాయకుల్లో క్రమశిక్షణ లేదని అన్నారు.

కోమటిరెడ్డికి తగినశాస్తి జరిగింది: నల్లాల ఓదేలు

రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంపత్‌కుమార్ శాసనసభ సభ్యత్వాలు రద్దుకావడంవల్ల తగిన శాస్తి జరిగినట్టు అయిందని విప్ నల్లాల ఓదేలు అన్నారు.


ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు

■ అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని ప్రతిపాదించిన ప్రభుత్వ చీఫ్‌విప్ కొప్పుల ఈశ్వర్
■ బలపర్చిన కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద



హైదరాబాద్, నమస్తేతెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన నాలుగేండ్లలో సీఎం కే చంద్రశేఖర్‌రావు నేతృత్వంలో రాష్ట్రం సాధించిన ప్రగతి గవర్నర్ ప్రసంగంలో ప్రస్ఫుటమైందని ప్రభుత్వ చీఫ్‌విప్ కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్ చేసిన ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మంగళవారం చర్చ ప్రారంభమైంది. రాష్ట్ర ప్రభుత్వం తరపున తీర్మానాన్ని ఈశ్వర్ ప్రతిపాదించారు. ఈ తీర్మానాన్ని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే జీ వివేకానంద బలపరిచారు. అనంతరం ఈశ్వర్ చర్చను ప్రారంభించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి గ్రామానికి, ఇంటికీ, గడపకు, ప్రజలకు చేరుతున్నాయని అన్నారు. గవర్నర్ ప్రసంగంలో రాష్ట్ర ప్రభుత్వ పనితీరు, గొప్పతనం వెల్లడవుతున్నదని చెప్పారు. సమాజంలోని ధనికులు, పేదల మధ్య అంతరాలు తొలిగేలా కేసీఆర్ పాలన సాగుతున్నదని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని గవర్నర్ ప్రశంసించారని గుర్తుచేశారు. ఓట్లను దృష్టిలో పెట్టుకొని పరిపాలన కొనసాగించేవారు రాజకీయ నాయకులు అవుతారని.. అన్ని ప్రాంతాల అభివృద్ధి కాంక్షిస్తూ పరిపాలన చేసేవారు సీఎం కేసీఆర్‌లా రాజనీతిజ్ఞులు అవుతారని కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు.


తెలంగాణ ముఖ చిత్రాన్ని ఆవిష్కరించిన గవర్నర్ ప్రసంగం: వివేకానంద



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గవర్నర్ ప్రసంగం తెలంగాణ ముఖచిత్రాన్ని ఆవిష్కరించిందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద అన్నారు. మంగళవారం గవర్నర్ ప్రసంగం ధన్యవాద తీర్మానంపై వివేకానంద మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ నాయకత్వంలో ఎమ్మెల్యేగా పనిచేయడం గర్వంగా ఉందన్నారు. బంగారు తెలంగాణకు సీఎం కేసీఆర్ చేస్తున్న కృషి అద్భుతమన్నారు. అభివృద్ధి అట్టడుగు వర్గాలకు చేరుతున్నదని, ఉద్యమ ఆకాంక్షలను ప్రతిబింబించేలా సీఎం కేసీఆర్ పనిచేస్తున్నారని పేర్కొన్నారు. స్పీకర్ అధ్యక్షతన ఎమ్మెల్యేలను కాళేశ్వరం ప్రాజెక్టు పరిశీలనకు తీసుకెళ్లాలని కోరారు.


గవర్నర్ ప్రసంగం.. తెలంగాణ ప్రభుత్వ ప్రోగ్రెస్ రిపోర్ట్

■ ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ ప్రభుత్వం అనేకరంగాలలో సాధించిన ప్రగతిని గవర్నర్ తన ప్రసంగంలో ఉదహరించారని శాసనమండలిలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. గవర్నర్ ప్రసంగం తెలంగాణ ప్రభుత్వ ప్రోగ్రెస్‌రిపోర్టని ఆయన అభివర్ణించారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మూడేండ్లలో సాధించిన అభివృద్ధిని వివరించారు. తెలంగాణలో 55 శాతం ప్రజలకు జీవనాధారంగా ఉన్న వ్యవసాయాన్ని లాభసాటిగా చేసేందుకు సీఎం కేసీఆర్ సారథ్యంలో అనేక ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నారని అన్నారు. మిషన్ కాకతీయ ద్వారా కాకతీయ, అసఫ్‌జాహి కాలంనాటి వేల చెరువులు నీటితో కళకళలాడుతున్నాయని, భూగర్భ జలాలు పెరుగుతున్నాయని శాస్త్రజ్ఞులు చెప్తున్నారని పేర్కొన్నారు. గతంలో కన్నా అదనంగా 8 లక్షల ఎకరాల భూమి సాగులోకి వచ్చిందని, ప్రపంచంలోని చాలా వ్యవసాయ దేశాల రీసెర్చ్ స్కాలర్స్ మిషన్ కాకతీయపై పరిశోధనలు చేస్తున్నారని పల్లా చెప్పారు. 2014లో అధికారంలోకి వచ్చిన ఆరుమాసాలలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ దీక్షాదక్షతలతో విద్యుత్తు సమస్యలను పూర్తిగా పరిష్కరించుకోగలిగామని గుర్తుచేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవసాయరంగంలో చేస్తున్న సంస్కరణలను స్వామినాథన్ వంటి నిపుణులు కూడా ప్రశంసిస్తున్నారని చెప్పారు.

అసాధ్యాలను సుసాధ్యం చేసిన సీఎం కేసీఆర్: నారదాసు లక్ష్మణరావు



అధికారం అంటే ఒక లక్ష్యాన్ని సాధించడమేనని నారదాసు లక్ష్మణరావు పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ తెలంగాణ ప్రభుత్వ లక్ష్యాలను సాధించే దిశలో అసాధ్యాలన్నింటినీ సుసాధ్యాలు చేశారని అన్నారు. ఇదివరలో యథారాజా తథాప్రజా అనే నానుడి ఉండేదని, తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ నానుడి యథాప్రజా తథారాజా అనేవిధంగా మారిందన్నారు. కాళేశ్వరం అనే అసాధ్యమైన ప్రాజెక్ట్‌ను నిర్దిష్ట లక్ష్యాలతో పూర్తిచేస్తూ భారత దేశంలోనే కేసీఆర్ ఒక మహోన్నత వ్యక్తిగా నిలిచారని నారదాసు పేర్కొన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ఆయన సోదాహరణంగా మాట్లాడారు.


మంగళవారం ప్రగతిభవన్‌లో రాజ్యసభ అభ్యర్థి జోగినిపల్లి సంతోష్‌కుమార్‌ను అభినందిస్తున్న ప్రభుత్వ సలహాదారు వివేక్, తెలంగాణ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ రామ్మోహన్‌రావు

రోడ్డుభద్రతపై మోడల్ కారిడార్ సిద్ధం

- హైదరాబాద్- బీజాపూర్ రోడ్డు ఎంపిక
- రూ.20 కోట్ల వ్యయంతో అమలు
- ఆర్అండ్‌బీ, రవాణా, పోలీస్, విద్యా, వైద్యశాఖ అధికారుల ద్వారా సంయుక్త కార్యాచరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నిత్యం అమాయకుల ప్రాణాలు బలిగొంటున్న రోడ్డు ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నది. రోడ్డు ప్రమాదాల నివారణకు రోడ్డుభద్రత డెమోకారిడార్‌గా హైదరాబాద్- బీజాపూర్ రోడ్డును ఎంపిక చేసింది. ఈ ప్రాజెక్టును ప్రపంచ బ్యాంకు నిధులతో చేపడుతున్నది. మొత్తం 120 కిలోమీటర్ల రోడ్డుకు రూ. 20 కోట్ల అంచనా వ్యయంతో రోల్‌మోడల్‌గా చేయదలుచుకున్నది. రోడ్డు ప్రమాదాల నివారణకు ఉమ్మడిగా పలు ప్రభుత్వ శాఖలు కలిసి ప్రణాళికను అమలుచేసి ప్రమాదాలను తగ్గించేందుకు చర్యలు చేపడుతున్నాయి. ఈ క్రమంలోనే రాష్ట్ర రవాణా, ఆర్అండ్‌బీ, పోలీస్, విద్యా, వైద్యశాఖలకు చెందిన 10 మంది అధికారులు ఉమ్మడి సమీక్షలు నిర్వహించి ప్రమాదాలను తగ్గించేందుకు కార్యాచరణను చేపడుతున్నారు. రోల్ మోడల్ రహదారికి మూడు అంబులెన్స్‌లు, రెండు ప్యాట్రోలింగ్ వ్యాన్స్, పోలీస్ అవుట్‌పోస్టు, రెండు ట్రామా కేర్ సెంటర్లు, భారీ క్రేన్లు, స్పీడ్ లేజర్‌గన్స్ వంటివి ఏర్పాటు చేసేందుకు సర్వం సిద్ధమైంది. ఇండియన్ ట్రాన్స్‌పోర్టు స్పెషలిస్టు శ్రీకుమార్, రవాణాశాఖ నుంచి జేటీసీ రమేశ్, పోలీస్ శాఖ నుంచి రోడ్‌సేఫ్టీ అథారిటీ డీజీ, ఆర్ అండ్ బీ నుంచి ఈఎన్సీ రవీందర్‌రావు, మెడికల్ డిపార్టుమెంటు నుంచి ప్రతినిధులు క్రమం తప్పకుండా రోడ్డు ప్రమాదాలపై సమీక్షలు చేస్తూ నివారణ చర్యలపై పలు సూచనలు సలహాలు ఇస్తున్నారు. ప్రమాదాల నివారణకు ఈ బహుశాఖలబద్ధంగా ప్రధానంగా రోడ్డు భద్రతకు వివిధరకాల చర్యలు చేపడుతారు. సరైన రోడ్డుమార్గ నిర్వహణ, వాహనాల వేగ నియంత్రణ, మద్యంసేవించి వాహనాలు నడపడాన్ని నిరోధించడం, ప్రమాదాలు జరిగిన వెంటనే వైద్య సదుపాయం అందించేందుకు ముందస్తు ఏర్పాట్లు వంటివి చేపట్టాలని నిర్ణయించారు. రోల్‌మోడల్‌గా ఎంపిక చేసిన ఈ రోడ్డులో చేపట్టే కార్యక్రమాలు మంచి ఫలితాలను ఇస్తే, రాష్ట్రంలోని అన్ని రోడ్లకు వర్తింపజేయాలని నిర్ణయంతో అధికారులు ముందుకు సాగుతున్నారు.

నేడు కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ భేటీ

సాగర్ ఎండీడీఎల్ దిగువన వాడకాన్ని వ్యతిరేకిస్తున్న తెలంగాణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కృష్ణానదీ యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ బుధవారం సమావేశం కానున్నది. శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లో ఎండీడీఎల్ దిగువన నీటి వాడకంపై ఏపీ పట్టుబడుతుండటం.. ఎలాగైనా ఏపీకి అనుకూల నిర్ణయం జరిగేలా కృష్ణాబోర్డు నానా తిప్పలు పడటం.. శ్రీశైలంలో ఎన్ని నీళ్లు వాడుకున్నా సరే! సాగర్‌లో మాత్రం అంగీకరించేది లేదని తెలంగాణ తేల్చి చెప్పిన నేపథ్యంలో బుధవారం త్రిసభ్య కమిటీ సమావేశానికి ప్రాధాన్యం ఏర్పడింది. జలసౌధలో మధ్యాహ్నం మూడు గంటలకు జరుగనున్న ఈ సమావేశానికి బోర్డు సభ్య కార్యదర్శి, రెండు రాష్ట్రాల ఈఎన్సీలతోపాటు అధికారులు పాల్గొననున్నారు. సరిగా ఈ సమావేశానికి 24 గంటల ముందు మంగళవారం నాడు ఆంధ్రప్రదేశ్ హడావుడిగా బోర్డుకు ఇండెంట్ సమర్పించడం గమనార్హం. వాస్తవంగా సాగర్ ఎండీడీఎల్ దిగువన నీటి వాడకాన్ని తెలంగాణ వ్యతిరేకిస్తుండగా.. అదేరోజు గతంలోనే అంగీకారం జరిగినట్లుగా ఏపీ ఈఎన్సీ మరో అబద్ధాన్ని తన లేఖలో ప్రస్తావించారు. ఈ క్రమంలో రెండు జలాశయాల్లో ఎండీడీఎల్ దిగువన ఏపీకి 30.38 టీఎంసీలు, తెలంగాణకు 46 టీఎంసీల వాటాకు అంగీకారం జరిగిందని పేర్కొన్నారు. అంతేకాదు.. తమ వాటా ఉన్న నీటి పరిమాణం సరిపోదని, అదనంగా సాగర్ కుడి కాల్వ కింద 7.5 టీఎంసీలు, కృష్ణా డెల్టా కింద 4.5 టీఎంసీలు కావాలంటూ లేఖ ద్వారా ఇండెంట్ సమర్పించారు.

ఎన్నికల బడ్జెట్ కాదు మాది ప్రజా బడ్జెట్

- వ్యవసాయం, అనుబంధ రంగాలకు అధిక కేటాయింపులు
- సంక్షేమం మా ప్రాధాన్యం.. పరిమితికి లోబడే అప్పులు
- 'నమస్తే తెలంగాణ'తో ఆర్థికమంత్రి ఈటల రాజేందర్

(ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ)

శాసనసభలో గురువారం(ఈ నెల 15న) ప్రవేశపెట్టబోయే ఐదో వార్షిక బడ్జెట్ పూర్తిగా ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేవిధంగా ఉంటుందని ఆర్థికమంత్రి ఈటల రాజేందర్ తెలిపారు. బడ్జెట్‌లో వ్యవసాయరంగానికి అత్యధిక ప్రాధాన్యమిస్తున్నట్లు వెల్లడించారు. ఎప్పటిలాగే సంక్షేమ కార్యక్రమాలకు పెద్దపీట వేస్తామని తెలిపారు. రాష్ట్ర బడ్జెట్ దేశానికే ఒక నమూనాగా మారిందని చెప్పారు. శాసనసభలో బడ్జెట్ ప్రవేశపెడుతున్న నేపథ్యంలో మంత్రి ఈటల రాజేందర్ 'నమస్తేతెలంగాణ'కు ఇచ్చిన ఇంటర్వ్యూలోని ముఖ్యాంశాలు:

ప్రశ్న: ఆర్థికమంత్రిగా వరుసగా మీరు ఐదోసారి శాసనసభలో బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్నారు. దీనిని మీరు ఏ విధంగా భావిస్తున్నారు?..

జవాబు: ఆర్థికమంత్రిగా కాకుండా తెలంగాణ పౌరునిగా చాలా గర్వపడుతున్నా. 'అసలు తెలంగాణవాళ్లకు పరిపాలన రాదు. వాళ్లకేం తెలుసు. ఘోరంగా దెబ్బతింటారు' అన్నవాళ్ల నోళ్లకు తాళాలు వేయగలిగాం. తెలంగాణ రాష్ట్రం మనగలుగుతుందా అన్న అనుమానాలను పటాపంచలు చేసి, ఇదీ మా తెలంగాణ అని చూపించగలిగాం. దేశమంతా తెలంగాణ వైపు చూడటానికి ఆర్థిక ఎదుగుదలే కారణం. కొత్తగా ఏర్పడిన రాష్ట్రంలో ఇంత ఎదుగుదల ఉం టుందా.. అని ఆశ్చర్యపోయే పరిస్థితిని మెరుగుపరిచాం. ఒక రాష్ట్రం బాగుపడాలన్నా, ఆర్థికంగా ఎదుగాలన్నా పాలకులకు విజన్, దృఢసంకల్పం, రాజకీయ అవగాహన, పాలనాదక్షత అవసరం. ఉద్యమం నుంచి వచ్చిన మా ప్రభుత్వం క్షేత్రస్థాయిలో ప్రజల అవసరాలను గుర్తించగలిగింది. ప్రజ ల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా కార్యక్రమాలను చేపట్టింది. తెలంగాణ రాష్ట్రాన్ని బలహీనపరచడానికి చంద్రబాబువంటి వారెందరో కుట్రలు చేశారు. కానీ కుట్రలను ఛేదించి, ఆటంకాలను అధిగమించి గిదీ మా తెలంగాణ అని ప్రపంచానికి చూపగలిగాం. శాంతిభద్రతలను కాపాడి మంచి వాతావరణం ఉన్న రాష్ట్రంగా తీర్చిదిద్దగలిగాం. అతి తక్కువ కాలంలోనే పెట్టుబడులు పెరిగి అభివృద్ధి జరిగి ఆర్థికపరంగా దేశానికే ఒక నమూనాగా మారాం. ఈ పరిస్థితులలో ఐదోసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం నాకు ఆనందంగా ఉంది.



ప్ర: చివరి బడ్జెట్ ప్రజాకర్షకంగా ఉంటుందా.. ఎన్నికల ప్రభావం ఉండే అవకాశముందా?..

జ: ఎన్నికలున్నా లేకపోయినా బడ్జెట్ తీరు మారదు. మాది ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే బడ్జెట్. దీనికి మేం 2014లోనే గట్టి పునాది వేసుకున్నాం. మొదటినుంచీ ప్రజల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి, సాగునీటి రంగాలకు ప్రాధాన్యమిస్తూ పక్కాగా బడ్జెట్‌కు రూపమిస్తున్నాం. ఎన్నికల మ్యానిఫెస్టోలో కూడా పొందుపరచని ఎన్నో పథకాలను, కార్యక్రమాలను బడ్జెట్‌లో ప్రవేశపెట్టాం. ప్రజల అవసరాలకు ప్రతిబింబంగా మా బడ్జెట్ ఉంటుంది. ఎన్నికలు వస్తున్నాయని ప్రజలను ఆకర్షించడానికి ప్రత్యేక మార్పులు చేయాల్సిన అవసరం మాకు లేదు. మా బడ్జెట్ ఈసారి కూడా పూర్తిగా ప్రజల అవసరాల ప్రాతిపదికనే ఉంటుంది.

ప్ర: బడ్జెట్‌లో ఏయే రంగాలకు అధిక ప్రాధాన్యం ఉంటుంది?

జ: వ్యవసాయరంగానికి ఎక్కువ ప్రాధాన్యం. గ్రామీణ ఆర్థికవ్యవస్థను బలోపేతం చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఎక్కువ మంది ఆధారపడే వ్యవసాయం, అనుబంధరంగాలపై దృష్టి కేంద్రీకృతమవుతున్నది. సంక్షేమానికి ఎప్పటిలాగే పెద్ద పీట వేస్తాం.

ప్ర: రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తి (జీఎస్డీపీ) అనూహ్యంగా పెరిగినా వ్యవసాయ జీడీపీ ఇంకా తక్కువగానే ఉండటానికి కారణం?

జ: ప్రభుత్వ చర్యలతో సంపద బాగా పెరిగింది. జాతీయ సంపదగానీ రాష్ట్ర సంపదగానీ ఎంత ఉందనేది కాదు. అది ఎవరి వద్ద కేంద్రీకృతమైంది.. ఎంతమంది చేతుల్లో ఉందనేది ప్రధానం. వ్యవసాయం ద్వారా వచ్చే ఆదాయం ప్రత్యక్షంగా ప్రజల చేతుల్లో ఉందనే విషయాన్ని ప్రభుత్వం గుర్తించింది. గత పాలకులు వ్యవసాయరంగాన్ని విస్మరించారు. మా ప్రభుత్వం వ్యవసాయ ఆదాయాన్ని పెంచడానికి నిర్దిష్ట చర్యలు తీసుకునే దిశలో అడుగులు వేస్తున్నది. ఇందులో భాగంగానే రుణమాఫీని పూర్తిచేశాం. పంటలకు ఆర్థికసహాయం అందించే కార్యక్రమాన్ని చేపట్టాం. వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరాతోపాటు మిషన్ కాకతీయ చేపట్టాం. కాళేశ్వరం, సీతారామ వంటి భారీ ప్రాజెక్టులకు చేపట్టాం. వ్యవసాయ అనుబంధంగా గొర్రెల పంపిణీ, చేపపిల్లల పెంపకం వంటి అనేక కార్యక్రమాలను చేపడుతున్నాం. ఇవన్నీ కూడా వ్యవసాయ జీడీపీని పెంచడానికి దోహదపడుతాయి. త్వరలో రైతుల ఆదాయం, వ్యవసాయ సంపద పెరుగుతుంది.

ప్ర: జీఎస్టీ, పెద్దనోట్ల రద్దు ప్రభావం రాబడులపై ఎంతవరకుంది?

జ: జీఎస్టీ చట్టం అమలులోకి వచ్చిన తర్వాత కొంత రాబడి తగ్గింది. వ్యాట్ అమలులో ఉన్నప్పుడు రాబడి భారీగా ఉండగా జీఎస్టీ అమలులోకి వచ్చిన తర్వాత కొన్ని నెలలు ఒడిదుడుకులను ఎదుర్కోవాల్సి వచ్చింది. ఇప్పుడు పరిస్థితి చక్కబడింది. ఆబ్కారీ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ ఇతర రాబడులు భారీగా పెరిగాయి. మొత్తంగా సొంత రాబడుల్లో 17 నుంచి 19 శాతం వరకు వృద్ధి నమోదైంది.

ప్ర: పెరిగిన ఆదాయం కంటే భారీస్థాయిలో అప్పులు చేస్తున్నట్లు ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.. ఇందులో ఎంత నిజముంది?..

జ: దీనిలో నిజం లేదు. ప్రజల అవసరాలను తీర్చడానికి, సంపదను పెంచడానికి కొన్ని అప్పులు చేయాల్సి ఉంటుంది. అది సాధారణం. పరిమితులకు లోబడే రుణాలను తీసుకుంటున్నాం. రాష్ట్ర జీఎస్డీపీ, రెవెన్యూ రాబడులు, వడ్డీల చెల్లింపు మొత్తాన్ని పరిగణనలోకి తీసుకొని ఎఫ్ఆర్బీఎం చట్టానికి లోబడే అప్పులు ఇస్తారు. రెవెన్యూ మిగులు ఉన్న రాష్ట్రాలకు ప్రాధాన్యం ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వాలు చేసే అప్పులు జీఎస్డీపీలో 25 శాతం దాటరాదు. ఈ లెక్కన మనకు రెండు లక్షల కోట్ల వరకు అప్పులు తెచ్చుకునే ఆస్కారముంది. ఇక అప్పులపై వడ్డీల చెల్లింపు రెవెన్యూ రాబడులలో 10 శాతం మించి ఉండరాదు. తెలంగాణ ప్రభుత్వం ఈ పరిమితికి లోబడే అప్పులు చేసిందే తప్ప ఎక్కడా పరిధి దాటలేదు.

ప్ర: ఈసారి కేంద్రం నుంచి సహకారం లభిస్తుందని భావిస్తున్నారా?

జ: కేంద్రం నుంచి ఆశించిన సహకారం రావడం లేదు. కొత్తగా ఏర్పాటైన రాష్ట్రాలకు కొన్ని ప్రత్యేక రాయితీలుండాలి. కానీ మనకు కూడా ఇతర రాష్ట్రాలకు మాదిరిగానే కేంద్ర పన్నులలో వాటా, కేంద్ర ప్రాయోజిత పథకాల నిధుల విడుదల తప్ప ప్రత్యేక సాయం ఏమీ లేదు. నాలుగేండ్లుగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను గమనిస్తే ఈసారి సహకారం ఉంటుందన్న ఆశ లేదు.

ప్ర: ఈసారి బడ్జెట్ ఇదివరకటి కంటే భారీగా ఉంటుందా?

జ: 2017-18తో పోలిస్తే ఈసారి రెవెన్యూ రాబడులు పెరుగవచ్చు. వాస్తవ లెక్కల ఆధారంగా బడ్జెట్ ఉంటుంది. బడ్జెట్ ఎలా ఉంటుందనేది ఈ నెల 15 వరకు వేచిచూడాల్సిందే.

9 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు మృతి

మొదటిపేజీ తరువాయి...


ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాలోని కిష్టారం సమీపంలో మావోయిస్టుల దాడిలో చెల్లాచెదురుగా పడి ఉన్న జవాన్ల మృతదేహాలు

500 కిలోమీటర్ల దూరంలోని కిష్టారం నుంచి 212 బెటాలియన్ సీఆర్పీఎఫ్ దళాలు పాలోడికి వెళ్తుండగా మంగళవారం మధ్యాహ్నం పన్నెండున్నర గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఐదు కిలోమీటర్ల మేర నిర్మాణంలో ఉన్న రోడ్డుపై వాహనాల శ్రేణి ప్రయాణిస్తుండగా రెండో వాహనం ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజెస్(ఐఈడీ)ల పేలుడుకు గురైంది. మృతిచెందిన జవాన్ల మృతదేహాలను కిష్టారం బేస్ క్యాంప్‌కు తరలించారు. గాయాలైన ఇద్దరు జవాన్లను రాయ్‌పూర్ వైద్యశాలకు తరలించారు. మృతుల్లో ఏఎస్సై రామకృష్ణాసింగ్ తోమర్, హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణ్, కానిస్టేబుళ్లు అజయ్ కుమార్ యాదవ్, మనోరంజన్ లెంకా, జితేంద్రసింగ్, శోభిత్‌కుమార్‌శర్మ, మనోజ్‌కుమార్‌సింగ్, ధర్మేంద్రయాదవ్, హెచ్‌ఎస్ చంద్ర ఉన్నారు. మదన్‌కుమార్, రాజేశ్ కుమార్ గాయపడ్డారు. మావోయిస్టు కమాండర్ హిద్మా, ఆయన నేతృత్వంలోని పీఎల్జీఏ బెటాలియన్ నంబర్ వన్ ఈ దాడికి కారణం కావచ్చునని అభిప్రాయపడుతున్నారు. ఈ ఘటన నేపథ్యంలో తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ పోలీస్ అధికారులు సరిహద్దుల్లో హై అలర్ట్ ప్రకటించారు. సరిహద్దు ప్రాంతాల్లోని దండకారణ్యంలో భారీగా అదనపు బలగాలను మోహరించి మావోయిస్టుల కోసం జల్లెడపడుతున్నారు. జిల్లా సరిహద్దుల్లో ఇప్పటికే అప్రమత్తమయ్యామని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ అంబర్ కిశోర్ ఝా 'నమస్తే తెలంగాణ'కు చెప్పారు. ఏజెన్సీల్లోని అన్ని ప్రాంతాల్లో ప్రధాన రహదారులు, కూడళ్లలో పోలీస్ అధికారులు వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. మార్చి రెండో తేదీన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం పూజారి కాంకేర్ వద్ద ఎన్‌కౌంటర్‌లో పది మంది మావోయిస్టులు మృతిచెందిన విషయం తెలిసిందే.

ఉదయం ఓ ఎన్‌కౌంటర్: మంగళవారం మధ్యాహ్నం దాడికి ముందు.. ఉదయం ఎనిమిది గంటల సమయంలో కూంబింగ్ చేస్తున్న కోబ్రా బలగాలు, మావోయిస్టుల కదలికలను గుర్తించాయి. మావోయిస్టులు కాల్పులు ప్రారంభించగా కోబ్రా బలగాలు తిప్పికొట్టాయని అధికారులు వెల్లడించారు. తర్వాత మోటర్‌సైకిళ్ల కాన్వాయ్, రెండు మైన్ ప్రూఫ్ వాహనా(ఎంపీవీ)లపై సీఆర్పీఎఫ్ జవాన్లు కిష్టారం నుంచి పాలోడి వెళుతుండగా దాడి జరిగింది. రెండో వాహనం పేలుడు బారిన పడిందని ఉన్నతాధికారి 'పీటీఐ' వార్తాసంస్థకు చెప్పారు. మందుపాతరలను తట్టుకునే వాహనమైనప్పటికీ భారీస్థాయి పేలుడు తీవ్రతకు ధ్వంసమైపోయింది. దాడిలో 50 కిలోలకుపైగా పేలుడు పదార్థాలను ఉపయోగించినట్లు భావిస్తున్నారు.

సీఆర్పీఎఫ్ చీఫ్ తిరిగి వెళ్లిన వెంటనే..

ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల అణచివేతకు కేంద్ర రిజర్వు పోలీసు బలగాలను వినియోగిస్తున్నందున పరిస్థితులను పర్యవేక్షించేందుకు సీఆర్పీఎఫ్ డైరెక్టర్ జనరల్ ఆర్ఆర్ భట్నాగర్ ఆ ప్రాంతాలను సందర్శిస్తున్నారు. తాజాగా మరోసారి పర్యటనకు వచ్చిన ఆయన మంగళవారం ఉదయమే ఛత్తీస్‌గఢ్ నుంచి తిరిగివెళ్లారు. పాలోడిలో మంగళవారం సుక్మా జిల్లా సూపరింటెండెంట్ అభిషేక్‌మీనా కూడా పర్యటించాల్సి ఉంది. ఈ నేపథ్యంలోనే కిష్టారం నుంచి పాలోడి వైపు గాలింపు చర్యలను తీవ్రం చేసినట్టు సీఆర్పీఎఫ్ సీనియర్ అధికారి తెలిపారు.

కేంద్ర మంత్రి, పలువురి ఖండన

ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో మావోయిస్టుల దాడి ఘటనను కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ తీవ్రంగా ఖండించారు. ప్రాణాలు కోల్పోయిన సీఆర్పీఎఫ్ సిబ్బంది కుటుంబాలకు సంతాపం తెలిపారు. ఈ ఘటన తనకు తీవ్రంగా బాధ కలిగించిందని పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి రమణ్‌సింగ్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. జవాన్లకు చికిత్స జరుగుతున్నదని, ఘటనకు బాధ్యులను పట్టుకునేందుకు గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని రమణ్‌సింగ్ తెలిపారు. వాస్తవ పరిస్థితిని సమీక్షించేందుకు ఛత్తీస్‌గఢ్‌కు వెళ్లాల్సిందిగా సీఆర్పీఎఫ్ డైరెక్టర్ జనరల్ ఆర్ఆర్ భట్నాగర్‌ను, కేంద్ర హోంశాఖ సహాయమంత్రి హన్స్‌రాజ్ అహిర్‌ను రాజ్‌నాథ్‌సింగ్ ఆదేశించారు. దాడిని ఛత్తీస్‌గఢ్ రమణ్‌సింగ్ తీవ్రంగా ఖండించారు. ఇది పిరికి, సిగ్గుచేటయిన చర్య అని వ్యాఖ్యానించారు. అభివృద్ధి పనుల వల్ల కార్యకలాపాలు అంతమవుతాయనే భయంతోనే మావోయిస్టులు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. విధులు నిర్వహిస్తూ ప్రాణాలను త్యాగం చేసిన భద్రతాసిబ్బంది అమరత్వం ఎప్పటికీ గుర్తుండిపోతుందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దాడిలో మరణించిన సీఆర్పీఎఫ్ సిబ్బంది కుటుంబాలకు బెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ సంతాపం తెలిపారు.

కేంద్ర విధానం లోపమే: కాంగ్రెస్

జాతీయ భద్రత విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న గురిలేని విధానం సత్ఫలితాలను సాధించలేకపోతున్నదని కాంగ్రెస్ విమర్శించింది. నక్సలిజం నిర్మూలనపై ప్రభుత్వ బోలు వాదనలను తాజా మావోయిస్టు దాడి ఎండగట్టినయిందని వ్యాఖ్యానించింది. ఈ దాడి మతిలేని, విచక్షణారహిత చర్య అని ఖండిస్తూ, బాధితు కుటుంబాలకు సంఘీభావం ప్రకటించింది. ఈ ఘటనపై కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ఇంచార్జి రణ్‌దీప్ సుర్జేవాలా సుదీర్ఘ ప్రకటన విడుదల చేశారు.

సిరిసిల్లలో అపారెల్ సూపర్ హబ్

తెలంగాణ ప్రభుత్వంతో కే వెంచర్స్ ఒప్పందం


సిరిసిల్లలో అపారెల్ హబ్ ఏర్పాటుపై మంగళవారం సచివాలయంలో ఒప్పంద పత్రాలు మార్చుకున్న తర్వాత మీడియాతో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో చేనేత శాఖ డైరెక్టర్ శైలజారామయ్యర్, కే వెంచర్స్ సంస్థ ప్రతినిధులు కూడా ఉన్నారు.

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ నేతన్నల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కృషిచేస్తున్న ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. టెక్స్‌టైల్ రంగంలో దేశంలోనే పేరెన్నికగన్న కే వెంచర్స్ సంస్థ సిరిసిల్లలో అపారెల్ సూపర్ హబ్ ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వంతో జట్టు కట్టింది. రాష్ట్ర చేనేత శాఖ మంత్రి కేటీఆర్ సమక్షంలో చేనేతశాఖ డైరెక్టర్ శైలజా రామయ్యర్, కే వెంచర్స్ ప్రతినిధులు మంగళవారం సచివాలయంలో ఒప్పందపత్రాలు మార్చుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ సిరిసిల్ల నేతన్నల జీవనచిత్రాన్ని మార్చే కీలక ముందడుగు ఈ హబ్ ఏర్పాటన్నారు.'రాష్ట్రంలో నేతన్నల జీవితాలు మార్చేందుకు అనేక నిర్ణయాలు తీసుకుంటున్నాం. సీఎం కేసీఆర్ గత ఏడాది బడ్జెట్‌లో రూ.1200 కోట్లు వారికోసం కేటాయించారు. దేశంలోనే అతిపెద్ద టెక్స్‌టైల్ పార్క్‌ను వరంగల్‌లో తీర్చిదిద్దుతున్నాం. మౌలిక సదుపాయాలు అందిస్తున్న సమయంలోనే 22 దేశీయ, అంతర్జాతీయ సంస్థలు ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. కొరియాకు చెందిన యంగ్‌వాన్ సంస్థ 8 ఫ్యాక్టరీలు ఏర్పాటు చేసేందుకు సిద్ధమైంది. ఈ ఒక్క సంస్థలోనే 8 నుంచి 10 వేల మందికి ఉపాధి దక్కనుంది. గద్వాలలో హ్యాండ్‌లూమ్ పార్క్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశాం. నారాయణపేట, సిద్దిపేట, జమ్మికుంట, దుబ్బాక, పోచంపల్లిలోని చేనేత కార్మికుల జీవితాల్లో మార్పులు తెచ్చేందుకు ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయి. నేతన్నలకు ప్రభుత్వం నేరుగా పని కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. బతుకమ్మ చీరలు, యూనిఫాంల తయారీని అప్పగించాం. గతంలో 8 నుంచి పదివేలు మాత్రమే సంపాదించేవారు. ఇప్పుడు దంపతులకు నెలకు 15వేల నుంచి 20వేలు వస్తున్నాయి' అని వివరించారు. 'ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు తమిళనాడుకు అధ్యయనం కోసం వెళ్లాం. సిరిసిల్లలో రూ.10వేల కోట్ల ఎగుమతులు ఉంటే.. తిరుపూర్‌లో రూ.36వేల కోట్లుగా ఉంది. ముడి సరుకు నుంచి దుస్తుల ఉత్పత్తి వరకు అపారెల్ వైపు మరలిన తీరును గమనించాం. కే వెంచర్స్ సంస్థతో చర్చలు జరిపి సూపర్‌హబ్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నాం. కే వెంచర్స్ వందకోట్ల పెట్టుబడితో మూడు దశల్లో కార్యకలాపాలు చేయనుంది. 15,000 ప్రత్యక్ష ఉద్యోగాలు దక్కనున్నాయి. ఇందులో 90%మహిళలే. 15,000 పరోక్ష ఉద్యోగాలు. సిరిసిల్ల మొత్తం జనాభా 70,000 అయితే దాదాపు సగం జనాభా జీవన విధానంలో గుణాత్మక మార్పులు రానున్నాయి. సిరిసిల్లలో 60 ఎకరాల టెక్స్‌టైల్ పార్క్‌లో అపారెల్ సూపర్‌హబ్‌ను 20 ఎకరాల్లో ఏర్పాటుచేస్తాం. సిరిసిల్లలోని అన్ని చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ఒక వేదిక సృష్టించడం. వారికి ఉపాధి కల్పించడం. సంస్థ కల్పించే అధునాతన యంత్రాల ద్వారా వారిలో మార్పు తీసుకురావడమే మా లక్ష్యాలు. ఇక ఫ్యాషన్ ట్రెండ్స్‌ను గమనంలోకి తీసుకుంటూ గుండ్లపోచంపల్లిలోని 120 ఎకరాల్లో టెక్స్‌టైల్ కార్యకలాపాలు సాగనున్నాయి. ఇప్పటికే కొరియా సంస్థ ఆసక్తి తెలిపింది. బహుముఖ లక్ష్యాలతో తెలంగాణలోని కేంద్రాలు తిరుపూర్ స్థాయికి ఎదుగాలి. చేనేతలో టెక్నాలజీ అంశాల ను పరిగణనలోకి తీసుకుంటున్నాం. ఆసుయంత్రం రూపొందించిన పద్మశ్రీ చింతకింది మల్లేశంకు రూ.కోటి ఇచ్చాం. ఆవిష్కర్తలను ప్రోత్సహించడానికి సిద్ధంగా ఉన్నాం. నిఫ్ట్ డైరెక్టర్ రాజారాంను గుండ్లపోచంపల్లి అపారెల్ పార్క్ సీఈవోగా నియమించాం'అని మంత్రి కేటీఆర్ తెలిపారు. కే వెంచర్స్ సంస్థ సీఈవో ఎస్ సుదీంద్రన్ మాట్లాడుతూ తెలంగాణలో కంపెనీ ఏర్పాటుచేయడంపై సంతోషం వ్యక్తంచేశారు. 'తమిళనాడుకు అధ్యయనం కోసం వచ్చిన సమయంలో తెలంగాణకు ఆహ్వానించారు. ఇక్కడకు వచ్చాక సొంతరాష్ట్రంలో ఉన్న భావన కలిగింది. సిరిసిల్ల జిల్లా పెద్దూరులో మూడుదశల్లో ఈ హబ్ నిర్మాణం జరుగుతుంది. తొలిదశలో 500 మెషీన్లతో 3000 మందికి ఉపాధి కల్పించేందుకు సిద్ధమయ్యాం. రెండోదశలో ఎస్ఎంఈలకు ఉపాధి కల్పిస్తాం. అగ్రిగేట్ కన్సాలిడేట్ ఇంటిగ్రేట్ విధానంలో రూపొందుతున్న ఈ హబ్ దేశంలోనే మొదటిది. కంపెనీ ఏర్పాటు చర్చలు మొదలైన క్షణం నుంచి మంత్రి కేటీఆర్ స్పీడ్‌ను చూసి ఆశ్చర్యపోయాం. అదే వేగాన్ని అందుకోవాలని కార్యకలాపాలు కొనసాగిస్తున్నాం' అని వివరించారు.


మంగళవారం సచివాలయంనుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో కాన్ఫరెన్స్ నిర్వహించిన పురపాలక శాఖమంత్రి కేటీఆర్

పట్టణాలకు అదనపు నిధులు

- కలెక్టర్లు, జేసీలు ఒక్కో పట్టణాన్ని దత్తత తీసుకోవాలి
- వీడియోకాన్ఫరెన్స్‌లో పురపాలకశాఖ మంత్రి కేటీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని పట్టణాల పురోగతికి టీయూఎఫ్ఐడీసీ (తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) ద్వారా అదనంగా నిధులు కేటాయిస్తామని ఐటీ, పురపాలకశాఖ మంత్రి కే తారకరామారావు తెలిపారు. మంగళవారం సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. రాష్ట్రంలో సుమారు 39 శాతం జనాభా పట్టణాల్లో ఉన్నదని, త్వరలో ఏర్పాటయ్యే కొత్త మున్సిపాలిటీలతో 45 శాతానికి పెరుగుతుందని చెప్పారు. పక్కా ప్రణాళికతో పట్టణాలను అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తున్నదని తెలిపారు. కొత్త జిల్లా కేంద్రాలు, పట్టణాల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేపట్టాలని కలెక్టర్లకు సూచించారు. ఆర్థిక సంఘంతో పాటు వివిధ మార్గాల్లో వచ్చే నిధులకు అదనంగా టీయూఎఫ్ఐడీసీ నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. ఈ నిధులను గడువులోగా ఖర్చయ్యేలా పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. పట్టణాభివృద్ధిలో సిద్దిపేటను రోల్ మోడల్‌గా తీసుకోవాలని సూచించారు. జంక్షన్ టు జంక్షన్ రోడ్ల అభివృద్ధి, మోడల్ మార్కెట్లు, ఫుట్‌పాత్‌లు, బస్‌బే, మురుగుకాల్వలు, శ్మశానవాటికలు, పార్కుల అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని, ఇవి పూర్తయితే గుణాత్మక మార్పు వస్తుందని వివరించారు. కలెక్టర్లు, జేసీలు ఒక్కో పట్టణాన్ని దత్తత తీసుకోవాలని, అప్పుడు పనులు వేగంగా జరిగే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

ప్రతి పనికి గడువు పెట్టుకోవాలి: టీయూఎఫ్ఐడీసీ పనులను పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్‌శాఖ పర్యవేక్షిస్తుందని మంత్రి కేటీఆర్ చెప్పారు. కలెక్టర్లు, జేసీలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పనులను పర్యవేక్షించాలని సూచించారు. ప్రతివారం పనుల పురోగతిపై సమీక్షలు ఏర్పాటుచేసుకోవాలని ఆదేశించారు. ఇప్పటికే ప్రతి పట్టణంలో మిషన్‌భగీరథ పనులు ప్రారంభమయ్యాయని, త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. సమావేశంలో పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్ కుమార్, టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ విప్లవ్‌కుమార్, మున్సిపల్ శాఖాధికారులు పాల్గొన్నారు.

సుక్మా.. మృత్యువల

సుక్మా.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దక్షిణ ప్రాంతంలోని ఈ జిల్లా ప్రస్తుతం మావోయిస్టు కార్యకలాపాల నిర్వహణకు తిరుగులేని కేంద్ర స్థానాల్లో ఒకటిగా కనిపిస్తున్నది. మావోయిస్టుల అణచివేత కోసం ప్రభుత్వాలు పంపిస్తున్న భద్రతాదళాలకు సుక్మా మృత్యువలగా మారిపోయింది. మావోయిస్టుల ఏరివేత కోసం వెళుతున్న జవాన్లు గత కొన్నేండ్లలో పలు ఎన్‌కౌంటర్లలో, ఆకస్మిక దాడుల్లో ప్రాణాలు కోల్పోయారు. మావోయిస్టులు ఇలాంటి దాడులను ముందస్తు ప్రణాళికతో, ఏమాత్రం విఫలంకాకుండా పకడ్బందీగా అమలుచేస్తారనేది ఇదివరకటి ఘటనలు, అనంతర పరిశోధన నివేదికలను బట్టి స్పష్టమవుతుంది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో గత ఏడాది వ్యవధిలోనే 272 మావోయిస్టు సంబంధిత ఘటనలు చోటుచేసుకున్నాయి. వీటిలో 58 మంది మావోయిస్టులు, అంతే సంఖ్యలో భద్రతాదళాల సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు.

ఏప్రిల్ 24, 2017

సుక్మా జిల్లాలో మావోయిస్టుల దాడిలో 25 మంది సీఆర్పీఎఫ్ సిబ్బంది చనిపోయారు. ఏడుగురు గాయపడ్డారు. ప్రతీకారంగా భద్రతాదళాలు జరిపిన కాల్పుల్లో పదిమందికిపైగా మావోయిస్టులు మరణించారు. ఆ ప్రాంతంలో కొనసాగుతున్న రహదారి నిర్మాణపనులకు రక్షణ కోసం సీఆర్పీఎఫ్ 74వ బెటాలియన్‌కు చెందిన దాదాపు వందమంది వెళుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది.

మార్చి 11, 2017

రోడ్డు నిర్మాణ సిబ్బందికి రక్షణ కల్పించేందుకు వంద మందికి పైగా సీఆర్పీఎఫ్ సిబ్బంది వెళుతుండగా మావోయిస్టులు దాడి చేశారు. ఈ ఘటనలో 12 మంది ప్రాణాలు కోల్పోయారు. మావోయిస్టులు భారీస్థాయిలో కాల్పులు జరుపుతుండగా కేంద్ర రిజర్వు దళాలు రక్షణకోసం ప్రయత్నించాయి. ఆ సమయంలో మావోయిస్టులు ఐఈడీలను ఉపయోగించడంతో వరుస పేలుళ్లు సంభవించాయి.

సుక్మా జిల్లాలో గత కొన్నేండ్లలో మావోయిస్టు దాడులు ఇవీ..

డిసెంబర్ 1, 2014

సుక్మా జిల్లా కాసల్‌పారా గ్రామ సమీపంలో మావోయిస్టుల ఆకస్మిక దాడిలో ఇద్దరు అధికారులు సహా 14 మంది సీఆర్పీఎఫ్ సిబ్బంది చనిపోయారు. ఆ సందర్భంగా ఆరుగురు మావోయిస్టులు కూడా మరణించినట్లు వార్తలొచ్చాయి.

మార్చి 11, 2014

సుక్మా జిల్లాలో జీరాం ఘాటికి దాదాపు 50 మంది సీఆర్పీఎఫ్, పోలీసులు రెండు ప్లటూన్లుగా వెళుతుండగా దాదాపు వందమంది మావోయిస్టులు చుట్టుముట్టి కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 15 మంది సీఆర్పీఎఫ్ సిబ్బంది, ఒక పౌరుడు ప్రాణాలు కోల్పోయారు.

మే 25, 2013

సుక్మా జిల్లా దర్భా వ్యాలీలో కాంగ్రెస్ నేతల కాన్వాయ్‌పై దాడిలో మాజీ మంత్రి మహేంద్ర కర్మ, ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్ అధ్యక్షుడు నందకుమార్ పటేల్ సహా 27 మంది మరణించారు.



సుక్మా జిల్లా తాడిమెట్ల గ్రామ సమీపంలో 2010 ఏప్రిల్ 6న జరిగిన మావోయిస్టుల దాడి ఇప్పటివరకు అత్యంత భయానకమైనది. ఆ ఘటనలో 75 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు, ఒక పోలీసు కానిస్టేబుల్ మరణించారు. గాయపడిన ఏడుగురిని హెలికాప్టర్ ద్వారా జగదల్‌పుర్‌లోని మహారాణి వైద్యశాలకు తరలించారు.

సెన్సెక్స్	నిఫ్టీ
33,857	10,427
↘ 61	↗ 5

ముడి చమురు (బ్రెంట్) ↘ 64.95 డాలర్లు

బంగారం ధరలు

ముంబై (రూ.లలో)	
24 క్యారెట్లు	30,400
22 క్యారెట్లు	30,250
వెండి (కిలో)	38,345

విదేశీ మారకం

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలర్	59.11	68.54
బహ్రెయిన్ దినార్	160.09	183.46
కువైట్ దినార్	178.88	222.68
సౌదీ రియాల్	15.72	18.62
యూఏఈ దిర్హామ్	16.09	18.81

చికెన్ ధరలు (రూ.లలో)

ఫారం ధర	65.00
రిటైల్ లైవ్	87.00
డ్రెస్డ్	126.00
స్కిన్‌లెస్	144.00

నెక్ (వంద గుడ్లకు) (రూ.లలో)

హైదరాబాద్	330-00
రంగారెడ్డి	330-00
మెదక్	330-00
కరీంనగర్	332-00
వరంగల్	332-00
రిటైల్ ప్రైస్	3-90

పరమ చెత్త పీఎస్‌యూలు

నష్టాల ఊబిలో బీఎస్‌ఎన్‌ఎల్, ఎయిర్ ఇండియా, ఎంటీఎన్‌ఎల్



న్యూఢిల్లీ, మార్చి 13: ప్రభుత్వ రంగ సంస్థ (పీఎస్‌యూ)ల్లో గత ఆర్థిక సంవత్సరం (2016-17) పరమ చెత్త ప్రదర్శనను కనబరిచిన వాటిలో బీఎస్‌ఎన్‌ఎల్, ఎయిర్ ఇండియా, ఎంటీఎన్‌ఎల్‌లు అగ్రస్థానాల్లో నిలిచాయి. ఈ మూడు సంస్థలు అత్యధిక నష్టాలతో నడుస్తున్నాయని మంగళవారం పార్లమెంట్‌కు చేరిన ఓ ప్రభుత్వ అధ్యయనం తెలిపింది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల పనితీరుపై వచ్చిన పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ సర్వే 2016-17లో నష్టాలబారినపడ్డ మొత్తం 82 పీఎస్‌యూల్లో టాప్-10 సంస్థల నష్టాల విలువ 83.82 శాతంగా ఉన్నది. ఇందులో బీఎస్‌ఎన్‌ఎల్, ఎయిర్ ఇండియా, ఎంటీఎన్‌ఎల్ వాటానే 55.66 శాతంగా నమోదు కావడం గమనార్హం. మరోవైపు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన పీఎస్‌యూల్లో మొదటి మూడు స్థానాల్లో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, ఓఎన్‌జీసీ, కోల్ ఇండియాలున్నాయి. టాప్-10 సంస్థల లాభాల్లో ఈ మూడింటి వాటా 53.08 శాతంగా ఉండటం విశేషం. ఇక హిందుస్థాన్ ఫర్టిలైజర్ కార్పొరేషన్, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌ల స్థానంలో హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్, మంగళూర్ రిఫైనరీ, పెట్రోకెమికల్స్ టాప్-10 లాభదాయక సంస్థల జాబితాలోకి వచ్చినట్లు సర్వే వెల్లడించింది. మొత్తం 174 లాభదాయక కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలుండగా, వీటి లాభాల్లో టాప్-10 సంస్థల వాటానే 63.57 శాతం. 2016-17లో నడిచిన మొత్తం 257 పీఎస్‌యూల స్థూల నికర లాభం 11.7 శాతం వృద్ధి చెంది రూ.1,27,602 కోట్లుగా నమోదైంది. 2015-16లో ఇది రూ.1,14,239 కోట్లుగా ఉన్నది.



రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీగా నియమితులైన బీ మనోహర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న సదరన్ ట్రావెల్స్ లిమిటెడ్ జాయింట్ ఎండీ ఏవీ ప్రవీణ్ కుమార్, ఆపరేషన్స్ డైరెక్టర్ రామారావు

ఎల్‌వోయూల జారీపై నిషేధం

పీఎన్‌బీ కుంభకోణం నేపథ్యంలో రిజర్వు బ్యాంకు సంచలన నిర్ణయం

ముంబై, మార్చి 13:

పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ)లో జరిగిన భారీ కుంభకోణంపై రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) కొరడా ఝళిపించింది. దిగుమతులకు సంబంధించిన వ్యాపార రుణాల కోసం బ్యాంకులు ఇకమీదట అండర్‌టేకింగ్ లెటర్లను (ఎల్‌వోయూలను) జారీ చేయకుండా ఆర్బీఐ నిషేధాన్ని విధించింది. ఈ నిషేధం తక్షణమే అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ, ఆయన మామ మెహుల్ చోక్సీ పీఎన్‌బీ అధికారులతో కుమ్మక్కై దాదాపు రూ.13 వేల కోట్లకుపైగా భారీ కుంభకోణంతో ఆ బ్యాంకును నిట్టనిలువునా ముంచిన నేపథ్యంలో రిజర్వు బ్యాంకు ఈ సంచలన నిర్ణయాన్ని తీసుకున్నది. దేశ బ్యాంకింగ్ వ్యవస్థ చరిత్రలోనే అతిపెద్దదైన పీఎన్‌బీ కుంభకోణం ఇటీవల వెలుగులోకి రావడంతో ప్రస్తుతమున్న మార్గదర్శకాలపై విస్తృత సమీక్ష జరిపామని, దిగుమతులకు సంబంధించిన వ్యాపార రుణాల కోసం ఏడీ (ఆథరైజ్డ్ డీలర్) కేటగిరీ-1 బ్యాంకులు ఇకమీదట ఎల్‌వోయూలు, ఎల్‌వోసీలు (కంఫర్ట్ లెటర్లు) జారీ చేయకుండా నిషేధం విధించాలని నిర్ణయించామని, ఈ నిషేధం తక్షణమే అమలులోకి వస్తుందని రిజర్వు బ్యాంకు మంగళవారం ఒక నోటిఫికేషన్‌లో వెల్లడించింది. అయితే దిగుమతులకు సంబంధించిన వ్యాపార రుణాల కోసం నిబంధనలకు లోబడి క్రెడిట్ లెటర్లను, బ్యాంకు గ్యారెంటీలను కొనసాగించవచ్చని ఆర్బీఐ ఆ ప్రకటనలో తెలిపింది. దిగుమతులకు సంబంధించిన బిల్లులను చెల్లించాలన్న సాకుతో నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీ పంజాబ్ నేషనల్ బ్యాంకు నుంచి తప్పుడు అండర్‌టేకింగ్ లెటర్లను పొంది రూ.13,600 కోట్ల భారీ కుంభకోణానికి పాల్పడ్డారు. ఈ కుంభకోణంపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సహా వివిధ సంస్థలు దర్యాప్తు జరుపుతున్నాయి.



నీరవ్ అప్పులను మేమే చెల్లిస్తాం: పీఎన్‌బీ

ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ, ఆయన మామ మెహుల్ చోక్సీకి వివిధ బ్యాంకుల నుంచి వేలాది కోట్ల రూపాయల రుణాలను ఇప్పించి నిట్టనిలువునా మునిగిపోయిన పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) ఇప్పుడు కొన్ని షరతులతో ఆ అప్పులను చెల్లించేందుకు అంగీకరించినట్లు తెలుస్తున్నది. ప్రభుత్వ రంగంలోని అతిపెద్ద బ్యాంకుల్లో రెండవది అయిన పీఎన్‌బీ జనవరిలో ఈ భారీ మోసాన్ని గుర్తించిన విషయం విదితమే. తమ బ్యాంకులోని కొంత మంది ఉద్యోగులు నీరవ్, చోక్సీలతో కుమ్మక్కై వారి సంస్థలకు తప్పుడు అండర్‌టేకింగ్ లెటర్లను (ఎల్‌వోయూలను) జారీ చేశారని, వీటిని ఆసరాగా చేసుకుని ఆ సంస్థలు విదేశాల్లోని వేర్వేరు భారతీయ బ్యాంకు శాఖల నుంచి వేలాది కోట్ల రూపాయల రుణాలను కొల్లగొట్టాయని పేర్కొన్న పీఎన్‌బీ.. ఈ నెల చివరి నాటికి సదరు బ్యాంకుల అప్పులను చెల్లించేందుకు ఒప్పుకున్నదని, అయితే ఈ బ్యాంకుల్లో అక్రమాలు జరిగినట్లు దర్యాప్తు అధికారులు తేల్చినట్లయితే తాము చెల్లించే మొత్తాలను తిరిగి చెల్లించాలని పీఎన్‌బీ షరతు విధించిందని అభిజ్ఞ వర్గాలు వెల్లడించాయి. అయితే దీనిపై పీఎన్‌బీ నుంచి ఇప్పటివరకూ అధికారిక ప్రకటన వెలువడలేదు. పీఎన్‌బీ నుంచి పొందిన తప్పుడు అండర్‌టేకింగ్ లెటర్ల ఆధారంగా నీరవ్, చోక్సీలకు రుణాలిచ్చిన బ్యాంకుల్లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)తో పాటు మరో మూడు ప్రభుత్వ రంగ బ్యాంకులు (యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూకో బ్యాంక్, అలహాబాద్ బ్యాంక్) ఉన్నాయి. ఈ బ్యాంకులకు పీఎన్‌బీ ఈ నెలాఖరు లోగా దాదాపు రూ.6 వేల కోట్లు చెల్లించాల్సి ఉన్నది.

తెరపైకి మరో రూ.6 వేల కోట్ల కుంభకోణం

నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీ, రొటొమాక్ కుంభకోణాలు మరువకముందే రూ.6 వేల కోట్ల పన్ను కుంభకోణం బట్టబయలు అయింది. రిఫైన్డ్ నోబల్ తయారీదారు ఇండియన్ టెక్నోమాక్ కంపెనీ హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి రూ.2,715 కోట్ల పన్ను ఎగవేసింది. 2009లో ప్రారంభమైన ఈ సంస్థ తప్పుడు పత్రాలు చూపించి సేల్స్ ట్యాక్స్ మినహాయింపు పొందింది. ఆ తర్వాత 2014లో ఈ సంస్థ మూతపడింది. అసెంబ్లీ వేదికగా ఈ కుంభకోణాన్ని ఈ రాష్ట్ర సీపీఎం ఎమ్మెల్యే రాకేశ్ సింఘా బహిర్గతం చేశారు. ఈ కుంభకోణానికి సంబంధించి హిమాచల్‌ప్రదేశ్ పోలీసులు ఎఫ్‌ఐఆర్‌ను దాఖలు చేసినట్లు తెలుస్తున్నది. పన్ను మినహాయింపుకోసం సమర్పించిన దొంగ నివేదికలతో పలు బ్యాంకుల వద్ద రూ.4 వేల కోట్లకు పైగా రుణాలు తీసుకున్నట్లు తెలుస్తున్నది. వీటిలో బ్యాంకులకు రూ.3,500 కోట్లు చెల్లించాల్సి ఉండగా, రూ.780 కోట్లు ఐటీ శాఖకు , రూ.15-20 కోట్లు పీఎఫ్ కింద కార్మిక మంత్రిత్వ శాఖకు, విద్యుత్ బిల్లులు చెల్లించాల్సి ఉన్నది. వీటి మొత్తం విలువ రూ.6,475 కోట్లకు పైమాటేనని ఐటీ వర్గాలు వెల్లడించాయి. విచారణలో ఉన్న ఈ కేసుపై త్వరలో నిజాలు వెలుగుచూడనున్నాయని, వాటిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు అందచేయనున్నట్లు ఆ వర్గాలు తెలిపారు.

నీరవ్‌కు 1,213 తప్పుడు ఎల్‌వోయూలు: జైట్లీ

పీఎన్‌బీలో దాదాపు రూ.13 వేల కోట్ల భారీ కుంభకోణానికి పాల్పడిన వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ 2011 మార్చి 10వ తేదీన ముంబైలోని బ్రాడీ హౌస్ పీఎన్‌బీ శాఖలో తొలిసారి తప్పుడు గ్యారెంటీని (అండర్‌టేకింగ్ లెటర్)ను పొందాడు. ఆ తర్వాత నుంచి 74 నెలల వ్యవధిలో ఆయన మరో 1,212 తప్పుడు ఎల్‌వోయూలను పొందాడని, పీఎన్‌బీలోని కొంత మంది ఉద్యోగులతో కుమ్మక్కైన నీరవ్ మోదీ ఒకే రోజు 5 తప్పుడు ఎల్‌వోయూలను పొందిన ఉదంతాలు కూడా ఉన్నాయని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ మంగళవారం రాజ్యసభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో వెల్లడించారు. గత ఏడాది మే 23వ తేదీన ఆయన చివరిసారి తప్పుడు ఎల్‌వోయూను పొందినట్లు జైట్లీ తెలిపారు. నీరవ్‌తో పాటు ఆయన మామ మెహుల్ చోక్సీకి చెందిన వివిధ కంపెనీలు ఈ ఎల్‌వోయూలను ఆసరాగా చేసుకుని విదేశాల్లోని భారతీయ బ్యాంకు శాఖల నుంచి అక్రమంగా రూ.13,600 కోట్ల రుణాలను పొంది పీఎన్‌బీని 'చావుదెబ్బ' తీశారు.

డీరిజిస్టర్డ్ కంపెనీల్లో నీరవ్ సంస్థలేమీ లేవు..!

ఇదిలావుంటే, దేశంలో నల్లధనాన్ని నిరోధించేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం గత ఏడాది చివరి నాటికి 2.26 లక్షలకు పైగా కంపెనీలను అధికారిక రికార్డుల నుంచి తొలగించింది. ఈ సంస్థలు చాలా కాలం నుంచి ఎటువంటి వ్యాపార కార్యకలాపాలను నిర్వహించకపోవడంతో ప్రభుత్వం ఈ చర్య చేపట్టింది. అయితే ఈ కంపెనీల జాబితాలో నీరవ్ మోదీ గ్రూపునకు చెందిన ఒక్క సంస్థ కూడా లేదు. కార్పొరేట్ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి పీపీ చౌదరి మంగళవారం రాజ్యసభలో ఈ విషయాన్ని వెల్లడించారు.

క్వాల్‌కామ్-బ్రాడ్‌కామ్ డీల్‌కు చెక్

వాషింగ్టన్, మార్చి 13: క్వాల్‌కామ్‌ను టేకోవర్ చేయాలన్న బ్రాడ్‌కామ్ ఆశలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నీళ్లు చల్లారు. అమెరికాకు చెందిన చిప్ తయారీదారైన క్వాల్‌కామ్‌ను దాని ప్రత్యర్థి సంస్థ, సింగపూర్ ఆధారిత బ్రాడ్‌కామ్.. 117 బిలియన్ డాలర్లకు కొనుగోలు చేసేందుకు ముందుకొచ్చిన విషయం తెలిసిందే. అయితే జాతీయ భద్రతా కారణాలను చూపుతూ మంగళవారం ట్రంప్.. ఈ డీల్‌కు చెక్ పెట్టారు. ఈ డీల్.. ప్రపంచ చిప్ మార్కెట్‌లో అమెరికా ప్రాధాన్యాన్ని తగ్గిస్తుందని, చైనా ఆధిపత్యానికి దోహదపడగలదన్న అంచనాల మధ్యే ట్రంప్ ఈ నిర్ణయానికొచ్చారు. ప్రస్తుతం ఇంటెల్, సామ్‌సంగ్ తర్వాత చిప్ తయారీలో ఉన్న అతిపెద్ద సంస్థ శాండియాగో కేంద్రంగా ఉన్న క్వాల్‌కామే. దీన్నిప్పుడు ఆసియాకు చెందిన బ్రాడ్‌కామ్ హస్తగతం చేసుకుంటే.. ఈ రంగంలో అమెరికాకు ప్రాతినిథ్యం లేకుండా పోతుంది. మరోవైపు చైనాకు చెందిన హువావీ టెక్నాలజీస్ చిప్ తయారీ మార్కెట్‌లో అగ్రశ్రేణి సంస్థగా ఎదిగేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నది. ఈ నేపథ్యంలో ఈ డీల్ అమెరికాకు ఎంతమాత్రం మంచిది కాదన్న బలమైన అభిప్రాయానికి ట్రంప్ వచ్చేశారు. దీంతో తాజాగా విడుదల చేసిన ఓ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌లో 'బ్రాడ్‌కామ్ చేతికి క్వాల్‌కామ్ వస్తే అమెరికా జాతీయ భద్రతకు ముప్పేనని మేము గట్టిగా విశ్వసిస్తున్నాం. కాబట్టి ఈ ప్రతిపాదిత టేకోవర్‌ను తక్షణమే శాశ్వతంగా రద్దు చేస్తున్నాం' అని ట్రంప్ పేర్కొన్నారు. 'క్వాల్‌కామ్‌ను బ్రాడ్‌కామ్ కొనుగోలు చేయడాన్ని లేక విలీనం చేసుకోవడాన్ని నిషేధిస్తున్నాం. అంతేగాక క్వాల్‌కామ్‌లో బ్రాడ్‌కామ్‌కు మెజారిటీ వాటాగానీ, సమాన వాటాగానీ ఉండరాదు. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎలాంటి లావాదేవీలు ఈ రెండు సంస్థల మధ్య జరుపరాదు' అని స్పష్టం చేశారు. గ్లోబల్ టెక్నాలజీ పరిశ్రమలో క్వాల్‌కామ్-బ్రాడ్‌కామ్ డీలే అతిపెద్దదవగా, ఇది కుదిరితే మొబైల్ టెక్నాలజీలో అమెరికా వెనుకబడిపోతుందన్న ఆ దేశ చట్టసభ సభ్యుల ఆందోళనలు ట్రంప్‌ను తాకాయి. ఇప్పటికే ఇతర దేశాల వల్ల అమెరికన్లు, ఆ దేశ సంస్థల ప్రయోజనాలు దెబ్బతింటున్నాయని తరచూ గోలపెడుతున్న ట్రంప్.. పెద్ద ఎత్తున రక్షణాత్మక ధోరణులను అనుసరిస్తున్న విషయం తెలిసిందే. హెచ్-1బీ వీసా నిబంధనల్ని కఠినతరం చేస్తున్న ఆయన ఇటీవల ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై భారీగా సుంకాలను విధించిన సంగతీ విదితమే. ఇదిలావుంటే ట్రంప్ తాజా ఆదేశాల్ని పరిశీలిస్తున్నామన్న బ్రాడ్‌కామ్.. ఈ డీల్ అగ్రరాజ్య జాతీయ భద్రతను ప్రమాదంలో పడేస్తుందన్న వాదనల్ని ఖండించింది.



ఇంకా చాలా నిందించాలి

పీఎన్‌బీ కుంభకోణంపై ఆర్బీఐ మాజీ గవర్నర్ రాజన్



న్యూఢిల్లీ, మార్చి 13: పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ)లో జరిగిన రూ.13,600 కోట్ల కుంభకోణంపై నిందించాల్సింది ఇంకా చాలా ఉన్నదని రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ అన్నారు. 2013 నుంచి 2016 వరకు ఆర్బీఐ గవర్నర్‌గా పనిచేసిన రాజన్ 2014లో ప్రారంభించిన 80:20 గోల్డ్ స్కీమ్‌పై ఆరోపణలు రావడంతో ఈ కుంభకోణంపై మౌనాన్ని వీడారు. యూపీఏ-2 ప్రభుత్వం అధికారం నుంచి వైదొలగడానికి కొద్ది రోజుల ముందు ఈ పథకానికి సంబంధించిన విధానాన్ని మార్చి తమ సన్నిహితులకు ఉద్దేశ్యపూర్వకంగా ప్రయోజనాన్ని కల్పించిందని ఆరోపిస్తూ 2014 జూలై 26వ తేదీన ఐబీజేఏ (ఇండియన్ బులియన్ అండ్ జువెల్లర్స్ అసోసియేషన్) రాసిన లేఖ ఇప్పుడు తెరమీదికి రావడంతో ఆయన ఈ కుంభకోణంపై స్పందించారు. 'ఎటువంటి విధాన నిర్ణయంతోనైనా కొన్ని సానుకూల ఫలితాలు, మరికొన్ని ప్రతికూల ఫలితాలు వస్తాయి. పీఎన్‌బీ కుంభకోణం గురించి నిందించాల్సింది ఇంకా చాలా ఉన్నది. ఈ కుంభకోణం ఎలా జరిగిందో, లోపాలు ఎక్కడ తలెత్తాయో పరిశీలించాల్సిన అవసరం ఉన్నది. అసలు పీఎన్‌బీ డైరెక్టర్లను ఎవరు నియమించారో, ఈ కుంభకోణానికి ద్వారాలు తెరిచింది ఎవరో మనం ప్రశ్నించాలి' అని ఒక టీవీ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో రాజన్ పేర్కొన్నారు.

పీఎన్‌బీ స్కాం మరింత పైకి

న్యూఢిల్లీ, మార్చి 13: పీఎన్‌బీ కుంభకోణం విలువ దాదాపు మరో రూ.942 కోట్లు పెరిగింది. అయితే కొత్తగా ఎల్‌వోయూలుగానీ, ఎల్‌వోసీలుగానీ ఏమీ బయటపడలేదని, గతంలో తాము గుర్తించని మొత్తమే ఇదన్న పీఎన్‌బీ.. బ్యాంకుల కూటమి రుణాల కింద గీతాంజలి గ్రూప్‌నకు మంజూరు చేసిన రెగ్యులర్ లిమిట్స్‌లో భాగమే ఈ మొత్తమని పోలీసులకు తెలిపింది. దీంతో స్కాం విలువ రూ.13,600 కోట్లను దాటినట్లైంది.

'గీతాంజలి'కి ఎన్‌ఎస్‌ఈ జరిమానా

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను ఆర్థిక ఫలితాలను ప్రకటించని సంస్థలపై స్టాక్ ఎక్స్ఛేంజ్ ఎన్‌ఎస్‌ఈ జరిమానా విధించింది. ఈ కంపెనీల్లో పీఎన్‌బీ కుంభకోణంలో ప్రధాన సూత్రధారి నీరవ్ మోదీకి మేనమామ మెహుల్ చోక్సీకి చెందిన గీతాంజలి జెమ్స్‌తోపాటు మరో 23లు ఉన్నాయి. మరో త్రైమాసికం ముగుస్తున్నప్పటికీ ఇంకా గడిచిన త్రైమాసిక ఆర్థిక ఫలితాలు విడుదల చేయకపోవడంతో ఈ సంస్థలపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం కనిపిస్తున్నది.

టీసీఎస్‌లో తగ్గిన టాటాసన్స్ వాటా

టీసీఎస్‌లో దాదాపు రూ.9,000 కోట్ల విలువైన షేర్లను మంగళవారం టాటా సన్స్ అమ్మేసింది. టీసీఎస్‌లోని టాటా సన్స్ వాటాలో ఇది సుమారు 1.63 శాతానికి సమానం. కాగా, బహిరంగ మార్కెట్ లావాదేవీల ద్వారా ఈ విక్రయం జరిగింది. మరోవైపు తాజా పరిణామంతో టీసీఎస్ మార్కెట్ విలువ రూ.30,153 కోట్లు తగ్గిపోయింది.

సరికొత్తగా హీరో ప్యాషన్ ప్రో

ప్రారంభ ధర రూ.53,189



న్యూఢిల్లీ, మార్చి 13: ద్విచక్ర వాహనాల తయారీలో అగ్రగామి సంస్థ హీరో మోటోకార్ప్..దేశీయ మార్కెట్లోకి సరికొత్త ప్యాషన్ ప్రోలను విడుదల చేసింది. వీటిలో ప్రో ధర రూ.53,189గా నిర్ణయించిన సంస్థ, మరో మోడల్ ఎక్స్‌ప్రోను రూ.54,189కి విక్రయించనున్నట్లు తెలిపింది. 100-110 సీసీ సామర్థ్యం కలిగిన బైకుల విభాగంలో మార్కెట్ వాటాను మరింత పెంచుకోవాలనే ఉద్దేశంతో విడుదల చేసిన ఈ బైకులను బీఎస్-4 ప్రమాణాలకు లోబడి రూపొందించినట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. దేశీయ మోటార్‌సైకిళ్ల విభాగంలో 50 శాతం వాటాతో దూసుకుపోతున్న సంస్థ..100-110 సీసీ సెగ్మెంట్‌లోనూ 75 శాతం వాటా కలిగివున్నది.

హోండా ఎక్స్-బ్లేడ్

బైకు ధర రూ.78,500



న్యూఢిల్లీ, మార్చి 13: స్పోర్ట్ మోటార్‌సైకిల్ పరిధిని మరింత పెంచుకోవడానికి ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా(హెచ్‌ఎంఎస్‌ఐ) మరో బైకును అందుబాటులోకి తీసుకొచ్చింది. 160 సీసీ సామర్థ్యంతో రూపొందించిన ఎక్స్-బ్లేడ్ బైకు ధరను రూ.78,500గా నిర్ణయించింది. గత నెలలో నోయిడాలో జరిగిన ఆటో ఎక్స్‌పోలో ప్రదర్శించిన ఈ బైకు డిస్పాచ్‌ను ప్రారంభించినట్లు కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ యద్వీందర్‌సింగ్ గులేరియా తెలిపారు.

ఎస్‌బీఐ ఖాతాదారులకు ఊరట

కనీస నగదు నిల్వలు లేని ఖాతాలపై భారీగా తగ్గిన జరిమానాలు

వచ్చే నెల 1 నుంచి అమల్లోకి.. 25 కోట్ల మందికి ప్రయోజనం

ముంబై, మార్చి 13: ఎస్‌బీఐ ఖాతాదారులకు శుభవార్త. కనీస నగదు నిల్వలు లేని ఖాతాలపై జరిమానాల్ని మంగళవారం బ్యాంక్ భారీగా తగ్గించింది. మెట్రో నగరాలు, నగరాలు, పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోని కస్టమర్లకు ఊరటనిస్తూ 75 శాతం వరకు కోత విధిస్తున్నట్లు ప్రకటించింది. వచ్చే నెల 1 నుంచి తగ్గించిన ఫైన్లు అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది. ఈ జరిమానాలపై వచ్చిన ఆదాయం సర్వత్రా విమర్శలకు దారితీసిన నేపథ్యంలో నెలసరి మినిమం బ్యాలెన్స్‌లను తగ్గించకపోయినా.. అవి లేని ఖాతాదారులపై వేసే జరిమానాల్ని మాత్రం పెద్ద ఎత్తున తగ్గించింది. ప్రస్తుతం హైదరాబాద్‌సహా దేశంలోని అన్ని మెట్రో నగరాలు, ఇతరత్రా నగరాల్లోగల ఎస్‌బీఐ ఖాతాదారులు తమ ఖాతాల్లో రూ.3,000లను తప్పనిసరిగా ఎప్పుడూ ఉంచుకోవాల్సి ఉంటుంది. అలాగే పట్టణ ప్రాంతాల్లోని కస్టమర్లు రూ.2,000, గ్రామీణ ప్రాంతాల్లోని ఖాతాదారులు రూ.1,000 ఉంచాలి. అయితే ఈ మొత్తాలు లేని ఖాతాల్లో మెట్రో, నగరాల్లోని కస్టమర్లకైతే ఏప్రిల్ 1 నుంచి నెలకు రూ.15 (జీఎస్టీ పన్నులు అదనం) వసూలు చేస్తామని ఎస్‌బీఐ తాజాగా వెల్లడించింది. ఇప్పుడు రూ.50 (18 శాతం జీఎస్టీ పన్నులు అదనం) తీసుకుంటున్నది. అలాగే పట్టణ ఖాతాదారులపై రూ.12 (జీఎస్టీ అదనం), గ్రామీణ ఖాతాదారులపై రూ.10 (జీఎస్టీ అదనం) తీసుకుంటామని వివరించింది. ప్రస్తుతం వీరి నుంచి నెలకు రూ.40 చొప్పున వసూలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజానికి దేశవ్యాప్తంగా 41 కోట్ల పొదుపు ఖాతాలుండగా, తాజా నిర్ణయంతో దాదాపు 25 కోట్ల మందికి లబ్ధి చేకూరనున్నది. ఈ మేరకు ఎస్‌బీఐ రిటైల్, డిజిటల్ బ్యాంకింగ్ ఎండీ పీకే గుప్తా ఓ ప్రకటనలో తెలిపారు. మిగతా 16 కోట్లకు పైగా ప్రధాన మంత్రి జన్‌ధన్ యోజన (పీఎంజేడీవై), బీఎస్‌బీడీ, పెన్షనీర్లు, మైనర్లు, సామాజిక భద్రత లబ్ధిదారులకు చెందిన ఖాతాలుండగా, వీటికి మినిమం బ్యాలెన్స్ నిబంధన వర్తించదు. కాగా, గతేడాది ఏప్రిల్-నవంబర్ మధ్య మినిమం బ్యాలెన్స్‌లను నిర్వహించని ఖాతాదారులపై వేసిన జరిమానాలతో ఎస్‌బీఐకి వచ్చిన ఆదాయం రూ.1,771.67 కోట్లుగా నమోదైందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. ఇది బ్యాంక్ జూలై-సెప్టెంబర్ త్రైమాసిక లాభం కంటే ఎక్కువ. దీంతో అన్ని వర్గాల నుంచి విపరీతంగా విమర్శలు రాగా, అప్పటికే కొంతమేర తగ్గించిన చార్జీలను మరింతగా సవరిస్తామని ఎస్‌బీఐ సీఎండీ ప్రకటించాల్సి వచ్చింది.

41 లక్షల ఖాతాలు మూసివేత

మరోవైపు కనీస నగదు నిల్వలను నిర్వహించలేని 41.16 లక్షల పొదుపు ఖాతాల్ని మూసివేసినట్లు ఎస్‌బీఐ తెలిపింది. గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది జనవరి మధ్య వీటిని క్లోజ్ చేసినట్లు సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కింద అడిగిన ఓ ప్రశ్నకు బదులుగా ఎస్‌బీఐ స్పష్టం చేసింది. ఐదేండ్ల విరామం అనంతరం గతేడాది ఏప్రిల్‌లోనే తిరిగి నెలసరి మినిమం బ్యాలెన్స్ నిబంధనల్ని బ్యాంక్ పరిచయం చేసిన విషయం తెలిసిందే.

మరో 65 విమానాల నిలిపివేత

ముంబై, మార్చి 13: చౌక విమానయాన సంస్థలైన ఇండిగో, గోఎయిర్‌లు వరుసగా రెండోరోజు మరో 65 విమాన సర్వీసులను రద్దు చేశాయి. ఏ320 నియో విమానాల్లో ప్రాట్ అండ్ విట్నీ ఇంజిన్లు తరచుగా విఫలమవుతున్నాయని ఏవియేషన్ నియంత్రణ మండలి డీజీసీఏ సూచనకు అనుగుణంగా సంస్థ ఈ నిర్ణయం తీసుకున్నది. ప్రతిరోజు వెయ్యికి పైగా విమానాలతో సేవలు అందిస్తున్న ఇండిగో గడిచిన రెండు రోజుల్లో 47 ఫ్లైట్లను రన్‌వేపై నిలిపివేసింది. కంపెనీ తీసుకున్న ఈ నిర్ణయంతో ఢిల్లీ, ముంబై, చెన్నై, కోల్‌కతా, హైదరాబాద్, బెంగళూరు, పాట్నా, శ్రీనగర్, భువనేశ్వర్, అమృతసర్‌ల నుంచి నడిచే విమానాలు రద్దుకావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరో విమాన సర్వీసును లేదా వారి బుకింగ్ రద్దు చేసుకున్న వారికి పూర్తిగా చెల్లింపులు జరుపుతున్నట్లు సంస్థ ప్రకటించింది. అలాగే గోఎయిర్ 18 విమానాలను రద్దుచేసింది.

ప్రయాణికుల భద్రతే తొలి ప్రాధాన్యం: ప్రభు

ప్రయాణికుల భద్రతకే పెద్దపీట వేయడంవల్లనే పలు విమాన సర్వీసులను రద్దు చేయాల్సి వచ్చిందని పౌర విమానయాన శాఖ మంత్రి సురేశ్ ప్రభు తెలిపారు.

ఐఎస్ సానుభూతిపరులపై ఎన్‌ఐఏ చార్జిషీట్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఐఎస్ కార్యకలాపాలకు ఆకర్షితులై, యువతను ఉగ్రవాదం వైపు మళ్లిస్తున్న తొమ్మిదిమందిపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) మంగళవారం చెన్నైలోని ఎన్‌ఐఏ కోర్టులో చార్జిషీట్ దాఖలుచేసింది. వీరిలో ఎనిమిది మంది తమిళనాడు, ఒకరు తెలంగాణకు చెందిన యువకుడు ఉన్నట్టు ఎన్‌ఐఏ చార్జిషీట్‌లో పేర్కొంది. గత జనవరిలో ఎన్‌ఐఏ సుమోటోగా కేసు నమోదుచేసింది. ప్రధాన నిందితుడు హాజా ఫక్రుద్దీన్ కాగా, తెలంగాణకు చెందిన నోమన్ జమీల్‌తోపాటు మరో ఏడుగురిపై విచారణ ప్రారంభించింది. ఫక్రుద్దీన్ చెన్నై, తెలంగాణలో కొత్తగా రిక్రూట్‌మెంట్ మొదలుపెట్టాడు. ఈ క్రమంలోనే మిగతా నిందితులతో గ్యాంగ్‌ను ఏర్పాటుచేసి, కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు.

భూసేకరణకు వేర్వేరుగా నోటిఫికేషన్‌లా?: హైకోర్టు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సూర్యాపేట నుంచి ఖమ్మం వరకు జాతీయరహదారి విస్తరణకు భూసేకరణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేర్వేరుగా ప్రకటనలు జారీచేయడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. కేంద్రం జారీచేసిన భూసేకరణ ప్రకటనను ఉపసంహరించుకొనే వరకు భూస్వాధీన ప్రక్రియను నిలిపివేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టంచేసింది. వేర్వేరుగా ప్రకటనలు జారీచేయడాన్ని సవాల్ చేస్తూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం తరఫున హైకోర్టులో వ్యాజ్యం దాఖలైంది. దీనిపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. దీనిపై స్పష్టత ఇవ్వాలని కేంద్రాన్ని ఆదేశిస్తూ విచారణను వాయిదావేసింది.

ముగిసిన ఎంసీఐ బృందం తనిఖీలు

పోచమ్మమైదాన్(వరంగల్): వరంగల్ కాకతీయ వైద్య కళాశాలలో మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఎంసీఐ) బృందం తనిఖీలు మంగళవారం ముగిశాయి. సోమవారం కేఎంసీతోపాటు నగరంలోని అన్ని టీచింగ్ దవాఖానలను ఎంసీఐ బృంద సభ్యులు తనిఖీ చేశారు. రెండోరోజు మంగళవారం కేఎంసీతోపాటు వర్ధన్నపేటలోని రూరల్ హెల్త్ సెంటర్, వరంగల్ అర్బన్ పరిధిలోని ఉర్సు అర్బన్ హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేశారు. అసోంకు చెందిన ఫోరెన్సిక్ ప్రొఫెసర్ డాక్టర్ కనకదాస్, కర్ణాటకకు చెందిన బయోకెమిస్ట్రీ ప్రొఫెసర్ డాక్టర్ మీరా, కేఎంసీ కమ్యూనిటీ మెడిసిన్ హెచ్‌వోడీ పూనం కుమారి హెల్త్ సెంటర్లను సందర్శించారు.

ఏపీ రాజ్యసభసభ్యుల ఎన్నిక ఏకగ్రీవం

హైదరాబాద్/అమరావతి, నమస్తే తెలంగాణ: ఆంధ్రప్రదేశ్ రాజ్యసభ సభ్యుల ఎన్నిక ఏకగ్రీవమైంది. వైసీపీ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సతీమణి ప్రశాంతిరెడ్డి మంగళవారం తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. రాష్ట్రంలో మూడు రాజ్యసభ స్థానాలకుగాను ముగ్గురే నామినేషన్లు దాఖలుచేయడంతో వారి ఎన్నిక ఏకగ్రీవం అయినట్లయింది. టీడీపీకి చెందిన సీఎం రమేశ్, కనకమేడల రవీంద్రకుమార్, వైసీపీకి చెందిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిల మూడు నామినేషన్లు మాత్రమే దాఖలవడంతో వారు ముగ్గురూ రాజ్యసభకు ఎన్నికయ్యారు. దీనిపై ఈ నెల 15న అధికారిక ప్రకటన వెల్లడించే అవకాశం ఉంది.

ఎస్సీల అభివృద్ధిపై జిల్లాలవారీగా సమావేశాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని ఎస్సీల అభివృద్ధి, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని కుల సంఘాల ప్రతినిధులు, అధికారులతో జిల్లాలవారీగా సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించినట్టు ప్రభుత్వ కార్యదర్శి జ్యోతిబుద్ధప్రసాద్ తెలిపారు. 31 జిల్లాలకు చెందిన ఎస్సీ అభివృద్ధిశాఖ ఈడీలతో మంగళవారం సంక్షేమభవన్‌లో సమావేశమయ్యారు. ఎస్సీల అభివృద్ధికి ప్రభుత్వం అమలుచేస్తున్న కార్యక్రమాలు, నూతన పథకాలు, ప్రాంతాలవారీగా అవసరాలను తెలుసుకొనేందుకు జిల్లాలవారీగా సమావేశాలు నిర్వహించాలని, వారంరోజుల్లో నివేదిక పంపాలని సూచించారు. ఎస్సీ సహకార అభివృద్ధి సంస్థ వీసీ, ఎండీ లచ్చిరాం భూక్యా, జీఎం ఆనంద్ కుమార్, డిక్కీ అధ్యక్షుడు రవికుమార్ పాల్గొన్నారు.

పెరిగిన గరిష్ఠ ఉష్ణోగ్రతలు

అత్యధికంగా 40.3 డిగ్రీల సెల్సియస్ నమోదు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో ఎండల తీవ్రత అధికమవడంతో గరిష్ఠ ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం అత్యధికంగా జయశంకర్-భూపాలపల్లి, భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40.3 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైనట్టు తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ (టీఎస్‌డీపీఎస్) వెల్లడించింది. జనగాం, నిజామాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మహబూబాబాద్, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో 39.6 డిగ్రీల సెల్సియస్‌గా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కనిష్ఠ ఉష్ణోగ్రతలు సైతం 17.5 డిగ్రీల నుంచి 19.1 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదైనట్టు టీఎస్‌డీపీఎస్ తన నివేదికలో తెలిపింది.



అలయ ఈవోకు వెండి కవచాన్ని అందజేస్తున్న నాందేడ్ భక్తులు

రాజన్నకు వెండి కవచం

వేములవాడ కల్చరల్: వేములవాడ రాజరాజేశ్వర స్వామికి మంగళవారం మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన భక్తులు వెండి ముక్కోటి కవచాన్ని బహూకరించారు. నాందేడ్‌కు చెందిన దత్తాత్రేయ దునేటోవార్ అనే భక్తుడు కుటుంబ సమేతంగా వచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 2.09 కిలోల వెండి కవచాన్ని ఆలయ ఈవో దూస రాజేశ్వర్‌కు అందజేశారు. వారికి ఆలయ అద్దాల మండపంలో స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.



హుండీ లెక్కిస్తున్న ఆలయ అధికారులు

ఎములాడ హుండీ ఆదాయం 1.02 కోట్లు

వేములవాడ కల్చరల్: వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామివారికి 21 రోజుల్లో హుండీ ద్వారా దాదాపు రూ.1.02 కోట్ల ఆదాయం సమకూరిందని ఆలయ ఈవో దూస రాజేశ్వర్ తెలిపారు. మంగళవారం రాజన్న ఆలయ ఓపెన్ స్లాబ్‌పై నిర్వహించిన హుండీ లెక్కింపులో 218 గ్రాముల బంగారం, 13.3 కిలోల వెండి సమకూరిందన్నారు. దాదాపు రూ.87,500 విలువైన రద్దయిన రూ.వెయ్యి, రూ.ఐదు వందల నోట్లు హుండీలో లభించాయని వివరించారు.



రథోత్సవంలో పాల్గొన్న మైహోం ఇండస్ట్రీస్ చైర్మన్ రామేశ్వర్‌రావు

వైభవంగా చక్రస్నానం

మేళ్లచెర్వు: సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వులోని మైహోం ఇండస్ట్రీస్ ఆవరణలో కొలువైఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారికి చక్రస్నానం, పూర్ణాహుతి నిర్వహించారు. శ్రీ అహోబిల రామానుజ జీయర్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా స్వామివారిని, అమ్మవార్లను రథంపై ఊరేగించారు. కార్యక్రమంలో మైహోం చైర్మన్ జూపల్లి రామేశ్వర్‌రావు, శ్రీకుమారి దంపతులు, వినోదరావు, రంజిత్‌రావు, రామూరావు, శ్యామరావు, మునగాల రామ్మోహన్‌రావు, అరుణ, సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



జనగామ జిల్లా గుండాల మండలం రామారం గ్రామంలో మంగళవారం టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బండ రమేశ్‌రెడ్డి నేతృత్వంలో వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు భారీగా టీఆర్ఎస్‌లో చేరారు. టీఆర్ఎస్ రాష్ట్ర రైతు విభాగం ప్రధాన కార్యదర్శి గొంగిడి మహేందర్‌రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు టీఆర్ఎస్‌లో చేరుతున్నారని పేర్కొన్నారు. - గుండాల

ఆగ్రహ జ్వాల

కాంగ్రెస్ నాయకుడు కోమటిరెడ్డి తీరుపై నిరసనల వెల్లువ

దిష్టిబొమ్మలను దహనం చేసిన టీఆర్ఎస్, ఇతర సంఘాల నాయకులు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా మండలి చైర్మన్ స్వామిగౌడ్‌పై కాంగ్రెస్ నాయకుడు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దాడి చేయడంపై టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, కుల సంఘాల, బీసీ సంఘాల నాయకులు భగ్గుమంటున్నారు. ఈ సందర్భంగా మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపట్టారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. నల్లగొండ సహా కనగల్, తిప్పర్తి మండల కేంద్రాల్లో టీఆర్ఎస్ కార్యకర్తలు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్‌లో జరిగిన నిరసనలో రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి నిరంజన్ వలీ, టీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జి కంచర్ల భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. నిడమనూరులో టీఆర్ఎస్ కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శాసన సభ్యత్వాన్ని రద్దు చేయడంపై చిట్యాలలో అధికార పార్టీ కార్యకర్తలు టపాకాయలు కాల్చి సంబురాలు జరుపుకొన్నారు. కోమటిరెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలంటూ జిల్లా కేంద్రంలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో టీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున ఫిర్యాదు చేశారు. కరీంనగర్ జిల్లా చొప్పదండిలోని తెలంగాణ చౌరస్తా వద్ద టీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో, జగిత్యాల జిల్లా మల్లాపూర్‌లోని భరతమాత కూడలి వద్ద గౌడ సంఘం నాయకులు, సారంగాపూర్ మండలం పెంబట్లలో టీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, జిల్లా ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పలుచోట్ల నిరసన ప్రదర్శనలు చేపట్టి, వెంకట్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. పెద్దపల్లి జిల్లాకేంద్రంలో సర్వాయి పాపన్న గౌడ సంఘం ఆధ్వర్యంలో, కమాన్‌పూర్ మండలంలో టీఆర్ఎస్ నాయకులు, వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండలోని కాళోజీ జంక్షన్ వద్ద వెంకట్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. అగ్రకుల అహంకారంతో వెంకట్‌రెడ్డి బీసీ ప్రజాప్రతినిధి అయిన స్వామిగౌడ్‌పై దాడి చేయడం సిగ్గుచేటన్నారు.



జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం పెంబట్లలో వెంకట్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టీఆర్ఎస్ నాయకులు



నల్లగొండలోని గడియారం సెంటర్‌లో కోమటిరెడ్డి దిష్టిబొమ్మ దహనంలో పాల్గొన్న అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, నల్లగొండ నియోజకవర్గ ఇంచార్జి కంచర్ల భూపాల్‌రెడ్డి తదితరులు

స్వామిగౌడ్‌పై దాడి అమానుషం

మరిపెడ, నమస్తేతెలంగాణ: మండలి చైర్మన్ స్వామిగౌడ్‌పై కాంగ్రెస్ నాయకుడు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా దాడి చేసి గాయపర్చడం అమానుషమని మార్కెటింగ్, గిడ్డంగుల సహకార సంస్థ చైర్మన్, టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి మందుల సామేల్ అన్నారు. మంగళవారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుతుంటే తట్టుకోలేని కాంగ్రెసోళ్లు సహనం కోల్పోయి ఆవేశంతో దాడులకు దిగుతున్నారని విమర్శించారు. ఇలా వ్యవహరిస్తే అధికారానికి చేరువ అవుతామనుకోవడం వారి భ్రమ అని ఆయన అన్నారు. కాంగ్రెస్ తీరును చూసి జనం చీదరించుకుంటున్నారన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నేతలు పద్ధతి మార్చుకోవాలని సూచించారు.



మాట్లాడుతున్న మందుల సామేల్



కరీంనగర్ జిల్లా చొప్పదండిలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు



వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండలోని కాళోజీ జంక్షన్‌లో కోమటిరెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న గౌడ సంఘం నాయకులు

ఇద్దరు వీఆర్వోలకు మూడేండ్ల జైలు

నకిలీ పాస్‌పుస్తకాల తయారీ కేసులో మొత్తం ఐదుగురికి శిక్ష

పెద్దపల్లి, నమస్తే తెలంగాణ: నకిలీ పట్టాదారు పాసుపుస్తకాలు తయారు చేసిన కేసులో ఇద్దరు వీఆర్వోలతోపాటు మరో ముగ్గురికి జైలుశిక్ష జరిమానా విధిస్తూ పెద్దపల్లి సబ్‌కోర్టు జూనియర్ సివిల్ జడ్జి రాజేందర్ తీర్పునిచ్చారు. పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లికి చెందిన బొమ్మక కొమురయ్య, బొమ్మక సతీశ్, గాండ్ల రాజేశంతోపాటు అదే మండలం రంగాపూర్ వీఆర్వో పాగాల నాగరాజు, ఓదెల మండలం సానగొండ వీఆర్వో బోగి శంకరయ్యకు మూడేండ్ల జైలుశిక్షతోపాటు రూ.3 వేల జరిమానా విధించారు. మంగళవారం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బ్రాహ్మణపల్లికి చెందిన బొమ్మక కొమురయ్య వ్యవసాయ భూమిపై రుణం తీసుకోవడానికి 2009లో పెద్దపల్లి ఎస్బీహెచ్(ఏడీబీ)లో దరఖాస్తు చేసుకున్నాడు. అప్పటి బ్యాంక్ మేనేజర్ పట్టాదారు పాస్‌పుస్తకం విచారణ కోసం తహసీల్దార్ కార్యాలయానికి పంపగా, ఫోర్జరీ సంతకాలతో నకిలీ పాసు పుస్తకాలను తయారు చేసినట్టు గుర్తించారు. ఈ మేరకు ఎస్సై ప్రశాంత్‌రెడ్డికి తహసీల్దారు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు నకిలీ పట్టాలో సభ్యులుగా ఉన్న బొమ్మక కొమురయ్య, బొమ్మక సతీశ్, గాండ్ల రాజేశంతోపాటు వారికి సహకరించిన వీఆర్వోలు పాగాల నాగరాజు, బోగి శంకరయ్యను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. ఆధారాలను, వాదనలను పరిశీలించిన జడ్జి.. సదరు ఐదుగురిని దోషులుగా నిర్ధారిస్తూ మూడేండ్ల జైలుశిక్ష, రూ.3 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్టు ఎస్సై జగదీశ్ తెలిపారు.



నిందితుడు మురళి

ఏసీబీకి చిక్కిన ఇంచార్జి ఆర్ఐ

నర్సంపేట/హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేట నగరపంచాయతీ ఇంచార్జి ఆర్ఐ, బిల్ కలెక్టర్ ఎం మురళి లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు. నర్సంపేటలో నివాసం ఉంటున్న జడల వెంకటేశ్వర్లు తన ఇంటి యాజమాన్య ధ్రువపత్రం కోసం గత ఏడాది డిసెంబర్‌లో దరఖాస్తు చేశారు. ధ్రువపత్రం జారీకి ఇంచార్జి ఆర్ఐ మురళి రూ.30 వేలు డిమాండ్ చేయగా, వెంకటేశ్వర్లు రూ.20 వేలు ఇచ్చారు. మిగతా రూ.10 వేలు ఇస్తేనే పనవుతుందని మురళి తేల్చిచెప్పడంతో వెంకటేశ్వర్లు ఏసీబీ అధికారులను సంప్రదించారు. పథకం ప్రకారం మంగళవారం మల్లంపల్లి రోడ్డులో ఆర్ఐ మురళికి రూ.10 వేలు ఇస్తుండగా ఏసీబీ డిప్యూటీ డైరెక్టర్ తాళ్లపెల్లి సుదర్శన్‌గౌడ్ ఆధ్వర్యంలో అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. హైదరాబాద్‌కు తరలించి ఏసీబీ స్పెషల్‌కోర్టులో ప్రవేశపెట్టారు.



నిజామాబాద్‌లోని స్నేహ సొసైటీలో నిర్వహించిన ఎంపీ కవిత జన్మదిన వేడుకల్లో టీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాంకిషన్‌రావుకు కేక్ తినిపిస్తున్న మేయర్ ఆకుల సుజాత



నిజామాబాద్‌లో జాగృతి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



హైదరాబాద్ మియాపూర్‌లోని ఆశ్రయ ఓల్డేజ్ హోంలో నిర్వహించిన వేడుకలో వృద్ధురాలికి కేక్ తినిపిస్తున్న సాంఘిక సంక్షేమ బోర్డు చైర్‌పర్సన్ రాగం సుజాత యాదవ్

ఘనంగా ఎంపీ కవిత పుట్టినరోజు వేడుకలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు, నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత పుట్టిన రోజు వేడుకలను మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, సింగరేణి కార్మికులు, జాగృతి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ల చైర్మన్లు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎన్ఆర్ఐలు సైతం ఆయా దేశాల్లో జరుపుకొన్నారు. ఈ సందర్భంగా కేకులు కట్‌చేయడంతోపాటు రక్తదాన శిబిరాలు, దుస్తుల పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి, విద్యార్థి జేఏసీ చైర్మన్ బాలరాజు యాదవ్ కేట్‌కట్ చేశారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ బోర్డు చైర్‌పర్సన్ రాగం సుజాత యాదవ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ మియాపూర్‌లోని ఆశ్రయ ఓల్డేజీ హోంలో భారీ కేకుకట్ చేశారు. వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మియాపూర్ కార్పొరేటర్ మేకా రమేశ్ పాల్గొన్నారు. కరీంనగర్‌లోని ఫిలింభవన్‌లో తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు జాడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో చీఫ్‌విప్ కొప్పుల ఈశ్వర్ సతీమణి కొప్పుల స్నేహలత కేక్ కట్ చేశారు. వివిధ రంగాల్లో విశేష సేవలందించిన 30మంది మహిళలను ఘనంగా సన్మానించారు. జాగృతి విద్యార్థి సమాఖ్య జిల్లా అధ్యక్షుడు రజీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో తెలంగాణ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మహ్మద్ సయ్యద్ అక్బర్ హుస్సేన్ కేక్ కట్ చేశారు. కరీంనగర్‌లో జాగృతి మహిళా విభాగం రాష్ట్ర కోకన్వీనర్ కల్పన ఆధ్వర్యంలో, తెలంగాణ చౌక్‌లో టీఎన్జీవోస్ అంగన్‌వాడీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు ఏరువ లలితారెడ్డి ఆధ్వర్యంలో వేర్వేరుగా కేకులు కట్‌చేశారు. నిజామాబాద్‌లోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో టీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఆర్ రాంకిషన్‌రావు, జిల్లా అధ్యక్షుడు ఈగ గంగారెడ్డి, నగర మేయర్ ఆకుల సుజాత కేక్‌కట్ చేశారు. జిల్లావ్యాప్తంగా అన్నదాన కార్యక్రమాలు కొనసాగాయి. పలుచోట్ల రక్తదాన శిబిరాలు నిర్వహించారు. అక్కడక్కడా జాగృతి ఆధ్వర్యంలో చలివేంద్రాలను ప్రారంభించారు. వైద్యశిబిరాలు నిర్వహించారు. పెద్దపల్లిలో జాగృతి జిల్లా నేత సంగ్రామ్ సింగ్ నేతృత్వంలో, ఆర్జీ 1, ఆర్జీ 2 పరిధిలో టీబీజీకేఎస్ నాయకులు బొగ్గు గనులు, సంఘం కార్యాలయాల వద్ద వేడుకలు నిర్వహించారు. డెన్మార్క్ శాఖ సహకారంతో జగిత్యాల జిల్లా కొరుట్ల మండలం ధర్మారంలో కేక్ కట్ చేసి, పండ్లు పంపిణీ చేశారు. నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలం వెంకటాపూర్‌లో విద్యార్థులకు నోట్‌బుక్స్, పండ్లు పంపిణీ చేశారు. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం రామచంద్రాపూర్‌లో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. మంచిర్యాలలో మున్సిపల్ చైర్‌పర్సన్ మామిడిశెట్టి వసుంధర, మహిళా శిశు సంక్షేమ శాఖ రెండు జిల్లాల ఆర్గనైజర్ అత్తి సరోజ, బెల్లంపల్లిలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రవీణ్ పాల్గొన్నారు. జాగృతి జిల్లా యువజన అధ్యక్షుడు బొమ్మెన హరీశ్‌గౌడ్ ఆధ్వర్యంలో 50 మంది రక్తదానం చేశారు. శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరియా పరిధిలోని బొగ్గు గనులు, టీబీజీకేఎస్ కార్యాలయాల వద్ద కార్మికులు, కార్మిక నేతలు పాల్గొన్నారు.

ఖతార్‌లో ఘనంగా వేడుకలు

జాగృతి గల్ఫ్ శాఖ ఆధ్వర్యంలో దోహ ఖతార్‌లో ఎంపీ కవిత జన్మదిన వేడుకలు నిర్వహించారు. అంతకుముందు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. గల్ఫ్ జాగృతి సభ్యురాలు అబ్బగోని నందిని, కోర్ కమిటీ సభ్యులు అనుపమ, ప్రశాంత్, ప్రణీత మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం వీ హబ్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. జాగృతి ఆధ్వర్యంలో చేస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్, గల్ఫ్ కార్మికులకు ఇస్తున్న చేయూత ప్రశంసనీమన్నారు.

న్యూజిలాండ్‌లో...

న్యూజిలాండ్ దేశం ఆక్లాండ్‌లో ఎంపీ కవిత పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. న్యూజిలాండ్ టీఆర్ఎస్ శాఖ గౌరవ చైర్‌పర్సన్ కళ్యాణ్ రావు కాసుగంటి, అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నర్సింగరావు ఇనగంటి పిల్లలతో కలిసి కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు జగన్‌రెడ్డి వొదినాల, రామారావు రాచకొండ, రామ్‌మోహన్ దంతాల, కిరణ్ కుమార్ పోకల, అషుతోష్‌రెడ్డి, యాదయ్య, గ్రీష్మ, లక్ష్మి, సునీత వొదినాల, సౌమ్య పాల్గొన్నారు. టీఆర్ఎస్ డెన్మార్క్ ఆధ్వర్యంలోనూ వేడుకలు నిర్వహించి కేక్ కట్ చేశారు.



తెలంగాణ జాగృతి గల్ఫ్ శాఖ ఆధ్వర్యంలో దోహ ఖతర్‌లో ఎంపీ కవిత జన్మదిన వేడుకలు



సచివాలయంలో బాలుడికి కేక్ తినిపిస్తున్న ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి



కరీంనగర్‌లో కేక్ కోస్తున్న చీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్ సతీమణి స్నేహలత, జాడి శ్రీనివాస్

ప్రముఖ పాత్రికేయుడు ఏబీకే సతీమణి కన్నుమూత

రాయదుర్గం మహాప్రస్థానంలో ముగిసిన అంత్యక్రియలు



సుధారాణి (ఫైల్)

కొండాపూర్: పలు దినపత్రికల్లో ఎడిటర్‌గా విధులు నిర్వహించిన సీనియర్ పాత్రికేయుడు ఏబీకే ప్రసాద్ సతీమణి సుధారాణి(76) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె కొండాపూర్‌లోని కిమ్స్ దవాఖానలో చికిత్సపొందుతూ మంగళవారం ఉదయం మృతిచెందారు. ఏబీకే దంపతులు కొన్నేండ్లుగా సీఆర్ ఫౌండేషన్‌లోని వృద్ధాశ్రమంలో నివాసముంటున్నారు. ఏబీకే ప్రసాద్, సుధారాణి దంపతులకు నలుగురు కూతుళ్లు హేమలత, స్వర్ణలత, విశ్వభారతి, రాధిక ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి, మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, సాక్షి దినపత్రిక ఈడీ రామచంద్రమూర్తి, ఎడిటర్ వీ మురళి, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కే శ్రీనివాస్, మన తెలంగాణ ఎడిటర్ కే శ్రీనివాస్‌రెడ్డి, వార్త ఎడిటర్ సాయిబాబా, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తదితరులు సుధారాణి భౌతికకాయానికి నివాళులు అర్పించారు. రాయదుర్గంలోని మహాప్రస్థానంలో సుధారాణి తమ్ముడు చలసాని వేణు దుర్గాప్రసాద్ అంత్యక్రియలు నిర్వహించారు.

దొంగ అనుకొని వ్యక్తికి దేహశుద్ధి

ములుగురూరల్: గుర్తుతెలియని వ్యక్తి ఓ ఇంటి దగ్గర నిలబడగా గ్రామస్థులు అతడిని దొంగ అనుకొని చితకబాదిన ఘటన జయశంకర్ భూపాలపల్లిజిల్లా ములుగు మండలం మల్లంపల్లిలో మంగళవారం తెల్లవారుజామున జరిగింది. ములుగు-2 ఎస్సై ముప్పిడి సూర్యనారాయణ కథనం ప్రకారం.. జార్ఖండ్‌కు చెందిన బాజబుయ్యా ములుగులోని పైపుల కంపెనీలో పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి మద్యం మత్తులో మల్లంపల్లిలో సంచరిస్తూ ఓ ఇంటి వద్ద ఆగాడు. ఆ ఇంటి యజమాని అతడిని దొంగగా అనుమానించి పట్టుకున్నారు. గ్రామస్థులు వచ్చి బాజబుయ్యాను ప్రశ్నించారు. అతడికి తెలుగు రాకపోవడం, స్థానికులకు హిందీ రాకపోవడంతో దొంగ అనుకొని స్తంభానికి కట్టేసి చితకబాదారు. ఉదయం సమాచారం అందుకున్న ములుగు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని బాజబుయ్యాను స్టేషన్‌కు తరలించి విచారించారు. అతడు దొంగ కాదని, రాత్రి వేళ తిరుగుతూ కనిపించడంతో గ్రామస్థులు దొంగగా అనుమానించారని ఎస్సై తెలిపారు. బాధితుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించామన్నారు.

అడ్లూర్ శివారులో విరిగిన రైలు పట్టా

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మండలం అడ్లూర్ గ్రామ శివారులో మంగళవారం రైలు పట్టా పాక్షికంగా ధ్వంసమైంది. ఉదయం 7 గంటల సమయంలో కీ మెన్ దాన్ని గుర్తించారు. రాయలసీమ ఎక్స్‌ప్రెస్ అదే సమయంలో అటుగా వెళ్తుండటంతో అప్పటికే అధికారులను అలర్ట్ చేశారు. సకాలంలో స్పందించిన అధికారులు.. ముందస్తుగా ఆ ప్రాంతం మీదుగా వెళ్లే రైళ్లను అప్రమత్తం చేయడంతో కాస్త నెమ్మదిగా వెళ్లాయి. విరిగిన పట్టాను సాయంత్రం వరకు సరిచేసినట్లు రైల్వే అధికారులు చెప్పారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది.


స్టార్ స్పోర్ట్స్-4లో మధ్యాహ్నం 2.30 నుంచి

సింధు, సైనాపైనే ఆశలు

బర్మింగ్‌హామ్: ప్రతిష్ఠాత్మక ఆల్‌ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ టోర్నీకి రంగం సిద్ధమైంది. పదిహేడేండ్లుగా భారత్‌ను ఊరిస్తున్న ఈ ట్రోఫీని ఈసారి గెలుచుకునేందుకు భారత షట్లర్లు సన్నద్ధులయ్యారు. పీవీ సింధు, సైనా నెహ్వాల్, కిడాంబి శ్రీకాంత్‌పైనే టైటిల్ ఆశలున్నాయి. భారత్ తరపున ఆల్‌ఇంగ్లండ్ ట్రోఫీని ప్రకాశ్ పదుకోణ్ (1980), పుల్లెల గోపీచంద్ (2001) గెలుచుకున్నారు. ఆ తర్వాత సైనా పది సార్లు ఈటోర్నీలో పాల్గొన్నప్పటికీ 2015లో రన్నరప్‌గా నిలువడమే ఆమెకు అత్యుత్తమ ప్రదర్శన. ఇక ఐదుసార్లు ఈ టోర్నీ ఆడిన సింధు గతేడాది క్వార్టర్ ఫైనల్ వరకు చేరగలిగింది. దీంతో ఈసారి ఈసారి సైనా, సింధు టైటిల్‌పై గురి పెట్టారు. తొలిరౌండ్‌లో సింధుకు సులభమైన డ్రా ఎదురవగా, సైనా కఠినమైన ప్రత్యర్థి, డిఫెండింగ్ చాంపియన్ తై జుతో తలపడబోతున్నది. మరోవైపు పురుషుల సింగిల్స్‌లో భారత్ ఆశాకిరణం కిడాంబి శ్రీకాంత్ ఫ్రాన్స్ ఆటగాడు బ్రీస్ లెవర్డెజ్‌తో పోటీపడనున్నాడు. ప్రపపంచ నంబర్ వన్ విక్టర్ అక్సెల్‌సెన్ కాలి చీలమండ గాయం కారణంగా టోర్నీ నుంచి తప్పుకోవడం శ్రీకాంత్‌కు కలిసొచ్చే అంశం. ఇతడితో పాటు సాయిప్రణీత్, ప్రణయ్ పురుషుల సింగిల్స్‌లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. మహిళల డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప, సిక్కిరెడ్డి జోడి..పురుషుల డబుల్స్‌లో చిరాగ్‌శెట్టి, సాత్విక్ జోడి..మిక్స్‌డ్ డబుల్స్‌లో జెర్రీ చోప్రా, సిక్కిరెడ్డి పోటీకి దిగుతున్నది.

'సర్వీస్' ఎలా ఉంటుందో..

ఇక కొత్తగా ప్రవేశపెట్టిన 1.15మీటర్ల సర్వీస్ నిబంధనపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమైన నేపథ్యంలో ఈ టోర్నీలో అవి ఎంతవరకు ప్రభావం చూపుతాయనేది ఆసక్తికరంగా మారింది. సర్వీస్ చేసేటపుడు షటిల్‌కు రాకెట్ 1.15మీటర్ల కంటే ఎక్కువ ఎత్తులో తాకొద్దని నిబంధన ప్రవేశపెట్టారు. ఇది పొడుగ్గా ఉన్న ఆటగాళ్లకు ఇబ్బందికరంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడ్డారు. సింధుకు ఈ నిబంధన ఇబ్బందికరం కాగా, సైనాకు కొంత అనుకూలంగా ఉండనున్నది.

టైటిల్‌పై కన్నేసిన శ్రీకాంత్
నేటి నుంచి ఆల్ ఇంగ్లండ్ ఓపెన్

ఎవరు ఎవరితో

పురుషుల సింగిల్స్: శ్రీకాంత్ x లెవర్డెజ్, ప్రణయ్ x తియెన్ చెన్, ప్రణీత్ x సాన్‌వాన్ హో.
మహిళల సింగిల్స్: సైనా x తై తెజు యింగ్, సింధు x చాచువాంగ్
పురుషుల డబుల్స్: మను–సుమీత్ రెడ్డి x ఎలిస్–లాంగ్‌రిడ్జ్. చిరాగ్ – రాంకిరెడ్డి x హొకి – కొబయాషి.
మహిళల డబుల్స్: మేఘన – పూర్వీషా x తనకా, యొనెమొటో. అశ్విని – సిక్కిరెడ్డి x మట్సుటొమో – టకహాషి

కుర్రాళ్లు జోరు చూపేనా..?
నేటి నుంచి ఇరానీకప్.. రెస్టాఫ్ ఇండియా జట్టులో అశ్విన్


మయాంక్


రజ్‌నీష్

నాగ్‌పూర్: సూపర్ ఫాంలో ఉన్న దేశవాళీ క్రికెటర్లు మయాంక్ అగర్వాల్, పృథ్వీషా, నవ్‌దీప్ సైనీ మరోసారి తమ సత్తా చాటేందుకు సిద్ధమయ్యారు. నేటి నుంచి ఐదురోజుల పాటు (మార్చి 14–18) ఇక్కడ జరుగనున్న ఇరానీ ట్రోఫీలో రంజీ చాంపియన్ విదర్భతో రెస్టాఫ్ ఇండియా తలపడుతుంది. భారత వన్డే జట్టులో తిరిగి చోటు దక్కించుకోవాలని ఆరాటపడుతున్న సీనియర్ ఆటగాడు రవిచంద్రన్ అశ్విన్ ఈ మ్యాచ్‌ను సరైన వేదికగా వాడుకోవాలని చూస్తున్నాడు. ఐపీఎల్‌కు మూడు వారాల ముందు ఇరానీ కప్ జరుగుతుండడంతో యువ క్రికెటర్లు తమ దమ్ము చూపించేందుకు సిద్ధమయ్యారు. మరోవైపు రంజీ చాంపియన్ విదర్భలో కెప్టెన్ ఫజల్, వసీం జాఫర్, రజ్‌నీష్ గుర్బానీ మరోమారు మునుపటి ఫాంను కనబరిచి ఇరానీకప్‌ను కైవసం చేసుకోవాలని ఆరాటపడుతున్నారు. ఐపీఎల్ తర్వాత భారత ఏ జట్టు ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లనున్నది. దీంతో ఇరానీకప్‌లో ప్రతిభ కనబరిచి భారత్ ఏ జట్టులో చోటు సంపాదించాలని దేశవాళీ కుర్రాళ్లు తహతహలాడుతున్నారు.

జట్లు:
రెస్టాఫ్ ఇండియా: కరుణ్(కెప్టెన్), ఈశ్వరన్, పృథ్వీషా, సమర్థ్, అగర్వాల్, విహారీ, భరత్, అశ్విన్, జయంత్, నదీమ్, రాజ్‌పుత్, సైనీ, సేథ్
విదర్భ: ఫజల్ (కెప్టెన్), సతీష్, సంజయ్, జాఫర్, వాంఖడే, వాడ్కర్, సిద్దేష్, కర్ణ్, వాఖరే, ఉమేశ్, గుర్బానీ, యాష్, థాకరే, అథర్వ

'సమయం ఆసన్నమైంది'


కోహ్లీ

ముంబై: కెరీర్‌ను మరింత ముందుకు తీసుకెళ్లాలంటే.. శరీరం, పని భారాన్ని సమన్వయం చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని భారత కెప్టెన్ విరాట్ కోహ్లీ అన్నాడు. 'శారీరకంగా నాకు చిన్నచిన్న గాయాలు ఉన్నాయి. వాటిని మెల్లగా అధిగమిస్తున్నా. పని భారం విషయంలో నాకు కొద్దిగా అసమ్మతి మొదలైంది. నా శరీరం, మనసు, క్రికెట్‌లో ఎలా ముందుకు వెళ్లాలో జాగ్రత్తగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి' అని విరాట్ పేర్కొన్నాడు. లంకలో టీ20 టోర్నీకి విశ్రాంతి తీసుకోవడం.. కొత్త సవాళ్లను ఎదుర్కొనేందుకు బాగా ఉపయోగపడుతుందన్నాడు. 'కెరీర్‌ను మరింత ఉన్నతంగా ముందుకు తీసుకెళ్లాలంటే ఇలాంటి బ్రేక్‌లు చాలా అవసరం. వీటిని నేను బాగా ఆస్వాదించా. నా శరీరం విశ్రాంతి కావాలని కోరుకుంది కాబట్టే ప్రతి క్షణాన్ని విలువైనదిగా భావించా. నేను మ్యాచ్‌లు చూడటం లేదు. చూస్తే నేను కూడా మైదానంలో ఉండాలని కోరుకుంటా. వీటికి దూరంగా ఇప్పుడు నా శరీరం చెప్పినట్లు నడుచుకుంటున్నా. ఐపీఎల్‌ను తాజాగా మొదలుపెడుతా. మానసికంగా మైదానంలో మరింత పరిణతితో వ్యవహరిస్తా. ప్రస్తుతానికి నేను ఎక్కడికి వెళ్లడం లేదు. గంటలకొద్ది ఇంటికే పరిమితమవుతున్నా' అని కోహ్లీ వ్యాఖ్యానించాడు.

రాజస్థాన్ బ్యాటింగ్ కోచ్‌గా మజుందార్



జైపూర్: రానున్న ఐపీఎల్ సీజన్ కోసం మాజీ చాంపియన్ రాజస్థాన్ రాయల్స్ జట్టు పక్కా ప్రణాళికతో సిద్ధమవుతున్నది. ఇప్పటికే మెంటార్‌గా ఆస్ట్రేలియా స్పిన్ దిగ్గజం షేన్ వార్న్, బౌలింగ్ కోచ్‌గా సాయిరాజ్ బహుతులేను నియమించుకున్న రాజస్థాన్ యాజమాన్యం తాజాగా అమోల్ మజుందార్‌ను బ్యాటింగ్ కోచ్‌గా తీసుకుంది. దేశవాళీ క్రికెట్‌లో మజుందార్ అపార అనుభవం జట్టుకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా యాజమాన్యం ఒక ప్రకటనలో పేర్కొంది. వచ్చే నెలలో మొదలయ్యే ఐపీఎల్–11వ సీజన్ కోసం ఈనెల 13 నుంచి సవాయ్ మాన్‌సింగ్ స్టేడియంలో క్రికెటర్లకు క్యాంప్ ఏర్పాటు చేశారు. కోచ్‌ల నేతృత్వంలో భారత క్రికెటర్లు శిక్షణ తీసుకోనున్నారు. రాజస్థాన్ జట్టులో భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందని, ఆటగాళ్లతో కలిసి పనిచేసేందుకు ఆతృతగా ఎదురుచూస్తున్నానని అమోల్ అన్నాడు.

రబాడనే నంబర్‌వన్



దుబాయ్: రెండు మ్యాచ్‌ల నిషేధం పడినా.. ఐసీసీ టెస్ట్ బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో దక్షిణాఫ్రికా పేసర్ కగిసో రబాడనే నంబర్‌వన్ స్థానంలో కొనసాగుతున్నాడు. ఆస్ట్రేలియాతో జరిగిన రెండో టెస్టులో 11 వికెట్లు తీయడం రబాడకు బాగా కలిసొచ్చింది. మంగళవారం విడుదల చేసిన తాజా జాబితాలో అతను 900 పాయింట్ల మార్క్‌ను అధిగమించాడు. ఓవరాల్‌గా ఈ ఘనత సాధించిన 23వ బౌలర్ కాగా, సఫారీల తరపున నాలుగో పేసర్‌గా రికార్డులకెక్కాడు. భారత ఆఫ్ స్పిన్నర్ అశ్విన్ రెండుస్థానాలు మెరుగుపర్చుకుని నాలుగో ర్యాంక్‌లోకి రాగా, అండర్సన్ (ఇంగ్లండ్), జడేజా (భారత్) రెండు, మూడులో ఉన్నారు. బ్యాటింగ్ విభాగంలో స్టీవ్ స్మిత్ (ఆస్ట్రేలియా), విరాట్ కోహ్లీ టాప్–2లో కొనసాగుతున్నారు. చతేశ్వర్ పుజార ఆరో ర్యాంక్‌ను పదిలం చేసుకున్నాడు. ఏబీ డివిలియర్స్ ఐదు స్థానాలు పైకి ఎగబాకి ఏడో ర్యాంక్‌లో నిలిచాడు. ఆమ్లా 9వ ర్యాంక్‌కు చేరుకున్నాడు.

గెలిస్తే.. ఫైనల్‌కు!

నేడు బంగ్లాదేశ్‌తో భారత్ టీ20 మ్యాచ్
ఆత్మవిశ్వాసంతో ఇరుజట్లు


రాత్రి 7.00 నుంచి డీ స్పోర్ట్స్‌లో

రోహిత్ శర్మ

ఓవైపు రెండు వరుస విజయాలతో ఊపుమీదున్న భారత్.. మరోవైపు రికార్డు లక్ష్యాన్ని ఛేదించిన ఆనందంలో బంగ్లాదేశ్.. ఫైనల్ బెర్త్ లక్ష్యంగా టీమ్‌ఇండియా.. సంచలనం కోసం పరితపిస్తున్న బంగ్లా టైగర్లు.. ఈ నేపథ్యంలో ఇరుజట్ల మధ్య మరో కీలక మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. ఇందులో భారత్ గెలిస్తే టైటిల్ పోరుకు అర్హత... బంగ్లా గెలిస్తే మళ్లీ ఆఖరి లీగ్ మ్యాచ్ వరకు డ్రామా.. ఇలాంటి సమీకరణాలతో ఆసక్తి రేకెతిస్తున్న ఈ మ్యాచ్ కోసం రెండు జట్లు సరికొత్త ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయి. ఓవరాల్‌గా ప్రతీకార వేటలో ఉన్న బంగ్లా.. భారత్‌ను పడగొట్టి టైటిల్ రేసులో ఉత్కంఠను తారాస్థాయికి తీసుకెళ్లాలని భావిస్తున్నది. అయితే వరుణుడు కరుణిస్తేనే ఈ మ్యాచ్‌లో మజా..!

కొలంబో: ఆఖరి అంకానికి చేరుకున్న ముక్కోణపు టీ20 టోర్నీలో మరో కీలక పోరు. నాలుగు మ్యాచ్‌లు ముగిసినా ఇంకా ఖరారు కానీ ఫైనల్ బెర్త్. రికార్డు బ్రేకింగ్ ప్రదర్శనలు లేకపోయినా.. ఉత్కంఠ మాత్రం కొనసాగుతూనే ఉన్నది. ఈ నేపథ్యంలో భారత్.. బంగ్లాదేశ్ మధ్య ఆఖరి లీగ్ మ్యాచ్‌కు బుధవారం ప్రేమదాసలో తెరలేవనుంది. గత రెండు మ్యాచ్‌ల్లో విభిన్నమైన ప్రదర్శనలు చూపెట్టిన ఈ రెండు జట్ల మధ్య పోరులో ఫేవరెట్‌ను అంచనా వేయడానికి కష్టంగా ఉన్నది. లీగ్ తొలి మ్యాచ్‌లో లంక చేతిలో అనూహ్యంగా ఓడిన భారత్.. వరుసగా రెండు విజయాలు సాధించి టైటిల్ పోరుకు చేరువైంది. ఈ మ్యాచ్ కోసం టీమ్‌ఇండియా బ్యాటింగ్ ఆర్డర్‌లో మార్పులు జరిగే అవకాశం ఉండగా, బంగ్లా మాత్రం ఏదో ఓ దశలో రోహిత్‌సేనకు చెక్ పెట్టాలని యోచిస్తున్నది. దీనికి తమ అస్త్రంగా ముస్తాఫిజుర్‌ను సిద్ధం చేస్తున్నది.

మార్పుల్లేవు..!

రిజర్వ్ బెంచ్ సామర్థ్యాన్ని పెంపొందించుకునే దిశగా భారత్ ఈ టోర్నీకి అందరూ కుర్రాళ్లను ఎంపిక చేసింది. కానీ మూడు మ్యాచ్‌లు పూర్తయినా ఇంక కొంత మందిని పరీక్షించనే లేదు. ఈ మ్యాచ్ కూడా ప్రయోగాలు చేసే అవకాశాల్లేవు. ఎందుకంటే ఫైనల్ బెర్త్ సందిగ్ధంలో పడటంతో మొన్న ఆడిన తుది జట్టుతోనే బరిలోకి దిగాలని రోహిత్ బృందం యోచిస్తున్నది. దీంతో సిరాజ్, దీపక్ హుడా, అక్షర్ పటేల్ మళ్లీ బెంచ్‌కే పరిమితంకానున్నారు. వీటిని పక్కనబెడితే కెప్టెన్ రోహిత్ ఫామ్ ఆందోళన కలిగిస్తున్నది. ధవన్‌తో కలిసి రాహుల్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించే అవకాశాలనూ పరిశీలిస్తున్నారు. రైనా ఫర్వాలేదనిపిస్తున్నా.. ఐపీఎల్ మెరుపులు చూపెట్టలేకపోతున్నాడు. మిడిలార్డర్ భారాన్ని మనీష్ పాండే, దినేశ్ కార్తీక్ పంచుకోవడం శుభసూచకం. ఆల్‌రౌండర్ పాత్రకు విజయ్ శంకర్ మరింత న్యాయం చేయాల్సి ఉంది. గత రెండు మ్యాచ్‌ల్లో నాలుగు ఓవర్ల కోటాను పూర్తి చేయలేకపోయిన జైదేవ్ ఉనాద్కట్ ధారాళంగా పరుగులు సమర్పించుకోవడం ఆందోళనకరం. శార్దూల్ ఊహించని రీతిలో అద్భుతాలు చేస్తున్నాడు. మిడిల్ ఓవర్లలో సుందర్, చాహల్.. ప్రత్యర్థులను నిలువరిస్తే భారత్‌డ విజయావకాశాలు చాలా మెరుగవుతాయి. చాహల్ విఫలమవుతున్నా.. రోహిత్ అతనిపై ఎక్కువ నమ్మకం పెట్టుకున్నాడు. దీంతో మరో స్పిన్నర్ అక్షర్ పటేల్‌కు అవకాశం లేకపోవచ్చు. ఓవరాల్‌గా అన్ని రంగాల్లో మెరిస్తే తప్ప భారత్‌కు ఈ గెలుపు అంత సులువుకాకపోవచ్చు.

అద్భుతం చేస్తారా..?

ఈ మ్యాచ్ కోసం బంగ్లా భారీ మార్పులు చేసేందుకు ఇష్టపడకపోయినా.. ఒకటి, రెండు అవకాశాలను మాత్రం పరిశీలిస్తున్నారు. లంకపై 215 పరుగుల రికార్డు లక్ష్యాన్ని ఛేదించడంతో బంగ్లా జట్టులో ఆత్మవిశ్వాసం రెట్టింపైంది. ఈ మ్యాచ్‌లో భారత్‌ను ఓడిస్తే ఫైనల్ అవకాశాలు మరింత మెరుగుపడుతాయి. కాబట్టి ఏమాత్రం అలసత్వం లేకుండా ఆడాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నది. లిట్టన్ దాస్, తమీమ్ సూపర్ ఫామ్‌లో ఉండటం కలిసొచ్చే అంశం. సౌమ్య, ముష్ఫికర్ కొద్దిగా సాయం అందించినా భారీ స్కోరు ఖాయం. ఇక కెప్టెన్ మహ్మదుల్లా సుడిగాలి ఇన్నింగ్స్ బంగ్లాకు లాభించే అంశం. టోర్నీ ఆరంభంతో పోలిస్తే బంగ్లా బౌలింగ్ కూడా గాడిలో పడింది. ముస్తాఫిజుర్, రూబెల్ పవర్‌ప్లే, స్లాగ్ ఓవర్లలో ఆకట్టుకుంటున్నారు. అంచనాలను అందుకోలేకపోతున్న టస్కిన్ స్థానంలో ప్రత్యామ్నాయం చూస్తారేమో చూడాలి. మెహిది హసన్, నజ్ముల్ ఇస్లామ్ మ్యాజిక్ చేస్తే భారత్‌కు ఇబ్బందులు తప్పకపోవచ్చు.

జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), ధవన్, రాహుల్, రైనా, మనీష్, కార్తీక్, విజయ్ శంకర్, సుందర్, చాహల్, శార్దూల్, ఉనాద్కట్.
బంగ్లాదేశ్: మహ్మదుల్లా (కెప్టెన్), తమీమ్, సౌమ్య సర్కార్, లిట్టన్ దాస్, ముష్ఫికర్ రహీమ్, షబ్బీర్ రెహమాన్ / ఆరిఫుల్ హక్, మెహిది హసన్, ముస్తాఫిజుర్, టస్కిన్ / అబు జాయేద్, రూబెల్ హుస్సేన్, నజ్ముల్ ఇస్లామ్.

పిచ్, వాతావరణం
బ్యాటింగ్‌కు స్వర్గధామం. కుదురుకుంటే భారీ స్కోర్లు ఖాయం. వర్షం ముప్పు ఉంది.

నెట్ రన్‌రేట్ కీలకం

ఈ మ్యాచ్‌లో భారత్ గెలిస్తే ఇతర సమీకరణాలతో అవసరం లేకుండా నేరుగా ఫైనల్లోకి ప్రవేశిస్తుంది. ఒకవేళ ఓడితే మాత్రం.. శుక్రవారం శ్రీలంక, బంగ్లాదేశ్ మధ్య ఆఖరి లీగ్ మ్యాచ్ ఫలితంపై టీమ్‌ఇండియా భవిష్యత్ ఆధారపడి ఉంటుంది. దీనికితోడు నెట్ రన్‌రేట్ కూడా కీలకమవుతుంది. ప్రస్తుతం భారత్ 4, లంక, బంగ్లాదేశ్ చెరో 2 పాయింట్లతో ఉన్నాయి. వరుసగా రెండు విజయాలు సాధించిన భారత్ నెట్ రన్‌రేట్ +0.21 కాగా, లంక –0.072, బంగ్లా –0.231 గా ఉంది. ఈ మ్యాచ్‌లో బంగ్లా గెలిచి ఆఖరి మ్యాచ్‌లో లంక చేతిలో ఓడితే అప్పుడు అందరి ఖాతాలో 4 పాయింట్ల చొప్పున ఉంటాయి కాబట్టి నెట్ రన్‌రేట్ కీలకమవుతుంది.

సర్దార్ సింగ్‌కు ఉద్వాసన
శ్రీజేశ్ పునరాగమనం
కామన్వెల్త్ క్రీడలకు భారత హాకీ జట్టు ఎంపిక


సర్దార్


కామన్వెల్త్ గేమ్స్‌కు భారత హాకీ జట్టు

న్యూఢిల్లీ: ఆస్ట్రేలియాలోని గోల్డ్‌కోస్ట్ వేదికగా వచ్చే నెలలో మొదలయ్యే ప్రతిష్ఠాత్మక కామన్వెల్త్ క్రీడల కోసం భారత హాకీ జట్టును ఎంపిక చేశారు. సీనియర్లు సర్దార్‌సింగ్, రమణ్‌దీప్‌సింగ్‌ను అనూహ్యంగా తప్పిస్తూ 18 మందితో కూడిన జట్టును హాకీ ఇండియా(హెచ్ఐ) మంగళవారం ప్రకటించింది. మరోవైపు గాయం నుంచి కోలుకున్న స్టార్ గోల్‌కీపర్ పీఆర్ శ్రీజేశ్ ఏడాది తర్వాత తిరిగి జాతీయ జట్టులోకి వచ్చాడు. మిడ్‌ఫీల్డర్ మన్‌ప్రీత్ సింగ్ కెప్టెన్‌గా వ్యవహరించనుండగా, చింగ్లేన్‌సన సింగ్ వైస్ కెప్టెన్‌గా కొనసాగుతాడు. శ్రీజేశ్‌కు రిజర్వ్‌గా 22 ఏండ్ల సూరజ్ కర్కెరను తీసుకున్నారు. శ్రీజేశ్ గైర్హాజరీలో ఇటీవల జరిగిన టోర్నీల్లో సూరజ్ అద్భుత ప్రదర్శనతో జట్టు విజయాల్లో కీలకమయ్యాడు. ఇదిలా ఉంటే ఇటీవలి అజ్లాన్‌షా టోర్నీలో పేలవ ఆటతీరు కనబర్చిన సర్దార్ సింగ్‌కు ఉద్వాసన ఊహించిందే అయినా.. మెరుగ్గా రాణించిన రమణ్‌దీప్‌ను పక్కకుపెట్టడం ఒకింత ఆశ్చర్యపరుస్తున్నది. అరంగేట్రంలోనే ఆకట్టుకున్న యువ ఆటగాళ్లు దిల్‌ప్రీత్‌సింగ్, వివేక్‌సాగర్ ప్రసాద్.. సెలెక్టర్ల నమ్మకాన్ని నిలబెట్టుకున్నారు. రూపిందర్‌పాల్‌సింగ్ నేతృత్వంలోని డిఫెన్స్ విభాగంలో హర్మన్‌ప్రీత్‌సింగ్, వరుణ్, కొతాజీత్‌సింగ్, గురిందర్, అమిత్ ఉన్నారు. ఇక చింగ్లేన్‌సన, సుమిత్, వివేక్‌తో కూడిన మిడ్‌ఫీల్డ్‌ను కెప్టెన్ మన్‌ప్రీత్ ముందుండి నడిపించనున్నాడు. పూల్–బిలో మలేసియా, ఇంగ్లండ్‌తో కలిసి ఉన్న భారత్ తమ తొలి మ్యాచ్‌లో ఏప్రిల్ 7న దాయాది పాకిస్థాన్‌తో తలపడుతుంది.

జట్టు వివరాలు: మన్‌ప్రీత్‌సింగ్(కెప్టెన్), చింగ్లేన్‌సన సింగ్(వైస్ కెప్టెన్), శ్రీజేశ్, సూరజ్ కర్కెర(గోల్‌కీపర్లు), రూపిందర్‌పాల్, హర్మన్‌ప్రీత్‌సింగ్, వరుణ్ కుమార్, కొతాజీత్‌సింగ్, గురిందర్‌సింగ్, అమిత్ రోహిదాస్, వివేక్‌సాగర్, ఆకాశ్‌దీప్‌సింగ్, ఎస్‌వీ సునీల్, గుర్జాంత్‌సింగ్, మన్‌దీప్‌సింగ్, లలిత్ కుమార్, దిల్‌ప్రీత్‌సింగ్.

హెచ్‌సీఏలో అక్రమాలపై
హైకోర్టుకు బీసీసీఐ నివేదిక

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)లో అక్రమాలు జరిగినట్లుగా ఉమ్మడి హైకోర్టుకు బీసీసీఐ మంగళవారం నివేదిక అందచేసింది. అక్రమాలపై అవినీతి నిరోధక కమిటీ అందచేసిన నివేదికను న్యాయస్థానానికి సమర్పించింది. ఈ నేపథ్యంలో హెచ్‌సీఏ పాలన వ్యవహారాలను పర్యవేక్షించడానికి తాత్కాలిక ప్రతిపాదికన గత ఏడాది ఏర్పాటు చేసిన మాజీ న్యాయమూర్తులతో కూడిన అడ్మినిస్ట్రేటివ్ కమిటీని కొనసాగించాలంటూ న్యాయస్థానాన్ని బీసీసీఐ అభ్యర్థించింది. ఈ మేరకు ఉమ్మడి హైకోర్టులో అఫిడవిట్‌ను దాఖలు చేసింది. జస్టిస్ లోధా కమిటీ సిఫార్సులను హెచ్‌సీఏలో అమలు చేయకపోవడంపై గత ఏడాది న్యాయవాది గోవిందరెడ్డి, తదితరులు హైకోర్టులో పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. ఆయా అంశాలను పరిశీలించిన ఉమ్మడి హైకోర్టు..హెచ్‌సీఏ పాలన వ్యవహారాల పరిశీలన, లోధా కమిటీ సిఫార్సుల అమలు కోసం సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ దవే, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జీవీ సీతాపతిలతో అడ్మినిస్ట్రేటివ్ కమిటీని ఏర్పాటు చేసింది. అయితే ఈ కమిటీ కాలపరిధి ముగియడం, హెచ్‌సీఏకు నూతన కార్యవర్గం ఎన్నిక జరుగడం పూర్తయ్యాయి. లోధా సిఫార్సుల అమలుకు కార్యాచరణ జరుగడం తమని కమిటీ బాధ్యతల నుంచి తప్పించాలంటూ సభ్యులైన విశ్రాంత న్యాయమూర్తులు ఇటీవలే హైకోర్టుకు ప్రమాణపత్రం దాఖలు చేశారు. అయితే ఈ కమిటీని కొనసాగించాలంటూ బీసీసీఐ తాజాగా హైకోర్టును ఆశ్రయించింది. హెచ్‌సీఏలో వివాదాల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన అంబుడ్స్‌మన్ ఇటీవలే హెచ్‌సీఏ అధ్యక్షుడు, కార్యదర్శుల పదవులపై ఉత్తర్వులను హైకోర్టు ఎదుట బీసీసీఐ ప్రస్తావించింది. ఈ నివేదికను పరిశీలించిన న్యాయస్థానం..నివేదికను అడ్మినిస్ట్రేటివ్ కమిటీకి అందచేస్తామని, విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది.

గేల్, యువీ రెండు మ్యాచ్‌లు గెలిపిస్తే..
పెట్టుబడి తిరిగొచ్చినట్టే అంటున్న సెహ్వాగ్



సెహ్వాగ్ అశ్విన్

న్యూఢిల్లీ: గేల్, యువరాజ్‌సింగ్ ఐపీఎల్‌లో పంజాబ్‌ను రెండు మ్యాచ్‌ల్లో గెలిపించినా వాళ్లపై పెట్టిన పెట్టుబడి తిరిగొచ్చినట్టే అని ఆ జట్టు మెంటార్ సెహ్వాగ్ అన్నాడు. ఈ ఇద్దరినీ ఐపీఎల్ వేలంలో పంజాబ్ రూ.2 కోట్ల చొప్పున దక్కించుకున్న సంగతి తెలిసిందే. మంగళవారం పంజాబ్ జెర్సీ ఆవిష్కరణలో అశ్విన్‌తో కలిసి పాల్గొన్న వీరూ ఈసారి తమ జట్టు చాంపియన్‌గా నిలిచే అవకాశం ఉందని చెప్పాడు. 'గత పది సీజన్ల కంటే ఈసారి పంజాబ్ జట్టు బలంగా ఉన్నది. ప్రతిభావంతమైన భారత ఆటగాళ్లు అందుబాటులో ఉన్నారు. తొలి మ్యాచ్‌కు ఓపెనర్ ఫించ్ అందుబాటులో ఉండటం లేదు. ఓపెనింగ్‌లో గేల్, లోయర్ ఆర్డర్‌లో మిల్లర్ వంటి హిట్టర్లు ఉండటం కలిసొచ్చే అంశం. యువీ, గేల్ కనీసం రెండు మ్యాచ్‌ల్లో పంజాబ్‌ను గెలిపించినా వాళ్లపై పెట్టిన పెట్టుబడి తిరిగి వచ్చినట్టే. అశ్విన్ వంటి బౌలర్ కెప్టెన్ ఉండటం జట్టుకు మేలు చేస్తుంది' అని వీరూ అన్నాడు.

అక్క చేతిలో సెరెనా ఓటమి



ఇండియానా వెల్స్: 15 నెలల విరామం తర్వాత పునరాగమనం చేసిన అమెరికా టెన్నిస్ క్వీన్ సెరెనా విలియమ్స్..తన అక్క వీనస్ చేతిలో ఓటమి చవిచూసింది. ఇండియానా వెల్స్‌లో భాగంగా సోమవారం జరిగిన మహిళల సింగిల్స్ మూడో రౌం డ్‌లో సెరెనా 3–6, 4–6తో వీనస్ చేతిలో ఓడిపోయి టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఈ అక్కాచెల్లెల్లు ఒక టోర్నీలో తొలి రౌండ్‌లోనే తలపడటం ఇదే మొదటిసారి. ఓవరాల్‌గా 29 సార్లు తలపడగా సెరెనా 17, వీనస్ 12 విజయాలు సాధించారు. పురుషుల సింగిల్స్‌లో స్విస్ దిగ్గజం టాప్ సీడ్ రోజర్ ఫెదరర్ 6–2, 6–1తో ఫిలిప్ క్రజనోవిక్‌పై సునాయాసంగా గెలిచి నాలుగో రౌండ్‌కు చేరుకున్నాడు.





మంగళ వారం రవీంద్రభారతిలో జరిగిన తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర మహాసభల విద్యా సదస్సులో మాట్లాడుతున్న ఇంద్రకరణ్‌రెడ్డి, పదవీ విరమణ చేసిన స్వామిరెడ్డిని సత్కరిస్తున్న మంత్రి హరీశ్‌రావు . చిత్రంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి, ఉద్యోగ సంఘం నేతలు కారం రవీందర్‌రెడ్డి, రేచల్ తదితరులు

ఉద్యమంలో టీయూటీఎఫ్‌వి

తొలి అడుగులు

పార్లమెంట్‌లో చట్టం చేస్తే సీపీఎస్ పరిష్కారానికి సిద్ధం ■ అన్ని జిల్లాల్లో వెల్‌నెస్ సెంటర్లు: మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్/రవీంద్రభారతి, నమస్తేతెలంగాణ: రాష్ట్ర సాధన ఉద్యమంలో ఉపాధ్యాయులు వీరోచితంగా పాల్గొన్నారని నీటి పారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు కొనియాడారు. ప్రజల ఆకాంక్ష మేరకు రాష్ట్ర సాధన ఉద్యమంలో టీయూటీఎఫ్ తొలి అడుగులు వేసిందని గుర్తుచేశారు. హైదరాబాలోని రవీంద్రభారతిలో మంగళవారం తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీయూటీఎఫ్)రాష్ట్ర మహాసభలో భాగంగా విద్యాసదస్సులో 'పాఠశాల విద్య-సంస్కరణలు' అంశంపై సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి మంత్రులు ఈటల రాజేందర్, ఇంద్రకరణ్‌రెడ్డి హాజరయ్యారు. మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ టీయూటీఎఫ్‌పై ప్రభుత్వానికి గౌరవం ఉన్నదని, ఉపాధ్యాయులందరికీ హెల్త్‌కార్డులు ఇచ్చామని గుర్తుచేశారు. కార్పొరేట్ వైద్యం అందిస్తున్నామని, అన్ని జిల్లాల్లో వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటుకు కృషిచేస్తున్నామని చెప్పారు.టీచర్ల బదిలీలు జూన్‌లోపే పూర్తిచేసేందుకు విద్యాశాఖమంత్రి చర్యలు చేపడుతున్నారని పేర్కొన్నారు. సీపీఎస్ సమస్య పరిష్కారానికి సిద్ధంగా ఉన్నామని, దీని కోసం పార్లమెంట్‌లో చట్టం చేయాల్సి ఉంటుందని తెలిపారు.

నూతన ఒరవడితో ముందుకెళ్తున్నాం: మంత్రి ఈటల

విద్యతోనే బంగారు తెలంగాణ సాధ్యమవుతుందని ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ చెప్పారు. తెలంగాణ వస్తే ఏం వస్తదన్న వారి నోర్లు మూతపడేలా ప్రభుత్వం నూతన ఒరవడితో ముందుకు వెళ్తున్నదని పేర్కొన్నారు. తెలంగాణ కోసమే టీయూటీఎఫ్ ఏర్పడిందని, మీ నమ్మకాన్ని వృథాగా పోనివ్వబోమని స్పష్టంచేశారు. ఎన్ని గురుకులాలు ఏర్పాటుచేసినా ప్రభుత్వ పాఠశాలలు కొనసాగుతాయని చెప్పారు. టీచర్లుగా మార్కుల కోసం కాకుండా విద్యార్థుల జ్ఞానం పెంచేలా చదువు చెప్పాలని సూచించారు. ఈ సదస్సులో వెల్లడైన అభిప్రాయాలను, డిమాండ్లను ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి నెరవేర్చేందుకు కృషి చేస్తామని హామీఇచ్చారు. విద్యాశాఖలో పర్యవేక్షణ పోస్టులు ఖాళీగా ఉండడంతో ప్రమణాలు తగ్గుతున్నాయని, వచ్చే వేసవిలోనే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు కల్పించేలా చర్యలు తీసుకుంటామని దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, బేవరెజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల జేఏసీ చైర్మన్ కారం రవీందర్‌రెడ్డి, టీయూటీఎఫ్ అధ్యక్షుడు సీ స్వామిరెడ్డి, కార్యదర్శి డీ మల్లారెడ్డి సభలో పాల్గొన్నారు. సీపీఎస్ రద్దు చేయాలని, భాషా పండిట్స్, పీఈటీలకు పదోన్నతి కల్పించాలని కోరారు. ఏకీకృత సర్వీస్‌రూల్స్ సమస్య పరిష్కారంతో పాటు ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించాలని సంఘం నేతలు కోరారు.

ఈఎస్‌ఐసీలో 206 ఫ్యాకల్టీలు

- ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు
- మెడికల్, డెంటల్ కాలేజీల్లో ఖాళీలు
- ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక



ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్‌ఐసీ) పరిధిలోని మెడికల్ కాలేజీల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

- పోస్టు పేరు: ప్రొఫెసర్
- మొత్తం ఖాళీల సంఖ్య - 206
- ప్రొఫెసర్-46, అసోసియేట్ ప్రొఫెసర్-75, అసిస్టెంట్ ప్రొఫెసర్-85
- ఈఎస్‌ఐసీ మెడికల్ కాలేజీ, సనత్‌నగర్: 38 ఖాళీలు
- ప్రొఫెసర్ - 13 ఖాళీలు (అనస్థీషియా-1, అనాటమీ-1, బయోకెమిస్ట్రీ-1, బ్లడ్ బ్యాంక్/హెమటాలజీ-1, డెంటిస్ట్రీ-1, జనరల్ మెడిసిన్-1, జనరల్ సర్జరీ-1, మైక్రోబయాలజీ-1, ఓ & జీ - 1, ఆర్థోపెడిక్స్-1, పిడియాట్రిక్స్-1, పాథాలజీ-1, ఫార్మకాలజీ-1, రేడియాలజీ-1)
- అసోసియేట్ ప్రొఫెసర్- 16 ఖాళీలు (అనస్థీషియా-1, అనాటమీ-1, బయోకెమిస్ట్రీ-1, బ్లడ్ బ్యాంక్/హెమటాలజీ-1, డెంటిస్ట్రీ-1, డెర్మటాలజీ-1, ఈఎన్‌టీ-1, జనరల్ మెడిసిన్-1, జనరల్ సర్జరీ-1, ఓ & జీ - 1, ఆర్థోపెడిక్స్-1, పిడియాట్రిక్స్-1, పాథాలజీ-1, సైకియాట్రీ-1, రేడియాలజీ-1
- అసిస్టెంట్ ప్రొఫెసర్- 9 ఖాళీలు (కమ్యూనిటీ మెడిసిన్-4, జనరల్ మెడిసిన్-1, ఓ & జీ - 1, ఆర్థోపెడిక్స్-1, పిడియాట్రిక్స్-1, పాథాలజీ-1)
- **ఈఎస్‌ఐసీ డెంటల్ కాలేజీ, రోహిణి (న్యూఢిల్లీ): 13 ఖాళీలు** (అసోసియేట్ ప్రొఫెసర్ - 6 , అసిస్టెంట్ ప్రొఫెసర్ - 7)
- **ఈఎస్‌ఐసీ మెడికల్ కాలేజీ, ఫరీదాబాద్: 55 ఖాళీలు** (ప్రొఫెసర్- 11, అసోసియేట్ ప్రొఫెసర్ - 18, అసిస్టెంట్ ప్రొఫెసర్-26)
- **ఈఎస్‌ఐసీ డెంటల్ కాలేజీ, గుల్బర్గా: 9 ఖాళీలు** (అసోసియేట్ ప్రొఫెసర్ - 3, అసిస్టెంట్ ప్రొఫెసర్ - 6)
- **ఈఎస్‌ఐసీ, పీజీఐఎంఎస్‌ఆర్ & మెడికల్ కాలేజీ, జోకా (కోల్‌కతా): 25 ఖాళీలు** (ప్రొఫెసర్ - 9, అసోసియేట్ ప్రొఫెసర్ - 12, అసిస్టెంట్ ప్రొఫెసర్ - 4)
- **ఈఎస్‌ఐసీ, మణికట్ల (కోల్‌కతా):3 ఖాళీలు** (అసోసియేట్ ప్రొఫెసర్ - 1, అసిస్టెంట్ ప్రొఫెసర్ - 2)
- **ఈఎస్‌ఐసీ పీజీఐఎంఎస్‌ఆర్ & మెడికల్ కాలేజీ, రాజాజీనగర్ (బెంగళూరు): 29 ఖాళీలు** (ప్రొఫెసర్ - 6, అసోసియేట్ ప్రొఫెసర్ - 7, అసిస్టెంట్ ప్రొఫెసర్ - 16)
- **ఈఎస్‌ఐసీ మెడికల్ కాలేజీ, గుల్బర్గా (కర్ణాటక): 34 ఖాళీలు** (ప్రొఫెసర్ - 7, అసోసియేట్ ప్రొఫెసర్ - 12, అసిస్టెంట్ ప్రొఫెసర్ - 15)
- **పేస్కేల్:** ప్రొఫెసర్ - రూ. 37,400 - 67,000/- గ్రేడ్ పే రూ. 8,700/-,
- అసిస్టెంట్/అసోసియేట్ ప్రొఫెసర్- రూ. 15,600 - 39,100 + గ్రేడ్ పే రూ. 7,600 (అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు గ్రేడ్ పే రూ.6600/-)

అర్హతలు:

- **ప్రొఫెసర్:** పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ (ఎండీ/ఎంఎస్)లో ఉత్తీర్ణత. సంబంధిత విభాగం నుంచి పీజీ, పీహెచ్‌డీలో ఉతీర్ణత.
- **అసోసియేట్/అసిస్టెంట్ ప్రొఫెసర్:** పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ (ఎండీ/ఎంఎస్)లో ఉత్తీర్ణత. సంబంధిత విభాగం నుంచి పీజీ, పీహెచ్‌డీలో ఉత్తీర్ణత.
- **గమనిక:** పై పోస్టులన్నింటికి సంబంధిత టీచింగ్/రిసెర్చ్ రంగంలో అనుభవం ఉండాలి.
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 225/-, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ, ఈఎస్‌ఐ ఎంప్లాయీస్, ఎక్స్ సర్వీస్‌మెన్, మహిళా అభ్యర్థులకు ఫీజు లేదు.
- **ఎంపిక:** సబ్జెక్టుల వారీగావివిధ తేదీల్లో ఈఎస్‌ఐసీ సెలక్షన్ బోర్డు ఇంటర్వ్యూను నిర్వహించి ఎంపిక చేస్తుంది.
- తెలంగాణలో ఈఎస్‌ఐసీ మెడికల్ కాలేజీ, సనత్‌నగర్, హైదరాబాద్‌లో ఇంటర్వ్యూ ఉంటుంది.

- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఏప్రిల్ 2 (సాయంత్రం 5 గంటల వరకు)
- **వెబ్‌సైట్ :** www.esic.nic.in.

విద్య, ఉద్యోగ సమాచారం

ఎన్‌హెచ్‌ఎంలో లీగల్ కన్సల్టెంట్

తెలంగాణ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనరేట్ పరిధిలోని నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఎన్‌టీసీపీ విభాగంలో ఖాళీగా ఉన్న లీగల్ కన్సల్టెంట్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

ఈ పోస్టులను తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేస్తారు.

- **పోస్టు పేరు:** లీగల్ కన్సల్టెంట్
- **అర్హతలు:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ ఆఫ్ లాలో ఉత్తీర్ణత. డిస్ట్రిక్ట్/హై కోర్టులో కనీసం మూడేండ్లపాటు లీగల్ కన్సల్టెంట్‌గా పనిచేసి ఉండాలి.
- **వయస్సు:** 18 నుంచి 44 ఏండ్ల మధ్య ఉండాలి.
- ఎంపిక: అకడమిక్ మెరిట్, ఎక్స్‌పీరియన్స్/ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **ఇంటర్వ్యూ చిరునామా:** SPMU-NHM, Telangana, DM&HS Campus Koti Opp. Koti womens College, HYderabad
- **చివరితేదీ:** మార్చి 19
- **వెబ్‌సైట్:** http://careers.cgg.gov.in

ఎన్‌డీటీఎల్‌లో సైంటిస్టులు

న్యూఢిల్లీలోని నేషనల్ డోప్ టెస్టింగ్ ల్యాబొరేటరీ (ఎన్‌డీటీఎల్) ఖాళీగా ఉన్న గ్రేడ్‌బీ సైంటిస్టు (కాంట్రాక్టు ప్రాతిపదికన) పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

ఎన్‌డీటీఎల్ స్వతంత్ర సంస్థ. ఇది మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ పరిధిలో పనిచేస్తుంది.

- మొత్తం పోస్టుల సంఖ్య: 5
- **పోస్టు పేరు:** సైంటిస్ట్(గ్రేడ్ బీ)
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఎమ్మెస్సీ(కెమికల్ సైన్సెస్, బయాలజికల్ సైన్సెస్, ఫార్మాస్యూటికల్ సైన్సెస్, అప్లయిడ్ సైన్సెస్)లో ఉత్తీర్ణత లేదా సంబంధిత సబ్జెక్టులో పీహెచ్‌డీ. రెండేండ్ల అనుభవం ఉండాలి.
- **వయస్సు:** 40 ఏండ్లకు మించరాదు.
- **పే స్కేల్:** రూ. 60,000/-
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో. నిర్ణీత నమూనాలో సంబంధిత పర్సనల్ అధికారికి పంపాలి.
- **దరఖాస్తులకు చివరితేదీ:** ఏప్రిల్ 2
- **వెబ్‌సైట్:** http://ndtlindia.com

జేఎన్‌సీఏఎస్‌ఆర్‌లో పీహెచ్‌డీ

బెంగళూరులోని జవహర్‌లాల్‌నెహ్రూ సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ సైంటిఫిక్ రిసెర్చ్ (జేఎన్‌సీఏఎస్‌ఆర్) 2018-19 ఇయర్‌కుగాను ఎంఎస్/పీహెచ్‌డీ ప్రోగ్రాంలో ప్రవేశానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:



జేఎన్‌సీఏఎస్‌ఆర్ డీమ్డ్ యూనివర్సిటీ.

- **కోర్సు పేరు:** ఎంఎస్ (ఇంజినీరింగ్/రిసెర్చ్)/పీహెచ్‌డీ ప్రోగ్రామ్
- **అర్హత:** సంబంధిత ఇంజినీరింగ్/సైన్స్‌లో డిగ్రీతో పాటు సీఎస్ఐఆర్/యూజీసీ జేఆర్‌ఎఫ్, డీబీటీ/ఐసీఎంఆర్ లేదా ఇన్‌స్పైర్‌లో జేఆర్‌ఎఫ్, గేట్, జెస్ట్, జీప్యాట్‌లో ఉత్తీర్ణత.
- **కోర్సు పేరు:** రెండేండ్ల మాస్టర్ డిగ్రీ (కెమిస్ట్రీ)
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం 55 శాతం మార్కులతో మెటీరియల్స్ కెమిస్ట్రీ లేదా కెమికల్ బయాలజీ సబ్జెక్టులతో బీఎస్సీ. ఫైనల్ ఇయర్ చదువుతున్న అభ్యర్థులు కూడా దరఖాసు చేసుకోచ్చు. జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ మాస్టర్ డిగ్రీ (జామ్)లో ఉత్తీర్ణత సాధించాలి.
- **కోర్సు పేరు:** ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ ప్రోగ్రామ్
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం 55 శాతం మార్కులతో మెటీరియల్స్ సైన్స్, కెమికల్ సైన్సెస్, బయాలజికల్ సైన్సెస్ సబ్జెక్టులతో బీఎస్సీ. ఫైనల్ ఇయర్ చదువుతున్న అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ మాస్టర్ డిగ్రీ (జామ్)లో ఉత్తీర్ణత సాధించాలి.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరి తేదీ:** ఏప్రిల్ 15
- **వెబ్‌సైట్:** www. jncasr.ac.in

ఎంఆర్‌పీఎల్‌లో ఎగ్జిక్యూటివ్ పోస్టులు

ఓఎన్‌జీసీ ఆధ్వర్యంలోని మంగళూరు రిఫైనరీ & పెట్రోకెమికల్స్ లిమిటెడ్ (ఎంఆర్‌పీఎల్) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:



మంగళూరు రిఫైనరీ & పెట్రోకెమికల్స్ లిమిటెడ్ చమురు శుద్ధి కర్మాగార కంపెనీ. మినీరత్న హోదాను కలిగిన ఎంఆర్‌పీఎల్‌ను ఓఎన్‌జీసీ అనుబంధంగా 1988లో మంగళూరులో ఏర్పాటుచేశారు.


- మొత్తం పోస్టుల సంఖ్య: 22
- విభాగాలవారీగా ఖాళీలు:
- ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసే పోస్టులు (ప్రకటన నంబర్-73/2017)
- ల్యాబొరేటరీ సూపర్‌వైజర్-7, ఎగ్జిక్యూటివ్-10 (ఫైర్-1, ఫైనాన్స్-8, ఇంటర్నల్ ఆడిట్-1)
- **అర్హత:** ఎమ్మెస్సీ (కెమిస్ట్రీ) లేదా తత్సమాన సైన్స్‌లో పీజీ, ఫైర్ అండ్ సేఫ్టీలో బ్యాచిలర్ ఆఫ్ ఇంజినీరింగ్, ఏదైనా డిగ్రీతోపాటు సీఏ/ఐసీడబ్ల్యూఏ లేదా ఎంబీఏ లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత.
- పే స్కేల్: రూ. 60,000-1,80,000/-
- ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసే పోస్టులు (ప్రకటన నంబర్-74/2018)
- సీనియర్ మేనేజర్ (మెడికల్ సర్వీసెస్)-1 , అసిస్టెంట్ మేనేజర్ (సేఫ్టీ)-2, అసిస్టెంట్ మేనేజర్ (మెడికల్ సర్వీసెస్)-2
- **అర్హత:** బ్యాచిలర్ ఆఫ్ ఇంజినీరింగ్ ఎంబీబీఎస్ లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత.
- **పే స్కేల్:** రూ. 70,000-2,00,000/-
- **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 750/-, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ, ఎక్స్‌సర్వీస్‌మెన్ అభ్యర్థులకు ఫీజు లేదు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లో
- **దరఖాస్తుకు చివరితేదీ:** మార్చి 24
- **వెబ్‌సైట్ :** https://mrpl.co.in

పీజీడీఏవీలో నాన్ టీచింగ్

యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీకి చెందిన పీజీ డీఏవీ కాలేజ్ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 22
- విభాగాలవారీగా ఖాళీలు
- అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్-1, సెక్షన్ ఆఫీసర్-2, సీనియర్ అసిస్టెంట్-1, సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్ (కంప్యూటర్స్)-2, సెమీ/ప్రొఫెషనల్ అసిస్టెంట్-2, అసిస్టెంట్-1, జూనియర్ అసిస్టెంట్-3, ఎంటీఎస్ (లైబ్రెరీ-6, కంప్యూటర్-6)
- **ఎంపిక:** రాత పరీక్ష/ స్కిల్/ ప్రాక్టికల్ టెస్ట్ ద్వారా



- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో. దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకొని, సంబంధిత కాపీలను జతచేసి పర్సనల్ అధికారికి పంపాలి.
- **చివరితేదీ:** మార్చి 15
- **వెబ్‌సైట్:** www.pgdavcollege.edu.in